
ఏమండి కథలు

కమల పరచ




(మాలా కుమార్)

## అంకితం



మాకే

ఏమండి కథలు ఇవే

1. ప్రభాత కమలం

2. గాజర్ హల్వా

3. కందిపప్పు కావాలా బాబూ!

4. ఆపరేషన్ సక్సెస్-పేషంట్ డైడ్

5. మబ్బుల పల్లకి

6. నన్ను వదిలి నీవు పోలేవులే!

7. పౌరుషిణి

8. పౌరుషిణి-2

9. మై హూం యమధర్మరాజ్!

10. ఎంతెంత దూరం

11. వీడు పెరుపెరగడు సూడవే !!1

12. వెంటాడే దొంగ గారు

13. పిలుపేలరా ఓ మాధవా!!!

14. బుజ్జి తల్లి

15. మా ఆయన బంగారం

16. బుచ్చిబాబు లాంటి మొగుడొద్దనుకున్నాను కానీ...

17. సాబ్ అందర్ ... అమ్మా బాహర్... దర్వాజా బంద్

18. లావొక్కింతయు లేదు!

19. మా ఏమండీగారూ - ఆవకాయ - అను మాలావిలాపం

20. అలారం మోగింది

21. మిస్టర్ & మిస్సెస్ నింబూపానీ!!

22. డాలర్ మొగుడు

23. ఏమండీ ప్లీజ్ మీరు మీరుగానే ఉండండి!

24. డిప్ప కట్టింగ్!!!

## 1. ప్రభాతకమలం

1968 డిసెంబర్ 31

స్థలం: మద్రాసు మెరీనా బీచ్

ఓ గంటసేపటి నుంచి ఏమండీగారు చాలా దీర్ఘాలోచనతో, చేతులు వెనక్కి పెట్టుకొని కాసేపు, పక్కన పెట్టుకొని కాసేపు, గడ్డం రాసుకుంటూ కాసేపు అటూ ఇటూ అచార్లూ పచార్లూ చేస్తున్నారు. నేను ఏమండీగారి వెనక ఆ కవాతు చేయలేక, కొత్త కావటంతో మొహమాటంతో ఏమి చెప్పలేక అలాగే నీరసంగా తిరుగుతున్నాను. అప్పటికి మా పెళ్ళై పది రోజులైంది. తిరుపతిలో స్వామివారికి వైభవంగా కళ్యాణం చేయించి, బెంగుళూర్ వెళుదామనుకున్నాము. కళ్యాణం ఐతే వైభవంగానే జరిపించాము కాని స్వామివారు, 'ఫాగ్ బాగా పడుతోంది, బెంగుళూర్ కు బస్ లు వెళ్ళటం లేదు, మద్రాస్ వెళ్ళండి' అని ఆదేశించటంతో ఇదో ఇలా మద్రాస్ లో నాలుగురోజులుగా తిరుగుతున్నాము. ఇంతకీ ఈ అచార్లూ పచార్లూ ఎందుకయ్యా అంటే, ఏమండీగారు నన్ను ఏమని పిలవాలి అని అన్నమాట. కమలను నానా విధాలుగా తిప్పారు. కొన్ని ఏమండీకి నచ్చలేదు. కొన్ని మొహమాటంగా ఊ అని బుర్రూపినా నాకు నచ్చలేదని ఏమండీకి తెలిసిపోతోంది. సమస్య పది రోజులైనా ఓ కొలిక్కి రాలేదు. కనీసం ఇప్పుడైనా ఏదైనా తోస్తే బాగుండు అని నేను అనుకుంటుండగానే, గబుక్కున వెనక్కి తిరిగి "అవును తెలుగు అక్షరాల నుంచే ఎందుకు? ఇంగ్లీష్ లెటర్స్ లో నుంచి కూడా మార్చవచ్చు కదా?" అన్నారు. గబుక్కున తిరగటంతో కింద పడబోతున్న నేను, నిలదొక్కుకొని 'అవును' అన్నట్లు తలాడించేసాను. ఇహ KAMALA లో నుంచి ఏవి తొలగించాలి అని, వాటిని తిరగేసి మరగేస్తున్నారు. నేనూ ఏమి చెపుతారా అని ఆసక్తిగా చూస్తున్నాను. KA తీసేసి, మకు దీర్ఘమిచ్చి, 'మాల' అంటే ఎలా ఉంది?' అన్నారు. 'ఓ, బాగుంది!' అన్నాను. ఆ విధంగా యాభై ఏళ్ళ క్రితం డిసెంబర్ 31 న మాలగా పునర్జన్మ ఎత్తానన్నమాట.

పునర్జన్మతో పూనాలో, మిలిటరీ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఏమండీ గారి కోర్స్ తో, కొత్త కాపురం ఇట్టే తిరిగి కొత్త సంవత్సరం వచ్చేసింది. నా మొదటి న్యూఇయర్ పార్టీ. అబ్బా ఎంత ఎక్సైట్ మెంట్. నాకే కాదు మా ఫ్రెండ్స్ అందరికీ కూడా! కోర్స్ ఆఫీసర్స్ అంతా కొత్తగా

పెళ్ళైన వాళ్ళు. అందులోనూ రాఫ్ట్ ఫ్లోర్ ఆన్ రివర్ ( డాన్స్ ఫ్లోర్ రివర్ మీద చెక్కబల్లల తో). ఫేమస్ బాండ్ అదుర్స్. ఇక చీఫ్ గెస్ట్ ఎవరూ టాప్ హీరోయిన్స్ లో ఒకరైన తనూజ. అన్నీ ఏర్పాట్లూ అదుర్స్. మరి మా ప్రిపరేషన్స్ కూడా అందుకు తగ్గట్టు ఉండాలిగా. అబ్బాయిలంతా పెళ్ళి సూట్ లు డ్రైక్లీనింగ్ చేయించి, కొత్త టైలు, స్మార్ట్ హేర్ కట్టింగ్స్ తో తయార్. అమ్మాయిలు పెళ్ళి బెనారసీ చీరలు పక్కన పడేసి కొత్తగా వస్తున్న ప్రింటెడ్ సారీస్, నేల్ పాలిష్, లిప్ స్టిక్ లతో తయార్. ఇంక హడావుడే హడావుడి. డాన్స్ క్లాస్ లో చేరాము. డాన్స్ మాస్టర్ మీకే ఈ కొత్త స్టెప్స్ నేర్పిస్తున్నాను అని ఏవేవో విన్యాసాలు చేయించేవాడు! ఏమండీ సీరియస్ గా, నేను ఈజీబూజీగా డాన్స్ నేర్చుకున్నాము. వస్తున్నది టాప్ హీరోయిన్. మరి మన మేకప్ కూడా ఆ హీరోయిన్ కు తగ్గట్టు ఉండాలా వద్దా :) మనకేమీ ఆ భయమేమీ లేదు ఎందుకంటే అప్పటి కల్లా డాన్స్ ఏమో కాని వంటతో పాటు మేకప్ కూడా బాగా నేర్చేసుకున్నాను. ఎదురు చూస్తున్న 31 వచ్చేసింది! హేర్ స్టైల్ కోసం, 'ఇంత జుట్టు ఎందుకిచ్చావు దేవుడా?' అని ఏడ్చుకుంటూ బాక్ కోంబింగ్ చేసుకుంటూ ఉంటే, ఏమండీ గారు, 'నా కఫ్ లింగ్స్ పెట్టు, నా షర్ట్ నెక్ బటన్ పెట్టు, నా టై సరి చేయి, కాలర్ సరి చేయి' అని ఒకటే పిలవటం. అసలు నాకు తెలీక అడుగుతాను అమ్మాయిలా తయారవ్వాల్సింది అబ్బాయిలా?(ఇదే మా ఫ్రెండ్స్ అందరమూ తరువాత చెప్పుకొని కొంపదీసి వీళ్ళంతా తనూజ కు లైన్ వేయటం లేదు కదా అని అపోహ పడ్డాము.) మొత్తానికి అందరూ బ్రహ్మాండమైన మేకప్ లతో, డాన్స్ తో పార్టీ అదరగొట్టేసారు. కాకపోతే ఈ మధ్య తెలిసిన సంగతేమిటంటే ఆ డాన్స్ మాస్టర్ దగ్గరకు అందరూ వెళ్ళారు. ప్రతివాళ్ళతో 'మీకే కొత్త స్టెప్' అంటూ బాగానే ఫీజ్ గుంజి, రాజేష్ ఖన్నా టోపీ పెట్టాడు. అందుకే అందరికీ విడివిడి క్లాస్ లు, వేరే వేరే టైంలల్లో తీసుకున్నాడు. హారినీ అని ఇప్పుడు తీరిగ్గా హాశ్చర్య పోతే ఏమొస్తుంది? ఆ తరువాత సికింద్రాబాద్ లో కోర్స్. సింకింద్రాబాద్ క్లబ్ కు మారింది సీను. అప్పటినుంచి, ఇప్పటివరకు చాలావరకు మా న్యూఇయర్ పార్టీకి సికింద్రాబాద్ క్లబ్ నే వేదిక.

అలా... అలా... ఆటపాటలతో వికసించిన మా 'ప్రభాతకమలం'లో ఎన్నో ఒడిదుడుకులను, సుఖసంతోషాలను ఒకరికి ఒకరమై పంచుకున్నాము. ఎన్నో మధురానుభూతులను ఆస్వాదించాము. అవే మా ఏమండీ, నేనూ కలిసి రాసుకున్న ఈ 'ఏమండీ కథలు.' కథ ఏమండీది. కథనం నాది. ముగింపు విధాతది.

(సాహితి- 1-1-2019)

## 2. గాజర్ హల్వా

పదండి 1969, పూణేకు.

అప్పటికి మా కొత్తకాపురం మొదలై కొన్ని నెలలే అయింది. నేను మా ఏమండీ గారి ఆధ్వర్యములో వంట నేర్చుకుంటున్నాననే భ్రమలో మా ఏమండీ ఉన్నరోజులవి. మా ఏమండీ మిలిట్రీ ఇంజనీరింగ్ కాలేజ్ లో కోర్స్ చేస్తుంటే నేను వాడియా కాలేజ్ లో బి. యే ఫస్ట్ ఇయర్ లో చేరాను. ఇద్దరమూ ఉదయమే 8 గంటలకల్లా కాలేజీలకు వెళ్ళిపోయేవాళ్లం. మళ్ళీ ఒంటిగంటకల్లా వచ్చేసేవాళ్ళము. 'వచ్చాకా వంట చేసుకోవచ్చు, కుక్కర్ లో అన్నం, పప్పు ఎంతలో ఉడుకుతాయి, రాగానే వండుకుంటే వేడిగా తినొచ్చు' అనే మా ఏమండీ గారి అభిప్రాయంతో ఏకీభవించి కాలేజీ నుంచి వచ్చాక వంట మొదలు పెట్టేదాన్ని. పెళ్లైన కొత్తగదా మొగుడి మాట జవదాటకూడదు అనుకునే అమాయకపు అమ్మాయిని మరి. మా అత్తగారు ఇంట్లోకి రాకూడని మూడు రోజులుమా ఏమండీనే వండేవారట. ఆ అనుభవంతో నా వెనక చేరి, ఇంకాస్త ఉప్పేయ్, కొంచెం నీళ్ళు పోయ్ అంటూ సలహాలిస్తూ, ఆ తరువాత తినలేక, 'ఇంత ఉప్పేసావేమిటి? నేను చెప్పినట్లు చేయలేదు...' అని గొణుగుతూ వుండేవారు. కాని ఇప్పటికీ వినేవాళ్ళుంటే 'మా ఆవిడకి నేనే వంట నేర్పాను' అంటూ ఎంత సేపైనా చెపుతారులెండి. 'ఏం నేర్పారండీ?' అంటే 'ఆమ్లెట్ నేర్పానా? టీ పెట్టటము నేర్పానా?' అంటూ లిస్ట్ మొదలుపెడుతారు. తమ గొప్పలు తాము చెప్పుకోవడం ఎవరికి మాత్రం ఇష్టముండదు? చెప్పొద్దూ, ఆ ఆమ్లెట్ కోసం ఎంత గోలని ? (అసలు అది తినేదెవరు ఆయన తప్ప) అయినా ఈ అబ్బాయిలకి అమ్మ వెనుకెనకే తిరుగుతూ, కొద్దో గొప్పో వంట నేర్చేసుకోవటం ఏమి పాడు అలవాటో? ఆ తరువాత వాళ్ల భార్యల పాట్లు భగవంతుడికే తెలుసు. ప్రతీదాంట్లో వేలెట్టి తప్పులు ఎత్తి చూపిస్తారు. ఏ యింటి కథ చూసినా ఇంతే కదా!

ఇంతలో ఇద్దరికీ సెలవలొచ్చాయి. హైదరాబాద్ వెళ్ళటానికి టికెట్స్ బుక్ చేసుకున్నాము. ఏం తీసుకెళ్ళాలి? అప్పటికి కొద్ది రోజుల ముందే మా మామగారి ఫ్రెండ్స్ వచ్చి, నేను చేసిన టమాటా పప్పు, టమాటా చారు, టమాటా పచ్చడి, వాళ్ళ కంట

పడకుండా ఏమండి చేసిన టమాటా ఆమ్లెట్ తిని, హైదరాబాద్ లో మా మామగారి దగ్గర మీ కోడలు వంట బ్రహ్మాండంగా చేసింది అని మెచ్చుకున్నారట! కాబట్టి ఏదైనా చేసి తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాము. ఆయననే డిసైడ్ చేయమని అడిగాను కదా. ఇక నేను ఊరుకోవచ్చుగా! అబ్బే అంత మంచి బుద్ధి ఏది? రెండుమూడు సార్లు అర్ధకిలో గాజర్లు హల్వా చేసిన ధైర్యం, అనుభవంతో "ఏమండీ గాజర్ హల్వా చేయనా?" అని అడిగా. ఆ హల్వా ఆయనకూ నచ్చటము వలన సరే అనేసారు.

"ఎంత ఒక కిలో చేయనా?"

"కిలో ఏం సరిపోతుంది?"

"పోనీ రెండు కిలోలు?"

"కాదులే మూడు కిలోలు చేయి. మనింట్లో అందరికీ స్వీట్ ఇష్టము కదా"అన్నారు.

సరే కిర్కీ మార్కెట్ కి గాజర్ తెద్దామని వెళ్ళాము. గాజర్ ఫ్రెష్ గా వుండటముతో తెగ నచ్చేసి నాలుగు కిలోలు తీసుకున్నారు. సాయంకాలం పాలవాడికి ఎనిమిది లీటర్ల పాలు కావాలని చెప్పాను. ఏమండి ఇరుగయ్యనీ, పొరుగయ్యనీ అడిగీ, బ్లాక్ లో కొంత వైట్ లో కొంత కొని, ఎనిమిది కిలోలల పంచదార తెచ్చారు. సామాన్లన్నీ వచ్చేసాయి. రాత్రి మూడు గంట వరకు గాజర్ తురిమినా ఉత్సాహంగానే వున్నాను. మొదటిసారికదా ఇంత పెద్ద ప్రయోగం చేయడం. ఉండదేమిటి మరి? పొద్దున పాలవాడు వచ్చేలోపల జీడి పప్పు వేయించి ఉంచుదామని తీసాను. మళ్ళీ దానిదో కథ. పదిరూపాయలకే కిలో అని ఇంటిముందుకు ఓ అమ్మాయి తెస్తే అందరమూ ఎగబడి కొనేసాము. ఆ తరువాత ఎవరికో అనుమానం వచ్చి కిలో జీడిపప్పు తూకం వేయిస్తే పూర్తిగా అర్ధకిలో కూడా లేదు. ఇంకో కిలో కిస్మిస్స్ లు ఓ రెండు కిలోల నెయ్యిలో వేయించి, ఓ వంద గ్రాములు ఇలాచీలు పొడి చేసేసరికి పాలవాడు రానే వచ్చాడు. పక్క ఫ్లాట్ లోనే ఉన్న, మిసెస్ బల్బీర్ దగ్గరికి వెళ్ళి పెద్ద గిన్నె కావాలని అడిగాను, మరి ఆమె దగ్గరే కదా పెద్ద పెద్ద గిన్నెలున్నాయి. ఏం చేస్తావంటే గాజర్ హల్వా అన్నాను. ఎన్ని కిలోలు అంటూ చిన్న గిన్నె చూపిస్తే ఇది సరిపోదు నాలుగు కిలోలు అని గొప్పగా చెప్పాను. పెద్ద గిన్నె తీసి ఇస్తూ, "ఇత్నా కర్ సక్తీ క్యా?" అనగానే నాకు ఎంత కోపం వచ్చిందో! ఇంత చేస్తున్నానని కుళ్ళుకుంటోంది. అందుకే 'మనం వంట చేసేటప్పుడు ఎవ్వరినీ రానీయద్దు అనేవారు అత్తయ్యగారు'

అనుకొని జవాబివ్వకుండా గిన్నె తీసుకొని వచ్చేసాను. కిరోసిన్ స్టవ్ వెలిగించా. మరి అప్పుడు మాకు గాస్ కొరత, పంచదార కొరత కదా! అందుకే చాలా పొదుపుగా వాడే వాళ్ళము.

గిన్నెలో నాలుగు కిలోల గాజర్ తురుము, నాలుగు కిలోల పంచదార, ఎనిమిది కిలోల పాలు కలిపి పెట్టేసి, బట్టలు సర్దుకోవటము మొదలు పెట్టాను. మరి సాయంకాలము నాలుగింటికే ట్రైన్. అప్పటికి పన్నెండైంది. భోజనాలయ్యాయి, బాగ్ సద్దుళ్ళు కూడా అయ్యాయి. టైం అయిపోతోంది. కాని హల్వానే కొంచెం కూడా చిక్కబడలేదు. అలాగే ఉంది. అలిగిన పెళ్ళాంలా! ఏంచేయాలి? ఎవరికిద్దామన్నా అందరూ సెలవల్లో వెళ్ళిపోతున్నారు. ఇంతలో ఆపద్బాంధవి మిసెస్. బల్బీర్ వచ్చి అయ్యిందా అని అడిగింది. ఏడుపు మొహం వేసుకొని చూపించాను. ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఈ మాత్రం దానికి అడగటమెందుకో? అని గొణుక్కుంటూ ఉండగా, ఇంకో రెండు గిన్నెలు తెచ్చి మొత్తం కలిపి, మూడు గిన్నెలలోకి సర్ది, గాస్ స్టవ్వుల మీదికి కూడా ఎక్కించి నువ్వు ఒకటి కలుపు నేను రెండు కలుపుతాను అని చకచకా కలపటము మొదలు పెట్టింది. హమ్మయ్య ఎలా అయితేనేం సరిగ్గా ట్రైన్ టైమ్ కి పూర్తి చేసి, ఆవిడ దగ్గరే వున్న ఓ పెద్ద కాన్లో సర్ది ఇచ్చింది. ఏమో అనుకున్నాను కానీ, పాపం ఆ గిన్నెలు కూడా ఆవిడే తోమేసుకుంది. అంత వేడి వేడి హల్వా ఎలా తీసుకెళ్ళామని మటుకు అడగొద్దు. కాన్ వేడివేడి గా చురకలేస్తూంటే కూలీ మమ్మలినెంత తిట్టాడో చెప్పలేనుగా! ఇక రుచి అంటారా నాలుగు కిలోల గాజర్, నాలుగు కిలోల పంచదార, ఎనిమిది లీటర్ల పాలూ, రెండు కిలోల నెయ్యీ, కిలో అనుకున్న అర్ధకిలో జీడిపప్పూ, కిలో కిస్మిస్, 25 గ్రాములకు తగ్గని ఇలాచీ పొడితో ఆరుగంటలు ఉడికిన హల్వా బాగుండక ఏమౌతుంది?

(సాహితి - 17, 2009)

# 3. కందిపప్పు కావాలా బాబూ!

తీరికగా నవల చదువుకుంటున్న నాతో మా అమ్మాయి "ఇండియన్ స్టోర్స్ కు వెళుదాము రామ్మా" అని పిలిచింది. నవల పక్కన పెట్టి తనతో బయలుదేరాను. స్టోర్ లో ఏమేమి ఉన్నాయా అని చూస్తున్న నాకు, పక్క రాక్ దగ్గర నుంచి "ఇందులో కందిపప్పు ఏదిరా ? మనం ఏమి తీసుకోవాలి?" అని ఓ అబ్బాయి మాట వినిపించింది. తెలుగు మాట వినిపించగానే ఎవరో తెలుగువాళ్ళు ఉన్నారే అనుకుంటూ తొంగి చూసాను. ఇద్దరు కాలేజ్ స్టూడెంట్స్ లా ఉన్నారు. ఒక అబ్బాయి చేతిలో కందిపప్పు, సెనగపప్పు, పెసరపప్పు ఉన్న పొట్లాలు పట్టుకొని రెండో అబ్బాయిని అడుగుతున్నాడు.

"ఏమోరా మా అమ్మ వచ్చేముందు చూపించి చెప్పింది కాని ఇప్పుడు గుర్తు పట్టలేకపోతున్నాను" అన్నాడు రెండో అబ్బాయి.

ఆ సంభాషణ వినగానే నా మనసు నా పెళ్ళైన కొత్తరోజుల్లోకి, పూనాకి వెళ్ళిపోయింది. అచ్చట్లు ముచ్చట్లు, చిటిపొటి అలుకలతో మా కొత్తకాపురం మొదలై అప్పటికి రెండు నెలలైంది. పూనాకు వచ్చే ముందు, వెళ్ళగానే సరుకులు ఏమి కొనుక్కుంటారు అని అమ్మ, అత్తయ్యగారు వంటకు కావాల్సిన పప్పులూ, బియ్యంతో సహా అన్నీ మూడు నెలలకు సరిపోను కట్టి ఇచ్చారు. ఇద్దరూ విడివిడిగానూ, కలిసీ ఏవి ఏవో, ఎట్లా వాడాలో చెప్పారు. సరే ఇహ కొత్తకాపురమూ, కొత్త మొగుడూ, కొత్త వంటాలో మూడునెలల సరుకులూ రెండు నెలలకే ఐపోయాయి. సరుకులన్నీ ఐపోతున్నప్పుడే ఏమండీతో సామాన్లు తెచ్చుకోవాలీ అని చెపుతునే ఉన్నాను కాని ఏమండీకి, పరీక్షల మూలంగా టైం దొరకటం లేదు. పోనీ నేను కాలేజ్ నుంచి వచ్చేటప్పుడు తెచ్చుకుందామా అనుకుంటే, వచ్చీరాని హిందీ. దేనిని ఏమంటారో తెలీదు. పైగా హైదరాబాద్ లో ఉన్నప్పుడోసారి బజార్ కు వెళ్ళినప్పుడు అరటిపండ్లు బాగుంటే కొందామని 'ఎంతకిస్తావు బాబూ?' అని అడిగాను.

"సవా రూపియాకో డజన్" అన్నాడు. ఏది కొన్నా బేరం ఆడాలి కదా. వాళ్ళు చెప్పిన రేట్ కు కొంటామేమిటి అనుకొని "దేడ్ రూపియాకు దేదో" అన్నాను. అతను నా వైపు ఎగాదిగా చూసి ఇచ్చేసాడు. భలే బేరమాడాను అని సంతోషపడిపోతూ ఇంటికి వచ్చి అత్తయ్యగారితో చెప్పాను. ఆవిడ "ఓసి పిచ్చిపిల్లా! సవ్వారూపియా అంటేరూపాయి

పావలా. దేడ్ రూపియా అంటే రూపాయిన్నర. వాడు రూపాయి పావలాకి ఇస్తానంటే నువ్వు రూపాయన్నరకు తెచ్చావు" అన్నారు. సో అలా ఉండే నా హిందీతో ఏమి కొంటాను?

ఇక ఆరోజు కాలేజ్ కు వెళ్ళే ముందు "ఏమండీ ఇంట్లో పెసలు తప్ప అన్నీ ఐపోయాయి. ఏమీ లేవు. ఈ రోజు సామాన్లు తెచ్చుకోకపోతే కష్టం" అన్నాను.

"పెసలు ఉన్నాయిగా, నీకు పెసరట్టు చేయటం బాగానే వచ్చిందిగా. ఈ రోజుకు పెసలు నానబోసి రాత్రికి పెసరట్టు చేసేయి. ఈ రోజు ఎగ్జాం ఐపోయాక సాయంకాలం వెళ్ళి తెచ్చుకుందాము" అన్నారు ఏమండి.

కాలేజ్ నుంచి వచ్చాక సాయంకాలము షాప్ నుంచి వచ్చాక రుబ్బేందుకు ఓపిక ఉంటుందో ఉండదో అని పొద్దున నానబోసిన పెసలు రుబ్బి, తయారై ఏమండీ కోసం ఎదురుచూస్తున్నాను. ఏమండీ హడావుడి వచ్చి, "పదపద, ఎగ్జాంస్ ఐపోయాయని అందరమూ సినిమా ప్రోగ్రాం వేసుకున్నాము" అని హడావుడి చేసారు.

"సినిమాకా? సామాన్లు తెచ్చుకోవాలి కదా" అన్నాను.

"ఫరవాలేదులే రాత్రికి, రేపు బ్రేక్ ఫాస్ట్ కూ పెసరట్టు, మాగాయి తినేద్దాము. అంతగా ఐతే లంచ్ కూడా మెస్ లో తినవచ్చు. లంచ్ ఐనాక అటునుంచి అటే వెళ్ళి సామాన్లు తెచ్చుకుందాం. పద పద" అన్నారు.

సినిమా అయ్యాక అందరూ అక్కడే ఉన్న ఉడిపి హోటల్ లోకి నడిచారు. నేను అంత కష్టపడి రుబ్బిన పెసర పిండి పాడైపోతుంది అని గొణుగుతుంటే, ఏమండి 'మేము ఇంటికి వెళుతాము' చెప్పి అని వచ్చేసాము. ఫ్రెషప్ అయి, అట్లు వేయటం మొదలు పెట్టాను. వేడివేడిగా అట్లు తిందామనుకుంటే వేసిన అట్టు వేసినట్లే పెనానికి అతుక్కుపోతోంది. దాని దుంపతెగ ఎంతకీ ఊడిరాదే! అట్లకాడతో గీకీ గీకీ ఆ ముద్దను సింక్ లో పడేయటమూ, ఇంకోటి వేసి మళ్ళీ గీకటం. ఏమండీ కూడా ప్రయత్నం చేసారు. అబ్బే ఏమాత్రం లొంగలేదా పెసరట్టు. అదే పిండి, అదే పెనం, అదే స్టవ్. ఎప్పుడూ చేసేవే. మరి ఇప్పుడేమొచ్చింది వాటికి. రేపొద్దున బ్రేక్ ఫాస్ట్ కు కాదుకదా ఇప్పుడు డిన్నర్ కు కూడా లేకుండా పిండి మొత్తం అయిపోయి చేయి నొప్పి మాత్రం మిగిలింది. ఇద్దరమూ

మొహామొహాలు చూసుకుంటూ కూర్చున్నాము. మొహాలు చూసుకుంటూ కూర్చుంటే కడుపు నిండదుగా! అప్పటికి రాత్రి పదకొండైంది. బయట కనీసం పండ్లేమైనా దొరుకుతాయేమో చూసొస్తానని ఏమండీ స్కూటరేసుకెళ్ళి చుట్టుపక్కలంతా వెతికారు. ఎక్కడా ఏమీ దొరకలేదు. ఇక చేసేదేమీ లేక రాత్రి కోసం తోడుబెట్టిన పెరుగు ఇద్దరమూ చెరో కప్పూ తిని, మరునాటి కాఫీ కోసం ఉంచిన పాలతో చెరొక కప్ కాఫీ తాగి పడుకున్నాము. పెరుగూ, కాఫీ సూపర్ కాంబినేషన్ కదా!

మరునాడు బ్రేక్ ఫాస్ట్, లంచ్ మెస్ లో కానిచ్చేసాము. లంచ్ తరువాత మెస్ నుంచే కిరాణా దుకాణం వెళ్ళాము. దుకాణం లోని పనిపిల్లవాడు "ఏమి కావాలి?"అని అడిగాడు. అవునూ ఏమేమి కావాలని చెప్పాలి? మళ్ళీ ఇద్దరికీ అనుమానం. బియ్యం ను చావల్ అని, పిండిని ఆటా అని, పప్పును దాల్ అని అంటారని మాత్రమే తెలుసు. కానీ ఏవేవి ఎంతెంత కావాలని అడగాలి? కాస్త ఆలోచించి, "చావల్ అధా కిలో, దాల్ ఆధా కిలో" అని చెపుతుండగా ఆవాలని రాయీ అంటారనీ, జీలకర్రను జీరా అంటారనీ గుర్తొచ్చి, "రాయీ ఏక్ కిలో, జీరా ఏక్ కిలో, ఆటా ఏక్ కిలో" అని చెప్పాను. అతను "దాల్ కౌన్ సా దాల్?"అని అడిగాడు. అవునూ కందిపప్పును ఏమంటారు? అని ఇద్దరమూ ఆలోచించాము కాని తెలీలేదు. ఇంతలో దుకాణం పిల్లవాడు మిగితా సామాన్లు పొట్లు కట్టి తెచ్చాడు. ఇదేమిటి బియ్యం ఇంత తక్కువగా, ఆవాలూ జీలకర్ర ఇంత ఎక్కువగా ఉన్నాయి అని గడబిడ పడ్డాను. ఏమి దాల్ కావాలో చెప్పండి అన్నట్లు నిలబడ్డాడు. ఏమండీ "సాంబార్ చేసుకుంటామే ఆ దాల్"అన్నారు. అతను అది నాకు తెలీదు అన్నాడు అతను. ఇంతలో అక్కడే బల్ల ముందు కుర్చీలో కూర్చొని కునికిపాట్లు పడుతున్న దుకాణం ఓనర్ మా ఇబ్బంది చూసి లేచి వచ్చి "నయా సాదీ హువా క్యా? మదరాసీ హై క్యా?"అని అడిగాడు. ఏమండి అవును అన్నారు.

అప్పుడు ఆయన "ఇక్కడికి దగ్గరలో ఒక మదరాసీ వాళ్ళున్నారు. ఆ అమ్మ ఎప్పుడూ మా దగ్గరే సామానులు కొంటుంది. వెళ్ళి వాళ్ళ ను అడగండి. మీకు ఏమేమి కావాలో చెపుతారు." అని వాళ్ళ ఇంటి అడ్రస్ చెప్పాడు.

వాళ్ళ ఇల్లు తొందరగానే కనుక్కున్నాము. బెల్ కొట్టగానే ఒకాయన వచ్చి తలుపు తీసి, మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయి ఏమిటి అని అడిగారు. ఏమండి మమ్మల్ని పరిచయము చేసుకొని, మాకు వచ్చిన ఇబ్బంది చెప్పి, దుకాణాదారు వాళ్ళ అడ్రెస్

ఇచ్చాడని చెప్పారు. ఆయన మమ్మల్ని లోపలికి ఆహ్వానించి, మమ్మల్ని కూర్చోమని "ప్రమీలా!" అని పిలిచారు. లోపలి నుంచి ఒకావిడ వచ్చారు. ఇద్దరూ నడి వయసు దంపతులలా ఉన్నారు. ఆవిడను చూపిస్తూ, "నా భార్య ప్రమీల. నా పేరు రామారావు" అని మాకు పరిచయం చేసి "వీళ్ళు కొత్తగా పెళ్ళైన వాళ్ళుట. సరుకులు కొనుక్కోవటానికి దుకాణానికి వస్తే ఏమి కొనుక్కోవాలో తెలీలేదుట. శేర్ జీ మనింటికి పంపాడుట" అని ఆవిడకు చెప్పారు.

ఆవిడ మమ్మల్ని మరీ ఏమీ తెలీని పిచ్చిమొహాలనుకుంటుందేమోనని, ఏమండీ ఏదో చెప్పబోయే లోపలే "అన్ని సరుకులూ కాదండీ. బియ్యం అర్ధకిలో, పిండి కిలో, ఆవాలూ జీలకర్రా కిలో కిలో చెప్పానండి. కానీ పప్పులను ఏమంటారో తెలీలేదు." అని గబగబా చెప్పేసాను.

రామారావుగారు "బియ్యం అర్ధకిలో, పిండి కిలో చెప్పావా? పిండి ఎక్కువెందుకు చెప్పావు ? ఆవాలు కిలో చెప్పావా? ఆవకాయ పెడతావా?" తమాషాగా అన్నారు.

ఏదో ఊపులో చెప్పానే కాని అసలుకే కొత్తవాళ్ళతో మాట్లాడాలంటేనే నాకు భయం. పైగా ఆయన అలా నవ్వుతూ అంటే ఇంకా భయం వేసింది. "ఏమండీ పొద్దునా సాయంకాలమూ ఫులకాలే తింటారండీ. అందుకని ఆటా కిలో చెప్పానండి. నాకు ఆవకాయ పెట్టటం రాదండి" అన్నాను బిక్క మొహం వేసుకొని భయం భయంగా.

"మీరూరుకోండి." అని ప్రమీలగారు ఆయనను మందలించి, "నువ్వు రామ్మా. సరుకులు చూపిస్తాను" అని నా భుజం చుట్టూ ఆప్యాయంగా చేయి వేసి వంటింట్లోకి తీసుకెళ్ళారు. ఏమండి రామారావుగారిని అడిగి పెన్, పేపర్ తీసుకొని మా వెనుకే వచ్చి, "ఊరికే వినటం కాదు ఈ పేపర్ లో వాటి పేర్లు హిందీలో ఏమంటారో రాసుకో" అని నాకు ఇచ్చారు.

"కంది పప్పు ను తూర్ దాల్ అంటారు. మీకు నెలకు ఒక కిలో సరిపోతుంది. ఇది శెనగపప్పు. దీన్ని చన్నా దాల్ అంటారు. పోపులోకే కదా పావుకిలో చాలు." అని ఒక్కొక్క పప్పునూ చూపిస్తూ చెపుతున్న ఆవిడతో, "శెనగపప్పు అంటే భక్షాలు చేస్తారు కదా. అదేగా ఐతే ఒక కిలో తీసుకుంటాను" అన్నాను.

"నీకు భక్షాలు చేయటం వచ్చా?"ప్రమీలగారు ఆశ్చర్యంగా అడిగారు.

"ఓ వచ్చండి. మా అత్తగారు చేస్తుంటే చూసాను" అన్నాను.

ఆవిడ ఇంకేమీ అనకుండా సరుకులన్నిటి పేర్లూ హిందీలో చెప్పి, సుమారు మాకిద్దరికీ నెలకు ఎంత అవసరముంటాయో చెప్పారు. అన్నీ వివరంగా, బుద్ధిగా రాసుకున్నాను. ఆ తరువాత కాసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చుని, ప్రమీలగారు పెట్టిన మైసూర్ పాక్, జంతికలూ తిని, చాయ్ తాగి ఆవిడకు థాంక్స్ చెప్పి లేచాము. అప్పుడప్పుడూ రమ్మని మమ్మల్నీ వాళ్ళు, వాళ్ళను కూడా మా ఇంటికి రమ్మని మేమూ ఆహ్వానించుకున్నాము. ఆ విధంగా నా వంటింటి మీద విజయం సాధించాను అని సంబరపడ్డాను.

మరునాడు ఆదివారం కావటంతో తీరికగా బ్రేక్ ఫాస్ట్ చేసి, పప్పు, పాలకూర కలిపి కుక్కర్ లో వేసి, స్టవ్ మీద పెట్టి, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని ఏదో రాసుకుంటున్న ఏమండీ పక్కన కూర్చొని దొండకాయలు కట్ చేస్తున్నాను. ఇంతలో 'ఢాం' అని పది తుపాకులు ఒక్కసారే పేల్చినంత పెద్ద సౌండ్ వచ్చింది. ఇద్దరమూ ఉలిక్కి పడ్డాము. ఆ చప్పుడు ఎక్కడి నుంచి వచ్చిదో అర్థం కాలేదు. ఇంతలో బయట నుంచి "కుమార్... కుమార్" అని గట్టిగట్టిగా పిలుస్తూ ఎవరో తలుపులు దబదబ బాదుతున్నారు. ఏమండీ గబగబా వెళ్ళి తలుపు తీసారు. పక్కింటి కాప్టెన్. బల్బీర్, ఆయన భార్య ఇంకా కిందింటి వాళ్ళు చాలా మంది అక్కడ ఉన్నారు. ఏమైందో మాకు అర్థం కాలేదు.

బల్బీర్ "ఏమైంది? అంత పెద్ద చప్పుడు వచ్చింది. మీరిద్దరూ బాగానే ఉన్నారుగా?"అని కంగారుగా అడిగాడు.

"మాకేమయ్యింది? చప్పుడు మా ఇంట్లో నుంచి వచ్చిందా?" అన్నారు ఏమండి.

అందరూ ఇల్లంతా హడావుడిగా వెతుకుతున్నారు. ఇంతలో ఎవరో వంటింట్లో నుంచి "ఇక్కడ కుక్కర్ పేలింది" అని అరిచారు. అందరూ అటెళ్ళారు.

కుక్కర్ మూత ఊడి కిందపడిపోయి ఉంది. పప్పు పైన సీలింగ్ కూ, కిందా అంతా చల్లినట్లుగా పడి ఉంది. గాస్ స్టవ్ నొక్కుకుపోయింది.

"కుక్కర్ పేలి పైకి ఎగిరి, కిందకు స్టవ్ మీద పడి, కింద నేల మీదకు పడినట్లుంది" అన్నారు ఎవరో.

"ముందు గాస్ బంద్ చేయండి" అన్నారు ఎవరో. ఏమండి గబగబా లోపలికెళ్ళి గాస్ బంద్ చేసారు. అసలు కుక్కర్ ఎలా పేలింది అనుకోసాగారు అందరు.

బల్బీర్ వాళ్ళింటికి లంచ్ కు వచ్చిన కాప్టెన్. స్వామినాథన్ వాళ్ళ అమ్మగారు "కుక్కర్ లో నీళ్ళు తక్కువయ్యాయేమో, ప్రెషర్ ఎక్కువై పేలిపోయింది. సేఫ్టీ వాల్వ్ దగ్గర కడిగినప్పుడు కొబ్బరి పీచో, మట్టో అడ్డంపడి మూసుకుపోయి ఉంటుంది. అందుకని సేఫ్టీ వాల్వ్ తెరుచుకోలేదు. ఇంకా నయం అమ్మాయి బయట ఉండబట్టి సరిపోయింది. వంటింట్లోనే ఉంటే ఏమయ్యేదో" అన్నది.

బిత్తరపోయి, జరుగుతున్నదంతా అయోమయంగా చూస్తున్న నా దగ్గరకు వచ్చి ఏమండీ నా భుజం చుట్టూ చేయివేసి దగ్గరకు తీసుకున్నారు. నన్ను కూర్చోబెట్టారు. అప్పటికి కాస్త తేరుకున్న నా దగ్గరకు ఆ పెద్దావిడ వచ్చి, నా తల నిమురుతూ, "భయం లేదులే. అదృష్టవంతురాలివి పెద్ద ప్రమాదం తప్పింది. కుక్కర్ లో ఏమి వేసావు?" అని అడిగారు.

"పాలకూర, పప్పు వేసాను పిన్నిగారు"అన్నాను.

అందరూ కాసేపు జరిగిన దాని గురించి మాట్లాడుకొని, మాకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళారు. ఆ పిన్నిగారు ఏదో అనుమానం వచ్చినదానిలా "ఏ పప్పు వేసావు? ఎంత నీళ్ళుపోసావు?" అని అడిగారు. ఆవిడను లోపలికి తీసుకెళ్ళి నేను వేసిన పప్పు చూపించాను. "మీరు శెనగపప్పుతో వండుకుంటారా?" కాస్త అనుమానంగా అడిగారు.

"కాదండీ ఇది కంది పప్పే కదా?"అడిగాను నేను.

"కాదు శెనగపప్పు. దీనికి ఎక్కువ నీళ్ళుపోయాలి. నువ్వు తక్కువ నీళ్ళుపోసావు. పైగా సేఫ్టీ వాల్వ్ మూసుకుపోయింది. అందుకే పేలింది." అని చెప్పి కందిపప్పుకూ, శెనగపప్పుకూ తేడా చూపించి, “లేబుల్ మీద వాటి పేరు రాసి డబ్బా మీద అతికించుకో” అని సలహా చెప్పి ఆవిడా వెళ్ళిపోయారు.

అప్పటికి స్టోర్ లో సామాన్లు కొనటం అయిపోయి, బిల్ కూడా పే చేసిన మా అమ్మాయి, "అమ్మా రా" అని పిలవటముతో కొత్తకాపురమూ, నా వంటిల్లు నుంచి బయట పడ్డాను.

ఇంకా "ఇంతకీ ఇందులో కందిపప్పు ఏదిరా?" అని తర్జనభర్జనలు పడుతున్న ఆ అబ్బాయిల దగ్గరకు పెళ్ళి "కందిపప్పు కావాలా బాబూ?" అని అడిగాను.

వాళ్ళిద్దరూ నా వైపు చూసి అవునాంటీ అన్నారు ఒక్కసారే. వాళ్ళకు కందిపప్పు చూపించి "దీని మీద తూర్ దాల్ అని రాసి ఉంటుంది. గుర్తుపెట్టుకోండి." అని చెప్పి మా అమ్మాయితో బయటకు నడిచాను.

## 4. ఆపరేషన్ సక్సెస్ - పేషంట్ డైడ్!!!!!

బయట మాటలు వినిపిస్తూంటే, ఎవరో వచ్చారు అని, ఏమండీ గారి స్టాండింగ్ ఇన్స్ట్రక్షన్స్ ప్రకారం, నీళ్ళ గ్లాస్ ట్రే లో పెట్టుకొని బయటకు వచ్చాను. అక్కడ పంచెకట్టుతో, నుదుటన కుంకుమబొట్టుతో ఉన్న ఒక పెద్దాయన కూర్చొని ఏమండీ గారితో మాట్లాడుతున్నారు. ఆయనకు నీళ్ళిచ్చి ఏమండి పక్కన కూర్చున్నాను. "మా ఆవిడండి. బియే ఫైనల్ ఇయర్ చదువుతోంది. " అని నన్నూ, "మహదేవ్ గారు అని తెలుగు పండితులు. ఈ మధ్య తెలుగు మాస్టారిగా రిటైర్ అయ్యారు." అని ఆయనను నాకూ పరిచయం చేసారు.

"నీ గ్రూప్ ఏమిటమ్మా?" అని అడిగారు మాస్టారు.

"ఇంగ్లిష్ లిటరేచర్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ అండి" అని వినయంగా సమాధానం ఇచ్చాను.

ఆయనకు ఐదుగురు పిల్లలట. ఒక్క అమ్మాయి పెళ్ళే అయ్యిందిట. ఇంకో అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారుట. ముగ్గురు మొగపిల్లలు చిన్నవాళ్ళుట. “రిటైర్ ఐనా ఇంకా పాఠాలు చెప్పగలిగే ఓపిక ఉందండి. ఎక్కడైనా ప్రైవేట్ లైనా చూపించండి. లేదా చిన్న ఉద్యోగం ఐనా ఇప్పించండి” అని అడుగుతున్నారు. పాపం పెద్దవాడు, ఇబ్బందులల్లో ఉన్నాడు. ఏమండీగారు ఏమంటారో అని జాలిగా, టెన్షన్ గా చూస్తున్నాను. కాసేపు ఏమండీ నిశబ్దంగా ఉండి, "ప్రస్తుతం నా దగ్గర ఉద్యోగాలేమీ లేవు. ఇంకెక్కడైనా చూస్తాను. అప్పటి వరకు మా ఆవిడకు ట్యూషన్ చెప్పండి" అన్నారు.

నేను ఉలిక్కిపడ్డాను. ఇదేమిటి నా నెత్తిసే బండ వేసారు. ఈయన నాకు చెప్పే ట్యూషన్ ఏమిటి అని కంగారుగా, "నాకు తెలుగు సబ్జెక్ట్ లేదు కదండి" అన్నాను.

వెంటనే మహదేవ్ గారు "ఫరవాలేదమ్మా, నేను ఇంగ్లీష్ చెప్పలేను కాని పొలిటికల్ సైన్స్, హిస్టరీ చెప్పగలను." అన్నారు.

ఏమండీ గారు, "సరే అవే చెప్పండి" అన్నారు.

నా మొహం పొలిటికల్ సైన్స్ కు, హిస్టరీ కి ప్రైవేట్ ఏమిటి? ఎవరన్నా విన్నా నవ్వుతారు అని అయోమయంగా చూస్తున్నాను. "సరేనండి. రేపు మంచి రోజే. రేపటి నుంచి మొదలుపెడదాము. మధ్యాహ్నం భోజనం అయ్యాక ఓ కునుకు తీసి నాలుగింటి వస్తాను." అనేసి మహదేవ్ గారు వెళ్ళిపోయారు.

ఆయన అటెళ్ళగానే, "ఈ ప్రైవేట్ ఏమిటండి?" అన్నాను.

"పోనిద్దూ పెద్దవాడు, ఇబ్బందులు పడుతున్నాడు. ఊరికే ఇస్తే డబ్బులు తీసుకోడు. ఏదో కాస్త సాయం చేసినట్లుగా ఉంటుంది. రోజొక గంట చెప్పించుకో. మునిగిపోయిందేముంది?" అనేసారు.

ఏడుపుమొహం తో ఏమనలేక చూస్తూ ఉండిపోయాను!

మరునాడు కాలేజ్ లో మధ్యాహ్నం మొదలు కాబోయే ప్రైవేట్ ఎట్లా తప్పించుకోవాలా అని తల బద్దలుకొట్టుకుంటూ, తప్పించుకునే దారి దొరకక దేభ్యమొహంతో ఓ పక్కన కూర్చొని గోళ్ళు కొరుక్కుంటూ ఉంటే, రాణి వచ్చి, "ఏమైందే మీ ఏమండీగారితో దెబ్బలేమైనా తిన్నావా?" అని పలకరించింది.

"నీ మొహం. దెబ్బలు కాదు, ట్యూషన్ పెట్టారు హిస్టరీ, పొలిటికల్ సైన్స్ లో. ఎట్లా ఎగొట్టాలో తెలీక చస్తున్నాను." అన్నాను విసుగ్గా.

"అబ్బ. ట్యూషనా, నేనూ చేరనా? ట్యూషన్ అంటే నా కెంత ఇష్టమో. మా అమ్మ వద్దంటుంది. ప్లీజ్ ప్లీజ్ నేనూ వస్తానే" అన్నది సంబరాలు పడిపోతూ.

'ఇదేమిటి అంత సంతోషిస్తోంది? ట్యూషన్స్ అంటే ఇష్టం ఏమిటి దాని బొంద. ఎక్కడ దానికన్నా నాకు ఎక్కువ మార్కులొస్తాయో అని ఏడుపు' అని మనసులో అనుకొని "సరే ఏడు" అన్నాను చిరాగ్గా.

లంచ్ కాగానే మా కార్ గారేజ్ లో ఓ పక్కగా టేబుల్, మూడు కుర్చీలు వేసాను. భోజనం కానిచ్చి హాస్టల్ నుంచి రాణి కూడా వచ్చింది. చిన్నగా నాలుగింటికి మాస్టారు గారు వచ్చారు. రాణీ కూడా ట్యూషన్ లో చేరుతోందని సంతోషించారు. కుర్చీలో కూర్చోవటానికి

కాస్త ఇబ్బంది పడుతున్నట్లుగా అనిపించి "మాష్టారూ ఏమైందండి?" అని అడిగాను. ఆ అడగటం ఎంత పొరపాటో తెలుసుకునేసరికి సమయం నా చేతుల్లో నుంచి జారిపోయింది!

"ఏం లేదమ్మా! ఈ రోజు మాచెల్లెలి స్నేహితురాలు నన్ను భోజనానికి పిలిచింది. చక్కగా పీటవేసి, అరిటాకు మీద వడ్డించింది. ఎదో పెద్దవాడిని కదా నాకూ కొన్ని నియమాలు ఉన్నాయి. ఒక్కోరోజు ఒక్కో నియమం పెట్టుకుంటాను. ఈ రోజు భోజనం చేసేటప్పుడు, ఏది పారేయకూడదనీనూ, అంటే ఏం లేదమ్మాయి కరివేపాకు, పచ్చిమిరపకాయలాంటివి తీసి పడేస్తాము కదా అవి ఈ రోజు పారేయనన్నమాట, ఇంకా వాళ్ళు వడ్డించనవి కాదనకుండా తినేయాలి అన్న నియమాలున్నాయన్నమాట. మామూలుగా ఎవరు భోజనానికి పిలిచినా వాళ్ళు అడుగుతారు ఏమైనా నియమం ఉందా అని, ఆవిడ అడగలేదు నేను చెప్పలేదు. చక్కగా వంకాయ పూర్ణం, కొబ్బరిపచ్చడి, అప్పడాలు, వడియాలు అదిరిపోయాయనుకో. ఎంత రుచిగా ఉన్నా మరీ ఎక్కువగా తినలేముగా, పులుసు వేయమని సైగ చేసాను. వేడి వేడిగా, మునక్కాడముక్కలతో, ఘుమఘుమలాడుతున్న పులుసు వడ్డించింది. ఏదీ పారేయకూడదు కదా అందువల్ల మునక్కాడ తొక్కలు కూడా కష్టపడి తినేసాను. ఆవిడ నాకు ములక్కాడలు ఇష్టమనుకొని నేను వారించే లోపలే ఇంకాసిని, మరిన్ని ములక్కాడ ముక్కలు వడ్డించేసింది. అవి తినలేను, పారేయలేను, వద్దని చెప్పలేను. ఏం చెప్పను నా ఇబ్బంది అవన్నీ పారయకుండా, తొక్కలతో సహా తినేసరికి కళ్ళల్లో నీళ్ళొచ్చేసాయనుకో! మొత్తానికి ఎలాగో పూర్తి చేసి, ఇంటికెళ్ళి కాసేపు పడుకొని వచ్చాను. ఐనా ఇంకా ఇబ్బంది తగ్గలేదు" అన్నారు దీనంగా.

"ఇలా భోజనాలకి కూడా నియమాలుంటాయా మాష్టారూ? " అడిగింది రాణి.

"అవునమ్మా మన పెద్దవాళ్ళు కొన్ని నియమాలు పెట్టారు కదా! రాను రాను ఎవరూ వాటిని పాటించటంలేదు. భోజనం చేసేటప్పుడు కబుర్లు చెప్పకుండా ప్రతి మెతుకూ ఆస్వాదిస్తూ తింటే చక్కగా అరిగి, వంటికి పడుతుంది. కొంతమంది ఇల్లాళ్ళు పెద్దవాళ్ళను, దంపతులను పిలిచి భోజనం పెడితే పుణ్యం అని భోజనానికి పిలుస్తుంటారు. ఇప్పుడు నేను రిటైర్ అయి ఖాళీగా ఉన్నాను కదా పిలుస్తుంటారు" అని నీరసంగా చెప్పారు.

ఇంకాసేపు అవే కబుర్లు చెప్పి, “రేపటి నుంచి పాఠాలు చెప్పుకుందామమ్మా” అని వెళ్ళిపోయారు!

మరునాడు వస్తూనే "మా బుజ్జిగాడికి మూడోనెల వచ్చిందమ్మా, ముచ్చటగా ముద్దలిప్పించారు" అన్నారు మాష్టారు సంబరపడిపోతూ.

"బుజ్జిగాడెవరండీ మాష్టారూ? ముద్దలిపించటమంటే ఏమిటండి?" అడిగింది రాణి.

"మా పక్క వాటాలో అద్దెకున్నవాళ్ళ బాబమ్మా. బుజ్జి వెధవ ఎంత ముద్దొస్తున్నాడో! పిల్లలు పుట్టినప్పటి నుంచీ వేడుకలూ, సంబరాలే కదా! బారసాలతో మొదలనుకో!మూడో నెల రాగానే కొంత మంది వెన్న ముద్దలిస్తారు. కొంతమంది నువ్వుముద్దలు ఇలా వాళ్ళ ఇష్టం బట్టి ఇస్తారు. మా బుజ్జిగాడితో వెన్నముద్దలిప్పించారు. తెల్లగా మెరిసిపోతూ, సువాసనతో అప్పుడే తీసిన వెన్న ముద్ద పెద్ద వెండి గిన్నెడు ఇచ్చారు...”

అలా అలా సాగిపోయింది మాష్టారుగారి వాక్ప్రవాహం. రాణి ఒక్కతే కూతురు. పైగా వాళ్ళ అమ్మ ఉద్యోగం చేస్తూ ఉండటంతో ఎక్కువగా ఏ వేడుకలకూ వెళ్ళలేదు. చూడలేదు. అంచేత ఏమి తెలీవు. దానితో ఇవన్నీ సరదాగా ఉన్నాయి. చాలా ఆసక్తిగా వింటోంది. నేనేమో మాటిమాటికి నా చేతి గడియారంలో టైం చూసుకుంటూ ‘పాపాయికి పాలు పట్టే వేళైంది’ అని గాభరాపడుతున్నాను.

"సరేనమ్మా, రేపు రాజకీయ శాస్త్రం చెప్పుకుందాం" అని వెళుతూ వెళుతూ ఆగి, "అన్నట్లు రేపు నాకు మౌనవ్రతం. అందుకని రాను. ఎల్లుండి రాజకీయ శాస్త్రం చెప్పుకుందాం" అన్నారు.

సరే అన్నట్లు అయోమయంగా తలూపాను నేను!

ముచ్చటగా మూడోరోజు కాదుకాదు నాలుగోరోజు వచ్చారు మాష్టారు కాస్త భారంగా. "అమ్మాయిలూ ఈ రోజు మా ఆవిడ చింతకాయపచ్చడి చేసింది. భలే రుచిగా ఉండి కాస్త ఓ ముద్ద ఎక్కువ తిన్నాను. కొత్తచింతకాయలు వస్తున్నాయా! అవి కాస్త వగరుగా కాస్త పుల్లగా ఉంటాయా! ఆ పిందెలతో పచ్చడి చేస్తే...”

దేవుడా! ఇక ఈ రోజు చింతకాయపచ్చడి ప్రహసనం అన్నమాట. రాణి నోరెళ్ళబెట్టుకొని వింటోంది.

మాష్టారు చింతకాయపచ్చడి గురించి వివరించి వివరించి, "మీ పుస్తకాలు తీయండమ్మా" అన్నారు భుక్తాయసంతో కునికిపాట్లు పడుతూ.

నా మొహం ఇంకేం పుస్తకాలు? ఆయన అప్పుడే కుర్చీలో చేరగిలిపోయారు!

ఇలాకాదని ఆ రోజు మా ఏమండీతో, "ఏమండీ ఆయన కథలూ కబుర్లూ తప్ప పాఠాలేమీ చెప్పటం లేదు. ప్రైవేట్ వద్దండీ" అని నసుగుతూ చెప్పాను.

"పాపం ఐదుగురుపిల్లలు, మంచివాడు, ఊరికే సాయం చేస్తే తీసుకోడు. కబుర్లేగా కాసేపు వింటే పోలా" అని చప్పరించేసారు.

హూం ఇంకేం చేస్తాను. బుజ్జిగాడి మూడోనెల ముద్దల్తో మొదలై, బోర్లపడితే బొబ్బట్లు, అడుగులేస్తే అరిసెలు, మధ్య మధ్య భోజనాల భుక్తాయసాలతో, బుజ్జిగాడికి పలుకులొస్తే పంచదార చిలకల దాకా, అంతేనా ఊళ్ళోని, వీధిలోని రాజకీయ కబుర్లతో సాగి... సాగి మా పరీక్షలొచ్చేసాయి.

మొదటి పేపర్ ఇంగ్లీష్ లిటరేచర్ సంతృప్తిగా రాసాను. తరువాత చరిత్ర పేపర్ ముందుపెట్టుకొని కూర్చుంటే, మునక్కాడలూ, చింతకాయపచ్చడి తప్ప ఏమీ గుర్తురాలేదు! ఎప్పుడో చదివినవి కొద్దిగా గుర్తొస్తే అవే రాసి వచ్చాను. ఆ తరువాత పాల్టిక్స్ పేపర్ రాద్దామంటే బుజ్జిగాడి పేడుకలు అరిసెలు, బొబ్బట్లూ, వీధిలోని రాజకీయలూ తప్ప ఏమైనా గుర్తొస్తే ఒట్టు! పరీక్ష హాల్ నుంచి బయటకు వస్తే మా స్నేహితులంతా గలగలా కబుర్లు చెప్పుకుంటూ, 'పరీక్షలైపోయాయి కదా సినిమాకు పోదాం' అని ప్లాన్ లు వేస్తున్నారు. రాణి ఏదా అని చుట్టూ చూస్తే ఓ చెట్టు కింద కనిపించింది. నేను అటెళ్ళగానే నన్ను చూసి భోరుమంది. ఇద్దరమూ ఒకళ్ళనొక్కళ్ళు వాటేసుకొని కాసేపు ఏడ్చి, పైటకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ ఇంటిదారి పట్టాము.

రిజల్ట్స్ సంగతి ఇక వేరే చెప్పేదేముంది? ఝూటర్ ఢమాల్! మార్క్స్ తెచ్చుకోవటానికి వెళ్ళక తప్పదుగా!మార్క్స్ షీట్ తీసుకొని మరోసారి నేనూ, రాణీ కాసేపు కళ్ళుముక్కూ ఎగబీల్చాము. మాష్టారుగారి దగ్గర నేర్చుకున్న మౌనవ్రతం పాటిస్తూ, నా

మార్క్స్ షీట్ తీసుకెళ్ళి ఏమండీకి ఇచ్చాను. నా మార్క్ షీట్ చూసి ఏమండి కాసేపు గడ్డం కింద రాసుకుంటూ ఉండిపోయారు! ఆ మౌనం చూసి భయం వేసి నత్తి నత్తిగా నసుగుతూ "ఏమండీ, పరీక్షలో మాష్టారు చెప్పిన బొబ్బట్ల వంటకం, చింతకాయ తయారీ, అవీ తప్ప పాఠాలు ఏవీ గుర్తు రాలేదు. అందుకని..." నసుగుతున్న నన్ను చూసి, "ఐతే మీ మాష్టారు వంటలు బాగా నేర్పారన్నమాట. అందుకే ఈ మధ్య వంటలు బహు రుచిగా ఉంటున్నాయి. ఏదోవొకటి నేర్పారుగా..." అంటూ పెద్దగా నవ్వేసారు.

బాగుంది హూం అనుకుంటూ నిట్టుర్చాను. ఏమైతేనేం యూనివర్సిటీలో చరిత్రలో యం.ఏ చేయాలి, యూనివర్సిటీ లోని పెద్ద లైబ్రరీలోని పెద్ద పెద్ద పుస్తకాలు చదుకోవాలి అన్న నా కలలు కలలుగా చరిత్రలో కలిసిపోయాయి.

(సంచిక అంతర్జాల పత్రిక – 1- 1- 2018)

## 5. ముబ్బుల పల్లకి

"ఏమండీ... ఏమండీ... ప్లీజ్ ప్లీజ్" ముందుకు వెళుతున్న ఏమండీగారి చేయి పట్టుకొని అన్నాను.

"ఊ... వెళ్ళు" అన్నారు ఏమండీగారు.

"థాంక్యూ. ఎంతైనా మా ఆయన చాలా మంచివారు. బంగారు కొండ" అన్నాను.

"ఎందుకూ కిటికీ సీట్ ఇచ్చినందుకా? ఇవ్వక పోతే బతకనిస్తావా, దారంతా గొణుగుతూనే వుంటావు." అన్నారు చిన్నగా నవ్వుతూ.

నేనూ నవ్వుతూ లోపలకు వెళ్ళి, కుర్తీ సరిగ్గా సద్దుకొని కూర్చుంటూ కిటికీలో నుంచి బయటకు చూసాను. కొద్ది దూరంలో, అక్కడక్కడ రెక్కలు సాచి, వెండిరంగులో, ఎండకు మిలమిలా మెరుస్తూ రాయంచలా నిలబడి వున్నాయి ముబ్బుల పల్లకీలు (విమానానికి నేను పెట్టుకున్న ముద్దు పేరు.) వాటిని అలా పరవశంగా చూస్తూ వుండి పోయాను. అందులో ఒకటి చిన్నగా స్టార్ట్ అయ్యి ముందుకు, చిన్నగా పరుగు మొదలు పెట్టింది. దానిని అలా చూస్తూ వుండగా మనసు గతంలోకి పరుగెత్తింది.

అది 1972 వ సంవత్సరము. అప్పుడే పాకిస్తాన్ యుద్ధం ముగిసి శాంతి నెలకొంటున్న రోజులు. సరిహద్దులల్లో ఇంకా పూర్తి ఉద్రిక్తత తగ్గలేదు. ఆ సమయములో మా ఏమండీగారికి సరిహద్దు ప్రదేశంలో ఒకటైన షిలిగురి నుండి వెళ్ళే ఆర్మీ కాంప్ కు పోస్టింగ్ వచ్చింది. యుద్ధం ముగిసినా ఉద్రిక్తత తగ్గలేదు కాబట్టి ఆంక్షలు ఇంకా పూర్తిగా సడలించ లేదు. దాన్ని ఇంకా పీస్ స్టేషన్ గా మార్చలేదు కాబట్టి కుటుంబాలను దగ్గరలోనే వున్న డార్జ్ లింగ్ లో సెపరేటెడ్ ఫామిలీ క్వార్టర్స్ లో ఉండవచ్చు అన్నారు. కానీ అక్కడకూ ఆయన ఏ రెండు మూడు నెలలకో కాని రాలేరు. 'అప్పుడు చంటిపిల్లతో ఒక్కతీ అక్కడ ఎలా ఉంటుంది? వద్దు' అని పెద్దవాళ్ళు, ఇక పోతే బి.యే పూర్తి చేయవలసిన బృహత్కార్యం నా భుజస్కంధాలపైన ఉండటం వల్లనూ, నేనూ మా అమ్మాయి హైదరాబాద్ లోనే ఉండిపోయాము. ఆయన సంవత్సరానికి రెండు నెలలు సెలవల్లో వచ్చి వెళుతుండేవారు. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. పోయినసారి వచ్చివెళ్ళిన తరువాత, మా అమ్మాయి 'డాడీ!' అని ఏడ్చినప్పుడు ఏమండీగారి ఫొటో చూపించి ఏవో

కథలూ కాకర కాయలు చెబితే ఊరుకుంది కాని ఈ సారి చాలా బెంగ పెట్టుకుంది. ఏమి చేయాలో మాకు తోచటం లేదు. ఆయన వచ్చి పెళ్ళి నాలుగు నెలలైనా బెంగ తగ్గ లేదు. పోనీ ఆయనతో మాట్లాడిద్దామంటే ఈరోజుల్లా ఫోన్ల కాలం కాదు. ఉత్తరాలే గతి. అవీ పోస్టల్ వాళ్ళ దయా, మా ప్రాప్తం అన్నట్లూ నిక్కీ నీలిగీ తీరికగా వచ్చేవి! అప్పుడేమైందంటే...

ఓ రోజు పొద్దున్నే కాలేజీకి వెళుదామని పుస్తకాలు తీసుకొని బయటకు వస్తున్నాను. నా వెనుక మా అత్తగారు ఏదో చెబుతూ వస్తున్నారు. ముందు వరండాలోకి వచ్చాము. అక్కడ మా మామగారు కూర్చొని పేపర్ చదువుకుంటున్నారు. ఇంతలో...

"టెలిగ్రాం" అంటూ వచ్చాడు... పోస్ట్ మాన్. ఒక్క ఉదుటున మా మామగారు లేచి “ఎక్కడినుంచి బాబూ?” అని అడిగారు.

"కాప్టెన్. కుమార్ దగ్గర నుంచండి” అన్నాడు పోస్ట్ మాన్.

‘ఆ!’ అని వణుకుతున్న చేతులతో టెలిగ్రాం అందుకున్నారు మా మామగారు.

గోడను పట్టుకొని నేను, నా భుజం గట్టిగా పట్టుకొని మా అత్తగారు వణుకుతూ నిలబడ్డాము.

ఆ టెలిగ్రాం నన్ను చదవమన్నట్లుగా, “అమ్మాయ్!” అంటూ నావైపు చాచారు మామయ్యగారు. నేను అప్పటికే ఫేంట్ అయ్యే ప్రోగ్రాం లో వున్నాను!

ఇక తప్పక ఆయనే విప్పి చదివారు. “మాలను, సంజును కలకత్తాలో రిసీవ్ చేసుకుంటాను” అని ఉంది అందులో. ఇదేమిటి? ఏమి జరిగింది? మమ్మల్ని కలకత్తాలో రిసీవ్ చేసుకోవటం ఏమిటి? అంతా అయోమయం లో పడ్డాము. కళ్ళనీళ్ళతో అత్తయ్య గారు కుర్చీలో కూలబడ్డారు. మామయ్య గారు ఆ టెలిగ్రాం ను అటు తిప్పి, ఇటు తిప్పీ అలోచనలో వున్నారు. నేను పుస్తకాలు పక్కన పడేసి, గోడకు ఒంటి కాలి మీద ఆనుకొని నిలబడి గోళ్ళు కొరికేస్తున్నాను.

సంజు వచ్చి కాళ్ళకు చుట్టుకొని అమ్మా ఆకలి అంది. అప్పుడు గమనించాము పొద్దుటి నుంచీ అలాగే వున్నామని, భోజనాలు చేయాలని. “ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు కానీయండి భోజనం చేద్దాం" అన్నారు మామయ్య గారు.

మమ్మల్నీ ఇంకా అయోమయావస్థలో ఉంచటం ఇష్టం లేక పోస్టల్ వాళ్ళు మధ్యాహ్నం పోస్ట్ లో ఉత్తరం ఇచ్చేసారు పాపం. మళ్ళీ గుండె దడ మొదలు! ఎందుకంటే అది మామూలు కవరు కాదు, బ్రౌన్ కలర్ పొడవాటి కవర్ మామయ్య గారి పేరు మీద వుంది! చిన్నగా, జాగ్రత్తగా చించారు.

అందులో నుంచి పొడవుగా మడత పెట్టి వున్న రెండు అట్ట ముక్కలు, ఒక ఉత్తరము బయటకు వచ్చాయి. 'సంజు చాలా మనాది పడ్డది కాబట్టి ఒక వారము రోజులు తన దగ్గరలో ఫామిలీని ఉంచుకునేందుకు పర్మిషన్ తీసుకున్నాని, (కూతురే మనాది పడిందా నేను కాదా కొంచెం కినుకగా అనుకున్నాను.) విజయవాడలో, కలకత్తాలో రైళ్ళు మారి నాలుగు రోజులు ఒక్కతే ప్రయాణం చేయటం కష్టం కాబట్టి, విమానం టికెట్లు పంపుతున్నాననీ, ఫలానా రోజు అక్కడ వాళ్ళిద్దరినీ విమానం ఎక్కిస్తే, కలకత్తాకు నాలుగు గంటల్లో చేరుకుంటుంది, తనను రిసీవ్ చేసుకోవటానికి నాకు వచ్చేందుకు వీలు కాకపోతే, కలకత్తా ఏర్ పోర్ట్ కు ఒక సిపాయిని పంపిస్తాననీ, అతను యూనీఫారంలో వుంటాడు, మాల పేరు ఉన్న అట్టను పట్టుకొని వుంటాడు కాబట్టి అతనిని కనుక్కోవటం సులభం, అతను జాగ్రత్తగా ఇక్కడకు తీసుకు వస్తాడు' అని ఆ ఉత్తరం సారాంశం!

సిపాయి కాకుండా తనే వచ్చి రిసీవ్ చేసుకుంటానని టెలిగ్రాం ఇచ్చారన్నమాట! ఐతే టెలిగ్రాం బులెట్ లా, ఉత్తరం తాపీగా టెలిగ్రాం ముందు, ఉత్తరం వెనకలా ముందు వెనుకల వచ్చాయన్నమాట. మామయ్య గారి దగ్గర నుంచి ఉత్తరం తీసుకొని, గదిలోకి వెళ్ళి ఉత్తరం మళ్ళీ చదివాను. అంతా నేను ఎలా రావాలో, ఏమేమి తెచ్చుకోవాలో వ్రాసి ఉంది. సంజు గురించి వ్రాసారు కాని నా గురించి కాని, నాకు వేరే ఉత్తరం కాని ఏమీ లేదు! కొంచెం నిరాశగా అనిపించి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఉత్తరంలో నుంచి చిలిపిగా నవ్వారు. 'ఊ!' అనుకొంటూ తల పక్కకు తిప్పుకున్నాను. నా గడ్డం పట్టుకొని, నా మొహం తన వైపు తిప్పుకుంటూ, "అలిగావా?" అని అడిగారు.

"కాదా మరి? నాకస్సలు ఉత్తరమే వ్రాయలేదు. అంతా మామయ్య గారికే వ్రాసారు. నేను మీ ఉత్తరం కోసం ఎంత ఎదురు చూస్తానో తెలుసు కదా?" అలుకగా అన్నాను.

"నిజమేననుకో, కాని నిన్ను రమ్మని నీకు వ్రాస్తే బాగోదు కదా! నాన్నకు చెప్పాలిగా! అందుకని నాన్నకు రాసాను." అన్నారు.

"మీరన్నీ అంతే చేస్తారు. సెపరేటెడ్ ఫామిలీ క్వాటర్స్ లలో కూడా బాగుంటుందిట. లేడీస్ అందరూ కార్డ్స్ అనీ, క్లబ్ అనీ ఎంజాయ్ చేస్తారుట. అంతా చక్కగా కలిసి మెలిసి వుంటారుట. పిల్లలకూ కంపెనీ వుంటుందిట. మిలిట్రీ కాంప్ కాబట్టి సెక్యూరిటీ బాగా ఉంటుందిట. మొన్న బజార్ లో మిసెస్. చెడ్డా కనిపించి చెప్పింది. 'నువ్వెందుకు వెళ్ళలేదు?' అని అడిగింది. పైగా మీరూ అప్పుడప్పుడూ కనిపిస్తూ ఉంటారు. ఇక్కడికైతే సంవత్సరం దాకా రారు. ఇంకా సంవత్సరం గడవాలి. అప్పుడు కాని పోస్టింగ్ రాదు. మీరేమో నువ్వు గ్రాడ్యుయేట్ కావాలి అని కాలేజ్ లో చేర్పించి వెళ్ళారు. ఇప్పుడు పది రోజులున్నా మళ్ళీ 8 నెలల దాకా కనిపించరు. ఇక నా వల్ల కాదు, ఇలా ఒంటరిగా ఉండటం" విచారంగా చెప్పాను.

"మరి నేను ఉండగలనా? మిమ్మల్నందరినీ వదిలి ఈ అడవిలో ఉంటున్నాను. మొన్న రాజ్ చెప్పాడు, ఇంటికి వెళ్ళినప్పుడు, 'మమ్మీ ఎవరో అంకుల్ వచ్చాడు' అన్నాడుట కొడుకు. ఎంత బాధ! మిలిట్రీ వాళ్ళ జీవితాలు ఇంతే వుంటాయి. మరి అడ్జెస్ట్ కావాలి. రాత్రి పూట బీర్ మగ్ తీసుకొని టెంట్ ముందు కూర్చుంటే, పైన చంద్రుడు వెన్నెలలు కురిపిస్తూ వుంటాడు. అడవిపూల సువాసనలు తేలి వస్తూ ఉంటాయి. వాతావరణం ఎంత ఆహ్లాదంగా ఉంటుందో తెలుసా! నిన్నెంత మిస్ అవుతానో! ఈ వెన్నెలంతా దండగై పోయింది కదా అనిపిస్తుంది" నవ్వారు ఏమండీగారు.

"అయ్యగారికి కవిత్వం కూడా వస్తోంది" నవ్వాను నేను.

"కమలా!" మామయ్య గారి పిలుపు వినిపించింది. ఉలిక్కి పడ్డాను. 'ఓ... ఇదంతా కలా?' నిరాశగా అనుకున్నాను. చేతిలోని ఉత్తరమూ, టికెట్లూ మసక మసకగా కనిపించాయి. కళ్ళు తుడుచుకున్నాను. 'నీవు వచ్చేవని, నీ పిలుపే విని, కన్నుల నీరిడి కలయ చూసితిని.' అనుకుంటూ లేచి బాత్రూంలోకి వెళ్ళి మొహమూ, కళ్ళూ కడుక్కొని బయటకు వెళ్ళాను.

గాభరా ఏమీ లేదని తెలిసాక మళ్ళీ చర్చ మొదలైంది. "ఇప్పటికే ఐదవ నెల కనుక సీమంతానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము, ఇప్పుడు పంపిస్తే ఎలాగా? మళ్ళీ అది తిరిగి వచ్చేసరికి ఆరో నెల వచ్చేస్తుంది. మన ఆనవాయితీ ఐదో నెల చేయటమే. ఠాట్ ఇప్పుడు పంపేందుకు వీలు లేదు వాడికి ఉత్తరం వ్రాసేయండి!" అన్నారు అత్తయ్య గారు.

“ఎట్లాగా? వాడు టికెట్ పంపాక పంపమని ఎలా చెబుతాము? మీ తల్లీ కొడుకులతో చస్తున్నాను!” మామయ్యగారి ధుమధుమలు! గోడకానుకొని, అడుగూ బొడుగూ మిగిలిన గోళ్ళు కొరుకుతూ నేను. కాకపోతే ఈ సారి సీను బయట వరండాలో కాకుండా లోపలి హాల్ లో! సరే తర్జన భర్జనలు, శిఖరాగ్ర సమావేశాల అనంతరం నన్ను పంపేందుకూ, సీమంతం తొమ్మిదో నెలలో చేసేందుకూ నిర్ణయాలు జరిగిపోయాయి.

ఆకాశంలో కనిపించే విమానం ఎక్కుతున్నానంటే చెప్పలేనంత ఎక్సైట్ మెంట్! ఎంచక్కా కిటికీలోనుంచి మబ్బులు పట్టుకోవచ్చేమో! మబ్బులు ఎలా ఉంటాయి? మబ్బుల్లో తేలిపోయాను. మా అమ్మాయిని బయటకు తీసుకెళ్ళి చుక్కలా దూరంగా కనిపిస్తున్న విమానం చూపించి, “మనం అందులో డాడీ దగ్గరకు వెళుతున్నాము” అని చెప్పాను. మా అమ్మాయి ఎగిరి గంతేసింది. మల్లీశ్వరిలోని మబ్బుల పాటలు గుర్తొచ్చాయి. నేను కాలేజిలో ఫ్రెండ్స్ తో, మా అమ్మాయి ఇంటికొచ్చిన వాళ్ళందరితో మా విమాన ప్రయాణం గురించి డప్పు కొట్టేసాము.

ఎదురు చూస్తున్న శుభ ఘడియ వచ్చేసింది. సూట్ కేస్ బయటకు తెస్తుంటే మా ఏమండి “నాకు ఇవి తేకు, అవి తేకు, భోజనం కూడా విమానలో పెడతారు” అంటూ వ్రాసిన బోలెడు జాగ్రత్తలు గుర్తొచ్చాయి. ఆయన పిచ్చి కాకపోతే నేనేమన్నా పార్వతీశాన్నా నల్ల ట్రంక్ పెట్టె, మర చెంబు, గొడుగు గట్రా పట్టుకు పోవటానికి! ఎలా తయారవ్వాలి అన్న మీమాంసలో పడ్డాను. సంజుకైతే ఏమండి తెచ్చిన గళ్ళ పినోఫాం వేసాను కాని నాకే ఓ పట్టాన తోచటం లేదు. చక్కగా చీర టైట్ గా కట్టు కొని, పెద్ద నల్ల కళ్ళద్దాలు పెట్టుకొని, తలకు స్కార్ఫ్ కట్టుకొని విమానం మెట్లెక్కి, తలపు దగ్గర నిలబడి చేయి అలవోకగా వూపే హీరోయిన్లు గుర్తొచ్చారు. నేనూ అలా తయారవుదామని సరదా పడ్డాను కాని అమ్మో ఇంకేమైనా వుందా? గంజి పెట్టిన వెంకట గిరి చీరో, బెంగాల్ కాటనో కట్టుకుంటే మరీ ముసలమ్మలా కనిపిస్తానేమో! చీరలన్నీ అటు తిప్పి, ఇటు తిప్పి సీమంతానికి మా అమ్మ తెచ్చిన లేత పసుపు రంగు జార్జెట్ చీర తీసాను. జాకెట్ కుట్టించుకోమని అమ్మ ఇచ్చి పోయింది. ఎలాగూ సీమంతం ఇంకా నాలుగు నెలలు వుంది కదా ఇంకోటి కొనుక్కోవచ్చులే అనుకొని అదే కట్టేసాను. మమ్మల్ని విమానం ఎక్కించటానికి మామయ్యగారు, పనివాడు వచ్చారు.

విమానం దగ్గరకు వెళ్ళాము...

మెట్లెక్కాము...

లోపలికి వెళుతూ తలుపు దగ్గర నిలబడి తిరిగి చూసాను. లాంజ్ చాలా దూరంగా వుంది. మామయ్య గారు ఎక్కడున్నారో తెలీలేదు. వాళ్ళు నాకు కనిపించనట్లే నేనూ వాళ్ళకు కనిపించను కదా స్టైల్ గా చేయి ఊపుదామా అని ఓ క్షణం అనుకున్నాను. అమ్మో నా పక్కన బుజ్జిపిల్ల వుంది కదా వాళ్ళు కనిపెట్టేస్తారేమో! తిరిగి వచ్చేటప్పుడు ఆయన ఉంటారు గా ఆయనకు చేయి ఊపొచ్చులే, అని సరి పెట్టుకొని లోపలకు వెళ్ళాను.

తలుపు దగ్గర ఏర్ హోస్టెస్ నాజూకుగా నమస్కార్ చేసి లోపలకు ఆహ్వానించింది. ఇంకో ఏర్ హోస్టెస్ మమ్మల్ని తీసుకెళ్ళి మా సీట్ దగ్గర కూర్చోపెట్టింది. మా వెనుక ఇద్దరు నన్స్ కూర్చొని వున్నారు. వాళ్ళు సంజును పలకరించారు. వాళ్ళు పిలిచి మాట్లాడించారు. ఎవరైనా మాట్లాడాలే కాని దానికేమీ కొత్తా పాతా లేదు అందరితో మాట్లాడేస్తుంది. వాళ్ళతో కబుర్లు మొదలు పెట్టింది. ఇంతలో విమానం తలుపు మూసేసారు. ఏర్ హోస్టెస్ వచ్చి సంజును ఎత్తుకొచ్చి నా పక్కన కూర్చోబెట్టి, ఇద్దరికీ బెల్టులు కట్టి వెళ్ళింది. నేను చుట్టూ కలియ చూసాను. నేనూ, ఇద్దరు నన్స్ తప్ప ఆడవాళ్ళెవరూ లేరు అంతా మొగవాళ్ళే! వాళ్ళైనా అక్కడక్కడ వున్నారు. ఏర్ హోస్టెస్ ఓ ట్రే లో చాక్లెట్ లు, దూది వుండలు తెచ్చి అందరికీ ఇస్తోంది. సంజు రెండు గుప్పిళ్ళ నిండా చాక్లెట్స్ తీసుకొని తన జేబుల్లో పోసుకుంది. “అయ్యో బంగారూ, అన్ని తీసుకోకూడదు” అని నేను గాభరా పడిపోయాను. “ఫరవాలేదు” అని ఆమె నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. మా ఏమండీగారి ఇన్స్ట్రక్షన్స్ ప్రకారం నేను రెండు చెవుల్లో దూది పెట్టుకొని, సంజుకూ పెట్టాను.

విమానం చిన్నగా కదలటం మొదలైంది. కాస్త పరుగెత్తి ఒక్క జర్క్ తో పైకి లేచింది! గుండె గుభేల్ మంది! సంజు ఒక్కసారే ఉలిక్కి పడి కెవ్ మంది. బెల్ట్ చేత్తో తీసేసేందుకు ప్రయత్నం చేస్తూ గింజుకుంటోంది! నేను దాని చేయి పట్టుకొని ఊరడిస్తున్నాను. విమానం స్టడీ అయ్యాక ఏర్ హోస్టెస్ వచ్చి మా ఇద్దరి బెల్ట్ లూ విప్పేసింది. సంజు ఒక్క ఉదుటన నా ఒళ్ళోకి దూకి, నా మెడ చుట్టూ చేతులు వేసి, ఏడవటం మొదలు పెట్టింది. ఎంత ఊరడించినా ఊరుకోదు. నాకేమో ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది. ఏర్ హోస్టెస్ వచ్చి ఎత్తుకోబోయింది. ఆమె చేతులు నెట్టేసింది. వెనుక వున్న నన్స్ పిలిచారు ఉమ్... హూ... వెళ్ళదు. నా ఒడిలో నుంచి లేవదు. ఒకటే ఏడుపు! ఏర్ హోస్టెస్ ను అడుగుతే పాపం నా హాండ్ బాగ్ లో నుంచి దాని పాలసీసా తీసి ఇచ్చింది. అది నోట్లో పెడితే ఒక్క తోపు

తోసేసింది.  అలా గంట పైనే అనుకుంటా ప్రయాణం చేసి ఓ ఊరు చేరు కున్నాము.  అది ఏ ఊరో గుర్తులేదు.  అక్కడ ఎక్కువ సేపు ఆగలేదు.

మళ్ళీ ప్రయాణం మొదలు! ఇంకాసేపు గడిచాక భువనేశ్వర్ చేరుకున్నాము. అక్కడ కొద్దిసేపు ఆగుతుంది అని,  కిందికి దిగి కాసేపు నడుస్తే ఫ్రెష్ గాలి కి ఏడవటం ఊరుకుంటుదేమో అని ఏర్ హోస్టెస్ చెప్పింది.  చిన్నగా దానిని ఎత్తుకొని దిగాను.  నేల మీదకు దిగగానే నా మీది నుంచి ఒక్క దూకు దూకి రయ్ న ముందుకు పరిగెత్తింది!

అదృష్టవశాత్తూ ఎదురుగా వస్తున్న ఏర్ పోర్ట్ ఉద్యోగి దానిని పట్టుకొని నాకు ఇచ్చాడు.  విమానం వద్దు అని ఒకటే ఏడుపు!

మరి డాడీ దగ్గరకు వెళ్ళొద్దా? అంటే డాడీ కావాలి,  విమానం వద్దు అంటుంది. ఓ నన్ నా దగ్గరకు వచ్చి, "నా దగ్గర స్లీపింగ్ టాబ్లెట్ వుంది.  ఓ హాఫ్ వేయి పడుకుంటుంది" అంది.

"అమ్మో స్లీపింగ్ టాబ్లెట్ నా.  నాకు స్లీపింగ్ టాబ్లెట్ అంటే చాలా భయం.  వద్దండి థాంక్ యు" అని చెప్పాను.

విమానం ఎక్కనంటుంది.  భువనేశ్వర్ లో ఎలా దిగను? ఏమి చేయను? అంతా అయోమయం.  ఏర్ హోస్టెస్ సహాయంతో కష్టం మీద విమానం ఎక్కాను.  ఏర్ హోస్టెస్ చాక్లెట్స్ తెచ్చింది.  ఏమనుకుందో ఏమో కాని మా అమ్మాయి తన దగ్గర ఉన్న చాక్లెట్స్ కూడా తీసి ఆ ట్రే లో వేసేసింది.  ఏడుపు తగ్గలేదు.  నా ఒడిలో నుంచి దిగదు.  ఏడ్చీ ఏడ్చీ తోటకూర కాడలా వడిలిపోయింది.  కళ్ళు రెండూ ఎర్రబారి,  కళ్ళూ, మొహమూ వాచిపోయాయి.  ఇంక ఏడ్చే ఓపిక లేదేమో, వెక్కిళ్ళు పెడుతోంది.  నాకూ ఓపిక అయిపోయింది.  ఏర్ హోస్టెస్ అటు వచ్చినప్పుడల్లా "ఇంకెంతసేపు?" అని అడగటమే! పొద్దున్న ప్రయాణం సరదాలో మా అత్తగారు, "వట్టి పిల్లవు కూడా కాదు,  వాళ్ళు పెడితే ఏం పెడుతారో తినిపో!" అంటే కష్టం మీద సగం చపాతి తిన్నాను.  ఇక్కడ వాళ్ళు పెట్టినవి తను తినలేదు, నన్ను తిననీయలేదు నా కూతురు.  నీరసం వస్తోంది.  కళ్ళు తేలిపోతున్నాయి.  అమ్మయ్య ఎట్టకేలకు కలకత్తా చేరుకున్నాము.  లేచి నిలబడలేను. కాళ్ళూ,  నడుమూ పట్టేసాయి.  పిల్ల చంక దిగదు.  చాలా అంటే చాలా కష్టం మీద ఏర్ హోస్టెస్ సహాయముతో దిగి బస్ ఎక్కాను.

అమ్మయ్య! అదిగో అక్కడ ఏమండీగారు కనిపిస్తున్నారు. అప్పటి వరకూ గొంతులో సుళ్ళు తిరుగుతున్న ఏడుపు బయటకు వచ్చేస్తోంది. ఆయన దగ్గరకు ఎలా వెళ్ళామో తెలీదు! డాడీ అంటూ మా అమ్మాయి, ఏమండీ అంటూ నేను ఇద్దరమూ ఆయనను వాటేసుకొని భోర్ మన్నాము!

మబ్బుల పల్లకీలో నా మొదటి ప్రయాణం అలా బీభత్సంగా మొదలై బీభత్సంగా ముగిసింది!

విమానం ఎక్కిన ప్రతి సారీ అది గుర్తొస్తుంది. మేమిద్దరమూ మీద పడి భోర్ మనగానే ఏమండీగారు పడ్డ కంగారు గుర్తొస్తే నవ్వొస్తుంది. చిన్నగా నవ్వుతున్న నన్ను చూసి, "ఏమిటీ నీ మొదటి ప్రయాణం గుర్తొచ్చిందా?" అని అడిగారు ఏమండీగారు.

"ఊ! అప్పుడంత గోల గోల చేసిందా, ఇప్పుడేమో పెద్ద డైరక్టరై నెలకు పది రోజులు మబ్బుల పల్లకీ లోనే ఊరేగుతూ వుంటుంది మీ కూతురు." అన్నాను నవ్వుతూ.

"మరి నా బంగారు తల్లి కదా?" మురిపెంగా అన్నారు ఏమండీగారు.

(20-11-2015 - గో తెలుగు. కాం వెబ్ మాగ జన్)

## 6. నన్ను వదలి నీవు పోలేవులే

అంటే అన్నానంటారు కానీ, "ఎప్పుడూ ఏమండీగారి మీద కంప్లెంట్సేనా?" అని ఫ్రెండ్స్ కోపం పడుతూ ఉంటారు. ఏమి చేయను చెప్పండి మరి? పరిస్థితులు అలా వస్తున్నాయి. నిన్న మధ్యాహ్నం ఉన్నట్లుండి సూట్ కేసులు రిపేర్ చేయించుకొద్దాం పదా అని రెండు సూట్ కేసులూ డిక్కీలో వేసి బయలుదీసారు. "ఇప్పుడెందుకు? మనమేమి యు. యస్ వెళ్ళటం లేదు కదా!" అన్నాను.

"వెళ్ళినప్పుడు కావాలి కదా, అప్పటికప్పుడు ఎట్లా తయారవుతాయి? అయినా ఎప్పుడు అంటావుగా, ముందు జాగ్రత్త మంచిది అని. పద పద" అన్నారు.

'హుమ్ నా మాటలు నాకే అప్పచెప్పుతుంటారు సందు దొరికినప్పుడల్లా' అని సణుక్కుంటూ బయలుదేరాను.

నాలుగింటికి సికింద్రాబాద్ దగ్గర మొదలు పెట్టి వెతుకుతూ వెతుకుతూ ఎవరినీ... సూట్కేస్ రిపేర్ చేసే అతడిని ఆరుగంటలకు చిక్కడపల్లి చేరాము. అక్కడో సూట్ కేసుల షాప్ కనిపించింది. బాస్ గారు, డ్రైవర్ గారు సూట్ కేసులు తీసుకొని దిగారు. నేనేమో చుట్టూ చూస్తూ కార్ లో కూర్చొని ఉన్నానా, సూట్ కేస్ షాప్ పక్కనే గాజుల దుకాణం కనిపించింది. సరే ఏమండీగారు ఆ షాప్ వాడి పుట్టుపూర్వోత్తరాలు కనుక్కొని బేరం సెటిల్ చేసుకునే లోపల గాజులు కొనుక్కుందామని దిగాను. గాజులు చూస్తూ ఎందుకో అనుమానం వచ్చి బయటకు చూసానా కార్ కనిపించలేదు. ఓ క్షణం కంగారు పడి, 'ఎప్పుడూ ఇంతే!' అని విరక్తిచెంది, 'పోనిద్దూ చిక్కడపల్లి మన ఇలాకానేగా చుట్టూ బోలెడు మంది మనవాళ్ళున్నారు. రాత్రికి ఎవరింట్లోనో పడుకొని పొద్దున పోవచ్చులే... అయినా ఇదేమైనా కొత్త విషయమా దిగులుపడేందుకు! పెళ్ళైన కొత్తలో ఏమండీ ఫ్రెండ్ ఖన్నా 'ఆరాధన' సినిమా బాగుందిట. రాజేష్ ఖన్నా, షర్మిళాఠాగూర్ బాగున్నారట వెళుదాము అన్నాడు. ఆయన భార్య పరీ, నేను కూడా చూద్దామని సరదాపడ్డాము. తిరిగి వచ్చేటప్పుడు బయట డిన్నర్ చేసివద్దాము అంటే వాకే అనేసారు ఏమండీలు. అమ్మయ్య రాత్రి వంట పని తప్పింది. లేకపోతే రోజూ డిన్నర్ ఫుల్కాలకు ఆంధ్రా కూరనా? మళయాళీ కూరనా ఏది వండాలా అని ఇద్దరమూ తలలు బద్దలు కొట్టుకోవలసివచ్చేది. రోజూ నేను కాలేజ్ నుంచి వచ్చేసరికి, "లంచ్ కు నీ ఇష్టం వచ్చినవే వండుతావు కదా, ఇప్పుడు నాకు కావలసినవి నేను వండుకుంటాను" అని ఒక్కోసారి చిన్నపాటి గొడవలు కూడా అయ్యేవి. ఏమండీలిద్దరూ ఏ రాయైతే ఏముందిలే, రెండూ ప్రయోగాలేగా, చెత్తబుట్టలో వేసినట్లు మా పొట్టలో వేస్తారు అని విరక్తిగా ఊరుకునేవారు.

ఏదైతేనేమి ఈ రోజు ఆ బాధ లేదు. "ఎంతైనా పెళ్ళైన కొత్త కదా. మనం ఏమి చెప్పినా వింటారులే" అని మేమిద్దరమూ నవ్వుకున్నాము. నలుగురమూ స్కూటర్ లెక్కి ఝూం మంటూ వెళ్ళాము. కొత్త సినిమా పైగా టాక్ కూడా బాగుంది. సినిమా బాగుంది. అప్పటికే చూసిన వాళ్ళు రాజేష్ ఖన్నా టోపీ, స్కార్ఫ్ కట్టేసుకుంటున్నారు. పాపం పరీక్షల మూలంగా వీళ్ళకు ఆ టోపీలు పెట్టుకోవటం లేట్ ఐపోయింది. లేకపోతేనా అని నేనూ, పరీ సీక్రెట్ గా నవ్వుకున్నాము. ఎంజాయ్ చేసాము నలుగురమూ.

సినిమా అయిపోయి బయటకు వస్తే అబ్బ ఎంత మంది జనాలో ఇసుకవేస్తే రాలనంత ఉన్నారు. ఏమండి స్కూటర్ ను చిన్నగా జనాలను తప్పిస్తూ

తీసుకెళుతున్నారు.  నేను ఎక్కడ తప్పిపోతానో అని భయం భయంగా వెనక సీట్ పట్టుకొని నడుస్తున్నాను. గేట్ దగ్గరకు రాగానే నేను ఎక్కుదామని సద్దుకుంటున్నాను ఇంతలో రయ్ మని ముందుకు వెళ్ళిపోయారు ఏమండీ గారు. నేను బిత్తరపోయాను. కాస్త తేరుకొని, 'ఏమండీ' అని పిలిచేసరికి ఏరీ? అప్పటికే ఝూం అంటూ దూసుకుపోయారుగా. 'ఏమి చేయాలి చెప్మా?' అని పరీవాళ్ళ కోసం చుట్టూ చూస్తుంటే, పరీవాళ్ళ కన్నా ముందు అక్కడ ఉన్న మా క్లాస్ అబ్బాయిలు నవ్వుతూ కనిపించారు. ఏదో సామెత మొగుడు కొట్టినందుకు కాదు... అన్నట్లు ఉక్రోషం ఏడుపు వచ్చేసాయి. రేపొద్దున కాలేజ్ లో ఎంత ఏడిపిస్తారో ఏమో దేవుడా! ఏమి చేయాలో తోచక బిత్తర చూపులు చూస్తూ ఉన్నాను. ఇంతలో ఖన్నా, పరీ వచ్చారు.

"ఇదేమిటి ఒక్కదానివే ఉన్నావు? కుమార్ ఏడీ?" అని అడిగాడు ఖన్నా.

"వెళ్ళిపోయారు" అన్నాను.

పాపం ఆయనకు నేను చెప్పింది అర్థం కావటానికి కాస్త టైం పట్టింది. పరీని నా దగ్గర ఉంచి ఆయనా రయ్ మని వెళ్ళిపోయాడు. "కుమారేమిటీ నిన్నొదిలి వెళ్ళిపోయాడు? ఏ అందమైన అమ్మాయో కనిపించలేదు కదా?" అని పరీ జోక్ లు వేస్తుంటే నేనేమో కోపంగా, ఉక్రోషంగా మూతి ముడుచుకున్నాను. ఓ అరగంటైనాక ఇద్దరూ వచ్చారు. వస్తూనే ఏమండీ, "అదేమిటీ నేను వెళ్ళిపోతుంటే పిలవద్దా?" అన్నారు.

'ఊం వదిలేసి పోవటమే కాక దబాయింపు కూడానూ' అనుకుంటూ, స్కూటర్ ఎక్కుతూ "ఎక్కడ కలిసారండీ?" అని ఖన్నాను అడిగాను.

"సిగ్నల్ దగ్గర ఆగి ఉన్నాడు. పైగా నన్ను చూసి పరీ ఏది?" అని అడిగాడు. "మా పరీ సరే ముందు మీ ఆవిడేది?" అంటే "వెనక ఉందిగా" అని చూసుకొని నువ్వు లేవని గాభరా పడ్డాడు. "నాయనా, ఆవిడను అక్కడే వదిలేసి వచ్చావు!" అని చెప్పి తీసుకొచ్చాను. సిగ్నల్ పడింది ఆగాడు కాబట్టి తొందరగా దొరికాడు లేకపోతే ఎంత దూరం వెళ్ళాల్సి వచ్చేదో" అన్నాడు.

అదో అది మొదలు అప్పుడూ ఇప్పుడూ ఇలా వదిలిపోతునే ఉన్నారు. 'అయినా నన్ను వదలి ఎక్కడికి పోతారు? వస్తారులే' అని సద్దుకొని తీరికగా గాజులు, బొట్టుబిళ్ళలు,

క్లిప్స్ కొనుక్కుంటున్నాను. ఇంతలో సెల్ రింగైంది. ఇంకెవరూ ఏమండీనే. “ఎక్కడున్నావు?” అంటూ.

“ఆ... ఎక్కడుంటానూ? మీరెక్కడ వదిలేసి వెళ్ళారో అక్కడే. ఆ సూట్ కేస్ షాప్ పక్కన గాజుల దుకాణంలో” అన్నాను. వచ్చేసారు. నేనూ నా షాపింగ్ ముగించి వెళ్ళి కార్ లో కొంచెం సీరియస్ గా కూర్చున్నాను. మరి ఆ మాత్రమైనా సీరియస్ గా ఉండకపోతే ఎట్లా! ఏమనుకున్నారో ఏమో కాస్త సంజాయిషీగా “కొంచెం దూరం వెళ్ళాక చూసుకున్నాను నువ్వు పక్కన లేవని” అని నాతో అని డ్రైవర్ తో, “నువ్వైనా చెప్పలేదిమిరా మేడం కార్ లో లేరని?” అని అడిగారు.

"మీరు మాట్లాడుతుంటే, మేడంతోనే అనుకున్నా సార్" జవాబు.

హూం బాగుంది సంబడం బాస్ కు తగ్గ అసిస్టెంట్!

- (మందాకిని త్రైమాసిక వ్రాతపత్రిక - సెప్టెంబర్ 2018)

## 7. పౌరుషిణి* * *

"మాధవాయ్ పెళ్ళాం పీయూసీనే చదివిందిట" అని వినిపించగానే, కొత్తపెళ్ళికూతురైన నన్ను చూసేందుకు వచ్చిన పేరంటాళ్ళ మధ్య తల వంచుకొని కూర్చున్న నేను చివుక్కున తల ఎత్తి చూసాను. అన్నావిడ ఎవరో తెలీదు కాని, అందరూ ముసిముసిగా నవ్వుకుంటూ, 'ఉష్... ఉష్!' అని ఆవిడకు సైగ చేయటము కనిపించింది. మాధవ అంటే ఎవరో కాదు మా ఏమండీనే. ఆయనను ఇంట్లో మాధవా అని పిలుస్తారు. ఓరగా గోడ దగ్గర కుర్చీలో కూర్చున్న ఏమండీ వైపు చూసాను. ఆయన దవడ కండరం బిగుసుకుంది. ఏమి ఉపద్రవం జరుగుతుందో అని భయపడ్డాను కాని ఏమీ జరగలేదు. అమ్మయ్య అనుకున్నాను కాని అమ్మయ్య కాదు అని ఆ తరువాత నాలుగు నెలలకు తెలిసింది.

ఏమండి 1962 చైనా యుద్ధం అప్పుడు ఎమర్జెన్సీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం డిస్కంటిన్యూ చేసి ఆర్మీలో, షార్ట్ సర్వీస్ కమీషన్ ఆఫీసర్ గా చేరారు. ఐదు సంవత్సరాలు సర్వీస్ అయ్యాక, ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యి, పర్మినెంట్ అయ్యారు. ఇంజనీరింగ్ పూర్తి కాలేదు కాబట్టి, పూనాలో ఒకటిన్నర సంవత్సరము, సికింద్రాబాద్ లో ఒకటిన్నర సంవత్సరమూ మిలిట్రీ ఇంజనీరింగ్ కాలేజ్ ట్రైనింగ్ ఇచ్చి, ఏ.యం.ఐ డిగ్రీ ఇచ్చారు. మేము మా పెళ్ళైన నాలుగు నెలలకు హైదరాబాద్ నుంచి ఏమండీ పని చేస్తున్న పటియాలాకు వెళ్ళి ఓ నెల హాపీగా డిల్లీ, ఆగ్రా, సిమ్లా అన్నీ తిరిగి, జూన్ లోఒక పెద్ద నల్లపెట్టెలో వంట సామానులూ, ఇంకో పెద్ద నల్లపెట్టెలో ఏమండీ యూనిఫాంలూ, షూస్, బెల్ట్ లూ, ఒక సూట్కేస్ లో నా బట్టలూ, ఇంకో సూట్కేస్ లో ఏమండీ బట్టలతో కొత్త కాపురానికి పూనా వెళ్ళాము. వెళ్ళగానే మాకు క్వాటర్ దొరకలేదు. ఏమండిగారి పాత బాస్ కల్నల్. కుమార్ మాకు మెస్ లో టెంపరరీ ఎకామిడేషన్ ఏర్పాటు చేసి "ఒక్క నెలే కదా ఈ రెండు రూముల్లో సద్దుకోండి"అని చెప్పారు. రెండు రూములన్న పేరే కానీ పెద్ద పెద్ద గదులు. ఒకొక్కటి ఓ ఇల్లంత ఉన్నాయి. రెంటికి మధ్య ఆర్చ్ లా ద్వారం. తలుపు లేదు. ఐతే ఏమిలే అనుకున్నాము. వెనుక వైపు సన్నటి వరండా. ముందు పెద్ద వరండా, ఎత్తైన రాతి గోడలు, ఎప్పుడో బ్రిటిష్ వారు కట్టిన బంగళా అది. రెండు పెద్ద పెద్ద చెక్క అలమారాలు, మంచాలు అన్ని హంగులూ ఉన్నాయి. అప్పుడే ఇంకో కోర్స్ ఆఫీసర్ కాప్టెన్. రామానుజంకు కూడా క్వాటర్ దొరక లేదని, ఒక్క నెలకు ఎవరు రెంట్ కు ఇస్తారని దిగులు పడుతుంటే ఏమండి

వాళ్ళకో రూం ఇచ్చారు. ఇద్దరూ కలిసి చెక్క అలమారాని ఆర్చి మధ్యకు జరిపారు. ఇద్దరమూ చెరో రూములో సద్దుకున్నాము.

అంతా సద్దుకోవటం అయ్యాక ఓ రోజు పొద్దున్నే ఏమండి బయటకు వెళుదామని తీసుకెళ్ళారు. ఎక్కడికా అని నేను అనుకుంటూ ఉండగానే, ఓ పెద్ద కాంపౌండ్ ముందు స్కూటర్ ఆపారు. ఏమిటా ఇది అని నేను తలేత్తి చూస్తే, 'వాడియా కాలేజ్' అని పెద్ద బోర్డ్ కనిపించింది. లోపల అమ్మాయిలూ, అబ్బాయిలూ కబుర్లు చెప్పుకుంటూ, మహా స్టైల్ గా, తిరుగుతున్నారు. ఏమండి ఆఫీస్ రూం లోకి వెళ్ళి అప్లికేషన్ ఫారం తీసుకొచ్చారు. ఇద్దరమూ ఒక చెట్టు కింద అరుగు మీద కూర్చున్నాము. చుట్టూ అందరినీ చూస్తూ "ఈ ఫారంలు ఎందుకండి? ఇక్కడికి ఎందుకు వచ్చాము?" అని చిన్నగా అడిగాను.

"నీకే. నా డిగ్రీ పూర్తయ్యే వరకూ నీ డిగ్రీ కూడా అవుతుంది. ఇక్కడి నుంచి నీకు కూడా సెకెండ్ ఇయర్ లో, సికింద్రాబాద్ కు ట్రాన్స్ఫర్ చేయించుకోవచ్చు" అని చెపుతూనే చకచకా ఫారం పూర్తి చేసి, "ఇక్కడ సంతకం చేయి." అన్నారు.

అప్పటికే ఆ కాలేజ్ వాతావరణం చూస్తున్న నాకు వణుకు వస్తోంది. "అమ్మో ఇక్కడా, నేను చదవను. అబ్బాయిలను చూస్తుంటే భయంగా ఉంది." అన్నాను భయంభయంగా.

"ఏం ఎందుకు భయం? అబ్బాయిలేమన్నా కొడతారా నిన్ను?" అన్నారు.

"ఉహూ... వద్దు, నాకు భయమేస్తోంది. వెళ్ళిపోదాము" అన్నాను.

"ఐతే బియ్యే చదవవన్నమాట. ఎప్పటికీ మాధవాయ్ పెళ్ళాం పి.యూ.సీ గానే ఉంటావన్నమాట. నీ వల్ల కాదు చదవటం. అంతేనా? పద" అని సీరియస్ గా అంటూ లేచారు.

నాకు చక్ మంటూ పేరంటాళ్ళ మాట గుర్తొచ్చింది. దాని ఎఫెక్ట్ అన్నమాట ఇది. అంతే నాలోని పౌరుషిణి తలెత్తింది. పౌరుషిణి ఏమిటా? పౌరుషం తలెత్తింది అంటే బాగుండదని, నేను అమ్మాయిని కాబట్టి పౌరుషిణి అని కొత్త పదం కనిపెట్టా. పదం బాగుంది కదా పౌరుషంగా! ఏమండి చేయి పట్టుకొని ఆపాను. ఆయన చేతిలోని ఫారంను తీసుకున్నాను. సంతకం చేసాను. "పదండి, ఆఫీస్ లో ఇద్దాము" అన్నాను.

నేను కాలేజ్ నుంచి వచ్చేసరికి, మిసెస్. వనజారామానుజం వేడివేడిగా అన్నం, సాంబార్, బీన్స్ కొబ్బరో, క్యాబేజ్ కొబ్బరో ఇలా వెరైటీ వెరైటీ గా కూరలూ వండి ఉంచేది. ఉష్... ఎవరికీ చెప్పకండి ఇది రహస్యం. మెస్ లో ఉన్నప్పుడు వండుకోకూడదు. ఏమి చేయాలి చెప్పండి? నూనెలూ, మసాలాలూ ఓడుతుండే కూరలు, రొట్టెలు తినలేక ఎన్ని రోజులు ఉపవాసం ఉండి ఏమండీలతో చివాట్లు తిని బతకగలము! ఏమండీలకైతే అలవాటు కాబట్టి తినేసేవారు. మరైతే మెస్ నుంచి వచ్చిన భోజనం వేస్ట్ చేసారా? అని కోపంగా చూడకండి. ఏమి చేసామంటే... అక్కడ పని చేసే స్వీపర్ లూ వాళ్ళూ అంతా సిపాయిలే కదా! వాళ్ళతో ఇంట్లో పని చేయించుకోవటం ఏమండీకి ఇష్టం ఉండేదికాదు. అందుకని ఆ బెద్ద భూతంలాంటి గది, ఈ బ్రిటిషర్స్ షోకు కూల! వాళ్ళు కట్టుకున్న పెద్ద బాత్ రూం, బాత్ టబ్ తో సహా కడుక్కొని, గిన్నెలు తోముకొని, రాత్రి వంట నా డ్యూటీ కాబట్టి వండి వార్చేసరికి చుక్కలు కనిపించేవి!

అలా చుక్కలు చూస్తున్న ఓ రోజు నాన్నగారు ఫోన్ చేసి, "ఎట్లా ఉన్నావమ్మా?"అని అడగటం ఆలస్యం, “నాన్నగారూ ఇట్లా ఉన్నానండి!” అని బేర్ మన్నాను. పాపం పితృహృదయం భారమైపోయి, వెంటనే గురువులు అని ఓ పనిపిల్లాడిని రైలెక్కించి పూనాకు పంపేసి భారం దింపుకున్నారు. గురువులు పనితో నేను వనజా హాపీ, మేము పెట్టే మసాలాకూరలతో వాడు హాపీ. ఇలా హాపీ హాపీగా గడిచిపోతుండగా గురువులు నాయనమ్మ వాడి మీద బెంగెట్టుకోవటంతో, వాడిని తిరిగి పంపక తప్పలేదు. వాడిని చూసి నోరెళ్ళబెట్టిన నాయనమ్మ, "ఓరోరి నాయనా ఈడకంటే ఆడనే గుండులెక్కున్నావు కదా ఆడకే వెళ్ళు" అందిట కాని అప్పటికి మాకు క్వాటర్ దొరకటము, బోనస్ గా పనిమనిషి దొరకటము కూడా జరిగిపోయి, వాడి వీసా రిజెక్ట్ అయిపోయింది.

చక్కగా రెండు బెడ్ రూంలూ, డ్రాయింగ్ కమ్ డైనింగ్, కిచెన్ ఫర్నీచర్ తో సహా ఎంత బాగుందో! అన్నట్లు ఓ చిన్న బాల్కనీ కూడా ఉంది. మా రెండు పెట్టెల సామానులూ సద్దుకోగా బోలెడు జాగా మిగిలింది! మూడో రోజు సాయంకాలం కాప్టెన్ అండ్ మిసెస్ ఖన్నా వచ్చారు మా ఇంటికి. లోపలికి వస్తూనే ఖన్నా మా ఏమండి చేతులు పట్టుకొని "కుమార్, మాకు ఇంకా క్వాటర్ ఎలాట్ కాలేదు. రెండు మూడు నెలల్లో అవుతుంది. అప్పటి దాకా నువ్వే మీ ఇంట్లో పెట్టుకోవాలి మమ్మల్ని "అన్నాడు.

"వాకే డన్." అని అభయమిచ్చేసారు ఏమండి. ముచ్చటగా మూడోరోజు చుట్టాలొచ్చేసారు! మిసెస్. ఖన్నా పేరు పరిమళ. “పరి అని పిలువు అందరూ అలాగే పిలుస్తారు” అంది. పరి ఎయిర్ హోస్టెస్ గా జాబ్ చేస్తూ ఖన్నాతో ప్రేమలో పడి పెళ్ళి చేసుకొని, జాబ్ కు రిజైన్ చేసింది. మరి ఆ రోజులల్లో ఎయిర్ హోస్టెస్ పెళ్ళైతే జాబ్ మానేయాల్సిందే! చాలా స్టైల్ గా ఉండేది. ఉన్నట్లుండి ఓ రోజు ఏమండి పరితో, "మాలాకు కూడా మేకప్, హేర్ స్టైల్స్, నీలాగా సారీ కట్టుకోవటం నేర్పు" అన్నారు.

"అమ్మో! యాక్... ఆ లిప్ స్టిక్ లూ, బాక్ కోంబింగ్ హేర్ స్టైలూ నేను చేసుకోను బాబూ. నేను నేర్చుకోను బాబూ" అన్నాను గుండెల మీద చేయి వేసుకొని.

"ఏం? ఎందుకు నేర్చుకోవు? ఆ వంకర టింకరగా వేసుకునే జడ, చుట్టుకున్న చీరతో ఎప్పటికీ అట్లా అప్పలమ్మలా ఉంటావా?" అన్నారు.

"మరి పెళ్ళయ్యేవరకూ నేను జడ వేసుకోలేదు. అమ్మనే రెండు జడలు వేసేది. లంగా వోణీలు వేసుకునే దానిని. ఇప్పుడేగా చీరలు కట్టుకుంటున్నాను. ఒక్క జడ వేసుకుంటున్నాను. కొంచెం అలవాటవుతే వస్తుందిగా" అన్నాను ఏడుపు గొంతుతో.

"అలవాటవ్వాలంటే నేర్చుకోవాలిగా. అంత గాడీగా ఏమీ చేసుకోనక్కర లేదు. కాస్త మంచిగా తయారవ్వటం నేర్చుకో అంటున్నాను. ఏం నేర్చుకోలేవా?" సవాల్ చేసారు.

ఇంకేముంది, పౌరుషిణి నిద్ర లేచింది. ఏమిటో ఏమండీ నా పౌరుషిణి పని పడతారు ఎప్పుడూ. అదో అట్లా నాలోని బ్యూటిషియన్ కు అంకురార్పణ జరిగింది.

పూనా నుంచి సికింద్రబాద్ రాగానే, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ తెచ్చుకొని హైదరాబాద్ లో బి.యే సెకెండ్ ఇయర్ లో చేరటమూ, మా అమ్మాయి పుట్టటమూ జరిగిపోయాయి. ఇక్కడ నాకు ఒక ప్లస్ పాయింట్ ఏమిటయ్యా అంటే, తెలంగాణా ఎజిటేషన్ మూలంగా ఎకడమిక్ ఇయర్ డిసెంబర్ లో మొదలయ్యింది జూన్ కాకుండా. దానితో నాకు మా అమ్మాయి పుట్టినప్పుడు సంవత్సరం ఆగకుండా ముందుకు జరిగిందన్నమాట. ఐతేనేమి ఆపరేషన్ సక్సెస్ - పేషంట్ డైడ్ లో చెప్పానుగా ఝూటర్ ఢమాల్ ఎందుకయ్యిందో!మళ్ళీ మళ్ళీ ఎందుకులెండి? పాడిందే పాటలా. కోర్స్ ఐపోగానే, ఏమండీకి షిలిగురి పోస్టింగ్ వచ్చింది. అప్పటికి అది ఇంకా పాకిస్తాన్ యుద్ధ వాతావరణంలోనే ఉండటంతో

కుటుంబాలను ఎలవ్ చేయలేదు. దగ్గరలోని డార్జిలింగ్ లో ఉండనిచ్చేవారు. ఏమైనా నా బి. యే పూర్తి చేయాలిగా అందుకని హైదరాబాద్ లోనే ఉండిపోయాను. మళ్ళీ మిగిలిన రెండు సబ్జెక్ట్ లూ చాలా సీరియస్ గా చదివి పరీక్ష రాసాను. పాపం అప్పుడూ మా మాస్టారుగారు నేను ట్యూషన్ చెపుతానండి అని వచ్చారు కాని ఏమండీగారు సున్నితంగా వద్దని చెప్పి నన్ను రక్షించారు! కాకపోతే ఒక పేపర్ ఔట్ ఆఫ్ సిలబస్ వచ్చింది. అది పోస్ట్ పోన్ అయ్యింది. నా సహనాన్ని పరీక్షిస్తూ రెండు నెలల తరువాత ఆ పేపర్ పెట్టారు. నేను చాలా దీక్షగా చదువుకుంటూ ఉండగా, ఓ రోజు "హాయ్ మాతే నాకింక బోర్ కొడుతోంది. నేను వచ్చేస్తున్నా" అన్నాడు నా సుపుత్రుడు.

"అంత హడావిడేమిట్రా బేటా? నువ్వు రావటానికి ఇంకా ఇరవై రోజులు ఉంది కదా. పోనీ ఓ నాలుగురోజులు సద్దుకోరా" అన్నాను.

"ఉహూ, ఇంక నీ బొజ్జలో ఉండలేను. మాలామమ్మీ వచ్చేసా బాత్ ఖతం - బర్కాస్ బిరియానీ. గుడ్ మార్నింగ్" అని ఎంట్రీ ఇచ్చేసాడు. ఏం పిల్లలో మహా అల్లరిపిల్లలు అని మురిపెంగా అనుకొని ఇంకేమి చేస్తాను? ఏదో ముప్పతిప్పలూ పడి డెలివరీ ఐన మూడోరోజు పరీక్ష రాసి, బి. యే పట్టా పుచ్చేసుకుని, ఏమండీ చేతికి భక్తిగా అందించి, "మాధవాయ్ పెళ్ళాం పి. యు. సీ కాదు, గ్రాడ్యుయేట్" అన్నాను నవ్వుతూ.

ఏమండీ హాపీ. మంచి సంబంధం వచ్చిందని పీ.యూ.సీ తో ఆపి పెళ్ళి చేసాము అని అప్పుడప్పుడు నా చదువు గురించి బాధ పడుతున్న అమ్మానాన్నగారు హాపీ. అమ్మయ్య అని మీరూ హాపీ అయిపోకండి, నా చదువు అప్పుడే పూర్తి కాలేదు. ఆ తరవాత నా చదువు సంగతి నెక్స్ట ఎపిసోడ్ లో వినండి. ఇప్పటికిది సశేషం!

## 8. పౌరుషిణి-2

జబల్పూర్ లో హాపీగా ఎంజాయ్ చేస్తున్న ఒకానొక రోజు ఆఫీస్ నుంచి వస్తూనే "మిసెస్. భట్నాగర్ లేడీస్ క్లబ్ లో బ్యూటీ క్లాస్ లు తీసుకుంటుందిట. నెలకు పది రూపాయలు ఫీజు. మూడు నెలల కోర్స్ అట. నోటీస్ పంపారు. నువ్వు పిల్లలు స్కూల్ నుంచి వచ్చేదాకా ఖాళీనేగా. నీ పేరు ఇచ్చాను. ఫీజు కట్టేసాను. క్లాస్ లో చేరు" అన్నారు ఏమండి.

నా గుండె ఘుభేళ్! బ్యూటీ కోర్స్ అంటే అందరూ ఫాషనబుల్ వాళ్ళు ఉంటారేమో! ఎవరెవరు వస్తారో ఏమో! ఏమండీకి నా మొహం చూడగానే నేను ఏమి చెప్పబోతున్నానో తెలిసిపోయింది. అదేమిటో నేను నోరు తెరవకుండానే నా మొహమే అన్నీ చెప్పేస్తుంది ఏమండీకి. "ఏం చేరవా? నువ్వు నేర్చుకోలేవా?"

నేర్చుకోలేనా హూం! తరవాత ఇంకేముంది కోర్స్ లో చేరటమే! అలా బ్యూటీకోర్స్ లో చేరానా? ఇరవై మంది స్టూడెంట్స్ ఉంటే నెల తిరిగే సరికి నేనొక్కదాన్నే మిగిలాను క్లాస్ లో. మాకు క్లాస్ లు నడుపుకోవటానికి ఇచ్చిన హాల్ కూడా ఎవరూ లేరు కదా అని వాపస్ తీసేసుకున్నారు. నేను మటుకు మిసెస్. భట్నాగర్ ను మెప్పించి వాళ్ళ ఇంటికి వెళ్ళి మూడు నెలల కోర్స్ థియరీ పూర్తి చేసాను. అందరూ ఉంటే ప్రాక్టికల్స్ కూడా అయ్యేవి. పోనీలే కోర్స్ కంప్లీట్ అయ్యింది.

కాలం ఇంకొంచెం ముందుకు నడిచి బరోడాకు తీసుకెళ్ళింది. ఏమండి ఇంతకు ముందు ఒకసారి బరోడాలో ఉన్నారు. అప్పుడు టెన్నిస్ క్లబ్ లో సుధీర్ ధాండేకర్ పరిచయమయ్యారట. ఆయన పార్లీకర్ ను పరిచయం చేసారట. సుధీర్ ఏదో కంపెనీలో డైరెక్టర్, ఆయన భార్య ఉష. పార్లేకర్ యూనివర్సిటీ లో సైకాలజీ ప్రొఫెసర్ గానూ, ఆయన భార్య కల్పన ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో ప్రొఫెసర్ గాను జాబ్ చేస్తున్నారు. మేము సెటిల్ అయ్యాక ఒక రోజు రెండు కుటుంబాలనూ డిన్నర్ కు పిలిచాము. ఉష 'ఊర్వశి' అనే పేరుతో బ్యూటీపార్లర్ నడుపుతోంది అని తెలియగానే నా కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి. నేను జబల్ పూర్ లో కోర్స్ చేసాను కాని ప్రాక్టీస్ చేయలేదు అంటే “దానికేమి భాగ్యం? మీ పిల్లలూ, కుమార్ వెళ్ళగానే మా పార్లర్ కు వచ్చేసేయి. ప్రాక్టీస్ చేసుకుందువుగాని!” అంది. ‘హబ్బ, అంతకన్నా కావలసింది ఏముంది,

ఆనందమానందమాయెనే!' అని పాడేసుకున్నానే కాని రాబోయే ఉపద్రవాన్ని పసికట్టలేక పోయాను. మరునాడు పొద్దున కల్పన వాళ్ళ కాలేజ్ కు రమ్మంటే ఎందుకబ్బా అని హాశ్చర్యబోయాను!

వాళ్ళు వెళ్ళిపోయాక, "ఎందుకండీ కల్పనాదీది వాళ్ళ కాలేజ్ కి రమ్మంటోంది?" అని అమాయకంగా అడిగాను.

"వాళ్ళ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ చైల్డ్ డెవలప్ మెంట్ కు ఇంకా ఎడ్మిషన్స్ అవుతున్నాయట. అది చేస్తే సొంతంగా నర్సరీ స్కూల్ పెట్టుకోవచ్చు. లేదా ఎక్కడైనా నర్సరీ టీచర్ గా జాబ్ చేయవచ్చు. నర్సరీ టీచర్ ఐతే మధ్యాహ్నానికి క్లాస్లు అయిపోయి ఇంటికి వచ్చేయవచ్చు. రేపు వెళ్ళి అప్లికేషన్ ఇద్దాము" అన్నారు. ఇంకెవరి కోసం నాకోసమే అని తెలిసిపోయిందిగా.

"ఏమండీ ఉషా బ్యూటీపార్లర్ నడుపుతోందిట. నన్ను రోజూ వచ్చి ప్రాక్టీస్ చేసుకోమంది. మరి కాలేజీలో చేరితే పార్లర్ కు వెళ్ళలేనుగా." సంశయంగా అన్నాను ఏమండీ పౌరుషిణిని ఎట్లా బుజ్జగిస్తారా అని ఆసక్తిగా చూస్తూ.

"పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోగలరు. నువ్వు ఖాళీగా ఉండే కన్నా ఏదైనా ఉద్యోగం చూసుకుంటే నీకు ఓ వ్యాపకం ఉంటుంది" అన్నారు.

"పార్లర్ లో చేయవచ్చు. లేదా సొంతంగా పార్లర్ ఓపెన్ చేసుకోవచ్చు కదా?" అన్నాను.

"ఫాషన్స్ ఎప్పటికప్పుడు మారుతుంటాయి. పైగా ఇంకా బ్యూటీపార్లర్ లు అంత పాపులర్ కాలేదు. మనకు పోస్టింగ్ వచ్చిన చోటల్లా బ్యూటీపార్లర్ అవసరం ఉండకపోవచ్చు. అన్ని చోట్లా అంత డిమాండ్ ఉండకపోవచ్చు. కాని గైనకాలజిస్ట్ లకూ, నర్సరీ టీచర్ లకూ ఎప్పుడూ, ఏ ఊరైనా డిమాండ్ తగ్గదు. ఏం నువ్వు చదవలేవా?"

అయిపోయింది పౌరుషిణీ పడిపోయావే!

"మరి పార్లరూ?" అని చిన్నగా గొణిగాను.

"నీ కోర్స్ ఐపోయాక ఇంకా రెండు సంవత్సరాలు ఇక్కడ ఉంటాముగా. అప్పుడు కావాలంటే వెళుదువుగాని. ఉష దగ్గర ఎప్పుడైనా చేరవచ్చు. యూనివర్సిటీలో మళ్ళీ సీట్ రావటం కష్టం. నీకూ యూనివర్సిటీలో చదవాలనే కోరికా తీరుతుంది" అన్నారు.

ఆ కోర్స్ యూనివర్సిటీలో కాదు, హోమ్‌సైన్స్ కాలేజీ లో, యూనివర్సిటీ కోరిక ఎట్లా తీరుతుంది? అని గొణుకున్నా అంతే జరగక ఇంకెట్లా జరుగుతుంది? "పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ చైల్డ్ డెవలప్మెంట్" సర్టిఫికెట్ b+ గ్రేడ్ తో తెచ్చి ఏమండీ చేతిలో పెట్టి అమ్మయ్య సగం పోస్ట్ గ్రాడ్యుయేట్ అయ్యాను అని ఊపిరి పీల్చుకున్నాను!

సగం పోస్ట్ గ్రాడ్యుయేట్ ఏమిటా ప్రోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా కదా అందుకని అట్లా అన్నానన్నమాట!

ఆ తరువాత ఉషా వాళ్ళ ఊర్వశిలో చేరాను. మూడు సంవత్సరాలు అక్కడ నాలోని బ్యూటీషియన్ కు మెరుగులు దిద్దాను. కొన్ని పరిస్థితుల వలన, ఏమండి లెఫ్టినెంట్. కల్నల్ ప్రమోషన్ వద్దనుకొని, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొంటే, హైదరాబాద్ వచ్చి సెటిల్ అయ్యాము. అప్పటికి పిల్లలు హైస్కూల్ చదువులకు వచ్చేసారు. "పిల్లలు వచ్చేవరకు ఊరికే కూర్చోవటం ఎందుకు? ఏదైనా వ్యాపకం పెట్టుకో" అన్నారు ఏమండి.

నాకూ ఏదైనా ముందు పిల్లలు, ఇల్లూ... తరువాతే ఏ ఉద్యోగమైనా, వ్యాపకమైనా అని ఉంది. అందుకే నాకు బి.యే కాగానే స్టేట్ బాంక్ లో జాబ్ వచ్చినా చేరలేదు. దానికి తగ్గట్టు నాకు ఉద్యోగం చేయాల్సిన అవసరమూ రాలేదు! అందుకని 'నర్సరీ టీచర్' గా ఐతే సగం రోజే ఉంటుంది. మధ్యాహ్నం కల్లా ఇంటికి వచ్చేయవచ్చు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చేసరికి నేనూ ఇంట్లో ఉంటాను" అన్నాను.

సరే అన్నారు ఏమండి. రెండు మూడు స్కూళల్లో ఇంటర్వ్యూకు వెళ్ళాను. సెలెక్ట్ ఐనా, వాళ్ళు మధ్యాహ్నం నర్సరీ పిల్లలు వెళ్ళిపోయాక, మిడిల్ క్లాస్ వాళ్ళకు క్లాస్ లు తీసుకోవాలనటంతో చేరలేదు.

"ఇట్లా కాదు. నీ వీలు ప్రకారంగా చేసుకోవాలంటే, నువ్వు సొంతంగా ఏదైనా మొదలుపెట్టాలి. స్కూల్ నా, పార్లర్ నా అన్నది నీ ఛాయిస్" అన్నారు ఏమండి.

కొంత తర్జనభర్జనల తరువాత నా మనసు పార్లర్ వైపే మొగ్గి, నా 'ఊర్వశి' ఆవిర్భవించింది. ఇంట్లో ఐతే డిస్టర్బెన్స్ ఉంటుంది అని బయట మా ఇంటికి దగ్గరలోనే ఒక చిన్న పోర్షన్ రెంట్ కి తీసుకొని, దానికి కావలసిన హంగులన్నీ సమకూర్చుకొని, ఆ ఇంటి ఓనర్ గారిని, ఇనాగరేషన్ ఫంక్షన్ కి రమ్మని పిలవటానికి, ఏమండీతో కలిసి వెళ్ళాను. నన్ను ఏమండి పరిచయము చేయగానే, ఆ ఇంటావిడ నన్ను పైనుంచి, కిందిదాకా ఎగాదిగా చూసి, 'ఇంత మైల్డ్ గా వుంది, ఈమేమి పార్లర్ నడుపుతుంది?' అని పెదవి విరిచేసింది! ఎంత ఉక్రోషం వచ్చేసిందో. ఇంటికి రాగానే, అద్దం ముందు నిలబడి నన్ను నేను చూసుకొని, 'నేను పార్లర్ నడపలేనా? ఇంత మాట అంటుందా?' అని ఆవేశ పడిపోయాను. ఇంత ఖర్చు పెట్టి, వెనుకకి పోలేను, అంతా దండగ కావలిసిందేనా? అని తెగ మథన పడుతుంటే, నా పౌరుషిణి చాలు చాలు లే పద అని ముందుకు తోసింది!

ఓ సారి ఏమండీ పని మీద బాంబే వెళుతూ నన్నూ రమ్మన్నారు. ఎందుకు అంటే "అక్కడ పార్లర్ లు ఎట్లా ఉంటాయో చూద్దువుగాని, మనం ఒక ఫీల్డ్ లో ఉన్నప్పుడు, ముందు నేర్చుకున్నది సరిపోదు. ఎప్పటికప్పుడు కొత్తవి నేర్చుకుంటూ ఉండాలి" అన్నారు.

అక్కడ పార్లర్ లు చూసాక అక్కడ కొన్ని టిప్స్ నేర్చుకుంటే బాగుండుననిపించింది. అలా మూడు సార్లు బాంబే వెళ్ళి ప్రసిద్ధ బ్యూటీషియన్స్ దగ్గర షార్ట్ కోర్స్ లు చేసాను. ఏమండీ ఆయన ఫ్రెండ్ ఇంట్లో పదిరోజులు ఎకామిడేషన్ ఏర్పాటు చేసారు. మూడోసారి వెళ్ళినప్పుడు యోగా కోర్స్ లో కూడా చేరాను.

యోగా సెంటర్ లో యోగా మాస్టర్ ను "ఇక్కడేమైనా పేయింగ్ గెస్ట్ ఎకామిడేషన్ దొరుకుతుందా?" అని అడిగారు ఏమండి.

"ఎన్ని రోజులకు, ఎవరి కోసం సర్?" అడిగాడు ఆయన.

"నెల రోజుల కోసం. మా మిసెస్ ఉంటుంది" అన్నారు.

అది వినగానే ఉలిక్కి పడి, ఏమండీ చేయి పట్టుకున్నాను. నా వైపు చూస్తూ "ప్రతిసారి ఫ్రెండ్ ఇంట్లో ఉంటే బాగుండదు. ఈ సారి రెండు క్లాస్ లల్లో చేరుతున్నావు కాబట్టి ఒక నెల రోజులుండి నేర్చుకొని రా" అన్నారు.

"మరి నెలంటే పిల్లలో?" అన్నాను చిన్నగా, ఒక వైపు 'ఎవరో తెలీనివాళ్ళింట్లో నా వాళ్ళెవరూ లేకుండా, ఈ బొంబాయి మహానగరంలో ఎట్లా ఉండాలిరా దేవుడా?' అని భయపడుతూ.

"నేను చూసుకుంటాను. నీ పిల్లలను నేను సరిగ్గా చూసుకోనా?" అడిగారు చిన్నగా నవ్వుతూ.

"ఎందుకు చూసుకోరూ? నాకంటే బాగానే చూసుకుంటారు. కానీ... ఎవరో తెలీని చోట నేనొక్కదాన్ని..." ఏమండీని చూస్తూ మాట ఆపేసాను.

ఇంతలో లోపల నుంచి యోగా మాస్టర్ ఒక అమ్మాయిని తీసుకొచ్చి, "తన పేరు అనిత. ఇక్కడే ఫుల్ కోర్స్ కోసం చేరింది. నాగపూర్ నుంచి వచ్చింది. తను ఒక ఇంట్లో పేయింగ్ గెస్ట్ గా ఉంది. మిమ్మల్ని అక్కడికి తీసుకెళుతుంది" అన్నాడు.

అనిత మమ్మల్ని తను ఉంటున్న ఎపార్ట్మెంట్ కు తీసుకెళ్ళింది. అక్కడికి టాక్సీలో వెళుతున్నంత సేపూ ఏమండీ అనితను ఇంటర్వ్యూ చేస్తుంటే నేను బొంబాయి వీధులు చూస్తూ ఉన్నాను! అది సింగిల్ బెడ్ రూం అపార్ట్ మెంట్. హాల్, కిచెన్, ఒక బెడ్ రూం, కామన్ బాత్ రూం ఉన్నాయి. హాల్ లో మంచం మీద తెల్లగా మెరిసిపోతూ, లావుగా ఉన్న ఒకావిడ కూర్చొని ఉంది.

"మౌసీ, ఈవిడ మా సెంటర్ లోనే కోర్స్ లో చేరింది. ఒక నెల ఉంటుంది. తన పేరు మాల" అని అనిత ఆవిడతో చెప్పింది.

ఆవిడా, ఏమండీ ఒకొళ్ళనొకళ్ళు ఇంటర్వ్యూలు చేసుకొని ఫరవాలేదు అని ఇద్దరూ ఒకే అనేసారు!

పొద్దున ఒక ఛాయ్ తప్ప ఇంకేమీ ఇవ్వననీ, బయటనే తినాలనీ, రాత్రి ఎనిమిది లోపల గూటికి చేరాలనీ మౌసీ పెట్టిన షరతులకు ఒప్పుకొని, నన్ను మౌసీకి అప్పగించి, ఏమండీ వెళుతుంటే ఏడుపు మొహం పెట్టాను. ఫరవాలేదు అని నాకు ధైర్యం చెప్పి వెళ్ళారు ఏమండి.

బొంబాయిలో ఒక పేయింగ్ గెస్ట్ గా ఉండటమూ, లోకల్ ట్రేన్ లో తిరగటమూ, వీ.టీ స్టేషన్ దగ్గర పావ్ భాజీ, బటాకా వడా, సేవ్ పూరీ వగైరా తినటమూ అన్నీ మరుపురాని అనుభవాలు. నేనూ అనితా క్లాస్ ఐపోగానే కొద్ది దూరం నడుచుకుంటూనే వెళ్ళేవాళ్ళం. ఓ సారి జుహూ బీచ్ దగ్గర టాంగా కూడా ఎక్కి తిరిగాము. అలా ఎంజాయ్ చేస్తూ నా కోర్స్ ముగించుకొని, బ్యూటీషియన్ సర్టిఫికెటూ, యోగా సర్టిఫికెటూ తీసుకొని హైదరాబాద్ వచ్చేసాను.

నా పార్లర్ కు రకరకాల వయసుల వాళ్ళు, రకరకాల వృత్తుల వాళ్ళు వచ్చేవారు. అందరూ నాతో చాలా స్నేహంగా ఉండేవారు. కొన్ని సార్లు గమ్మత్తైన అనుభవాలు కూడా కలిగేవి. ఎప్పుడో తప్ప ఎవరూ ఎక్కువ కంప్లైంట్స్ చేయలేదు. ముందుకు వేసిన అడుగు అలాగే ఎన్నెన్నో జ్ఞాపకాలను పోగుచేసుకుంటూ ముందు ముందుకు వెళ్ళింది. ఎంతో మంది అభిమానాన్ని సంపాదించి పెట్టింది. ఎందరికో ఉపాధిని కల్పించింది. మావారి బిజినెస్ పార్ట్నర్ చనిపోతే ఆయన భార్యకోసం, బంజారా హిల్స్ లో ఊర్వశి బ్రాంచ్ ని తెరవటము మరిచిపోలేనిది. పలు కార్యక్రమాలకి ముఖ్య అతిథిగా, కొన్నిటికి జడ్జ్ గా వెళ్ళటము మరుపురానివి. పార్లర్ కి వచ్చే పిల్లలతో చేరి నేనూ ఒక టీనేజ్ అమ్మాయినే అయిపోయాను. అంతేనా, మౌనంగా వుండేదానిని వాగుడుకాయనయ్యాను! నాకంటూ ఒక గుర్తింపును ఇచ్చింది నా 'ఊర్వశి'.

ఏమండీ, పిల్లల సహకారముతో ఇంటినీ, వృత్తినీ బాలెన్స్ చేసుకుంటూ దాదాపు పదిహేను సంవత్సరాలు పార్లర్ నడిపాను.

15 సంవత్సరాల తరువాత పార్లర్ అమ్మేసి, ఇంటి ఓనర్ కీస్ ఇద్దామని వెళితే, "ఎందుకు మాలా పార్లర్ మూసేస్తున్నారు? మీరు చాలా హోంలీ గా వుంటారని, బాగా చేస్తారని, మంచి పేరు వచ్చింది. రష్ కూడా బాగా వుంది కదా మూసేయకండి కంటిన్యూ చేయండి" అంది. ఈవిడేగా "ఇంత మైల్డ్ గా వుంది, ఈమేమి పార్లర్ నడుపుతుంది" అన్నది పొరిషిణి నా మజాకా అని మనసులో గర్వంగా నవ్వుకుంటూ థాంక్స్ చెప్పి వచ్చేసాను!

అలా మా ఏమండీ చెమటోడ్చి, నన్ను చదివించుకున్నారన్న మాట! అంతే కాదు తాత దగ్గర నా నాడి పట్టటం నేర్చుకొని, మా మనవడు "నీకు కంప్యూటర్ రాదా? ఇపుడు నేర్చుకోలేవా?" అని చేసిన సవాల్ కు జవాబ్ గా కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ లో చేరి మూడు

నెలల కోర్స్ కూడా చేసానండోయ్! ఇదో ఇప్పుడు "నీ కథలన్నీ వీడియోలో నువ్వే చదవచ్చుగా. నువ్వు చదవలేవా?" అని మా అమ్మాయి సవాల్ కు జవాబ్ మీరు వింటున్నారుగా! అమ్మయ్య శుభం అనుకోకండి. ఏం ఈ వయసులో ఇంకా ఏమైనా చదవాలా అంటే ఏమో మళ్ళీ ఏదైనా సవాల్ వస్తే "గుర్రం ఎగరావచ్చు. పౌరుషిణి నిద్రలేవనూ వచ్చు."

## 9. మై హూం యమధర్మరాజ్!

లేడీస్ క్లబ్ లో చర్చలు మహా జోరుగా నడుస్తున్నాయి. కొత్త సీ. ఓ గారి భార్యగారు వచ్చాక, మెస్ పార్టీలల్లో, లేడీస్ క్లబ్ తరుఫు నుంచి కూడ ఓ ప్రోగ్రాం ఉండాలని ప్రతిపాదించారు. అందరమూ ఉత్సాహంగా ఓకే అనేసాము. మొదటిసారి యూపీ ఆవిడ కావటంతో, ఆవిడ కోరిక మీద చక్కగా టినోపాల్ అడ్వర్టైజ్మెంట్ లోలా మెరిసిపోయే తెల్లటి లక్నో కుర్తీ పైజామాలు వేసుకొని, మేకప్ చేసుకొని మరీ ఖవాలీ పాడాము. పార్టీలో ఆఫీసర్స్ అందరూ తెగ మెచ్చేసుకొని, మా అందరి దగ్గరకూ వచ్చి అభినందించారు. ఆ విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో, ఈసారి పార్టీకి తయారవుతున్నాము. పైగా ఈ సారి బయట నుంచి గెస్ట్ లు కూడా వస్తున్నారు. పార్టీ చాలా పెద్ద ఎత్తున జరగబోతోంది. అందుకని వీర లెవల్లో చర్చలు జరుగుతున్నాయి. భాంగ్ డా, లేదా ఏదైనా గ్రూప్ డాన్స్ ఇలా తలా ఒకటి చెప్పాక, ఆవిడ "ఈ సారి నాటకం వేద్దాము. డాన్స్ ఐతే అందరూ చేయలేరు, నాటకం ఐతే చాలా పాత్రలు ఉండి, ఎక్కువ మందికి అవకాశం ఉంటుంది" అన్నారు. ఇందులో అభ్యంతరం ఏమీ కనిపించక అందరం వాకే అనేసాము. నేను మనసులో నాటకమైతే, ఆ శుద్ధ హిందీ నాకు రాదు కాబట్టి తప్పించుకోవచ్చు అమ్మయ్య అనుకున్నాను. అందరూ ఏ నాటకం వేద్దాము అని తర్జనభర్జన పడుతున్నారు. కాసేపు అన్నీ విని ఆవిడ "నేను 'నవీన్ సావిత్రి' అని ఒక నాటకం రాసాను. మీకు అభ్యంతరం లేక పోతే అది వేద్దాము అన్నారు. అందరూ చేదు మాత్ర వేసుకున్న మొహం బెట్టారు.

"అది హాస్య నాటిక. అందులో సావిత్రి తల్లీ తండ్రి, అత్తామామలు, ఇలా చాలా పాత్రలున్నాయి. చాలా తమాషాగా ఉంటుంది అని చెప్పాను. మీ కభ్యంతరమైతే వద్దులే" అన్నారు కాస్త కినుకగా.

అమ్మో అభ్యంతరం ఉందని బాసుగారి పెళ్ళానికి చెప్పటమే! ఏమండీలు ఊరుకుంటారా అని మనసులో అనుకుంటూ అందరమూ మొహామొహాలు చూసుకున్నాము.

అందరిలో ముందుగా తేరుకున్న మిసెస్. తండన్ "టీక్ టీక్ హై. ఆప్ జైసే బోలేంగే వైసేయీ కరేంగే" అంది. చేసేదేమీ లేక వెర్రి మొహాలేసుకొని అందరం బుర్రూపేసాము.

ఇహ పాత్రధారుల ఎంపిక మొదలైంది. చిన్నా చితకా అందరి పాత్రలు ఎన్నికైపోయాయి. ఇహ ముఖ్యమైన పాత్రలు 'సావిత్రి', 'యమధర్మరాజు' మిగిలారు. ఆవిడ "సావిత్రి గా నేను వేస్తాను" అన్నారు. తప్పదుగా సరే అనేసాము. యమధర్మరాజుగా అంటూ స్లో మోషన్ లో, సస్పెన్స్ మేంటేన్ చేస్తూ అందరినీ పరికించి చూస్తోంది. ఇంతకు ముందు పాత్రలకు ఎన్నికైన వాళ్ళు కులాసాగా మావైపు చూస్తున్నారు. మిగతా వాళ్ళు టెన్షన్ గా ఉన్నా నేను మాత్రం ధిలాసాగా ఉన్నాను. ఆవిడ తల ఒక్కొక్కళ్ళ వైపు తిప్పుతోంది. పిన్ డ్రాప్ సైలెన్స్. ఆవిడ చూపు తప్పుకోగానే చిన్నగా ఉఫ్ అని నిట్టూర్చేవాళ్ళ గాలి సవ్వడి కూడా వినిపించటం లేదు. ఇంతలో చిన్నగా కాదు కాదు ఢభేల్ మని నా నెత్తిన ఏదో పిడుగు పడ్డ శబ్దం వినిపించింది! నా వైపు చూస్తూ "ఆప్ కరేంగే యమధర్మరాజ్" అని ఏదో అన్నట్లుగా లీలగా వినిపించింది. నేను... నేను యమధర్మరాజునా సన్నగా, పెద్ద గాలేస్తే పడిపోయేట్లున్న నేను యమధర్మరాజును, లావుగా పొట్టిగా ఉన్న ఆవిడ సావిత్రి. విధిలీల, భగవంతుని చిత్రాలు ఏవేవో గుర్తొచ్చేస్తున్నాయి. అవును మరి నవీన్ సావిత్రి కదా! అలాగే ఉంటారేమో!

ఆవిడ వైపు అయోమయంగా చూస్తూ "నాకు స్టేజ్ ఎక్కాలంటే భయం" అన్నాను నంగిరి నంగిరిగా.

"భయమెందుకు? ఐనా వెల్ఫేర్ సెంటర్ ప్రోగ్రాం లు కండెక్ట్ చేస్తావు కదా" అన్నది.

"అక్కడ అంతా ఆడవాళ్ళు, ఓ పది మందే ఉంటారు." అన్నాను చిన్నగా.

"మొన్న ఖవాలీలో ఉన్నావుగా?" అంది.

ఏదో గుంపులో గోవిందమ్మలాగా అటో చప్పట్లు, ఇటో చప్పట్లు కొట్టానే కాని నేను చేసింది ఏముంది? దానికీ ఆ తరువాత ఏమండీగారు, "చప్పట్లు కొట్టటానికి కూడా అంత భయమెందుకు?" అని ఎంత క్లాస్ పీకారో! అని ఆమెవైపు గుడ్లప్పగించి చూస్తూ, చివరాఖరుగా "మేరేకో హిందీ టీక్ సే నై ఆతా" అన్నాను హైదరాబాదీ స్టైల్ లో.

"కోయీ బాత్ నై. ఆప్ కో జాదా డైలాగ్స్ నహీ రహతా. నేను నిన్ను 'ఆప్ కౌన్ హో?' అని అడుగుతాను. 'మై హూ యమధర్మరాజ్' అని, మీసం మెలేస్తూ, గంభీరంగా చెప్పాలి. మధ్య మధ్య సావిత్రీ అని భీకరంగా అరవాలి. అంతే" అందావిడ సింపుల్ గా.

గంభీరంగా,  భీకరంగానా? నా బొంద నలుగురి ముందు గొంతే పెగలదు. చచ్చేంత టెన్షన్.  అట్లా అని ఈవిడ కు ఏమీ చెప్పలేని మొహమాటం. అంతే అంటుంది కాని అది ఎంతో ఆమెకేమి తెలుసు? ఈ మొహమాట మోక్షంతో ఏమి చేయాలో తోచక చుట్టూ అందరి వైపు చూసాను. అందరూ ఏమి మాట్లాడితే ఏమో,  ఎక్కడ ఈ యమధర్మరాజు పాశం వాళ్ళ మెడకు చుట్టుకుంటుందో అని నిశ్శబ్దంగా మా ఇద్దరినీ కళ్ళప్పగించి చూస్తున్నారు. మనసులో బాగైందిలే లల్ల లల్లా అని పాడుకుంటూ నవ్వుకుంటున్నారేమో కూడా అని ఓ డౌటనుమానం వచ్చింది.

"రేపు ఆదివారం కదా, ఎల్లుండి నుంచి రిహార్సల్ మొదలు పెడుదాము. వారంరోజులే ఉంది టైం" అని అదే ఫైనల్ అన్నట్లు చెప్పి లేచింది. నా వైపు జాలిగా చూస్తున్న  ఎవరినీ పట్టించుకోకుండా నీరసంగా నేనూ ఇంటికి బయలు దేరాను.

డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు సద్దుతున్న నన్ను  "ఎట్లా ఐంది మీ లేడీస్ మీట్? ఈ సారి ఏమైనా ప్రోగ్రాం చేస్తున్నారా?" అని అడిగారు ఏమండి. నేను ఏమీ మాట్లాడలేదు. పరధ్యానంగా,  నీరసంగా ఉన్న నన్ను చూసి "ఏమైంది? అట్లా ఉన్నావు?" అన్నారు.

"ఏమీలేదు. ఈసారి 'నవీన్ సావిత్రి' అని నాటకం వేస్తున్నాము." అన్నాను ముభావంగా.

"వెరీ గుడ్. నువ్వేమైనా వేషం వేస్తున్నావా?" అని అడిగారు.

అప్రయత్నంగా "మై హూం యమధర్మరాజ్" అన్నాను.

నోట్లో పెట్టుకోబోతున్న ముద్దను ఆపి "ఏమిటి?" అన్నారు.

"అవును. నేను యమధర్మరాజ్ వేషం వేస్తున్నాను" అన్నాను. ఏమండి నావైపు విచిత్రంగా చూస్తూ "మరి సావిత్రి ఎవరు?" అడిగారు.

"ఇంకెవరూ? మీ బాస్ పెళ్ళాం" అన్నాను కసిగా.

ఏమండీ చేతిలోని ముద్ద జారిపోయింది. ఒక్క క్షణం బిత్తరపోయి,  అప్పటి వరకూ మా ఇద్దరి సంభాషణను కుతూహలంగా వింటున్న పిల్లల వైపు చూస్తూ, "మీ అమ్మ

యమధర్మరాజు... ఆహాహ ఓహోహో!" అంటూ తలపైకెత్తి నవ్వారు పెద్దగా. పిల్లలూ శ్రుతి కలిపారు. ఆ ముగ్గురి నవ్వునూ చూస్తూ ఉక్రోషంగా అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయాను.

రాత్రి తెల్లవార్లూ కలలో యమధర్మరాజు దున్నపోతెక్కి వచ్చి, "మై హూం యమధర్మరాజ్" అని భీకరంగా అరుస్తున్నాడు. పొద్దున నిద్ర లేచి పని చేసుకుంటున్నా, కూడా వెనకెనకే దున్నపోతుమీద తిరుగుతున్నాడు. ఆ యముడి బాధ భరించలేక, అన్యధా శరణం నాస్తి అని సాయంకాలం ఏమండీగారిని, 'ఈ యమధర్మరాజ్ బారి నుంచి నన్ను రక్షించండి' అని వేడుకున్నాను. శ్రీకృష్ణపరమాత్మలా చిరునవ్వు నవ్వి, అభయ హస్తం చూపించి "పద" అన్నారు. ఎక్కడికి అని మారు మాట్లాడకుండా వెనకాల నడిచాను.

ఇద్దరమూ బాస్ గారింటికి వెళ్ళాము. బాస్ గారు సాదరంగా ఆహ్వానించారు. బాస్ గారి పెళ్ళాంగారు కూడా కాఫీ టిఫినూ పెట్టి మర్యాద చేసింది. అవును మరి ఎంతైనా యమధర్మరాజును కదా ఎందుకు చేయదు? అని నోట్లోనే కనిపించకుండా పళ్ళు నూరుకున్నాను. బాస్ గారి తో పిచ్చాపాటి మాట్లాడుతున్న ఏమండీగారి వైపు, 'ఏమిటీయన ఎందుకు వచ్చాము, ఏమి మాట్లాడుతున్నారు?' అని చూస్తూ ఆవిడ అడిగిన దానికి ఏదో సమాధానంచెపుతున్నాను. కాసేపైనాక ఏమండి ఆవిడవైపు చూసి, "మేడం మీరు నాటకంలో మా ఆవిడకు ఇంపార్టెంట్ పోర్షన్ ఇచ్చారట కదా. చాలా థాంక్స్" అన్నారు. నేను గాభరాగా ఏమండీ వైపు చూసాను.

"ఏమి పోర్షన్ ఇచ్చావు?" అని బాస్ గారు ఆవిడను అడిగారు.

"మేము నేను రాసిన 'నవీన్ సావిత్రి' నాటకం వేస్తున్నాము. అందులో నేను సావిత్రి, మాల యమధర్మరాజ్" అంది నోరంతా తెరిచి నవ్వుతూ సంబరంగా.

ఆయన ఆవిడ వైపు కాసేపు సాలోచనగా చూస్తూ, "నువ్వు సావిత్రి గా వేస్తున్నావా వెరీ గుడ్. చాలా బాగుంటావు. నాటకం కూడా బాగుంటుంది" అన్నారు.

"మేడం మీరు పాటలు కూడా రాసి బాగా పాడతారట. పార్టీలో మీరు రాసిన పాట మాకు వినిపించవచ్చు కదా" అన్నారు ఏమండీ.

"పాటకు, నాటకానికి సమయం సరిపోదేమో" అన్నారు బాస్ గారు.

"నాటకం మేము ఎప్పుడైనా చూస్తాము. వచ్చే గెస్ట్ లకు మేడం పాట వినిపిస్తే బాగుంటుంది కదా" అన్నారు ఏమండి ప్లీజింగ్ గా.

ఆవిడ మురిసిపోతూ "సరేలెండి పాటే పాడుతాను. ఇప్పుడు నాటకం రిహార్సల్ కు టైం కూడా ఎక్కువ లేదు. నాటకం ఇంకోసారి వేయొచ్చు" అంది.

అమ్మయ్య ఆవిడ పాట పాడేందుకు ఫిక్సైపోయింది. ఈవిడ పాటలు కూడా పాడుతుందా అదీ సొంతంగా రాసి. అబ్బో ఎన్ని కళలున్నాయో! బాగా పాడుతుందా? పోనిద్దూ ఎట్లా పాడితే నాకేమిటి?బాగో వోగో బాసమ్మగారి పాట వినక చస్తారా? మళ్ళీ నాటకం వేసే సమయానికి ఎవరెక్కడో! అప్పటి సంగతి అప్పుడే. ఇప్పటికి నా గండం గడిచింది. ఎంతైనా ఏమండీ గారి బుర్రే బుర్ర. వాళ్ళకో నమస్కారం, ఓ థాంక్స్ పడేసి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డాను. లేకపోతే నేనేమిటి యమధర్మరాజ్ ఏమిటి? నన్ను యమధర్మరాజ్ గా సెలెక్ట్ చేసుకున్న బాసమ్మకు జోహార్!

- (సంచిక అంతర్జాలపత్రిక - ఫిబ్రవరి 10, 2019)

## 10. ఎంతెంత దూరం

సుధీర్, ఉష కొత్త కార్ కొనుక్కున్నామని చూపించేందుకు మా ఇంటికి వచ్చారు. నల్లరంగు కొత్త అంబాసిడర్ మెరిసిపోతోంది. కాసేపు అందరమూ దాని చుట్టూ తిరిగి చూసి, ఆహా, ఓహో అనేసుకొని లోపలికి వచ్చాము. సుధీర్ ఈమధ్యనే బరోడా నుంచి పోర్ బందర్ కు ట్రాన్స్ఫర్ అయి వెళ్ళాడు. నెలకో రెండు సార్లు బరోడా వచ్చి వెళుతుంటాడు. ఉషా మటుకు, పిల్లలిద్దరి చదువు కోసమనీ, అత్తమామలు పెద్దవాళ్ళనీ బరోడాలోనే ఉండిపోయింది. ఎప్పుడు వాళ్ళు మా ఇంటికి వచ్చినా, మేము వాళ్ళ ఇంటికి వెళ్ళినా భోజనం చేయటం అలవాటు. అలాగే భోజనాలయ్యాక కాసేపు కూర్చొని, "ఇక వెళతాము. నేను రేపు వెళ్ళాలి." అని లేచారు. వాళ్ళతో పాటు మేము కూడా బయటకు వచ్చాము. సడన్ గా సుధీర్ "రేపు మీరూ నాతో రావచ్చుగా, ఎలాగూ నేనొక్కడినే వెళుతున్నాను. పిల్లలకూ సెలవలే కదా!" అన్నాడు.

ఈ మధ్యనే నేను ఓ కాన్వెంట్ స్కూల్ లో టీచర్ గా చేరాను. మొదటి నెల జీతం వచ్చింది. ఆ ఉషారులో, వెంటనే నేను "నాకూ సెలవలే. వెళ్దామండీ!" అన్నాను.

పిల్లలూ "వెళ్దాం డాడీ" అన్నారు.

మా హడావుడి చూసి పాపం ఏమనలేక, "సరే వస్తాము కాని తిరిగి వచ్చేటప్పుడు ఎట్లా?" అన్నారు.

"నువ్వు కార్ తీసేసుకో, మా ఆఫీస్ వాళ్ళెవరైనా ఇక్కడి నుంచి వచ్చేటప్పుడు నాకు తెచ్చిస్తారులే. నో ప్రాబ్లం. మీరు హాయిగా అక్కడంతా కార్ లో తిరిగేయండి" అన్నాడు.

అంతే చలో సౌరాష్ట్రా!

మరునాడు బ్రేక్ ఫాస్ట్ ముగించుకొని బయలుదేరాము. “ముందుగా అహ్మదాబాద్ పోదాము, అక్కడ నాకు కొంచెం పని ఉంది.” అన్నాడు సుధీర్. సుధీర్ ఆఫీస్ పనయ్యాక, "ఇక్కడ టెక్స్టైల్ మిల్స్ ఎక్కువ కదా, మిల్లుల వాళ్ళు కట్ పీస్ లని బండిల్స్ లో మిగిలిన

బట్ట ముక్కలను, కిలోల లెక్కన అమ్ముతారు. ముక్కలన్నమాటే కాని పెద్దగా డ్రెస్ లు కుట్టించుకునేట్లుగా ఉంటాయి. ఉషా ఎప్పుడూ ఇక్కడే తీసుకుంటుంది. నువ్వు కూడా తీసుకుంటావా?" అని నన్ను అడిగాడు. నేను జవాబు చెప్పే లోపలే, ఏమండీ "చూద్దాం పద" అన్నారు.

మంచి మంచి ప్రింట్లతో, చక్కని లేతరంగులలో ఆ కట్ పీస్ లన్ని బాగున్నాయి. కొన్ని ఏరి పక్కనున్న తరాజులో వేసాను. “ఇంకా తీసుకో, నీకు, సంజుకూ ఇద్దరికీ డ్రెస్ లు కుట్టుకుందువుగాని” అని దగ్గర దగ్గర ఐదు కిలోల పైనే తీసుకున్నారు ఏమండి. ఆ పక్కనే కాటన్ ఫుల్ వాయిల్ చీరలు కూడా భలేగా ఉన్నాయి. నాకిష్టమైన వైట్ అండ్ బ్లాక్ కలర్ కాంబినేషన్ లో, తెల్లని చీర మీద అక్కడక్కడా నల్లని చిన్నచిన్న పూలతో ముద్దుగా ఉన్న చీర చాలా నచ్చింది. కాని అప్పటికే చాలా తీసుకున్నాము, ఇంకా ప్రయాణం మొదట్లోనే ఉన్నాము, డబ్బులన్నీ ఇప్పుడే ఖర్చు చేస్తే ఎట్లా అని నేను అనుకుంటూ ఉండగానే ఏమండీ నా చూపులను కనిబెట్టి కొనేసారు. వద్దు వద్దు అంటూనే కొంచెం ఇష్టంతో కొంచెం అయిష్టంతో తీసేసుకున్నాను.

హోటల్ రూం లో కాసేపు రెస్ట్ తీసుకొని, ఛాయ్ తాగి డ్రైవ్ ఇన్ మూవీకి వెళ్ళాము. షమ్మీకపూర్, సైరాబానుల సినిమా ‘జంగ్లీ’ వేస్తున్నారట ఆ రోజు. మేము ప్లేస్ చూసుకొని సెటిలయ్యేసరికి సినిమా మొదలైంది. పెద్ద గ్రౌండ్ లో పెద్ద స్క్రీన్ మీద వేస్తున్నారు. కొందరు కార్లల్లోనే కూర్చొని చూస్తున్నారు. కొంత మంది కార్ పక్కన ఫోల్డింగ్ చైర్స్ వేసుకొని, కింద దుప్పటి పరుచుకొని కూర్చొని, హాయిగా ఇంట్లో కూర్చొని చూస్తున్నట్టు చూస్తున్నారు. ఓపెన్ ఏయిర్ థియేటర్ లో సినిమా చూసాము. కాని ఇలా కార్ లో కూర్చొని చూడటం గమ్మత్తుగా ఉంది. సినిమాలో సైరాబాను చాలా సున్నితంగా అందంగా ఉంది. సుధీర్, ఏమండీ షమ్మీకపూర్ డాన్స్ లు ఎంజాయ్ చేస్తుంటే, నేను మాత్రము ఛాహే కోయి ముఝే జంగ్లీ కహే అని పాడేసుకుంటూ, పిల్లలతో కలిసి రకరకాల ఛాట్ లు అబ్బో ఎన్ని రకాలో తింటూ ఎంజాయ్ చేస్తూ, మధ్య మధ్య కాసిని వాళ్ళిద్దరికీ ఇస్తూ, సినిమా ఏమో కానీ డ్రైవ్ ఇన్ మూవీ, ఛాట్ లూ బహూ మజా ఆవీ.

మరునాడు పోర్ బందర్ చేరాము. సుధీర్ మాకు చౌపాటీ (గెస్ట్ హౌస్) లో రూం ఇప్పించి, తన అసిస్టెంట్ ఒక అబ్బాయిని మాకు గైడ్ గా ఏర్పాటు చేసి, మీకు పోర్ బందర్, సోం నాథ్, ద్వారకా అన్నీ ఇతను చూపిస్తాడు, నేను మళ్ళీ మీరు వెళ్ళేటప్పుడు

కలుస్తాను అని చెప్పి వెళ్ళిపోయాడు. మహాత్మాగాంధీజీ పెరిగిన ఊరు అని తలుచుకుంటుంటేనే చెప్పలేని భావమేదో వచ్చేసింది. ఎంతో ఆనందంగా ఊహించుకుటూ ఉంటే ఆ  గుంతల రోడ్డులు,  ఇరుకు సందులు ఇబ్బంది పెట్టాయి. "ఇదిగో ఇదే గాంధీజీ ఇల్లు" అని సుదీర్ అసిస్టెంట్ అరవింద్ లోపలికి తీసుకెళ్ళాడు. ఎంత అబ్బురంగా చూసామో. మేడ మీదికి తీసుకెళ్ళి,  పక్కనున్న ఇల్లు చూపిస్తూ "అదే కస్తూరిబా ఇల్లు. ఈ పక్కన కనిపిస్తోందే అది కస్తూరిబా గది. ఇదో ఈ కిటికీ లోనుంచే కస్తూరిబా గాంధీజీ ని చూస్తూవుండేది ఎప్పుడూ" అని ఓ ప్రేమ కథ కూడా వినిపించేసాడు.  అబ్బో గాంధీజీ, కస్తూరీబాకు కూడా ఓ ప్రేమకథ ఉందే అని ఆశ్చర్యపోయాము.

తిరిగి తిరిగి చౌపాటీకి వచ్చాము. డిన్నర్ చేసి పిల్లలు అలిసిపోయి పడుకున్నారు. నేను బాల్కనీ లోకి వచ్చాను. ఎదురుగా సముద్రుడు ఎగిసిపడుతున్నాడు. కార్తీక చంద్రుడు నన్ను చూడు, నా అందం చూడు అని మెరిసిపోతూ చుక్కలకందకుండా ఏడిపిస్తున్నాడు. అబ్బ ఎంత మనోహరంగా ఉంది? వాలు కుర్చీ జరుపుకుని కూర్చొని ఆ అందాలు చూస్తూ పరవశించిపోతున్నాను. ఏమండీ వచ్చి "పడుకోకుండా ఏమి చేస్తున్నావు? పడుకో" అన్నారు.

"అశ్వత్థామ కోసం చూస్తున్నాను" అన్నాను అప్రయత్నంగా.

"ఎవడాడు?" అడిగారు.

"అయ్యో తప్పు అలా అనకూడదు చెంపలేసుకొండి. ద్రోణాచార్యుడి కొడుకు" అన్నాను.

నేనెక్కడ ఆయన చెంపలేస్తానో అని కాస్త దూరం జరిగి “ఎవరు" అని మళ్ళీ అడిగారు.

"అబ్బా అన్నీ చెప్పాలి. భారతంలో పాండవుల గురువు ద్రోణాచార్యులున్నారా? ఆయన కొడుకు అశ్వత్థామ!" అన్నాను.

"ఏడిచినట్టుంది. ఇన్ని యుగాల తరువాత నీకు కనిపిస్తానని చెప్పాడా?" అన్నారు కాస్త వెక్కిరింతగా!

"నాకేమీ చెప్పలేదు, మీరేమీ నన్ను వెక్కిరించనక్కరలేదు. అశ్వత్థామ చిరంజీవి. ఆయనకు మరణం లేదు. ఈ సముద్రం ఒడ్డునే తిరుగుతూ ఉంటాడట. ముఖ్యంగా పౌర్ణమి రోజులల్లో తప్పక వస్తాడట. దాదాపు ఇరవై అడుగులపైన ఉంటాడట.  చాలా గంభీరంగా ఉంటాడట. మన పనిమనిషి తులసీబెన్ చెప్పింది" అన్నాను చాలా ఉద్వేగంగా.

"ఎంతుంటాడటా,  నీ కూతురి ఆకాశమంత సిస్టర్ లా ఉంటాడటనా? ఏదీ మన ఇంటి వెనుక పౌర్ణమి రోజు ఓ నల్లనాగు ఓ మణి ని నెత్తిన పెట్టుకొని డాన్స్ చేస్తుందని, తులసీబెన్ చెప్పిందనేగా ప్రతి పౌర్ణమికీ కిటికీ పక్కన కూర్చొని ఎదురుచూస్తూ ఉంటావు అలాగ ఇక్కడ అశ్వత్థామ వస్తాడని ఈ రాత్రంతా ఎదురు చూస్తావా? సరే సరే కానీ చూసి తరించు" అని  " అశ్వత్థామ హతః కుంజరః" అంటూ,  నవ్వుకుంటూ లోపలికి వెళ్ళారు.

పెద్ద అశ్వత్థామ ఎవరో తెలీనట్లు చేసారు.  హుం ఎప్పుడూ నన్ను వెక్కిరించటమే.

బోట్ సముద్రపు అలల మీద చిన్నగా తేలిపోతోంది. సూర్యకిరణాలు నీటి మీద పడి తళతళా మెరిసిపోతున్నాయి. రాత్రి చాలా సేపు బైట కూర్చొని ఎప్పటికో నిద్రపోయాను. పొద్దున లేవగానే అందరమూ రెడీ అయ్యి, సోమనాథ్ చూసి, బేట్ ద్వారక చూద్దామని వెళుతున్నాము. సముద్రము పక్క నుంచి వెళుతుంటే ఏమండీకి కాసేపు బోట్ లో వెళ్ళాలనిపించి బోట్ ఎక్కాము. వచ్చీ రాని గుజరాతీలో పడవతనితో ముచ్చట్లేస్తున్నారు ఏమండి.  మనము ఏ స్టేట్ లో ఉంటే అక్కడి భోజనం తినాలి, వాళ్ళ భాష కొంచమైనా నేర్చుకోవాలి అని ఏమండీగారి సిద్ధాంతము. ఇంతలో కొంచెం దూరంలో ఓ పెద్ద భవనము చూపించి అదే బేట్ ద్వారక అన్నాడు పడవతను.

దానితో మహా ఉత్సాహంగా "అదిగో ద్వారక,  ఆల మందలవిగో" పద్యం ఎత్తుకున్నారు ఏమండీ. డాడీతో పాటు కొడుకుకు కూడా అంతకన్నా ఉత్సాహం ఎక్కువైపోయి, "బావా ఎప్పుడు వచ్చితివీవు?" అని ఎత్తేసాడు.

"ఓరోరి బేటా ఈ పద్యం దీనికి చదవరురా"అంటే వింటేనా! తండ్రీకొడుకులు ఓ వచ్చిన పద్యాలన్నీ పాడేసుకుంటూ,  బోట్ షికార్ ముగించి,  ద్వారక చేరాము. అసలు ద్వారక సముద్రములో మునిగిపోయాక,  ఈ భవనం ఒక్కటే మిగిలిందని గైడ్ చెపుతూ, ‘ఇది రుక్మిణి అంతఃపురం,  ఇది సత్యభామ అంతఃపురం’ అని చూపించాడు. ఏమిటబ్బా

ఇంత చిన్న గుమ్మాలున్నాయి. ఇన్ని రంగులేసారు అనుకుంటుంటే ఏమండీ "బహుశా ఇది తరువాత జ్ఞాపకచిహ్నంగా కట్టి ఉండవచ్చు" అన్నారు.

మొత్తానికి ఏదైతేనేమి ద్వారక చూసాము. సోమనాథ్, గాంధీజీ ఇల్లు, కస్తూరిబా ఇల్లు, కచ్ దగ్గర గాంధీజీ ఉప్పుసత్యాగ్రహం చేసిన ప్రదేశము అన్నీ చూసుకొని, సుధీర్ కు థాంక్స్ చెప్పి తిరుగు ప్రయాణమయ్యాము.

దారంతా చిన్న చిన్న పల్లెటూళ్ళు. పొద్దున్నే బయలుదేరటముతో పోర్ బందర్ లో లంచ్ పాక్ చేసి తెచ్చుకోలేకపోయాము. ఏమిచేయాలా అనుకుంటూ ఓ ఊరు కొంచెం పెద్దగా కనిపిస్తే, పక్కన కార్ ఆపి అక్కడున్న ఒకతనిని అడిగారు "ఇక్కడ భోజనం ఏమైనా దొరుకుతుందా?" అని అతను ఆ పక్కనే ఉన్న గుడిసె చూపించి, ఇందులో ఒక ముసలమ్మ రోటీ, సబ్జీ చేసి అమ్ముతుంది అని చెప్పాడు. 'అమ్మయ్య' అనుకొని ఏమండీ లోపలికి వెళ్ళి రోటీ, సబ్జీ పాక్ చేయించుకొచ్చి, "లక్కీగా సమయానికి వచ్చాము. ఆవిడ చేయటం ఆపేస్తోంది. మన కోసం అని వేడి వేడిగా జొన్న రొట్టెలు చేసిచ్చింది. మూంగ్ సబ్జీ కూడా ఇచ్చింది. కాని అక్కడ తినేందుకు వీలుగా లేదు ఎక్కడన్నా ఆపుకొని తిందాము" అన్నారు. కొంచము ముందుకు వెళ్ళగానే రోడ్ పక్కన ఒక పొలం కనిపించింది. దాని గేట్ ముందు పెద్ద రావి చెట్టు ఉంది. దాని కింద కార్ ఆపారు. అందరము కిందికి దిగాము. నేను కార్ డిక్కీ లో నుంచి ప్లేట్ లూ, గ్లాస్ లూ ఉన్న బుట్ట తీస్తున్నాను. ఇంతలో లోపల నుంచి ఒకతను బయటకు వచ్చి, మమ్మల్ని చూసి, "థం బద్దా బాహర్ బైఠా చో. ఘర్మా అందర్ ఆవో. (బయటెందుకు కూర్చున్నారు? లోపలికి రండి)" అన్నాడు.

అతనితో నలుగురమూ లోపలికి వెళుతూ, "ఏమండీ... ఆ రైతును "తమారూ సూ నాం చే?(నీ పేరేమిటి?)" అని అడిగారు.

"మారూ నాం ముకుంద్" అని చెప్పాడు.

లోపలికి తీసుకెళ్ళి ముకుంద్, పెద్ద మామిడిచెట్టు కింద మాకోసం రెండు నులక మంచాలు తెచ్చి వేసాడు. వాటి మీద దుప్పట్లు వేసాడు. మేము ముసలమ్మ దగ్గర నుంచి తెచ్చిన జొన్నరొట్టెలు, మూంగ్ (పెసల) కూర తీసి, నా దగ్గర ఉన్న పళ్ళాలల్లో వేస్తున్నాను. ఇంతలో ముకుంద్ ఒక పెద్ద కటోరీ నిండా తెల్లటి పేరి నెయ్యి, ఒక కూజాలో మంచి నీళ్ళు తెచ్చిచ్చాడు మళ్ళీ వెళ్ళి, తళతళా బంగారంలా మెరుస్తున్న నాలుగు పెద్ద

పెద్ద ఇత్తడిగ్లాస్ ల నిండా మజ్జిగ తెచ్చిచ్చాడు. అన్నీ అక్కడ పెట్టి ఆరాంగా తినమని చెప్పి తన పనిలోకి వెళ్ళిపోయాడు. ఏమండి వెన్నముద్దలా ఉన్న ఆ నెయ్యి కొద్ది కొద్దిగా తీసి రొట్టెల మీద వేసి పిల్లలకు ఇచ్చారు. జొన్న రొట్టెలు అలవాటు లేవు, పిల్లలు ఎట్లా తింటారా అనుకున్నాను కాని, చల్లగా హాయిగా ఉన్న ఆ పొలంలో చెట్టు నీడన కూర్చొని, "డాడ్ నువ్వెప్పుడూ భలే పిక్నిక్ అరేంజ్ చేస్తావు?" అంటూ ఆ వేడి వేడి రొట్టెలు ఎంజాయ్ చేస్తూ తిన్నారు. మా భోజనం అయ్యాక ఏమండీ ముకుంద్ తో ముచ్చట్లేస్తూ పొలం అంతా ఓ రౌండ్ కొట్టి వచ్చారు.

కాసేపు విశ్రాంతి తీసుకున్నాక, బయిలుదేరుతూ ఏమండీ ముకుంద్ భుజం చుట్టూ చేయివేసి దగ్గరకు తీసుకొని, "బహు మజా ఆవీ. మహర్మాని"( చాలా ఎంజాయ్ చేసాము. థాంక్ యూ) అని ధన్యవాదాలు చెప్పారు. ముకుంద్ విప్పారిన మొహంతో మాతోపాటు గేట్ దాకా వచ్చి, "ఆవ్ జో" (బై) అన్నాడు.

'మాధవపురం' అని బోర్డ్ చూసి కార్ ఆపి, “ఇక్కడేమన్నా ప్రత్యేకమా?” అని అడిగారు అక్కడున్న ఒకతనిని ఏమండి. అతను కొంచెం దూరంలో ఉన్న ఓ చెట్టు చూపించి, ఈ చెట్టు కిందనే శ్రీకృష్ణుడు నిర్యాణము చెందాడని, అప్పటి నుంచి ఈ చెట్టును ఎండిపోకుండా కాపాడుతున్నారని చెప్పాడు. చూద్దాం అని దిగి పిల్లలను ఆ చెట్టుకు దండం పెట్టమని ఫొటో తీసాను.

"బాగుంది. అతను చెప్పటమూ, నువ్వు నమ్మటము, పిల్లలను నిలబెట్టి ఫొటో తీయటమూ" అంటూ నవ్వారు ఏమండి.

"పోనీయండి నాది పిచ్చే. పిల్లలూ పెద్దయ్యాక ఈ ఫొటో చూసి నవ్వుకుంటారు సరదాగా" అన్నాను కాస్త కినుకగా.

కనుచీకటి పడుతుండగా 'వీర్ పూర్ ' చేరాము. ఇదేదో కాస్త పెద్ద ఊరులా ఉంది ఈ రోజు ఇక్కడ ఉండి రేపు పొద్దున వెళుదాము అని అక్కడ ఉండేందుకు ఏముందా అని కనుక్కుంటే ‘జలారాం’ మందిర్ ఉందని, దానికి అనుబంధంగా ధర్మశాల ఉందని, భోజనము కూడా అక్కడ పెడతారని చెప్పారు. ధర్మశాల క్లర్క్ తో మాట్లాడి గది తీసుకున్నాము. గది శుభ్రంగా బాగుంది కాని కామన్ వాష్ రూంలే వాడుకోవాలి.

గునుస్తున్న పిల్లలకు ఇదీ ఒక ఎక్స్పీరియన్స్. అన్నీ నేర్చుకోవాలి అని నచ్చచెప్పారు ఏమండీ. ఏమాటకామాటే చెప్పాలి కామన్ అయినా చాలా శుభ్రంగా ఉన్నాయి.

రాత్రి భోజనంలో, పెద్దగా గుండ్రంగా ఉన్న ఇత్తడి కంచంలో, ఒక కటోరీలో ఆలూ సబ్జీ, ఒక కటోరీలో ఉల్లిగడ్డ ముక్కలూ, నిమ్మకాయ ముక్క, ఒక కటోరీలో దాల్ వేసి తెచ్చి ముందు పెట్టారు. రోటీలు వేడిగా చేస్తూ వడ్డించారు. కటోరీలు, గ్లాస్ లూ అన్నీ ఇత్తడివే. తళతళా బంగారంలా మెరిసిపోతున్నాయి. గుజరాతీలు పాత్ర సామానులన్నీ ఇత్తడివే వాడుతారు. పైగా మెరిసేట్టుగా తోముతారు. అంతలా ఎలా మెరిపిస్తారా అని నాకెప్పుడూ ఆశ్చర్యమే!

రాత్రి హాయిగా విశ్రాంతి తీసుకొని, పొద్దున్నే ధర్మశాల వాళ్ళు పెట్టిన పోహ్ తిని మళ్ళీ రోడ్ ఎక్కాము. దారిలో వస్తున్న చిన్న చిన్న ఊళ్ళన్నిటికీ కృష్ణుని పేర్లే ఉన్నాయి. అవన్నీ శ్రీకృష్ణుడు నడయాడిన ఊళ్ళట. శ్రీకృష్ణపరమాత్మ బాల్యం అక్కడే గడిచిందని ఒక్కో ఊళ్ళో ఒక్కో కథ చెప్పారు. అన్నీ తాపీగా చూసుకుంటూ వెళుతున్నాము. పిల్లలు వెనక సీట్లో ఏవో ఆటలాడుకుంటున్నారు. ఏమండీ చిన్నగా విజిల్ వేస్తూ డ్రైవ్ చేస్తున్నారు. మాధవుడు బాల్యం గడిపిన ప్రదేశాలు చూస్తుంటే పవిత్రమైన భావన కలుగుతోంది. చిలిపి కృష్ణుడు గుర్తొచ్చి, "బడ నట్ కట్ హైరే కిషన్ కన్నయ్యా,

కా కరూ యశోమతి మయ్యా"

అని కూని రాగం తీస్తూ పరవశించిపోతున్నాను.

"డాడ్"

వెనక నుంచి పిల్లలు పిలిచారు. కూనిరాగం ఆపి, ఏమైందా అని వెనక్కి తిరిగాను.

"వాట్?" అన్నారు ఏమండి.

నాలుగు రోజుల నుంచీ ప్రయాణం చేస్తున్నారేమో, ఆటలూ, పాటలూ అన్నీ ఐపోయి విసుగొచ్చేసినట్లుంది, "ఇంకెంత దూరం?" అన్నారు కోరస్ గా.

"అట్లా అడగ కూడదు. ఎంతెంత దూరం అని అడగాలి" జవాబిచ్చారు.

"సరే ఎంతెంత దూరం?" అన్నారు ఇద్దరూ.

ఏమండీ నాతో "ఇప్పుడు నువ్వేమనాలి?" అన్నారు.

ఓహో పిల్లలను ధ్యాస మళ్ళించి, ఎంగేజ్ చేస్తున్నరన్నమాట అనుకొని "కోసు కోసు దూరం." అన్నాను.

"కోసు అంటే ఏమిటి డాడీ?" సుపుత్రిక ప్రశ్న.

"కోసు అంటే కొంచెం దూరం అన్నమాట. ఏదీ మళ్ళీ అడగండి ఎంతెంత దూరం అని."

వెనక నుంచి వాళ్ళు ఎంతెంత దూరం అనటం, ముందు నుంచి మేము కోసు కోసు దూరం అనటం. ఇంతలో జునాఘుడ్ వచ్చింది. అక్కడే ఓ పక్కన ధాభా దగ్గర ఆపి కాసేపు కూర్చుని, మేము ఛాయ్, పిల్లలు ఐస్ క్రీం కానిచ్చేసాము.

మళ్ళీ "ఎంతెంత దూరం డాడీ?"

"కొంచెం కొంచెం దూరం బేటీ."

సరే ఇంకేం బేటా, బేటీ, డాడీ పాడుకుంటుంటున్నారుగా అని నేను నా కన్నయ్య లోకంలోకి వెళ్ళాను.

"శ్యాం తేరీ, కన్నయ్యా తేరీ బంశీ పుకారే రాధా నాం,

రాధా కాభీ శ్యాం హైతో, మీరా కాభీ శ్యాం హై. "

చిన్న జర్క్ తో కార్ సడన్ గా ఆగింది. నేను ఏమైందా అని చూసాను. ఏమండీ కిందకి దిగి చూస్తున్నారు.

"డాడ్ మేము కార్ తొయ్యం" పిల్లలు గట్టిగా అరిచారు. ఓసారి ఇలాగే సుధీర్ పాత కార్ లో పిక్నిక్ కు వెళితే, కార్ స్టార్ట్ చేయాల్సిన ప్రతిసారీ కొద్ది దూరం తోస్తే కాని ముందుకు పోనని మారాము చేసేది. పాపం పిల్లలు పిక్నిక్ సరదాలో కార్ వెనుక చేరి వాళ్ళ డాడీ చెపుతుంటే "హైలెస్సో హైలెస్సా" అని నెట్టారు. పైగా అప్పుడు వాళ్ళ

పిల్లలిద్దరు, మా పిల్లలిద్దరు, సుధీర్ ఉన్నారు కాబట్టి సరిపోయింది. ఆ తరువాత ఆ కార్ మళ్ళీ ఎక్కమని ప్రతిజ్ఞ చేసారు. అది గుర్తొచ్చి, "మేము తొయ్యమంటే తొయ్యం" అని గొడవ మొదలుపెట్టారు.

"అబ్బ ఆగండి, డాడీ చూస్తున్నారుగా... ఏమైందో!" అన్నాను.

ఏమండి లోపలికి వచ్చి, "అంతా బాగానే ఉంది, పెట్రోల్ చెక్ చేస్తాను" అని చెక్ చేసి, "అరే పెట్రోల్ తక్కువగా ఉందే. ముందు చూసుకోలేదే..." అన్నారు.

"అమ్మో మరి ఎట్లా? బరోడా ఇంకెంత దూరం ఉంది? ఎట్లా వెళుతాము?" అన్నాను గాభరాగా.

"ఇంకో గంటా, రెండు గంటలు పట్టవచ్చు. చూద్దాం అక్కడి దాకా వస్తుందిలే" అన్నారు కాస్త నీరసంగా.

"కొంచెం ఉంది కదా. దారిలో ఎక్కడైనా పెట్రోల్ బంక్ కనిపిస్తే పోయించుకుందాం లెండి" అన్నాను.

కార్ స్టార్ట్ చేసి "డబ్బులులేవు, ఐపోయాయి" అన్నారు.

"ఆ" అన్నాము ముగ్గురమూ ఒక్కసారే పెద్దగా. “చూద్దాం” అన్నారు. అప్పటి దాకా అందంగా కనిపించి, ఊహల్లో విహరింపచేసిన ఆ ప్రదేశం ఇప్పుడు భయం కలిగిస్తోంది.

"పోనీలెండి. నా చెవికి రింగులున్నాయి. చేతికి గాజులున్నాయి. అవెక్కడన్నా అమ్మవచ్చు." అన్నాను కాస్త తేరుకొని.

"ఎక్కడ అమ్ముతావు?" అన్నారు.

నిజమే ఎక్కడ అమ్ముతాము? అంతా అడవి లాగా ఉంది. రోడ్ కు రెండు వైపులా దయ్యాల్లా పెద్ద పెద్ద చెట్లు తప్ప ఎక్కడా ఊరు కనిపించటం లేదు. పిల్లలు "డాడ్ ఇప్పుడేం చేద్దాం?" అన్నారు ఏడుపు గొంతుతో.

"ఓ పని చేద్దాం.  మనం జలారాంను దర్శించుకొని వచ్చాము కదా ఆయననే ప్రార్థిద్దాం క్షేమంగా బరోడా చేర్చమని. సరేనా అనండి, “శ్రీరాం,  జై రాం, జై జలారాం.” అని మనం ఇంటికెళ్ళేదాకా భజన చేయండి ఒకేనా? స్టార్ట్!" అన్నారు.

పిల్లలిద్దరూ శ్రీరాం,  జై రాం, జై జలారాం అని భజన మొదలు పెట్టారు.

"అహ్మదాబాద్ లోనే అన్నాను మొదట్లోనే షాపింగ్ ఎందుకు అని. అన్ని బట్టలు కొన్నారు. అవి కొనకుండా ఉంటే డబ్బులైపోయేవి కాదు కదా" చిన్నగా గొణిగాను.

"ఏదో నువ్వు సంతోషిస్తావని కొన్నాను కాని ఇట్లా అవుతుందనుకున్నానా?" విసుక్కున్నారు.

ఇంకా ఏమీ మాట్లాడే ధైర్యం లేక "నాకోసం కొన్నారట" అని గొణుక్కుంటూ పిల్లలతో నేనూ గొంతుకలిపాను శ్రీరాం,  జై రాం, జై జలారాం అంటూ. పాపం అనీ అనీ నీరసిస్తున్నారు పిల్లలు అనుకున్నట్లున్నారు. "ముగ్గురూ ఒకేసారి కాకుండా ఒకళ్ళ తరువాత ఒకరు  బారీ బారీ అనండి" అన్నారు ఏమండీగారు.

ఏమి చేస్తాం హై కమాండ్ ఆర్డర్. మధ్య మధ్య "డాడ్ ఇంకెంత దూరం ఉంది?"అని అడుగుతున్నారు. ఎంతెంత దూరం అనుకుంటూ అమ్మయ్య మొత్తానికి చీకటి పడక ముందే ఇంటికి చేరాము. ఇంటి ముందు కార్ ఆగగానే ఊఫ్ అమ్మయ్య జలారాముడు క్షేమంగా చేర్చాడు అనుకున్నాను. పిల్లలిద్దరూ "హే హే హే"అని సంతోషంగా అరుచుకుంటూ కార్ లో నుంచి దూకినట్లుగా దిగారు. ఏమండీ డిక్కీ తీస్తుంటే,  "ఇంటి కీ ఇవ్వండి"అని అడిగాను.

జేబులో నుంచి కీ తో పాటు పర్స్ కూడా వచ్చింది. అదీ అందుకున్నాను. అప్రయత్నంగా పర్స్ లో చూస్తే వంద రూపాయల నోటు,  ఇంకా చిల్లర నోట్లూ కనిపించాయి. "డబ్బులున్నాయిగా? లేవన్నారేమిటి?"అడిగాను ఆశ్చర్యంగా.

"కార్ లో పెట్రోల్ కూడా ఉంది"అన్నారు నవ్వుతూ.

"ఐతే" ఆ తరువాత ఏమనాలో తెలీక ఏమండీ వైపు చూసాను. పిల్లలు కూడా గంతులాపి మావైపు చూసారు.

"మీకందరికీ బోర్ కొడుతోందని, కాస్త ఉషార్ చేద్దామని అట్లా చెప్పాను" అన్నారు నవ్వుతూ.  పిల్లలిద్దరూ "డాడీ" అంటూ ఏమండీని కొట్టసాగారు. ఏమండీ వాళ్ళ నుంచి తప్పించుకుంటూ, "నేనట్లా మిమ్మల్ని భజన చేయించకపోతే డాడీ ఎంతెంత దూరం అంటూ ఎంత గోల చేసేవారుగా!" అని తల పైకెత్తి ఓ అంటూ బిగ్గరగా నవ్వారు.

- (ప్రభాతకమలం ఛానల్ కోసం - 29/4/2020)

## 11. వీడు పెరుపెరగడు సూడవే !!1

సీట్ బెల్ట్ తీసి, నిలబడి "ఇంకా కూర్చున్నావేం? లే. అందరూ దిగారు." అన్నారు ఏమండీ గారు.

"ఇదేమి ఊరండి? నేను సరిగ్గా వినలేదు." అని అడిగాను.

"ఛాఫే" బదులిచ్చారు ఏమండీగారు.

"ఏ దేశం?"

"చైనా, ఇహ ప్రశ్నలాపి లేస్తావా?" అన్నారు ఏమండి.

"అమ్మో చైనానే! ఇదేమిటి ఇంకే దేశమూ లేనట్లు తెచ్చి తెచ్చి ఇక్కడ ఆపాడు?" భయం భయం గా అడిగాను.

"చైనా ఐతే ఏమైందిట? ఇక్కడ నిన్నెవరైనా జైల్ లో వేస్తున్నారా? నువ్వలాగే కూర్చో నేను దిగుతున్నాను." అన్నారు.

అమ్మో నేనొక్కదాన్ని ఇక్కడ ఉండటమే అనుకుంటూ ఏమండీగారి వెనకాల నడుస్తూ, "ఏమండీ" అని పిలిచాను.

"మళ్ళీ ఏమిటి?"

"ఏమీలేదు, మీరు కాస్త జాగ్రత్తగా ఉండండి."

వెనకకు తిరిగి కొంచెం సీరియస్ గా చూసారు నా వైపు.

నేను తడబడిపోతూ, "అహ్ ఏమీ లేదు, పోయినసారి మీరు రెస్ట్ రూం లోకి వెళ్ళినప్పుడు, బయట ఏదో గొడవలౌతున్నాయని, పాస్పోర్ట్ లు వున్న బాగ్ లోపలే మర్చిపోయి హడావుడిగా బయటకు వచ్చారు. మీ వెనకాలే వెళ్ళిన స్వీపర్ చూసి, మంచి ఆవిడ కాబట్టి, మిమ్మలిని పిలిచి ఆ బాగ్ ఇచ్చింది. ఆవిడ ఇచ్చేదాకా మీకు ఆ బాగ్ లోపల మర్చిపోయానని గుర్తు కూడా లేదు. లేకపోతే మనం ఎంత ఇబ్బంది పడేవాళ్ళము. అందుకే ఈసారి బయిలుదేరే ముందు పిల్లలు, ఎవరితో ఎక్కువ తక్కువ మాట్లాడవద్దు, ఏ గొడవలైతున్నా తలదూర్చవద్దు. ఎవరినీ పట్టించుకోవద్దు ఇలా ఎన్ని జాగ్రత్తలు చెప్పారు. ప్లీజ్ ఎందులోనూ..." కోపం గా చూస్తున్న ఏమండీని చూసి ఆపేసాను.

"చూడూ ఏదీ పట్టనట్లు, నన్నంటుకోకు నామాలకాకి అన్నట్లు వుండటం నావలన కాదు. కావాలంటే ఇదిగో ఈ బాగ్ నీ దగ్గరవుంచుకో" అంటూ నడుముకు వున్న చిన్న బాగ్ తీయబోయారు.

"అహ్ వద్దు వద్దు మీదగ్గరే ఉండనీయండి" అనేసాను. మనసులో, "స్వామీ వెంకటేశ్వరుడా మమ్మల్ని ఈ చైనా నుంచి క్షేమంగా బయటపడేయి తండ్రీ" అని వెంకటేశ్వరుని వేడుకుంటూ ఏమండీ వెంట లాంజ్ లోకి నడిచాను.

విమానం తలుపు దగ్గర, ఆరెంజ్ రంగులో ఏదో బుక్ మార్క్ లాంటి అట్టముక్క ఇచ్చారు. ఇదెందుకిచ్చారా అనుకుంటూ, వాళ్ళను ఏమడుగుతే ఏమి తంటానో అనుకొని, తీసుకొని పర్స్ లో వేసుకున్నాను. కొద్దిసేపు లాంజ్ లో వేసి వున్న కుర్చీలలో కూర్చున్నాము.

"విమానం ఓ గంట ఆగుతుందిట, అలా ఏర్పోర్ట్ లోకి వెళ్ళి చూసొద్దామా?" అడిగారు ఏమండి. “సరే పదండి” అని లేచాను.

లాంజ్ లో నుంచి ఏర్పోర్ట్ లోకి వెళ్ళటానికి మెట్లు ఎక్కి పక్కన వున్న చిన్న గట్టును పట్టుకొని ఓ నిమిషం నిలబడ్డాను. ఆ గట్టు మీద ఆరెంజ్ రంగులోని అట్ట ముక్క కనిపించింది కాని అప్పుడు దాన్ని అంతగా పట్టించుకోలేదు. ఎక్కడి నుంచో కమ్మని కాఫీ సువాసనలు తేలి వస్తున్నాయి. విమానంలో వాళ్ళిచ్చిన కాఫీ కాని కాఫీ లాంటి ద్రవ పదార్థం గుర్తొచ్చి "ఏమండీ, ఇక్కడెక్కడో కాపీ షాప్ ఉన్నట్లుంది కాఫీ తాగుదామా?" అని అడుగుతుండగానే, "కాఫీ తాగుదాము పదా" అని ముందుకు నడిచారు ఏమండి.

ఓ పెద్ద కాగితం గ్లాస్ లో నురగలు తేలుతూ, సువాసనలు వెదజల్లుతున్న కాఫీని ఇద్దరూ చెరిసగం చేసుకొని, దాని రుచిని ఆస్వాదిస్తూ తాగాము.

విమానం కదలటానికి ఇంకా చాలా సమయం వుంది.

అద్దాల తలుపులలో నుంచి, దీపాల వెలుతురులో తళతళ లాడుతున్న షాపులోకి వెళ్ళాము.

"ఏమండీ చైనా గుర్తుగా ఏమైనా కొనుక్కుందామా?" అంటూ షాప్ అంతా తిరుగుతూ, అక్కడ పెట్టివున్న బొమ్మలను చూసాను. అమ్మోఎంత చిన్నది చూసినా 100 డాలర్ల పైనే వుంది. ఏముంది బాబూ ఇందులో అని ఆశ్చర్యపోతూ సమయం గడిపేసాను.

"ఏమిటీ ఏవీ నచ్చలేదా? ఐతే ఈ షాప్ లో చూద్దాం రా" అంటూ పక్కన ఉన్న బట్టల దుకాణం లోకి దారి తీసారు ఏమండి.

అటు చూసీ, ఇటు చూసీ ఓ తెల్ల కోటు తీసి బేరమాడసాగారు.

హుం బేరాలు మొదలెట్టారూ? ఏమిటో ఏ షాప్ లోనైనా బేరం ఆడకుండా ఏదీ కొనరుకదా! ఇహ ఐనట్టే, ఆ విమానం ఉంటుందో పోతుందో!

కాస్త తొందర పెట్టాల్సిందే లేకపోతే ఇంతే సంగతులు అనుకుంటూ, "ఏమండీ చాలా సేపైంది, విమానం వెళ్ళిపోతుందేమో! మనమీ చైనాలో చిక్కుబడిపోతాం" అని హడావుడి పెట్టేసాను.

"అబ్బ నీకంతా భయమే" అని విసుక్కుంటూ బేరం పూర్తి చేసి 120 డాలర్ ది 60 డాలర్స్ కు ఆ కోట్ కొన్నారు. అబ్బో అనుకుంటూ ఏమండి వైపు మెచ్చుకోలుగా చూసాను! ఇద్దరంలాంజ్ లోకి వెళ్ళాము. అప్పుడే విమానం బయిలుదేరుతుందని ప్రకటన వస్తోంది. అందరూ హడావుడిగా లేచారు. నేను కూడా లేచాను.

"ఇక్కడే వున్నాము కదా అంత హడావుడి దేనికి అందరినీ ఎక్కనీ" అన్నారు ఏమండి.

కూర్చున్న ఏమండీ వైపు, విమానంలో ఎక్కుతున్నవారి వైపు చూస్తూ టెన్షన్ గా నిలబడ్డాను.

అంతా ఎక్కేసారు. ఓ అమ్మాయి మటుకు తలుపు దగ్గర నిలబడి, సెక్యూరిటీ వాళ్ళతో ఏదో మాట్లాడుతోంది. ఆ అమ్మాయికి దాదాపు 25-26 ఏళ్ళు వుండవచ్చు. జీన్స్ పాంట్, నల్లరంగు టీషర్ట్ వేసుకొని, భుజాల వరకు కత్తిరించిన జుట్టుతో వుంది. చేతిలోని కాగితాలుఏవో ఆ సెక్యూరిటీ అతనికి చూపిస్తూ ఏదో చెపుతోంది. ఇంత దూరానికి కూడా ఆ అమ్మాయి మొహంలో గాభరా కనిపిస్తోంది.

"ఇహ లేవండి బాబూ అందరూ ఎక్కేసారు. ఈ కూర్చునేదేదో విమానంలోనే కూర్చోవచ్చుకదా!"అని గాభరా పడుతున్ననన్ను పట్టించుకోకుండా, గబగబా వెళ్ళి, సెక్యూరిటీ వాళ్ళ తో మాట్లాడుతున్న అమ్మాయిని "ఏమ్మా ఎనీ ప్రాబ్లం?" అని అడిగారు.

బాబోయ్ ఆపద్బాంధవా ఏమి కనిపించింది? ఇహ మన పనైపోయింది! నేనూ వెనుకనే పరుగెట్టాను.

"అవునంకుల్, వీళ్ళు ఇచ్చిన ఎంట్రీ పాస్ కార్డ్ ఎక్కడో పడిపోయింది. అది ఇవ్వకపోతే విమానం ఎక్కనివ్వమంటున్నారు. నా పాస్పోర్ట్, టికెట్ చూపించినా వదలటం లేదు" ఏడుపు గొంతుతో చెప్పింది.

ఓహో ఐతే ఈ అట్టముక్క గేట్ పాస్ అన్నమాట! ఇంకా నయం పర్స్ లో వేసుకున్నాను, ఇంకెక్కడో వేసాను కాదు అనుకొంటూ, “అరె, దాన్ని ఇందాక ఎక్కడో చూసాను” అనుకొని, మెట్ల దగ్గర చూసింది గుర్తొచ్చి అదే ఆ అమ్మాయికి చెప్పాను.

ఆ అమ్మాయి అటువైపు పరిగెత్తింది. సెక్యూరిటీ ఆఫీసర్ మమ్మల్ని లోపలికి వెళ్ళమన్నాడు. చిన్నగా తలపంకించి అక్కడే నిలబడ్డారు ఏమండి. ఆ అమ్మాయి బిక్క మొహంతో అక్కడ ఆ అట్టముక్క లేదంటూ వచ్చింది!

"నీతోపాటు ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు వుండాలి. ఓ పెద్దావిడని వీల్ చేర్ లో తీసుకొచ్చావు, వాళ్ళంతా లోపలికివెళ్ళిపోయారా?" ఆ అమ్మాయిని అడిగాను.

"వాళ్ళు కో పాసెంజర్స్ ఆంటీ. మొదటిసారిగా వస్తున్నారని, అంతా కొత్త అంటే నేను చూపిస్తున్నాను. ఆ పెద్దావిడ మాకు తెలిసినావిడ. ఆవిడకు సాయం చేయమంటే చేస్తున్నాను" అంది.

ఇదంతా మాకు పట్టదనట్లు ఆ అమ్మాయిని ఆగిపొమ్మని, వీళ్ళిద్దరినీ లోపలికి వెళ్ళమనీ తొందరచేస్తున్నాడు సెక్యూరిటీ ఆఫీసర్.

"ఈ అమ్మాయి కోలాలంపూర్ లో, ఈ ఫ్లైట్ లో ఎక్కింది. ఈ ఫ్లైట్ లో నుంచే దిగింది. నేను చూసాను. ఐనా పాస్ పోర్ట్, టికెట్ ఉన్నాయి కదా?" అన్నారు ఏమండి.

"పాస్ పోర్ట్, టికెట్ వున్నా ఈ విమానంలో నుంచే దిగింది అన్న నమ్మకం మాకేమిటి? మేమిచ్చిన పాస్ చూపిస్తేనే లోపలికి పంపుతాము. సారీ సర్, మా రూల్స్ ఒప్పుకోవు. మేము లోపలికి వెళ్ళనీయము. మీరు వెళ్ళండి" అని ఖరాఖండిగా చెప్పేసాడు అతను.

"నువ్వెళ్ళు లోపలికి. నేను ఈ అమ్మాయి సంగతి చూసి వస్తాను" అని నాతో అన్నారు ఏమండి.

"అమ్మో నేనసలు మీరు లేకుండా లోపలికి వెళ్ళను" అని గట్టిగా ఆయన చేయి పట్టుకొని నిలుచుండిపోయాను. బిక్కమొహంతో నిలుచున్న ఆ అమ్మాయిని చూస్తుంటే జాలివేస్తోంది కాని దేశం కాని దేశంలో ఏమండి అనవసరమైన వివాదం లోకివెళుతున్నారేమోనని ఓ పక్క భయం వేస్తోంది! చిన్నవాళ్ళు కూడా మాకెందుకని వెళ్ళిపోతుంటే ఈ పెద్దమనిషి కెందుకో ఈ అఖ్ఖర్లేని జంజాటం... అని ఇంకో పక్క గాభరా!

సెక్యూరిటీ ఆఫీసర్ కూ ఏమండికి వాదోపవాదాలు నడుస్తున్నాయి. ఆ అమ్మాయి, పాస్ పోర్ట్, టికెట్ చూపిస్తూ, వెళ్ళనీయమని భయం భయంగా, కంగారుగా అడుగుతోంది. సెక్యూరిటీ ఆఫీసర్ ససేమిరా ఆ అమ్మాయిని మాత్రం వదలనంటున్నాడు. మధ్య మధ్య మమ్మల్ని లోపలకు వెళ్ళమని హెచ్చరిస్తున్నాడు. నన్ను లోపలికి వెళ్ళమని అంటున్నారు ఏమండి. ఊహూ అంటూ ఏమండి చేయి గట్టిగా పట్టుకొని, భయం భయంగా అందరినీ చూస్తూ నిలుచున్నాను. దేవుడా దేవుడా రక్షించు. నీకు రెండుకొబ్బరికాయలు కొడతాను అర్జెంట్ గా వెంకటేశ్వరస్వామికి మొక్కేసుకున్నాను.

హుం... ఆ కొబ్బరికాయలకు వెంకటేశ్వరస్వామి పడిపోలేదు! ఆ సెక్యూరిటీ ఆఫీసర్ ఏర్పోర్ట్ పోలీసులను పిలిచాడు. వాళ్ళను చూసి, ఆఅమ్మాయి ఏడుపు లంకించుకుంది. నేను వణికిపోతూ ఏమండి చేయి ఇంకా గట్టిగా పట్టుకొని, ఆయనకు అతుక్కొని నిలబడ్డాను.

"సారీ సర్, మీరు మా మాట పట్టించుకోవటంలేదు, మిమ్మల్ని కూడా అరెస్ట్ చేయక తప్పదు"అన్నాడు.

పోలీసులు ఆ అమ్మాయిని, ఏమండిని అరెస్ట్ చేస్తూ నన్ను విమానం లోపలికి వెళ్ళిపొమన్నారు.

"నో... నో... నేను వెళ్ళను. నన్ను కూడా ఆయనతోపాటు తీసుకెళ్ళండి" అంటూ పరిగెడుతూ ముందుకు తూలాను. కిందపడబోతూ ఏమండిని గట్టిగా పట్టుకున్నాను. ఏమైంది అట్లా అరుస్తున్నావు అంటూ ఏమండి అనగానే గబుక్కున స్పృహలోకి వచ్చి చుట్టూ చూసాను. ఇంకా ఏమండీకి, ఆ సెక్యూరిటీ ఆఫీసర్ కి వాదోపవాదాలు నడుస్తున్నాయి. ఆ అమ్మాయేమో టెన్షన్ గా ఇద్దరినీచూస్తోంది. "ఓ పోలీసులు ఏమండీ ని పట్టుకుపోవటం నిజం కాదన్నమాట. నా ఊహ" అనుకుంటూ ఇంక ఆపమనట్లు ఏమండి చేయి చిన్నగా గుంజాను. కాని ఏమండి పట్టించుకోలేదు. ఇంకా ఆ ఊహలో నుంచి బయటకు రాలేకపోయాను. కాళ్ళు గజ గజ వణుకుతున్నాయి. అలాగే ఏమండి చేతిని ఆసరాగా చేసుకొని నిస్త్రాణగా నిలుచుండిపోయాను!

కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళతో వణికి పోతూ ఉన్న ఆ అమ్మాయి వైపు ఏమీ ఫరవాలేదు అని ధైర్యం చెపుతునట్లుగా చూసి, అప్పుడే గుర్తొచ్చినట్లు నడుముకు వున్న

సంచీని తీసి, అందులో నుంచి ఐడెంటిటీ కార్డ్ తీసి, "నేను ఆర్మీ ఆఫీసర్ ను" అని ఆ కార్డ్ ఆ సెక్యూరిటీ ఆఫీసర్ కు చూపించారు. ఆ గార్డ్ ఆ కార్డ్ ను, ఏమండీని కొన్ని క్షణాలు మార్చి మార్చి చూసి, ఏమనుకున్నాడో ఏమో కానీ ఏమండికి సెల్యూట్ చేసి లోపలికి వెళ్ళమన్నట్లు చేయి చూపించాడు.

ఇంకోసారి ఇలాంటి పొరపాటు చేయవద్దని ఆ అమ్మాయిని హెచ్చరించి లోపలకు వదిలాడు. అంతే ఆ అమ్మాయి వింటిని వదిలిన బాణంలా రయ్ న లోపలకు పరిగెత్తింది! ఆ సెక్యూరిటీ ఆఫీసర్ కు థాంక్స్ చెప్పి లోపలి కి నడిచిన ఏమండిని బ్రతుకు జీవుడా అనుకుంటూ అనుసరిస్తూ, "ఇంత సాయం చేస్తే ఆ అమ్మాయి కనీసం థాంక్స్ ఐనా చెప్పకుండా వెళ్ళింది" అని గొణిగాను.

"ఆ అమ్మాయి థాంక్స్ చెప్పాలని సాయం చేసామా? ఐనా పాపం ఆ అమ్మాయి ఎంత టెన్షన్ పడిందో" అన్నారు.

"అది కాదండి, ఆ అమ్మాయి థాంక్స్ ఎవరికి కావాలి కాని, మీరు గబుక్కున ఇలా దూరిపోయారు, దేశం కాని దేశం లో అందునా చైనాలో. ఏమైనా అయితే?"

అంటున్న నా మాట పూర్తి కాకుండానే "మాటిమాటికి చైనా అని భయపడతావు, వాడేమైనా మన తల నరుకుతాడా? ఆ అమ్మాయి స్థానంలో మన అమ్మాయి ఉంటే కూడా ఇలాగే ఆలోచిస్తావా?" సీరియస్ గా అన్నారు.

"అది కాదండీ, మనం బయలుదేరేటప్పుడు పిల్లలు ఎన్ని జాగ్రత్తలు చెప్పారు. ఆ అమ్మాయిని మనం కోలాలంపూర్ లో కూడా చూసామనుకోండి. అంత మాత్రాన ఆ పిల్ల ఎలాంటిదో మనకు తెలుసా? ఒకవేళ ఏదైనా ముఠాకు చెందిన పిల్లై ఉంటే? ఇవాళ రేపు ఎవరినీ నమ్మలేము. మనమొక్కళ్ళమే కాదు కదా ఇంకా విమానంలో ఉన్నవాళ్ళు చాలా మంది ఆ అమ్మాయిని చూసే ఉంటారు. ఒక్కళ్ళూ పట్టించుకోలేదు. అంతెందుకు, ఆ అమ్మాయితో ఉన్నవాళ్ళే లోపలకు వెళ్ళిపోయారు. వాళ్ళంతా కలిసి ఈ అమ్మాయి మా అమ్మాయే అని గట్టిగా చెపితే వినకపోయేవాడా? ఏదో అతను పట్టించుకున్నాడు కాబట్టి సరిపోయింది. అంతేకాని అన్ని చోట్లా మీ ఆర్మీ ఐడెంటిటీ కార్డ్ పని చేస్తుందా? పైగా రిటైర్ అయ్యి కూడా పదేళ్ళవుతోంది. అతనికేదో డిఫెన్స్ వాళ్ళంటే గౌరవమున్నట్లుంది. వదిలేసాడు. కొద్దిలో జైల్ నుంచి తప్పించుకున్నాము." బాధగా, ఉక్రోషంగా మాట్లాడుతూ

నా  సీట్ వైపు వెడుతూ ఓరగా ఆ అమ్మాయిని చూసాను.  ఆ అమ్మాయి తను ముందుగా కలిసి దిగినవారితో అభిమన్యుడు ఛేదించలేని పద్మవ్యూహం తను ఛేదించుకు వచ్చినట్టు గొప్పగా పోజులిచ్చేస్తూ వర్ణించేస్తోంది.  కనీసం తిరిగి కూడా చూడలేదు! ఇంకా ఒళ్ళు మండిపోయింది.

"చూసేరా... చూసేరా...  కనీసం థాంక్స్ అయినా చెప్పలేదు సరికదా అసలు మనవైపే చూడకుండా మొహం ఎలా తిప్పేసుకుంటోందో..."

"ఆ అమ్మాయి థాంక్స్ చెప్పలేదని అంతగా గింజుకోకు.  బహుశా వాళ్ళందరి దగ్గరా ఇప్పటి వరకు తన గురించి గొప్పలు చెప్పుకొని ఉంటుంది.  ఇప్పుడు ఇలా కాగానే అవమానంగా భావిస్తోందేమో! ఇప్పుడు కూడా తనే ఏదో మానేజ్ చేసుకొని వచ్చేసానని చెపుతూ ఉండవచ్చు.  ఇంక మన దగ్గరకు వచ్చి థాంక్స్ ఏమి చెపుతుంది? లేదా ఆ కంగారులో తోచకపోయి ఉండవచ్చు.  ఏదైనా కారణం కావచ్చు.  మనకు మంచి అనుకున్నది మనం చేసాము.  ఇంకా విషయం మర్చిపో.  చిన్నపిల్ల అని నవ్వుకో" అని చెప్పి హాయిగా సీట్ వెనకకి తల ఆనించి కళ్ళు మూసుకున్నారు ఏమండి!

ఏ దేశమైనా కాని,  ఏ వూరైనా కాని,  జాతీయ విమానాశ్రయం కాని,  అంతర్ జాతీయ విమానాశ్రయం కాని,  నాకు మంచిది అనుకున్నది నేను చేస్తాను.  నాకే భయమూ లేదు, ఎవరి మెప్పూ అక్కరలేదు అన్నట్లు నిశ్చింతగా కూర్చున్న ఏమండీగారిని  చూడగానే

"సిరుత నవ్వుల వాడు సిన్నెక్కా వీడు వెరుపెరగడు సూడవే సిన్నెక్కా. "

అన్నమాచార్య కీర్తన గుర్తొచ్చి నిట్టూర్చాను  * * * * *

- (20-3-2014 ఆంధ్రభూమి వారపత్రిక)

## 12. వెంటాడే దొంగ గారు

“నిన్ను భందించగలను. వొళేయ్ నా నుంచి తప్పించుకు పోలేవు, నిన్ను వళ్ళేయను” తెలుగు కార్టూన్ నెట్ వర్క్ భాషలో అరుపులు ఆ పై పక్కకి తిరిగి పడుకున్న నా వీపు మీద కాళ్ళతో తన్నులు, పిడికిళ్ళతో గుద్దులు. ఇది నా మనవడి విన్యాసము. వాడు నాదగ్గరే పడుకుంటాడు. “నాన్నా గౌరవ్, లే ఎందుకు కొడుతున్నావు?” అని లేపాను.

“నేను నిన్ను కొట్టటము లేదు బామ్మా." జవాబిచ్చాడు నిద్రలోనే.

“లేదురా నన్నే కొడుతున్నావు” అన్నాను.

“నన్ను క్షమించు బామ్మా నేను నిన్ను కొట్టటము లేదు.”

“మరి ఎవరినిరా?” అడిగాను.

“బాడ్ గైని” అని అటుతిరిగి పడుకున్నాడు.

హూం తరతరాలుగా మా ఇంట్లో ఉన్న ముల్లె ఏమిటో అది దోచుకుపోయే దొంగ ఎవరో! ఈ తాతామనవళ్ళ దొంగలగోలతో చచ్చిపోతున్నాను బాబూ! ‘ఐనా రోజూ దొంగా దొంగా అని మేజర్ గారు, ఆయన పక్కవాద్యగాడు, అరుస్తుంటే కాలనీలోకి ఏ దొంగోడొస్తాడు? ఇంక ఏమండీగారి దొంగగారు కూడా వచ్చేస్తే ఓ పనైపోతుంది బాబూ!’ అనుకున్నాను విసుగ్గా. తలచుకుంటే తల కింద ప్రత్యక్షమైనట్లు రానే వచ్చాడు "దొంగ... దొంగా" అన్న అరుపులతో పక్కకు చూసాను. ఏమండీగారూ కలలోని దొంగను పట్టుకోవటానికి చేతులు గాల్లో ఆడిస్తున్నారు. "ఇంకెక్కడి దొంగ? మీ అరుపులకు ఎప్పుడో తారుకొని పారిపోయాడు. వాడిని పిలిచీ పిలిచీ అలిసిపోయారు కాని, లేచి కాసిని మంచినీళ్ళు తాగండి" అని ఏమండీని లేపాను.

"అబ్బా అర్ధరాత్రి అంకమ్మ శివాలన్నట్లు ఏమిటీ నీ గోల. అరవకుండా పడుకో" అని విసుక్కొని అటుతిరిగి పడుకున్నారు.

"నావా అంకమ్మ శివాలూ, నేనరుస్తున్నానా? బాగుంది సంబడం. మంచి నిద్రలో మీ దొంగోడి దెబ్బకు మెలుకువచ్చేసింది. ఇంకేం నిద్ర పడుతుంది?" స్వగతఘోష పడ్డాను. ఐనా ఈ స్వగత ఘోష ఇప్పటిదా? ఎప్పటిదో...

మా పెళ్ళైన పదిరోజులకు ఏమండీగారి లీవ్ అయిపోయింది. రెండు నెలల తరువాత వచ్చి తీసుకెళుతానని, అప్పటి వరకు అత్తయ్యగారి దగ్గర వంట నేర్చుకోమని చెప్పి ఏమండీ డ్యూటీలో జాయిన్ అయ్యేందుకు పటియాలా వెళ్ళారు. కొత్త చోటు... కొద్దిగా అలవాటైన ఏమండి లేరు, అమ్మ, నాన్నగారు, చెల్లెళ్ళు గుర్తొస్తున్నారు. దిగులు దిగులుగా, భయం భయంగా నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతున్నాను. ఇంతలో "దొంగ దొంగా" అని అరుపులు వినిపించాయి. ఉలిక్కిపడి లేచాను. చిన్నగా తిరిగి పక్కకి చూసాను. ఆడపడుచులు నిశ్చింతగా నిద్ర పోతున్నారు. ఒకపక్క భయం, ఇంకో పక్క ఏం చేయాలో తెలీటములేదు. మళ్ళీ 'దొంగ... దొంగా' అరుపులు. హాల్లో లైట్ వెలిగింది. "ఏమయ్యా లే" అత్తయ్యగారి మాట వినిపించింది. అమ్మయ్య అనుకుంటూ చిన్నగా హాల్ లోకి వెళ్ళాను. అప్పటికే అత్తయ్యగారు "దొంగ లేడు, ఎవ్వరూ లేరు... పడుకో" అంటున్నారు. నన్ను చూసి, "ఏంలేదులే... మీ మామగారు కలవరిస్తున్నారు, పడుకో పో" అన్నారు. అత్తయ్యగారి మాటలకు 'మామయ్యగారి కలవరింతలా?' అనుకొని, ఐనా భయం భయంగా చూస్తూ వెళ్ళి పడుకున్నాను.

కాలం కొంచెం ముందుకు జరిగింది.

"చోర్ చోర్... పకడో పకడో" అనే అరుపులు వెంటనే నా వీపు మీద పెద్ద దెబ్బ పడ్డాయి. ఏమి జరిగిందో అర్థం కాలేదు. పక్కకి తిరిగి చూసే సరికి మా ఏమండీ గారు ఇంకా గట్టి గట్టిగా 'చోర్ చోర్' అని అరుస్తూ గాల్లో చేతులు ఆడిస్తున్నారు. నేను వణికి పోతూ ఓ పక్కన ముడుచుకొని కూర్చున్నాను. ఇంతలో మామయ్యగారు, అత్తయ్యగారు, మరిదిగారు అంతా వచ్చారు. మరిదిగారు ఆయన నుంచి దెబ్బలు తగలకుండా తప్పించుకుంటూ ఆయనని లేపారు. అత్తయ్యగారు నా పక్కన కూర్చొని వీపు మీద రాస్తూ, "భయపడ్డావా ఈ అయ్యా కొడుకులు ఏదో ముల్లె దాచినట్టు 'దొంగ దొంగా' అని అరుస్తుంటారు భయపడకు, ఆదమరచి నిద్ర పోకు!" అని చెప్పారు.

చిన్నగా ఆ అరుపులకు అలవాటు పడ్డాను.

కల్నల్. దత్తా కొత్తగా వచ్చారు అని పార్టీ ఇస్తున్నారు. ఆయనకు మా ఏమండీగారు నన్ను పరిచయం చేయగానే, "ప్రభాత్ ఇంకా కలవరిస్తున్నాడా?" అని అడిగారు. 'ఓహో ఈయనకూ ఏమండీగారి కలవరింతల సంగతి తెలుసా?' అనుకొని మొహమాటముగా నవ్వి ఊరుకున్నాను. ఏమిటని పక్క వాళ్ళు అడిగితే ఇలా చెప్పారు, "అప్పుడే చైనా యుద్ధము అయిపోయి, శాంతి నెలకొన్న రోజులు. సరిహద్దుల్లో టెంట్స్ వేసుకొని వున్నాము. ఒక్కొక్క బెటాలియన్ తిరిగి వెళుతున్నాయి. ఇంకా మా టర్న్ రాలేదు. అంతా ప్రశాంతముగా వుంది కాబట్టి మేము కూడా విశ్రాంతిగా వున్నాము. ఒకరాత్రి ఆ నిశబ్దంలో 'చోర్ చోర్ షూట్ హిమ్' అని అరుపులు వినిపించగానే, అంతా హడావుడిగా గన్స్ తీసుకొని బయటకి పరిగెత్తుకుంటూ వచ్చాము. కాని ప్రభాత్ టెంట్ లో నుంచి ప్రభాత్ బయటకి రాలేదు. మా హడావుడి చూసి ప్రభాత్ ఆర్డర్లీ చెప్పాడు, 'సాబ్ కి ఇలా కలవరించటము అలవాటు' అని." అంటూ ఇంకా ఆ రోజు వాళ్ళు ఎంత కంగారుపడ్డారో చెప్పి ఒకటే నవ్వు. ఐతే యుద్ధ రంగములో కూడా మావారి కలవరింతల బాధితులున్నారన్న మాట!

యుద్ధరంగము, ఇల్లు మాత్రమేనా? ఇందుకలడు అందులేడు అన్న సందేహం లేకుండా దొంగగారికి టైం ఉన్నప్పుడుల్లా మమ్మల్ని 'హలో, హాయ్' అని పలకరించి పోతూనే ఉంటారు. ఈ మధ్య ఇంటర్నేషనల్ ట్రావెల్స్ చేస్తుండటంతో ఇంటర్నేషనల్ స్మగ్లర్స్ కూడా వస్తున్నారు. వారి వెంట మేము విమానాశ్రయం అంతా పరుగులు పెడుతూ ఉంటాము. అదేలెండి నిద్రలో. ఈ అరుపులు మా చుట్టుపక్కల వాళ్ళకు కూడా అలవాటయి పోయి అసలు దొంగగారొస్తే ఎవరూ రారేమోనని నా డౌట్ అనుమానం! దానికి తగ్గట్టు, ప్రతి నెలా ఫస్ట్ పొద్దున్నే వచ్చి జీతం తీసుకెళ్ళే గూర్ఖా కూడా రెండు నెలల నుంచి రావటం లేదు. అతనిని. 'మేజర్ గారి అరుపులు చాలులే, ఇక నువ్వు రానక్కరలేదు' అని కాలనీ వాళ్ళే మానిపించి ఉండవచ్చు. నో డౌట్! ఈ విధముగా 'ఇందుకలడు అందు లేడు' అనుకోకుండా దొంగగారు మాకు 'హలో' చెప్పి పోతుంటారు.

ఇలా ఇలా కాలము గడిచిపోతూ వుంది. దొంగలకు, స్మగ్లర్స్ కు అలవాటు పడి, దెబ్బలనుంచి నన్ను కాపాడుకుంటూ ఎలాగో కాలం నెట్టుకొస్తున్నాను అని నిట్టూరుస్తూ స్వగత ఘోష నుంచి బయటకు వచ్చి, అరుపులైపోయాక నిద్రపోతున్న మనవడి దుప్పటి సరిచేసి, "అయ్యా మేజర్ గారూ! మీ అరుపులతో మా పిల్లలు హడలిచస్తున్నారు. మాకు రాత్రిళ్ళు నిద్ర ఉండటం లేదు. ఆఫీస్ లో పని చేసుకోలేక, నిద్రతో తూగుతూ బాస్

తో చివాట్లు తింటున్నాము. దయచేసి మీరు అరుపులాపండి." అని కాలనీ మీటింగ్ లో అందరూ దీనంగా వేడుకుంటున్నట్లు ఊహ వచ్చి నవ్వుకుంటూ, 'ఇంక నిద్రేమిపడుతుంది, కాసేపు లాప్ టాప్ చూసుకుందాం' అనుకుంటూ హాల్ లోకి వచ్చి లైట్ వేసాను.

హాల్ లో సెంటర్ టేబుల్ మీద ఏమండీగారి బ్రీఫ్ కేస్, దాని మీద ఆయన సెల్, పక్కన సోఫా మీద జర్కిన్ కనిపించాయి. రాత్రి లోపల పెట్టుకోవటం మర్చిపోయారేమో అనుకుంటూ సెల్ చేతిలోకి తీసుకున్నాను. నాలుగు రోజుల క్రితం నా సెల్ పాడవుతే రిపేర్ కని షాప్ లో ఇచ్చాను. తెచ్చుకోవటానికి ఓపిక లేక తెచ్చుకోక, ఏమండీ సెల్ తో నాలుగు రోజుల క్రితం మొగ్గేసిన తెల్ల గులాబీని రోజు ఎట్లా విచ్చుకుంటోందో దానిని రోజు ఫొటో తీసి, మంచి కాప్షన్ తో మాగజైన్ కు పంపుదామని అవీ, మొన్న క్లబ్ లో జరిగిన పార్టీవి ఫొటోలు తీసాను. ఏమండీ రేపో ఎల్లుండో కాంప్ కు వెళుతే నా ఫొటోలు అట్లాగే ఉండిపోతాయి, అప్ లోడ్ చేసుకుందామా అనుకొని, రేపొద్దున చేసుకోవచ్చులే అని బద్ధకించి, నా లాప్ టాప్ ఓపెన్ చేస్తూ, సోఫాలో కూర్చుంటూ తలెత్తి పైకి చూసాను. కోడలి గదిలో నుంచి కొద్దిగా తెరిచి ఉన్న తలుపు సందులో నుంచి, సన్నగా లైట్ కనిపిస్తోంది. 'ఏం సాఫ్ట్ వేర్ ఉద్యోగాలో ఏమో ఓ సమయం పాడూ ఉండదు ఇరవైనాలుగు గంటలూ మీటింగులే! ఎప్పుడూ ఉరుకులు పరుగులే' అనుకుంటూ లాప్ టాప్ తీసి కాసేపు సాలిటేర్ ఆడాను. ఇంక నిద్ర భారంతో తల నొప్పిగా ఉందని లైట్ ఆర్పేసి లోపలికి వెళ్ళి పడుకున్నాను.

మూగన్నుగా నిద్ర పడుతుండగా, "దొంగా... దొంగా..." అని అరుపులు వినిపించాయి. "దేవుడా... అప్పుడే ఏం తొందరొచ్చింది? ఇప్పుడేగా వచ్చి వెళ్ళాడు. మళ్ళీ అంతలోనే తగలడ్డాడు." విసుక్కుంటూ లేచి కూర్చున్నాను. అప్పటికే ఏమండీ లేచి కూర్చొని అటూ ఇటూ చూస్తున్నారు. అరుపులు మళ్ళీ వినిపించాయి. "అదేమిటీ?ఏమండీ కూర్చొనే ఉన్నారు. పెదాలు కూడా కదలటం లేదు. నోరు తెరవకుండా ఎట్లా అరుస్తున్నారు?" బిత్తరపోయి చూస్తూ ఉంటే, మా బెడ్ రూం కింద, పార్కింగ్ ఏరియాలో ఉన్న సర్వెంట్ రూం నుంచి "దొంగా... దొంగా..." అని మళ్ళీ అరుపులు వినిపించాయి. 'హుం దేవుడా ఈ దొంగ జాడ్యం కిందికి కూడా పాకిందా?' అని స్వగతఘోష పడుతుండగానే ఏమండీ లేచారు. పై నుంచి కోడలు కూడా గబగబా వచ్చింది. ముగ్గురం హడావుడిగా మెట్లు దిగాము. మా వంటావిడ సావిత్రమ్మ, ఆవిడ కొడుకు శంకర్

కింద రూంలో ఉంటారు.  వాళ్ళ రూంలో నుంచే అరుపులు వినపడ్డాయి. వాళ్ళ రూం బయట గొళ్ళెం పెట్టి ఉంది. ముందుగా వెళ్ళిన మా ఏమండీ గది తలుపు గొళ్ళెం తీసారు. సావిత్రమ్మ,  శంకర్ బయటకు వచ్చారు.

"అమ్మ బాత్ రూంకు వెళ్ళాలని తలుపు తీస్తే తలుపు రాలేదు సర్. మీ సెల్ కు ఫోన్ చేసాను. మీరు లిఫ్ట్ చేయలేదు అందుకని అరిచాను సర్" అన్నాడు శంకర్.  అవును మరి సార్ అన్న పిలుపు కన్నా దొంగా అని అరుస్తేనే పలుకుతారనుకున్నట్టున్నాడు.

అప్పుడే సెల్లార్ లో కింద పడిఉన్న జెర్కిన్ ను చూసాను. అరే మీ జర్కిన్ ఇక్కడ పడి ఉంది అంటుండగానే పక్కనే మూత తీసి పడి ఉన్న బ్రీఫ్ కేస్ కనిపించింది. అవి చూడగానే ఇందాక సెంటర్ టేబుల్ మీద, ఆ బ్రీఫ్ కేస్ నూ, సెల్ నూ చూసిన గుర్తొచ్చి గబగబా పైకి పరిగెత్తాను. టేబుల్ మీద బ్రీఫ్ కేస్,  సెల్,  సోఫాలో జెర్కిన్ లేవు. నా మొహం అవి కింద కనిపించాయిగా ఇంక ఇక్కడెందుకుంటాయి? అయినా ఏమిటీ ఏమి జరిగిందీ అని అయోమయంగా చూస్తుండగానే  కింద నుంచి ఏమండి బ్రీఫ్ కేస్ నూ,  జెర్కిన్ నూ తీసుకొని వచ్చారు. వెనుకనే కోడలు,  శంకర్,  సావిత్రమ్మా, ఈ హడావుడికి మెలుకువ వచ్చిన మా అబ్బాయి అందరూ వచ్చారు.

తరతరాలుగా ఆహ్వానిస్తున్న దొంగగారొచ్చేసారహో...

ఏమండీగారు ఎప్పుడూ జోక్ చేస్తున్నట్లుగానే, బ్రీఫ్ కేస్,  జెర్కిన్ వెతికినా ఏవీ దొరకలేదు.  పిచ్చి వెధవ! మిలిట్రీ వాళ్ళింట్లో రెండుమూడు సూట్ లూ అవీ ఒకటి హాంగర్ కు,  ఒకటి డ్రైక్లీనింగ్ లో, కొన్ని మెడల్స్ తప్ప ఇంకేమీ ఉండవని తెలీదేమో! 'అసలు లోపలికి ఎట్లా వచ్చాడు?' అని అందరు తర్జనభర్జన పడుతుంటే, "పోనీలే ఏమీ పోలేదు ముఖ్యంగా ఎవరినీ ఏమి చేయకుండా వెళ్ళిపోయాడు!' అని ఏమండీ నిట్టూరుస్తుండగా హఠాత్తుగా ఏమండీగారి సెల్ గుర్తొచింది. అవునూ సెల్ ఏదీ? సెల్ తో పాటు నాలుగురోజులుగా తీస్తున్న నా ఫొటోలు  గుర్తొచ్చాయి.

"హేవండీ,  నా ఫొటోలు?" గట్టిగా అరిచాను.

అందరూ ఉలిక్కిపడి "ఏం పోయాయి?" అన్నారు. "మీ సెల్,  అది పోతే పోయింది నా ఫొటోలు వా..."

"పోనీలెండి ఆంటీ, సెల్లే కదా పోయింది. కొత్తది కొనుక్కోవచ్చు. మీ గులాబీ ఈసారి పూసినప్పుడు నా సెల్ తో చక్కగా ఫొటోలు తీసి ఇస్తానులెండి" అని ఓదారుస్తోంది కోడలు.

"వొరేయ్ నిన్ను వళ్ళేయనురా! రారా రా!" బెడ్ రూం లో నుంచి మనవడి కలవరింతలు వినిపించాయి గట్టిగట్టిగా.

“ఇంకేమిటి నాయనా నువ్వు వళ్ళేసేది. నువ్వూ మీ తాతా ప్రేమారగా పిలుస్తుంటే రానూ వచ్చాడు ముచ్చటగా తీసుకున్న గులాబీ ఫొటోలతో సహా సెల్ ఎత్తుకొని పోనూపోయాడు!”

నా స్వగతఘోష కాస్తా ఓపెన్ ఘోషగా మారిపోయింది.

- (సాహితి)

## 13. పిలుపేలరా ఓ మాధవా!!!

మామయ్యగారు అర్జెంట్ పని మీద ఊరికి వెళ్ళటము వలన, ఆయన స్నేహితుని కూతురి పెళ్ళికి నేనూ, ఏమండి వెళ్ళాము. ఇప్పట్లా తలుపు ముందే ఒక బల్ల వేసి, దానిమీద పసుపు కుంకుమ గిన్నెలు, పూలున్న పళ్ళెం పెట్టి, ఓ ఇద్దరు పిల్లకాయలకు పన్నీరుబుడ్డీ ఇచ్చి నిలబెట్టటం, మనం ముందు వరసలో ఉంటే వెనక వరసలో, వెనక వరసలో ఉంటే ముందు వరసలో స్నాక్స్, కూల్ డ్రింక్స్ అంది, మన చేతికి మాత్రం టూత్ పిక్స్ రావటమూ, మంగళసూత్రధారణ కాగానే, నెట్టుకుంటూ లైన్లో నిలబడి, మన వంతు వచ్చేసరికి ఈసురోమంటూ వధూవరుల నెత్తిన పక్కనున్న అక్షింతలు చల్లి, అంతకన్నా ఈసురోమంటూ డైనింగ్ హాల్ లో పళ్ళాలు చేతిలో పట్టుకొని, తోసుకుంటూ వెళ్ళి, దొరికిందేదో తిని బయటపడే కాలం కాదది. అందరికీ బొట్టూ, తాంబూలం చేతికిచ్చి, డైనింగ్ హాల్ లో విస్తళ్ళేసి భోజనాలు వడ్డించి, మడివాళ్ళకు విడిగా మడితో వండించి వడ్డించి, ఆహూతులనందరినీ వీలైనంత వరకు ఆదరించే కాలం అది. ఇంకా చెప్పాలంటే అలకలూ ముచ్చట్లూ, సరదాలూ, సాంప్రదాయాలూ యథావిధిగా జరిగే కాలం అది.

పెళ్ళి సాయంకాలం 7.15 కు ఐతే మేము ఆరింటికల్లా వెళ్ళాము. హాల్ లో అక్కడక్కడా తప్ప ఎక్కువగా ఎవరూ లేరు. స్టేజ్ మీద బ్రాహ్మణుడు ఏదో సర్దుకుంటున్నాడు. ఆ ఉన్నవాళ్ళల్లోనే ఎవరినో తెలిసినవాళ్ళను దొరికించుకొని, ఏమండీ కబుర్లు చెపుతున్నారు. నేను ఒక కుర్చీలో కూర్చొని, సన్నాయి వాళ్ళు వాయిస్తున్న కృతులు వింటూ దిక్కులు చూస్తున్నాను. ఓ పది నిమిషాలయ్యాక ఏమండి వచ్చి "ఇక్కడ ఒక్కదానివి అట్లా సీరియస్ గా కూర్చున్నావెందుకు? అదో ఆ గదిలో పెళ్ళికూతురు వాళ్ళున్నారట. పెళ్ళికూతురికి తయారుకావటములో సహాయం చేయవచ్చుగా వెళ్ళు" అన్నారు. అసలు తెలిసి వాళ్ళతో మాట్లాడటానికే చచ్చేంత మొహమాటం. ఎవరో తెలీని కొత్తవాళ్ళతో ఏం మాట్లాడాలి, పైగా పెళ్ళికూతురు తయారవటానికి సహాయం చేయాలట. అమ్మో ఐనా తప్పదు అనుకుంటూ చిన్నగా పెళ్ళికూతురు వాళ్ళు ఉన్న గదిలోకి వెళ్ళాను. అక్కడ నా సహాయము అవసరము లేకుండానే పెళ్ళికూతురు తయారై, ఓ పక్కగా కూర్చుని, గౌరీపూజ చేసుకుంటోంది. గదంతా పూల సువాసనలతో, తయారయేవాళ్ళు, సర్దుకుంటున్నవాళ్ళూ, అందరూ హడావుడిగా మాట్లాకుంటూ సందడి సందడిగా ఉంది. అక్కడ ఎవరైనా తెలిసిన వాళ్ళు ఉన్నారా అని చూస్తుంటే,

పెళ్ళికూతురి తల్లి నన్ను చూసి గుర్తుపట్టి, "మీ అత్తగారు రాలేదా?" అని అడిగి సమాధానము వినకుండానే హడావుడిగా వెళ్ళిపోయింది. కాసేపు అటు నిలబడి, ఇటు నిలబడి ఎవరైనా పలకరింపుగా నవ్వితే నవ్వుతూ, నిలబడి నిలబడి కాళ్ళు పీకుతుంటే వెళ్ళి పెళ్ళికూతురి వెనక కొంచెం జాగా ఉంటే, ముందే ఈ పని చేస్తే బాగుండేది కదా అనుకుంటూ వెళ్ళి కూలబడ్డాను. పెళ్ళికూతురు నా వైపు చూసి చిన్నగా నవ్వి, మళ్ళీ పూజలో పడిపోయింది.

ముహూర్తం సమయమైతే గదిలోని అందరితో పాటు నేనూ వెళ్ళి, స్టేజ్ మీద వేసి ఉన్న జంపఖానా మీద కూర్చున్నాను. ఒకదాని తరువాత ఒకటి పెళ్ళి తంతులు జరుగుతుంటే ఆసక్తిగా చూస్తున్నాను. ఇంతలో ఒకాయన హడావుడిగా పెళ్ళికూతురి తండ్రి దగ్గరకు వచ్చి, చిన్నగా ఏదో చెప్పాడు. ఆయన గాభరా పడుతూ కిందికి వెళ్ళాడు. కిందంతా ఏదో హడావుడిగా ఉంది.

కాసేపయ్యాక ఏమండి వచ్చి "నువ్వు ఇంటికి వెళ్ళు. నేను తరువాత వస్తాను" అన్నారు.

"అదేమిటి మీరు రారా? ఇంకా భోజనాలు కూడా కాలేదు కదా?" అన్నాను నేను.

"లేదులే. మొగపెళ్ళివారు తినకుండా ఆడపెళ్ళి వారి బంధువులు భోజనాలు చేస్తున్నారట. మొగపెళ్ళి వారికి కోపం వచ్చింది. వాళ్ళు భోజనం చేయకుండా కూర్చున్నారు. నేను ఆ ఏర్పాట్లు చేసి వస్తాను" అన్నారు.

అప్పటికి టైం తొమ్మిదైంది. చీకటి పడింది. "రిక్షాలో నేను ఒక్కదాన్ని వెళ్ళలేను భయం. మీరు వచ్చేదాకా కూర్చుంటాను లెండి" అన్నాను.

"సరే" అని వెళ్ళిపోయారు ఏమండి. మళ్ళీ కాసేపయ్యాక వచ్చి "రా" అని డైనింగ్ హాల్ లోకి తీసుకెళ్ళారు. అక్కడంతా శుభ్రంగా కడిగేసి, బల్లలు, కుర్చీలు వేసి, వాటి మీద అరిటాకులు పరిచి ఉన్నాయి.

"ఇదో ఈ అరిటాకుల దగ్గర ముగ్గేయి" అని చెప్పి వెళ్ళారు. నేను మరోఇద్దరు అమ్మాయిల సహాయముతో బియ్యపిండితో అరిటాకుల చుట్టూ ముగ్గులేసి, పసుపు

కుంకుమతో అలంకరించి, అరటి ముక్కలు, ఆలుగడ్డల ముక్కల మీద అగరొత్తులు వెలిగించి పెట్టాను.

ఏమండీ మొగవాళ్ళను తీసుకొచ్చి కూర్చోబెడుతూ, ఇంకో వైపు ఆడవాళ్ళను తీసుకొచ్చి కూర్చోబెట్టమని నాకు చెప్పారు. సరే మొత్తానికి ఆడపెళ్ళివారి పెద్దల సహాయముతో, మొగ పెళ్ళివారిని కొండ మీద నుంచి దింపి భోజనాలు చేయించారు.

పెళ్ళికూతురి తండ్రి, ఏమండీ దగ్గరకు వచ్చి చేతులు పట్టుకొని గద్గద కంఠంతో "మాధవా! మా వాళ్ళెవరూ చెప్పినా వినలేదు. నువ్వు ఏమి నచ్చచెప్పావో భోజనాలు సక్రమంగా అయిపోయాయి. ఈ రోజు నా మర్యాద నిలిపావు" అని అన్నారు.

అదో అప్పటి నుంచి ఎవరి పెళ్ళికి వెళ్ళినా పెళ్ళైనాక, పెళ్ళివారికి భోజన సదుపాయాలు చూసి, ఏవైనా గొడవలైతే సర్దుబాటు చేసి, స్టేజ్ మీద అప్పగింతలు అవుతుంటే, కింద కుర్చీలలో కూర్చుని, ఇద్దరమూ ఒకరి చేయి ఒకరము పట్టుకొని, మా అమ్మాయి పెళ్ళి కాకముందైతే, మా అమ్మాయిని అప్పగించే సీను తలుచుకుంటూ, మా అమ్మాయి పెళ్ళైనాక, మా అమ్మాయిని అప్పగించిన సీను తలుచుకుంటూ, కాసిని కళ్ళ నీళ్ళు పెట్టుకొని, ఆ తరువాత పెళ్ళికొడుకు దగ్గరికి వెళ్ళి, ఆయన పెళ్ళికొడుకు చేయి పట్టుకొని, 'అమ్మాయిని జాగ్రత్తగా చూసుకో బాబూ...' అని చెపుతున్నప్పుడు, నేను చేతులు కట్టుకొని, ఆయన పక్కన నిలబడి, ఆయన చెప్పటమైనాక, నేనూ ఆ పెళ్ళికూతురి చేయి చిన్నగా తట్టి వచ్చేయటము మాకలవాటై పోయింది. విచిత్రమేమిటంటే మేము అమ్మాయి తరఫున వెళ్ళినా, అబ్బాయి తరఫున వెళ్ళినా అక్కడ ఇదే సీనుండేదన్నమాట. ప్రస్తుతమైతే మరీ దగ్గరవాళ్ళైతే తప్ప అంతవరకూ ఉండటము లేదు. కాకపోతే ఈమధ్య పెళ్ళిళ్ళలో గొడవలు కూడా కావటము లేదుకదా! కాని ఆడపెళ్ళివారింట్లో భోజనాల దగ్గర ఏర్పాట్లు చూడటము మానుకోలేదు.

ఈమధ్య మా పనమ్మాయి శారద పెళ్ళైంది. ఆ పెళ్ళికి మేమిద్దరమూ వెళ్ళాము. మమ్మల్ని చూడగానే శారద "అమ్మా! మీరూ పెద్దసారూ వచ్చారు!" అని తెగ సంతోష పడిపోయింది. సరే యథావిధిగా పెళ్ళికొడుకుతో, "మా శారద చాలా మంచమ్మాయి, జాగ్రత్తగా చూసుకో" అని ఏమండి చెప్పటము జరిగింది. ఆ అబ్బాయి బిత్తర పోయి తరువాత శారదని అడిగాడుట, "మీ సారు వాళ్ళకు నువ్వంటే చాలా అభిమానమా?" అని.

ఇంటికొచ్చి శారద చెప్పుకొని మురిసి పోయింది. “అమ్మా మీరొస్తారనుకోలేదు. పెద్దసారు అంత బిజీగా ఉండి కూడా రావటము నాకు చాలా సంతోషము కలిగిందమ్మా!” అంది. “పిచ్చిపిల్లా, ఎందుకు రామనుకున్నావు? ఎవరు పిలిచినా ఎలాగో వీలుచేసుకొని తప్పక వెళుతాము.” అని శారదకు చెప్పి, ‘అవును మరి మమ్మల్ని పిలవనివాళ్ళు పాపాత్ములు’ అని మనసులో అనుకున్నాను. కాకితో కబురంపినా వస్తామని పేరు మాకు!

ఆ పేరు తెచ్చిన తంటా కూడా ఓటుందండోయ్! ఏమండి స్నేహితుని కూతురు పెళ్ళైందని ఎవరి ద్వారానో తెలిసింది. అరే మనను పిలవలేదే అనుకున్నారు ఏమండి. ఏమైందోలే అనుకొని సమాధాన పడ్డారు. ఓసారి ఆయన ఇంకేదో ఫంక్షన్ లో కనిపించి, ఏమండీ మాట్లాడించినా ముభావంగా ఉన్నారు. నేనేమో ఈయన వాళ్ళ అమ్మాయి పెళ్ళికి పిలవలేదు సరికదా, మాట్లాడించినా మాట్లాడటంలేదు అని మనసులో గొణుక్కుంటున్నాను. ఇంతలో ఇంకో ఫ్రెండ్ అక్కడకు వచ్చాడు. ఏమండిని చూడగానే "నువ్వు వీడి కూతురి పెళ్ళికి రాలేదేమిరా?" అని అడిగాడు.

వెంటనే ఆ పెళ్ళికూతురి తండ్రి, "వీడు పెద్దవాడైపోయాడుగా! మా లాంటి వాళ్ళ ఇంటికి ఎందుకొస్తాడులే. నేనే పిచ్చివాడిని రెండు రోజుల ముందైనా వచ్చి ఏర్పాట్లకు సహాయం చేస్తాడని ఆశ పడ్డాను" అన్నాడు నిష్టూరంగా.

ఆయనను మాట్లాడనిచ్చి, ఏమండి “అసలు నువ్వు నన్ను పిలిచావా?" అని అడిగారు.

ఆయన, “ఏమిటీ, నిన్ను నేను పిలవలేదా?” అని బోలెడు ఆశ్చర్యపోయి, అప్పుడే అటొచ్చిన వాళ్ళావిడను, “మనము ప్రభాత్ ను పెళ్ళికి పిలవలేదా?” అని అడిగాడు. ఆవిడ అంతకన్నా ఆశ్చర్యపోయి, "మనము పిలవటానికి వెళ్ళకపోతే కొడుకు కోడలిని పంపారనుకున్నాను. మిమ్మల్ని అడుగుదామనుకొని కూడా పనిలో పడి మర్చిపోయాను. అన్నయ్య పెళ్ళికెందుకు రాలేదా అనుకున్నాను" అని తెగ ఫీలింగైపోయింది! ఇద్దరూ కలిసి లక్షాతొంబైసార్లు సారీలు చెప్పారు. ఆ తరువాత ఇంటికొచ్చి బట్టలు పెట్టి, ఇంకో లక్షాతొంబైసార్లు సారీలు చెప్పారనుకోండి. అయినా కాకీ కబురూ కూడా లేకుండా, పిలుపేలరా ఓ మాధవా అని ఓ కీర్తన పాడేసుకుంటూ వెళ్ళిపోతామేమిటి? మరీ విడ్డూరం కాకపోతే!

## 14. బుజ్జి తల్లి

"అమావాస్య అర్ధరాత్రి... బలవంతుడైన పిశాచం బలహీనులైన ఆత్మలను లోబరుచుకొని వారికి నాయకత్వం వహిస్తారు. అట్టి పిశాచం బ్రతికి ఉన్నప్పుడు దుష్టుడైన రాజకీయ నాయకుడై ఉంటాడని అంటారు. దయ్యాలకు కూడా స్నేహితులు కావాలి. ఒక బలహీనుడైన మనిషిలో చోటు దొరుకుతే అది వెళ్ళి మరికొన్ని దయ్యాలను వెంటబెట్టుకొని వస్తుంది.

భీకరాకార వికృత రూపాలలోనున్న ప్రేతాత్మలు ఆ ఇంటిని కాపలా కాస్తున్నట్లు నిల్చున్నాయి. ప్రేతాలకు సూక్ష్మ శరీరం వుండదు. వాయురూపంలో శాపగ్రస్థుల్లా గాలితో పాటు సంచరిస్తూ వుంటాయి.

హంతకులు దోపిడీదారులు, చనిపోయిన దుఃఖంలో, కష్టంలో, నష్టంలో, బాధలో నున్నవారి ఇంట్లో దొంగలించినా ఆశించినా చనిపోయి ప్రేతాలుగా మారి ఆకలిదప్పులతో అలమటిస్తుంటారు. వాటికి కనుగుడ్లు బయటకి పొడుచుకు వస్తాయి. కోరల్లాంటి దంతాలు చేతులవేళ్ళు పాముల్లా మెలితిరుగుతూ నలువైపులా పాకుతున్నట్టుగా ఉన్నాయి. వాటి చేతుల్లో పుర్రెలు, వాటి నిండుగా రక్తం."

టింగ్... టింగ్

శబ్దానికి ఉలిక్కి పడ్డాను. ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. శరీరం భయంతో కొద్దిగా వణికింది. చిన్నగా తేరుకొని, చదువుతున్న, నవల నుంచి తలెత్తి చూసాను. అప్పటికీ

ఏమండీ లాప్ టాప్ లో ఆడుతున్న బ్రిడ్జ్ గేం నుంచి తలెత్తకుండా, “ఎవరో బెల్ కొట్టారు చూడు!” అన్నారు. “ఇంత అర్ధరాత్రి ఎవరొస్తారులెండి?” అని నవలలోకి కళ్ళు తిప్పబోయాను. మళ్ళీ, టింగ్... టింగ్... అని బెల్ శబ్దం వినిపించింది. ‘ఇక తప్పదురా దేవుడా, ఐనా ఇంత రాత్రి ఎవరబ్బా?’ అనుకుంటూ సోఫాలో నుంచి లేచి వెళ్ళి తలుపు తీసాను. ఎవరూ లేరు! చల్లటి గాలి ముఖానికి తగిలింది. ఆ చల్లగాలికి పరవశిస్తూ బాల్కనీలోకి వెళ్ళాను. ఆ రోజు అమావాస్య మూలంగా నేమో అంతా గాఢాంధకారం! చిక్కటి, నల్లని చీకటి. వీధి దీపం పిశాచాలకు భయపడి ఆరిపోయినట్లుంది. పగలు రణగొణ ధ్వనులతో హడావుడిగా ఉండే వీధి భయంకరమైన నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా పిట్ట పురుగు చప్పుడు లేదు. పూలసువాసనలూ లేవు ఎందుకో మరి! “నీలా ఆస్మా సోగయా” పాట గుర్తొచ్చింది. ఆ నిశ్శబ్ద, నిశీథికి ఒక్కసారిగా వళ్ళు జలదరించింది! ఆ చిమ్మ చీకట్లో కొద్దిగాలికే ఊగినట్లున్నాయి కొబ్బరాకులు చల్లటి గాలి వణికించింది. ఎక్కడి నుంచో ఏ పిశాచమో నన్ను చూస్తున్న భావన కలిగి, గబుక్కున ఇంట్లోకి వెళ్ళి, తలుపు వేసాను. లోపల కూడా ట్యూబ్ లైట్ వేసి లేదు. మేమిద్దరమూ కూర్చొని ఉన్న చోట మాత్రం లైట్ వేసుకున్నాము. అందుకని హాలంతా కూడా మసక చీకటిగా ఉంది. భయం వేసి ట్యూబ్ లైట్ వేసాను.

"లైట్ ఎందుకు వేసావు? ఇది చాలు కదా, కరెంట్ దండగ తీసేయి" అన్నారు ఏమండి.

"ఈ మధ్య మీకు మరీ పొదుపు ఎక్కువైంది. ఉండనీయండి" అని చెప్పి నవలలోకి తల దూర్చాను.

‘టింగ్... టింగ్...’ మళ్ళీ చప్పుడు! విసుగ్గా తలెత్తాను. ఏమండీ తల కూడా తిప్పకుండా బ్రిడ్జ్ ఆడుతున్నారు. నేను లేవక పోవటం గమనించి "ఊ" అన్నారు చూడమన్నట్లుగా.

"అబ్బా ఏం చప్పుడో ఏమో, ఐనా ఇప్పుడెవరొస్తారండీ?" అన్నాను భయంగా. అవును మరి నేను చదువుతున్న నవలలోని భూతాలు, పిశాచాలు నా చుట్టూ తిరుగుతున్నాయి.

"ఏమో మనలాగా నిద్ర పట్టని వాళ్ళు ఎవరొచ్చారో చూడు" అన్నారు ఏమండి.

ఏమండీగారు చెప్పాక తప్పుతుందా మరి అనుకుంటూ సోఫాలోనుంచి లేచి, వళ్ళు విరుచుకుంటూ, ఎందుకో పైకి చూసాను. షాండిలీయర్ కొద్దిగా కదిలినట్టు అనిపించింది. "హేమండీ, షాండిలీయర్ కదులుతోంది" పైకే చూస్తూ భయం భయంగా అన్నాను.

"నీ మొహం షాండిలీయర్ కదలటం ఏమిటి? అదేమన్నా చిన్న వస్తువా?" ఏమండి సమాధానం!

ఇంతలో పక్క ఫ్లాట్ వాళ్ళు లేచినట్లున్నారు. లైట్ వేసారు. హాల్ లోని లైట్, పక్కవాళ్ళ లైట్ తో హాలంతా వెలుతురు పరుచుకొని షాండిలియర్ స్పష్టంగా కనిపించింది. దాని మీద నల్లగా ఏదో కూర్చొని ఉన్నట్లుగా కనిపించింది.

ఏ దయ్యమో రాలేదుకదా * * * * * * కళ్ళ ముందు మెరుపులు మెరిసినట్లై “హేవండీ... అక్కడేదో నల్లగా కనిపిస్తోంది...” గజగజా వణికిపోతూ అన్నాను.

"ఏహే... ఊరుకో. ఏమీ లేదు" అన్నారు.

"అది కాదండి, నల్లగా ఉంది ఏ దయ్యమో వచ్చిందేమో. ఈ నవలలో క్లియర్ గా ఉంది దయ్యాలున్నాయని" ఇంకా ఇంకా వణికిపోతూ అన్నాను.

"అందుకే చెపుతాను ఆ దయ్యాల నవలలు చదవకు అని. దయ్యాలు లేవు భూతాలు లేవు. చదివింది చాలు పోయి పడుకో" కోపం చేసారు.

"కాదు చూడండి ప్లీజ్" నోట్లో నుంచి మాటనే స్పష్టంగా రావట్లేదు భయంతో!

ఇక నా గోల భరించలేకనో, ఆ గేమైపోయిందో తలెత్తి చూసారు ఏమండి. అప్పుడే షాండిలీయర్ మీద నుంచి ఏదో నల్లటిది కదిలి రేలింగ్ మీదకు వెళ్ళింది. ఏమండీ కూడా ఆశ్చర్యపోతూ అటే చూస్తున్నారు.

"చూసారా నేను చెప్పితే నమ్మలేదు మీరు" అన్నాను నిష్ఠూరంగా. నా మాట పట్టించుకోకుండా, మెట్లెక్కి పైకి వెళ్ళారు.

"వద్దు... వద్దు... ఆ దయ్యం ఏమి చేస్తుందో!" కీచుగా అరిచాను.

ఆ అరుపుకు అది అక్కడి నుంచి మళ్ళీ షాండిలీయర్ మీదకు వచ్చింది. అక్కడి నుంచి రేలింగ్ మీదకు రివ్వున పోయింది. దాని విన్యాసాలు నేను కళ్ళప్పగించి చూస్తూ చలనం లేకుండా నిలబడ్డాను. ఏమండీ కుదుపుతూ, "అది ఏదో బుజ్జి పిట్ట" అన్నారు.

"కాదు. చిన్న పిల్లలు చనిపోతే ఇలా అమాయకమైన పిట్టల్లాగా బుజ్జి దయ్యాలవుతాయి. అది ఏ బుజ్జితల్లి దయ్యమో! అందుకే మనలనేమీ చేయక పాపం అదే అయోమయంగా తిరుగుతోంది" అన్నాను అప్రయత్నంగా!

"అది బుజ్జితల్లి దయ్యమైతే వాళ్ళ ఇంటికి పోతుంది కాని మనింటికెందుకొస్తుంది?" ఏమండీ గారి వేళాకోళం.

కాసేపు దానినే దీక్షగా చూస్తూ "దానికి నువ్వంటే ఇష్టమేమో? అందుకే ఆ బుజ్జితల్లి దయ్యం నీ దగ్గరకు వచ్చింది" అన్నారు ఏమండి.

బాబోయ్ ఉష్... ఉష్... అని దాన్ని వెళ్ళ గొట్టే ప్రయత్నం చేసాను. నీ లెక్కేమిటి? అంటూ అది అట్లాగే అటూ ఇటూ తిరుగుతూ ఉంది. అది కదిలి నప్పుడు షాండిలీయర్ కు ఉన్న చిన్న డెకరేషన్ పీస్ లు తగిలి టంగ్ మని బెల్ చప్పుడులా వస్తోంది.

"పాపం మధ్యాహ్నం ఎండకు తాళలేక ఇంట్లోకొచ్చి ఉంటుంది. తిరిగి వెళ్ళలేకపోయిందేమో. ఇప్పుడెక్కడికి వెళుతుంది ఉండనీయిలే నీ బుజ్జితల్లిని." అన్నారు దయగా.

"అన్నింటికి ఇట్లా భయపడకూడదు. ఐనా దయ్యాలూ, భూతాలు అన్నవి ఎక్కడో లేవు. మన మనసులోనే ఉన్నాయి" అన్నారు ఏమండి.

"ఆ మీరన్నీ అట్లాగే చెపుతారు. దయ్యాలు భూతాలు లేకపోతే, మధ్యాహ్నం చింతతోపుకు, స్మశానాలకు ఆడపిల్లలు వెళ్ళకూడదని, మగవాళ్ళు కూడా తల్లితండ్రులు ఉన్నవాళ్ళు శవాలను మోయకూడదని, స్మశానానికి వెళ్ళకూడదని, అట్లా వెళితే దయ్యాలు పడతాయని, చెడు జరుగుతుందని అంటారు. అట్లా దయ్యాలు పట్టిన వాళ్ళ గురించి వింటూనే ఉంటాము కదా. అవన్నీ అబద్ధాలా?"అన్నాను.

"చింతలతోపుకు, అర్ధరాత్రి ఆడపిల్లలు ఒంటరిగా వెళ్ళ కూడదు ఇలాంటివన్నీ అమ్మాయిల సెక్యూరిటీ కోసం పెద్దవాళ్ళు ఏర్పాటు చేసిన నిబంధనలు. శవాలను మోయకూడదు అంటే మరి వార్ టైం లో మేమే తీసి, దహన సంస్కారం చేయాల్సి వస్తుంది. యూనిట్ లో ఎవరైనా పోయినప్పుడు మాకు అఫిషియల్ గా కూడా ఆ డ్యూటీలుంటాయి. మేము చేయము అంటే కుదురుతుందా? నేను ఎన్నో చేసాను. పిల్లి ఎదురు వస్తే, ఒంటి బ్రాహ్మడు ఎదురొస్తే, తుమ్మితే ఏదైనా పనులు చేస్తే కావు అంటారు. పొద్దున్నే విడోను చూడకూడదు. ఇలా ఏవేవో అంటారు. అవన్నీ మూఢనమ్మకాలు. మామూలుగా చెపితే, వినరని కొన్ని ఆచారాలు, కొన్ని నమ్మకాలూ, సమాజ శ్రేయస్సుకోసం అనీ, వ్యక్తిగత శ్రేయస్సు కోసమనీ మన పెద్దవాళ్ళు ఏర్పరచారు. చదువుకోక ముందు కాకరకాయ అనీ, చదువుకున్నాక కీకరకాయ అన్నాడుట ఎవరో. అట్లా మంచి కోసం చేసినవన్నీ మూఢాచారాలుగా మారిపోయాయి. మనుషుల నమ్మకాలల్లో పాతుకుపోయాయి. దయ్యాలు పట్టటం అన్నది ఒక మానసిక రోగం. అవన్నీ నమ్మకు. పిచ్చి పిచ్చి భయాలు, అనుమానాలు, నమ్మకాలు పెట్టుకోకు" అన్నారు ఏమండి.

"ఐతే ఏవీ నమ్మవద్దంటారు. మనిష్టం ఉన్నట్లు ఉండవచ్చు అంటారు" అన్నాను ఆసక్తిగా.

"మూఢాచారాలను నమ్మకు అన్నాను. మనమాట, మనచేత ఇతరులకు నష్టం కలిగించనంతవరకు మనము మన ఇష్టం వచ్చినట్లుగా చేసుకోవచ్చు. మన నమ్మకాలు అతి కాకూడదు. ఎవరినీ బాధించకూడదు. మన ధర్మం మనము నెరవేర్చాలి. మనము చేసేది ధర్మబద్ధంగా ఉండాలి. ఖరం హీ ధరం అన్నది ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి" అన్నారు ఏమండి.

ఏమండి ఏది చెప్పినా చక్కగా విడమరిచి చెపుతారు. అంతేగా మనవలన ఎవరికీ ఏ అపకారమూ కలగకుండా మనకు కావలసినట్లు మనం ఉండవచ్చు కదా! ఐనా అండగా ఈ భీమన్న ఉండగా నాకిక భయమెందుకు అనుకుంటూ నవలలోకి తలదూర్చబోయి, ఓ సారి పైకి చూసాను. పాపం బుజ్జి తల్లి ఎప్పటి నుంచి అట్లా ఉందో అనుకొని వంటింట్లోకి వెళ్ళి, కాసిని బియ్యం గింజలు, ఒక గ్లాస్ లో నీళ్ళు తీసుకున్నాను. దేవుడి గదిలో, దీపావళికి కొన్న పెద్ద మట్టిప్రమిదల్లో మిగిలిన ఒక దానిని తీసుకొని, పైకి వెళ్ళాను.

బుజ్జితల్లి అలాగే రేయిలింగ్ మీద కూర్చొని ఉంది. గోడ వారగా ప్రమిద పెట్టి నీళ్ళుపోసి, బియ్యంగింజలను పక్కన చల్లాను. ఓసారి దానిపైపు తిను అన్నట్లుగా చూసి, మెట్ల మీద లైట్ ఉంచేసి, కిందకు వచ్చాను.

"ఊ అయిందా నీ బుజ్జితల్లి సేవ? ఇక చాలా రాత్రైంది పడుకో. పొద్దున తలుపు తీయగానే వెళ్ళిపోతుందిలే" అన్నారు ఏమండి నవ్వుతూ.

అయ్యో వెళ్ళిపోతుందా, అవునులే దాని అమ్మ దగ్గరకు అది వెళ్ళాలికదా!

- (అచ్చంగాతెలుగు అంతర్జాల మాసపత్రిక, అక్టోబర్ 2018)

### 15. మా ఆయన బంగారం

రాత్రి 9 గంటలైంది. భోజనం కానిచ్చి టి. వి. పెట్టారుఏమండి. 'టైమ్స్ నౌ' ఛానల్ లో అర్ణబ్ గోస్వామి చెడుగుడు ఆడేస్తున్నాడు. వక్తలు పెద్ద పెద్దగా మాట్లాడేస్తున్నారు. కాసేపు వాళ్ళ గోడు విని పడక గదిలోకి వచ్చాను. పరదాలు పైకి వేసి, కిటికీ తలుపులు తీసి బయటకు చూపు సారించాను. రోడ్డంతా ఖాళీగా, నిశ్శబ్దంగా వుంది. గంటక్రితం పడ్డ వానలో మొక్కలన్నీ తడిసి ముద్దైనట్లున్నాయి, వీధి లైటు వెలుగులో మెరిసిపోతున్నాయి. పారిజాతం సువాసనలు సన్నగా గాలిలో తేలివస్తున్నాయి. వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంది. కొద్ది నిమిషాలు అలానే నిలబడి, లాప్టాప్ తీసాను. మెయిల్ చూసుకున్నాను. ఎవరైనా స్నేహితులు ఆన్ లైన్ వున్నారా అని చూసుకున్నాను. ఇంకా ఎవరూ వచ్చినట్లులేరు! యుట్యూబ్ ఇంకో టాబ్ లో తీసి, ఏపాట పెడదామా అని ఆలోచించి చాలా రోజులైంది విని అనుకొని 'జాణవులే... నెరజాణవులే' పెట్టాను.

"ఆ ఆ ఆ ఆ

నెరజాణవులే వరవీణవులే కిలికించితాలలో ఆహహ్హా

జాణవులే మృదుపాణివిలే మధు సంతకాలలో "

జిక్కి గొంతు మృదు మధురంగా సాగుతోంది. సిల్క్ స్మిత చాలా వయ్యారంగా నాట్యం చేస్తోంది. ఈ పాట, దీనికి సిల్క్ స్మిత డాన్స్ నాకు చాలా ఇష్టం. ఇంతమంచి డాన్సర్ ఎందుకు క్లబ్ డాన్సర్ గా చేసిందా అని బాధపడుతూవుంటాను.

ఆ పాటలో మునిగిపోయివున్న నాకు గట్టిగా 'వదులు' అని వినిపించింది. ఒక్క క్షణం ఉలిక్కి పడ్డాను. అదేమిటీ పాటలో బాలకృష్ణ అరిచాడా? అనుకుంటూ చూస్తూ వుండగానే మళ్ళీ ఈ సారి ఇంకొంచెం గట్టిగా "వదులు" అని వినిపించింది. అప్పుడు ఇది పాటలో నుంచి కాదు బయట నుంచి అని అర్థమై, లేచి బయటకు చూసాను. మా గేట్ కు ఎదురుగా, రోడ్ కు ఇంకోవైపు ఒక అబ్బాయి బైక్ మీద కూర్చొని, పక్కనే నిలబడి వున్న అమ్మాయి చేయి పట్టుకొని లాగుతున్నాడు. ఆ అమ్మాయి చేయి వదిలించుకొని పక్కకు వెళ్ళింది. ఆ అబ్బాయి బైక్ మీద, ఆ అమ్మాయిని వెంబడిస్తూ 'ఆగు' అని అరుస్తున్నాడు. ఉలిక్కిపడి, వారం రోజుల నుంచి తెగ సినిమాలు చూసి భ్రమ పడుతున్నానా అనుకుంటూ కళ్ళు నులుముకొని మళ్ళీ చూసాను. ఆ అమ్మాయి విసవిసా ఇంటి రోడ్ కు అవతలి వైపు నడుస్తోంది. ఆ అబ్బాయి ఆమెను ఆగు అని అరుస్తూ వెంబడిస్తున్నాడు. ఆ అమ్మాయి వెనుతిరిగి నడిచింది. అతనూ బైక్ వెనక్కి తిప్పాడు. అలా ఇద్దరూ అటూ ఇటూ తిరిగారు. ఇంతలో అతను బైక్ ఆపి ఆ అమ్మాయి చేయి పట్టుకున్నాడు. ఆమె "వదులు... వదులు" అని గింజుకోసాగింది. ఏమైనా సినిమా షూటింగా అని చుట్టూ చూసాను. కెమెరాలు, లైట్ లు, మనుషులు ఎవరూ కనిపించలేదు. ఐతే ఈ సీను నిజంగానే నా కళ్ళెదుట జరుగుతోందన్నమాట అనుకొని ఏమి చేయాలో తోచక ఒక్క సెకను నిలబడి, లోపలికి వెళ్ళి ఏమండికి చెప్పాను. అర్ణబ్ గోస్వామి నుంచి బయటకొచ్చి, హడావుడిగా బయటకు వెళ్ళారు. వెంటనే రెండేసి మెట్లకొకటి చొప్పున దిగుతూ బయటకు పరిగెత్తారు. ఏమండి అలా పరిగెత్తటము చూసి, అక్కడే సర్వెంట్ గది ముందు, పోర్టికోలో కూర్చొని ఉన్న పనమ్మాయి శైలజ కూడా ఆయన వెనుక పరిగెత్తింది.

ఏమండి గబగబా వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఆ అమ్మాయి చేయిని అతని నుంచి విడిపించి, ఆ అమ్మాయిని ఆయన వెనకే వెళ్ళిన శైలజకి ఒప్ప చెప్పి, అతనిని "ఎవరు నువ్వు?" అని దబాయించారు. వాళ్ళిద్దరూ ఈ పరిణామం ఊహించలేదేమో బిత్తర పోయారు. ఆ అమ్మాయిని శైలజ గేట్ లోపలికి తీసుకొచ్చేసి గేట్ వేసేసింది. ఆ అబ్బాయి "సారీ అంకుల్, తను..." అంటూ ఏదో చెప్పబోయాడు. ఏమండి వినిపించుకోకుండా ఆ అమ్మాయి దగ్గరకు వచ్చి "అతను నీకు తెలుసా?" అని అడిగారు. ఆ అమ్మాయి గబగబా తలతిప్పింది. (తెలిసినట్లా... తెలియనట్లా... ఏదీ తెలీకుండానా...)

ఇంతలో పక్క ఫ్లాట్స్ ల వాచ్ మాన్, శైలజ భర్త శ్రీనివాస్ వచ్చారు. "వాడిని పట్టుకోండి, కట్టేసి పోలీసులను పిలుద్దాము" అన్నారు ఏమండి. అప్పటి వరకూ, "అంకుల్... అంకుల్ అని ఏదో చెప్పబోతున్నవాడల్లా ఆ అబ్బాయి బైక్ ను ముందుకు ఫాస్ట్ గా పోనిచ్చాడు.

ఇక చేసేదేమీ లేక లోపలకు వచ్చిన ఏమండి ఆ అమ్మాయిని "నీ పేరేమిటి?" అని అడిగారు.

"సంధ్య" అని చెప్పింది ఆ అమ్మాయి.

"ఎక్కడ ఉంటావు?" అన్నారు. సంధ్య మాట్లాడలేదు.

"ఇంత రాత్రివేళ ఎక్కడనుంచి వస్తున్నావు? ఈ పక్క సందులోకి ఎందుకు వచ్చావు?" అని అడిగారు. దేనికీ సమాధానం చెప్పకుండా తల వంచుకొని, "నేనెళ్ళిపోతాను అంకుల్" అంది సంధ్య.

"ఎక్కడికి వెళతావు? మీ ఇల్లెక్కడో చెప్పు వచ్చి దింపుతాను" అన్నారు ఏమండి. సంధ్య భయపడినట్లుగా చూసి, "మీరు వద్దంకుల్ నేను వెళ్ళిపోతాను..." అంది. సంధ్యను పరికించి చూసి, "శైలజా, ఈ అమ్మాయికి నీళ్ళివ్వు. కూర్చోబెట్టు," అని నాతో "కార్ కీస్ తీసుకొనిరా, ఈ అమ్మాయిని ఇంట్లో దింపి వద్దాము" అన్నారు.

చెప్పులేసుకొని కార్ కీస్ తీసుకొని వచ్చాను. ఆ అమ్మాయి నన్ను చూడగానే "ఆంటీ మీరొద్దు ప్లీజ్, నేను వెళతాను" అంది. ఆ అమ్మాయిని చూస్తే 21 / 22 ఏళ్ళ

అమ్మాయిలా ఉంది. చాలా లేతగా సుకుమారంగా ఉంది. లేత గులాబీ రంగు డ్రెస్ లో ముద్దుగా వుంది. బెదురు బెదురుగా చూస్తోంది. మధ్య మధ్య చేయి ఊదుకుంటోంది. చేయి ఎర్రగా కందిపోయింది.

“ఏం చదువుకుంటున్నవమ్మా?” అని అడిగాను.

“నర్స్ ట్రైనింగ్ అవుతున్నానండి” అంది.

“నువ్వెక్కడుంటావు?” అడిగాను.

“అక్కడే హాస్టల్ లో ఉంటానండి. మా పేరెంట్స్ వైజాగ్ లో ఉంటారు”

“ఇక్కడిదాకా ఎందుకు వచ్చావు? అసలు ఆ అబ్బాయి ఎవరు? గొడవేంటి అసలు?” అని అడిగితే “రాంగ్ కాల్ వచ్చిందని అరుస్తున్నాడండి” అంటుందే కాని ఆ అబ్బాయి తెలుసని కాని, తెలీదు అని కాని చెప్పదు.

"ఫోన్ అంటూ వుంటే రాంగ్ కాల్స్ రాకుండా ఉంటాయా ఏమిటి?" అని శైలజ ఆశ్చర్యం.

ఆ అమ్మాయి చెప్పేదానికి ఒకదానికి ఒకటి కలవటం లేదు. మాములా కుచ్ గడ్ బిడ్ హై అనుకున్నాను. అయినా చూస్తూ చూస్తూ ఓ ఆడపిల్లను అలా వదిలేయలేరు.

బయటకు వెళ్ళి చుట్టూ చూసారు ఏమండి. ఆ అబ్బాయి ఎక్కడా కనిపించలేదు. పారిపోయాడని గ్రహించి, అక్కడే వున్న పక్క ఫ్లాట్స్ వాచ్ మాన్ ను "నువ్వు ఈ గొడవ చూసావా?"అని అడిగారు.

"చూసాను సార్. ముందు ఆ అమ్మాయి వచ్చింది. వెనకాల ఆపిల్లవాడు వచ్చాడు. ఆ అమ్మాయి చేయిబట్టి గుంజుతున్నాడు. చూసినా" అన్నాడు.

"మరి చూసి ఎందుకు ఊరుకున్నావు? అందరూ ఇట్లా మాట్లాడకుండా ఊరుకోబట్టే కదా గొడవలవుతున్నాయి. అదే నీ చెల్లెలిని ఎవరైనా ఇట్లాగే ఏడిపిస్తూవుంటే ఊరుకుంటావా?" అని అడిగారు.

అతను బుర్రగోక్కుంటూ "అవుననుకో సారూ" అని ఊరుకున్నాడు.

లోపలికి వచ్చి "ఆ రౌడీ వెళ్ళిపోయాడు. నీకేమీ భయం లేదు. నిన్ను ఇంటిదగ్గర దింపుతాము పదా" అన్నారు ఆ అమ్మాయితో.

సంధ్య మాట్లాడదేమని తన వైపు పరిశీలనగా చూసాను. ఆమె మొహంలో ఇంతకు ముందు కనిపించిన బెదురులేదు. లీలగా కొంటెతనముందా అనిపించింది. ఏదో నిశ్చయించుకున్నదానిలా లేచి “పదండి అంకుల్!” అంది.

సంధ్య దారి చెపుతుంటే రెండు సందుల అవతల వున్న ఫ్లాట్స్ ముందుకార్ ఆపారు ఏమండి... ఆ ఫ్లాట్స్ మా ఇంటికి దగ్గరే!

“దిగండి అంకుల్, ఆంటీ మీరూ రండి” అంది సంధ్య.

ఇక్కడా? ఎక్కడో దూరాన వుంటున్న హాస్టల్ లో ఎక్కడో ఉంటున్నానన్నదే అనుకుంటూ దిగాను. లిఫ్ట్ లో నాలుగో అంతస్తులోకి వచ్చాము. ఎదురుగా వున్న ఫ్లాట్ తాళం తీస్తూ, “రండి!” అని ఆహ్వానించింది. ఆశ్చర్యపోతూ, ఇద్దరం లోపలికి నడిచాము. లోపలికెళ్ళి గ్లాసులతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఇంతలో ఎవరో బెల్ కొట్టారు. తలుపు తీసిన సంధ్యను రాసుకుంటూ బైక్ అబ్బాయి లోపలికి వచ్చాడు. అతడిని చూసి ఏమండి సోఫాలో నుంచి లేచి ఏదో అనబోయారు.

"ప్లీజ్ అంకుల్! నామాట వినండి. నా పేరు సుధీర్. నేను ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నాను. ఇది మా ఇల్లే. ఈమె నాభార్య" అంటూ నిస్త్రాణగా సోఫాలో కూలబడ్డాడు.

సంధ్య వైపు ఆశ్చర్యంగా చూసాము. అవునన్నట్లు తలాడించింది సంధ్య.

"మరి ఇదంతా ఏమిటి?" కొంచెం కోపంగా అడిగారు ఏమండి.

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు సారీ అంకుల్. మాకు ఈ మధ్యనే పెళ్ళైంది. కాపురానికి వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. ఎంతసేపు టార్గెట్స్ అంటాడు, ప్రాజెక్ట్స్ అంటాడు. ఎప్పుడూ ఆ లాప్ టాప్ ముందు కూర్చొని పనే పని... బిజీబిజీ. ఈ ప్రాజెక్ట్

అంటాడు. బయటకు వెళ్దామంటే రాడు. ఈ రోజు పొద్దున ఆఫీస్ కు వెళ్ళేటప్పుడే చెప్పాను, ఎక్కడికీ తీసుకొని పోకపోతే పోయావు, కనీసం ఐస్క్రీం ఐనా తిని వద్దాము కాస్త తొందరగా రా అని. చక్కగా తయారై ఎదురుచూస్తూ ఉంటే రావటమే ఆలస్యంగా వచ్చాడు. కనీసం నావైపు తిరిగి చూడను కూడా చూడలేదు. నేను అడుగుతే ఐస్క్రీం షాప్ నుంచి తెచ్చుకొని ఇంట్లో తినవచ్చుకదా అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. అందుకే నేను ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను అని చెప్పి బయటకు వచ్చాను. ఇంకా నయం నా వెనుకే నన్ను బతిమిలాడుతూనైనా వచ్చాడు. అందుకే ఆ కోపంలోనే మీరు అడిగినప్పుడు నాకు తెలీదు అని చెప్పాను" అంటూ ముద్దుగా మూతి తిప్పింది సంధ్య.

'రోలొచ్చి మద్దెలతో మొరబెట్టుకున్నట్లుంది' అనుకుంటూ ఓరగా చూసాను ఏమండి వైపు.

"సారీ అంకుల్... మిమ్మల్ని ఇబ్బంది పెట్టాము. ఈ రోజులల్లో ఎదురుగా హత్య జరుగుతున్నా మనకెందుకులే అని చూసీ, చూడనట్లు ఊరుకుంటున్నారు అందరూ... కాని మీరు మాత్రం ఎవరో ముక్కూ మొహం తెలీని అమ్మాయిని ఓ రౌడీ ఇబ్బందిపెడుతున్నాడని, కాపాడాలని ప్రయత్నంచేసారు. యు ఆర్ వెరీ గ్రేట్ అంకుల్. మాలాంటి వారందరమూ మిమ్మల్ని చూసి నేర్చుకోవాలి. థాంక్ యు అంకుల్" అన్నాడు సుధీర్.

చిన్నగా తలపంకించారు ఏమండి. ఇంక వెళతామన్నట్లు లేచారు.

"ఆంటీ, అంకుల్... భోజనంచేసి వెళ్ళండి." అంది సంధ్య.

"మాదైందమ్మా... వస్తాము" అన్నాను.

కాఫీయైనా తాగమని బలవంతం చేసారు సుధీర్, సంధ్య.

కనీసం అప్పుడప్పుడైనా పనిలో నుంచి బయటకు వచ్చి భార్యను పట్టించుకోమని సుధీర్ కూ, కాస్త సద్దుకుపోయి, భర్తను ఏడిపించకుండా ఉండమని సంధ్యకూ పెద్దరికంగా బుద్ధులు చెప్పి కాఫీ తాగి బయిలుదేరాము.

డ్రైవ్ చేస్తున్న ఏమండీతో "మనమీమధ్య మరీ 'తాయరమ్మా బంగారయ్య'లము అయిపోతున్నాము" అన్నాను.

"ఎవరు వాళ్ళు?" అడిగారు ఏమండి.

"ఓ సినిమా ఉంది లెండి తాయారమ్మా బంగారయ్యా అని. వాళ్ళూ మనలాగే ఆపదలో వున్నవాళ్ళను, వాళ్ళు పిలిచినా పిలవకపోయినా కాపాడుతూ వుంటారు. సి.డి వచ్చిందేమో చూసి తెచ్చి మీకు చూపిస్తానులెండి" అంటూ నవ్వాను.

"ఏమండీ "

"ఊ"

"మనమూ మిడ్ నైట్ ఐస్క్రీం తిని చాలా రోజులైంది. ఈ రోజు తిందామా?" గోముగా అడిగాను.

ఏమీ జవాబివ్వకుండా గంభీరంగా డ్రైవ్ చేస్తున్న ఏమండిని ఓసారి చూసి, హుం అనుకొని తల వెనకకు వాల్చి కళ్ళుమూసుకున్నాను.

కార్ ఆగగానే, ఇల్లొచ్చేసిందా? అనుకుంటూ కళ్ళు తెరిచిన నాకు, ఎదురుగా ఐస్క్రీం పార్లర్ కనిపించింది.

అనుకొంటాను కాని ఎంతైనా మా ఆయన బంగారం అనుకుంటూ మురిపెంగా ఏమండీ వైపు చూసాను.

- (మార్చ్ 2014 - స్వప్న సకుటుంబ సపరివార మాసపత్రిక)

## 16. బుచ్చిబాబులాంటి మొగుడొద్దనుకున్నాను కానీ...

బుచ్చిబాబు ముప్పాళ రంగనాయకమ్మగారి నవల 'స్వీట్ హోం' హీరో. విమల మొగుడు. ఎంత మంచివాడంటే పెళ్ళాన్ని కోపం చేయాలన్నా మొహమాటపడిపోయేంత. విమల చక్కగా ఉన్న షర్ట్ ను ఫేషన్ పేరిట అడ్డదిడ్డంగా కట్ చేసి కుట్టినా అలాగే ఆఫీస్ కు వేసుకెళ్ళేంత. ఆ నవల వస్తున్న రోజులల్లో అమ్మాయిలు మరీ ఇంత మంచివాడిని, బుద్ధావతారం, ముద్దపప్పును భరించలేము బాబూ, బుచ్చిబాబు లాంటి మొగుడసలొద్దు అని జోక్ లు వేసుకునేవారు.

"అత్తయ్యా ఇంక సద్దుకోవటము కాలేదా?" అని అడుగుతూ లోపలికొచ్చాడు మా మేనల్లుడు.

"అంతా అయ్యిందిరా. ఇదిగో ఈ మందులే హాండ్ బాగ్ లో సద్దుతున్నాను" అన్నాను.

"ఏమిటీ అన్ని మందులు హాండ్ బాగ్ లో సద్దుకుంటున్నావా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవునురా మరి, ఈ మధ్య ఏ పేపర్ లో చదివినా, ఏ టి. వి న్యూస్ ఛానల్ లో చూసినా టెరరిస్ట్ లు విమానాలను హైజాక్ చేయటమే వార్తలుగా ఉంటున్నాయి. అసలే మీ మామయ్య బైపాస్ ఐనప్పటి నుంచి మందుల మీదే ఉన్నారా? మా విమానం ఏ టెర్రరిస్టో హైజాక్ చేసాడనుకో, సంప్రదింపులూ అవీ ముగిసి మమ్మల్ని వదిలేసరికి ఎంత లేదన్నా కనీసం పదిరోజులైనా పడుతుంది. అందుకని ముందు జాగ్రత్తగా, ఇద్దరి మందులూ ఓ పదిహేను రోజులకు సరిపడా హాండ్ బాగ్ లో పెట్టుకుంటున్నాను" అన్నాను సీరియస్ గా మందులు లెక్కచూసుకుంటూ.

"నీ పిచ్చిగాని అత్తయ్యా, మిమ్మలిని ఏ టెర్రరిస్టైనా హైజాక్ చేసి బతికిబట్టకడతాడా? మామయ్య స్పీచ్ లకు బెదిరిపోయి దండం పెట్టి పారిపోతాడు" అని నవ్వాడు.

"అంతేరా నీకు మమ్మల్ని చూస్తే జోక్ గానే ఉంటుంది. టెర్రరిస్ట్ నే కానక్కరలేదు, ఏర్ పోర్ట్ లో మీ మామయ్య చేసే సాహసాలకు ఒకవేళ అక్కడే కొన్ని రోజులు ఉండిపోయే అవసరమూ రావచ్చు. ఏం చెప్పగలము?" అని రుసరుసలాడాను.

ఫైనల్ గా సద్దుకోవటములో సహాయము చేసి, ఏర్ పోర్ట్ దాకా మాతో వచ్చి హాపీ జర్నీ అని మామయ్యకు, మామయ్య వినకుండా, "భయపడకు అంతా బాగానే జరుగుతుంది" అని నాకు ధైర్యం చెప్పి వెళ్ళాడు.

"స్వామీ ఆంజనేయా మమ్మల్ని క్షేమంగా చేర్చు తండ్రీ" అని, మా చెల్లెలు నా సెల్ వాల్ పేపర్ లో సెట్ చేసి ఇచ్చిన ఆంజనేయస్వామిని కళ్ళకద్దుకొని, ఏర్ పోర్ట్ లోకి అడుగు పెట్టాను. బోర్డింగ్ పాస్ తీసుకొని, సెక్యూరిటీ చెక్ ముగించుకొని విమానంలోకి వెళ్ళాము. అమ్మయ్య ఇక హాంగ్ కాంగ్ దాకా నిశ్చింత!

హాంగ్ కాంగ్ లో దిగి కాస్త ఫ్రెష్ అప్ అయ్యాక, నెక్స్ట్ ఫ్లైట్ కు ఎక్కువ సమయము లేదు. అందుకని ఆ గేట్ దగ్గరే కూర్చుందామని, ఆ గేట్ దగ్గరకు వెళ్ళాము. అక్కడ ఉన్న ఖాళీ కుర్చీలో కూర్చోబోతూ, ఎదురుగా చూసాను. అక్కడ ఇద్దరు భార్యాభర్తలున్నారు. వాళ్ళ చేతుల్లో కవలపిల్లలనుకుంటాను ఉన్నారు. బహుశా ఆ పిల్లలకు మూడునెలలు ఉండవచ్చు. వాళ్ళు ఇండియన్స్ లా ఉన్నారు. పక్కన చాలా సామానులు ఉన్నాయి, ఇద్దరూ వాళ్ళను సముదాయించలేక సతమతమౌతున్నారు. పిల్లలను స్ట్రోలర్ లో పడుకోపెడితే ఊరుకోవటము లేదు. చాలా చికాకు చేసుకుంటున్నారు. పాపం ఇంత చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నారే అని జాలి పడుతున్నాను. హుం ఇంకో క్షణం లో నా మీదే నేను జాలి పడాల్సి వస్తుందని ఊహించలేకపోయాను. ప్రమాదము రానే వచ్చింది. "ఒక్కరిని ఆంటీకి ఇవ్వండి చూసుకుంటారు" అని వాళ్ళతో అన్నారు మా ఏమండీ గారు. పాపం అప్పటికీ వాళ్ళు మొహమాటపడుతుంటే బలవతంగా నాకప్పగించారు. నేను తేరుకొని చూసే లోపల, "పాపం వాళ్ళకు సహాయం చేయి నేనిప్పుడే కాఫీ తాగి, నీకు తీసుకొస్తాను" అని వెళ్ళిపోయారు. నేను నా చేతిలోని పసివాడిని గుడ్లప్పగించి చూస్తూండిపోయాను! ఒకళ్ళు పాలు కలుపుతుంటే, ఇంకోళ్ళు వాళ్ళకు పడుతూ, మధ్యలో రెస్ట్ రూం కు వెళ్ళి వస్తూ, పిల్లలను నాకు మార్చి మార్చి ఇస్తూ, అంతా నా ప్రమేయము లేకుండానే జరిగిపోతోంది. పోనీలే నేనూ కాస్త వాళ్ళకు సహాయము చేస్తున్నాను అనుకొని మాడిన మొహం మీద నవ్వును అతికించుకున్నాను.

ఎంత సమయము గడిచిందో తెలియలేదు. ఇంతలో విమానం లోకి ప్రయాణికులను ఎక్కమని ఎనౌన్స్ చేస్తున్నారు. అందరూ వళ్ళు విరుచుకొని వాళ్ళ వాళ్ళ సామానులు తీసుకొని కదిలారు. అప్పుడు ఈయనేరీ అని చుట్టూ చూసాను. ఎక్కడా కనిపించలేదు. గుండె గుభిల్లుమంది. ఎక్కడున్నారు, ఏమి చేస్తున్నారు? కాఫీ తాగి నాకు తెస్తానని వెళ్ళిన మనిషి ఏమైపోయారు? రకరకాల ప్రశ్నలు. భయం. వళ్ళంతా వణికిపోతోంది. పసిపిల్లలున్న వాళ్ళను ముందుగా రమ్మని అనౌన్స్ చేసారు. నా చేతిల నుంచి పిల్లవాడిని తీసుకొని వాళ్ళు లేచారు. "ప్లీజ్ కాసేపు ఉండరా! మీ అంకుల్ రాలేదు, భయంగా ఉంది" అని దిగులుగా, భయంగా అన్నాను ఆ అబ్బాయితో. ఒక్క క్షణం కూర్చొని లేచారు. "వాళ్ళు రమ్మని అనౌన్స్ చేస్తున్నారాంటీ!" అని పిల్లవాడిని నా చేతులో నుంచి తీసుకొని వెళ్ళిపోయారు. దీనంగా చూస్తూ ఉండిపోయాను...

క్షణాలు భారంగా గడుస్తున్నాయి...

క్యూ లో ఒక్కరొక్కరే కదిలి వెళ్ళిపోతున్నారు...

కళ్ళ నిండా నీళ్ళు... ఏమి చేయాలో తోచటం లేదు... హనుమాన్ చాలీసా చదువుకుందామనుకున్నా గుర్తు రావటం లేదు...

అందరూ లోపలికి వెళ్ళిపోయారు...

సెక్యూరిటీ గార్డ్ వచ్చి, "మీరెందులో వెళ్ళాలి?" అని అడిగాడు. లాంజ్ లో ఒక్కదాన్నే ఉండటము వల్ల అనుకుంటాను వచ్చి అడిగాడు. ఇందులోనే అని వణికిపోతూ, భయపడుతూ చెప్పాను. "మరి వెళ్ళండి" అన్నాడు. "మా హస్బెండ్ కోసం వెయిట్ చేస్తున్నాను" అని చిన్నగా చెప్పాను. అతను విచిత్రంగా చూసి వెళ్ళిపోయాడు!

గేట్ దగ్గర వాళ్ళు లెక్క చూసుకున్నారు కాబోలు మమ్మల్ని రమ్మని మా పేర్లు ఎనౌన్స్ చేసారు. చుట్టూ చూసాను ఎక్కడా ఏమండి కనిపించలేదు. దిక్కు తోచక ఏమి చేయాలో తెలీక తల వంచుకొని కూర్చున్నాను.

దిస్ ఈజ్ లాస్ట్ ఎనౌన్స్మెంట్ ఫర్ అని మా పేర్లు మళ్ళీ వినిపించాయి. అలాగే తల వంచుకొని, చేతులు నలుపుకుంటూ కూర్చున్నాను. ఇంతలో నా భుజం మీద చేయి పడింది. ఏమండీనే...

“పద” అని నా చేయి పట్టుకొని లేపారు.  మౌనంగా ఆయన వెనక నడిచాను...

సీట్ లో కూర్చొని బెల్ట్ పెట్టుకుంటూ "నువ్వు ఎక్కకపోయావా, నేను వచ్చేవాడిని కదా" అన్నారు.

"ఏమిటీ, మీరు రాకుండా నేను విమానం ఎక్కి, మీరేమయ్యారో తెలీక, మీదారిన మిమ్మలిని వదిలేసి వెళ్ళిపోవాలా?" అని ఉక్రోషంగా అంటూ ఆయన వైపు చూసాను. కొద్దిగా ఆయాసపడుతున్నారు.

"ఏమిటి ఏమైంది? ఎందుకలా ఆయాసపడుతున్నారు?" నా కోపం మర్చిపోయి గాభరాగా అడిగాను. ఆయన మాట్లాడలేదు.  చిన్నగా ఆయాసపడుతూ కళ్ళు మూసుకొని కూర్చున్నారు.

"ఏమైందండి? అసలు ఇప్పటిదాకా ఎక్కడికెళ్ళారు? ఈ ఆయాసమేమిటి?" ఆదుర్దాగా అన్నాను.

"ఏమీ లేదులే కంగారు పడకు.  నేను కాఫీ తాగి నీకు తీసుకొని వస్తుండగా ఒక అమ్మాయి ఎదురుగా వచ్చింది.  ఆ అమ్మాయి స్ట్రోలర్ లో చిన్నపాపను తోసుకుంటూ, భుజానికి బాగులతో,  ఇంకో చేతితో ఓ మూడేళ్ళ బాబు ను పట్టుకొని వస్తోంది. ఇంతలో ఆమె చేతిలో ఉన్న బాబు,  చేయి విడిపించుకొని పరిగెత్తాడు. ఆ అమ్మాయి, “ప్లీజ్ కాచ్ హిం” అంది నాతో కంగారుగా.  కాఫీ కప్పు అక్కడే వదిలేసి వాడి వెనుక పరిగెత్తాను. వాడు దొరకలేదు. చాలా దూరం పరిగెత్తించాడు. చివరకు ఎలాగో వాడిని పట్టుకొని,  ఆ అమ్మాయిని కలుసుకొని,  తన గేట్ దగ్గర వదిలేసి,  ఇక్కడ లేట్ అవుతోందని, నువ్వు భయపడతావని తొందరతొందరగా వచ్చాను. కనీసం ఆ అబ్బాయైనా నీకు తోడుగా ఉంటాడనుకున్నాను,  నిన్ను వదిలేసి వెళ్ళిపోయారా? అవునులే వాళ్ళకూ ఆలశ్యం అవుతుందికదా" అంటూ కళ్ళు మూసుకొని కూర్చున్నారు.

"ఆ బాబు వెనుక పరిగెత్తారా? అక్కడ ఇంకెవరూ లేరా? సెక్యూరిటీ వాళ్ళు ఉంటారు కదా వాళ్ళకైనా చెప్పవచ్చుకదా?" అయోమయంగా అడిగాను.

"అవన్నీనాకప్పుడు తోచలేదు. ఆ అమ్మాయి గాభరా పడుతోంది. వాడు పరిగెడుతున్నాడు. సహాయము చేద్దామనుకున్నాను అంతే" అన్నారు తిరుగులేనట్లు.

ఏర్ హోస్టెస్ ను పిలిచి జ్యూస్ తెమ్మని చెప్పాను.

ఆయన గుండె మీద చిన్నగా రాస్తూ "బుచ్చిబాబు లాంటి మొగుడొద్దన్నాని ఇంత సూపర్ ఫాస్ట్ మొగుణ్ణిచ్చావా?" అని ఆంజనేయస్వామితో నిష్ఠూరంగా అన్నాను.

- (మందాకిని త్రైమాస లిఖిత పత్రిక 15-10-2017)

## 17. సాట్ అందర్... అమ్మా బాహర్... దర్వాజా బంద్

ధడ్... ధఢ్... ధఢ్... ధడాల్...

పెద్ద చప్పుడుతో తలుపు తెరుచుకోగానే, "ఆజ్ హవా బహుత్ హైనా అమ్మా, నిచే కాభీ కొండీ లగాలో తబ్ సై ఖులేగా!" అని చెప్పి జహీరా వెళ్ళి పోయింది. ఓరినీ గాలికి తెరుచుకుందా ఈ తలుపు! ఏ దొంగోడు వచ్చాడో, ఏ దయ్యమో వచ్చిందోనని ఎంత హడలి చచ్చాను. ఈ తలుపులు మరీ ఇంత వీకేమిటి బాబూ... ఇంత దడిపిస్తున్నాయి! మేము ఈ ఇంట్లోకి వచ్చిన నాలుగైదు రోజులకేననుకుంటా, నేను వంట ఇంట్లో పని చేసుకుంటూ వుండగా, మా ఏమండీ పిలుపులు వినిపించాయి. 'ఏముంది, ఇందాక పేపర్ చదువుతూ కనిపించారు, పేపర్ ఏమైనా కింద పడి వుంటుంది. తీసి ఈయమనో, లేదా సెల్ తెచ్చియమనో పిలుస్తున్నారులే' అనుకొని చిన్నగా చేతిలో పని పూర్తి చేసుకొని వెళ్ళాను. ఏరీ? ఈ మనిషెక్కడా కనిపించటము లేదే అనుకుంటూ ఇల్లంతా కలియ జూస్తూ, "ఎక్కడండీ?" అని అడిగానా, "ఈ గదిలో, బయట నుండి తలుపు తీయి!" అని ఓ గది లోనుండి వినిపించింది. ఇదేమిటి, గది తలుపు వేసుకొని నన్ను తీయమంటున్నారూ... అని దీర్ఘం తీస్తూ బయట నుండి హాండిల్ తిప్పాను. రెండు సారులు తిప్పితేనే కాని రాలేదు. చెమటలు కక్కుతూ బయటకొచ్చారు. "ఇంత సేపు ఏం చేస్తున్నావు? ఈ తలుపు రాలేదు. పిలవగానే రావద్దూ?" అని కోపం చేసారు. తలుపు రాకపోవటమేమిటి???

"లోపల హాండిల్ విరిగి పోయింది అందుకని తలుపు వేస్తే లోపల నుండి తీయటానికి రాదు. నేను ముందు చూడలేదు. జాగ్రత్త, నువ్వు లోపలి కెళ్ళి తలుపేసుకోకు అన్నారు.

ఒక్క క్షణం భయం వేసింది. ఆ... ఈ సంగతి తెలిసాక నేను లోపలి కెళ్ళి తలుపేసుకోవటమా? నెవర్. ఐనా ఏమండీ లోపల ఉండగానో, పొరపాటున నేను లోపలికి వెళ్ళినప్పుడో పడిపోతే ఎలా? అందుకని ఎలాగూ మా ఏమండీకి తలుపు చెక్క మీద టవల్ ఆరేయటము అలవాటు కాబట్టి, ఏదో ఒక తలుపు మీద ఎందుకు, ఈ తలుపు మీదే వేస్తే పోలే అనుకొని, ఏమండి టవల్ ఏ తలుపు మీద వేసినా తీసుకొచ్చి ఈ గది తలుపు మీద

వేయసాగాను.  ఐతే ఈయన గారు ఎప్పుడు ఆ టవల్ గుంజేస్తారో తెలీదు.  అందుకని, స్టాపర్ పెట్టి,  తలుపుకడ్డంగా ఓ కుర్చీ కూడా పెట్టాను.  ఒకటి కాకపోతే ఒకటైనా తలుపు పడకుండా కాపాడుతాయి కదా అని.  అంతేనా హాండిల్ లాక్ దగ్గర హోల్ లో బాగా కాగితాలు కూడా గుచ్చి అలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని, "అమ్మయ్య!" అని ఊపిరి తీసుకున్నాను.  అ గదికి స్కేరీ రూం అని మా మనవళ్ళు ఓ పేరు కూడా తగిలించారు. ఇక ఫరవాలేదులే అని నిశ్చింతగా ఉన్నాను. హుం నన్ను అలా నిశ్చింత గా ఏమండి ఉండనిస్తే ఇహ లేనిదేముంది ?

ఈ రోజు ఆదివారం అమ్మ లంచ్ కు రమ్మన్నది. వెళ్ళేందుకు తయారవుతున్నాము.  ఇంతలో ధోభీ కిషోర్ వచ్చాడు.  అతనికి బట్టలేసి,  డబ్బులిచ్చి పంపేసరికి పేపర్ బాయ్ ధ్రువకుమార్ వచ్చాడు.  అతనికి డబ్బులిద్దామని లోపలికి వచ్చాను.  బాత్ రూం తలుపు,  స్కేరీ రూం తలుపు వేసి వున్నాయి.  చిన్నగా బాత్రూం తలుపు తోసాను.  తెరుచుకుంది.  స్కేరీ రూం తలుపు... తో...సాను. తెరుచుకోలే.  గుండె ఝుల్లుమంది.  అనుమానంగా చిన్నగా, 'హేమండీ!' అని పిలిచాను...

"ఊ..." లోపలి నుండి సమాధానం వచ్చింది.

ఐనా "లోపల వున్నారా?" గుసగుసగా,  భయంభయంగా అడిగాను.

"ఏమిటా పిచ్చి ప్రశ్న? తీయ్ హాండెల్" అని అరిచారు.  హాండిల్ తిప్పాను.  రాలేదు.

"గట్టిగా తిప్పు" లోపలి నుండి హుకుం.

"అబ్బే రాలే.  రాలేదండి," గొంతులో ఏడుపు,  వణుకు!!

"యేహే గట్టిగా గుంజు" లోపలి నుండి అరుపు.  ఘట్టిగా గుంజాను.  పుటుక్ హాండిల్ పుటుక్ "అయ్యో హాండిల్ విరిగిపోయిందండి వా..." బయట నుండి ధ్రువకుమార్ "అమ్మా నా పైసలిస్తే నే పోతా!" అని ఒకటే పిలుపు.  లోపలి నుండి ఏమండి "ముందు వాడిని పంపించిరా" అన్నారు.  మూడొందలే ఇచ్చానో,

నాలుగొందలే ఇచ్చానో ఇచ్చి పంపి, స్కేరీ రూం ముందుకొచ్చాను. మళ్ళీ తలుపు ఎలా తీయను? లోపలి నుండి ఏమండి "హాండిల్ గట్టిగా తిప్పు" అన్నారు.

"ఎక్కడండీ, హాండిల్ పుటుక్ మందిగా."

"ఐతే కీస్ పెట్టి తీయి అదీ నేనే చెప్పాలా బుర్ర లేదు" అని వెటకారాలు. "నా బుర్ర సరే, కొంపలో వుండి చచ్చింది ఇద్దరమే, నేను బయటెక్కడో ఉన్నాను, తమరు తలుపు ఎందుకు వేసుకున్నట్లు?"

"పిచ్చిగా అరవకు నేనెక్కడ వేసాను? అదే పడింది. హాండిల్ తిప్పు"

"హాండిల్ విరిగి చచ్చిందని చెప్పానా? కీస్ తో రావటము లేదు. ఇప్పుడెలా? పక్కింటి వాళ్ళను పిలవనా"

"పక్కింటి వాళ్ళను పిలుస్తావా? ఏమక్కర లేదు. కీస్ తో తీయ్."

కీస్ ఎంత తిప్పినా రాదే! భగవంతుడా ఏం చేయను? ఏడుపు, కోపం, భయంతో కాసేపు అటూ ఇటూ చూసి ఎందుకో వంటింట్లోకి వెళ్ళాను. అక్కడ జహీరా తోమటానికి గిన్నెలు తీస్తోంది. "జహీరా సాబ్ అందర్ బంద్ హోగయే. థోడా తుం దర్వాజా కోల్ సక్తే క్యా? కోషిష్ కరో. మేరేసే నైహోరా. మేరా హాత్ పావ్ కాంప్రె" అని కీస్ జహీరా కిచ్చాను. తను కీస్ పెట్టి తిప్పుతూ "సాబ్ అందర్... అమ్మా బహార్ బంద్ హోగయే" అని పాట మొదలు పెట్టింది.

"క్యా జహీరా క్యా బోల్ రహేహో" అడిగాను.

"కుచ్ నై అమ్మా మేరోకో బాబీ కా గానా యాద్ ఆయా" అంది.

అప్పటి దాకా ఉన్న టెన్షన్ ఏమైందో నేనూ నవ్వుతూ పాట ఎత్తుకున్నాను.

“సాబ్ అందర్... అమ్మా బాహర్

దర్వాజా బంద్ హోగయా...

దర్వాజా బంద్ హోగయా...

కొండీ తూడ్ గయా. . .

అందర్సే కోయి బాహర్,

బాహర్ సే కొయి అందర్ నా జాసకే

సోచో అబ్ క్యా హోగా...” ఇద్దరమూ పాడుకుంటున్నాము.

"ఏమొచ్చిందే పిచ్చి పోరగాళ్ళారా, (పాపం ఏమండిగారికి పిచ్చిపోరి తప్ప ఇంకో తిట్టు రాదు) తలుపు తీయకుండా పాటలు పాడుతున్నారు. జహీరా కొండీ జోర్సే ఖీంచో" అన్నారు.

"సాబ్ కొండీ తూడ్ గయా" అంది జహిరా.

"ఇప్పటికెన్నిసార్లు చెప్పాను, హేండిల్ విరిగిందని. తలుపేసుకున్నారు కదా కూర్చోండి" అన్నాను.

"పిచ్చి వాగుడు వాగకు. నేనెక్కడ వేసాను అదే పడిందని చెప్పానా?"అన్నారు విసుగ్గా. "టవల్, స్టాపర్, కుర్చీ, ఇన్నింటిని నెట్టుకుంటూ తలుపదే పడి పోయిందా?" అడిగాను. "ఇపుడవన్ని అవసరమా? తలుపు తీయ్ ముందు" అన్నారు. "ఎలా తీయను? అలాగే ఉండండి. నేను అమ్మ దగ్గరికెళ్ళి లంచ్ చేసి మీకు కారియర్ తెస్తాను, ఈ లోపల ఏదో ఉపాయం తోచకపోదు"అన్నాను టీజింగా. అప్పుడప్పుడు ఏమండిని జోక్ చేసే ఛాన్స్ వస్తుంది మరి.

"సద్దు జోకులాపు ముందు" అన్నారు చికాగ్గా. ఇంతలో నాకో బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. జహీరా కు స్క్రూ డ్రైవర్ ఇచ్చి, హాండిల్ ప్లేట్ వూడదీయమన్నాను. కాస్త అటూ, ఇటూ తిప్పింది. లేచి వంట ఇంట్లో కెళ్ళి కత్తి పట్టుకొని వస్తోంది...

ఇదేమిటి? కత్తి తెస్తోంది. ఆయన లోపల బందీగా వున్నారు. నన్ను పొడిచి, నా మెడలోని గాజులు... చేతి గొలుసు... కాదు కాదు చేతి గొలుసు, అబ్బ ఏదో వొకటి నా వంటి మీది బంగారం తీసుకొని పారిపోదు కదా!! శ్రీ రామచంద్రా నారాయణా ఎన్ని కష్టాలు... అని నేను అనుకుంటుంటూ ఉండగానే, ఆ కత్తితో, స్క్రూ డ్రైవర్ తో కొద్దిగా వచ్చిన ప్లేట్ కు సపోర్ట్ పెట్టి మొత్తం ప్లేట్ వూడ దీస్తోంది. పాపం ఎంత అపార్ధం చేసుకున్నాను! మొత్తానికి కష్టపడి హాండిల్ ప్లేట్ ఊడదీసింది. అక్కడ ఏర్పడ్డ కంతలో నుండి లోపలికి చూసి, "అమ్మా సాబ్ దేఖో కైసే బైటే "అంది. నేనూ చూసాను. మంచం మీద కూర్చొని పైకి చూస్తున్నారు.

"ఏమండీ పైకి దీర్ఘంగా చూస్తున్నారేమిటి? పై కప్పు ఊడదీస్తే పై ఇంటాయన తోలు తీస్తాడు" అన్నాను నవ్వుతూ.

ఉరిమి చూస్తూ, "వెధవ జోకులాపు" అని, "జహీరా చాబీసె నికాలో!" అన్నారు. మధ్యలో తలుపు లేకపోతే నేను భస్మం అయిపోయే దానినే!!

అబ్బే ఆ చాబీ ఉండటము లేదే! ఇప్పుడు మరీ కష్టమైంది. ఇదేమిటి ఇలా అవుతోంది.

ఇప్పుడెలా? ఇప్పటికే బందీ అయ్యి అరగంట పైన అయ్యింది. ఎలారా దేవుడా!

ఓ పక్క స్క్రూ డ్రైవర్ తో తిప్పుతూనే, "అమ్మా అగర్ సాబ్ బాహర్, అమ్మా అందర్ బంద్ హో గయా తో క్యా హోగా?" అని అడిగింది జహీరా.

"క్యా హోగా కాలియా? అమ్మ ఝూటర్ ఢమాల్" అన్నాను నవ్వుతూ.

"ఏమొచ్చిందే మీకు, మీ పాటలు తగలెయ్య. తలుపు తీసి ఏడవండి ముందు" అరిచారు ఏమండి.
"అబ్బ ఉండండి. మరీ అంత మమ్మల్ని చూసి కుళ్ళు కోకండి సారూ."

అమ్మయ్య స్క్రూడ్రైవర్ తో అటు తిప్పి, ఇటు తిప్పి ఎలా ఐతేనేం ఏమండి బంధ విముక్తులైనారు.
“అందర్ సాట్... బాహర్ అమ్మా బంద్ హోగయే.

కొండీ తూడ్గయా, సోచో కభీ ఐసా హోతో క్యా హోగా?” జహీరా మహా ఉషారుగా పాడేస్తోంది.

“అదికాదండి,” అంటూ గదిలోకి చూసిన నాకు దూరంగా పడి వున్న కుర్చీ... మా ఏమండీ నడుముకు టవల్... దర్శనం ఇచ్చాయి. స్టాపర్ ఏమైందో పాపం! అరె కాగితాలూ పడిపోయాయి!

(నా బ్లాగ్ సాహితిలోని ఎప్పుడో రాసుకున్న పోస్ట్)

## 18. లావొక్కింతయు లేదు!

"నువ్వసలు నా డైట్ గురించి సరిగ్గా పట్టించుకోవటము లేదు." ఏమండి నిష్టూరంగా అన్నారు.

"అదేమిటి ఈ ఉరుములేని పిడుగు? నూనె తక్కువగా వేస్తున్నాను. ఉప్పూకారం చాలా తగ్గించాను. ఆకుకూరలు పొడికూరలుగా చేస్తున్నాను, పుల్కాలు చేస్తున్నాను. ఇంకేమి చేయాలి? ఇంకెంత డైటింగ్ చేస్తారు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"నేను బరువు చాలా తగ్గాలని డాక్టర్ అంటున్నాడు. ఈ డైటింగ్ సరిపోదు. నీ సొంత పెత్తనం కాదు, ఈ రోజు మా లైఫ్ సెంటర్ కు వచ్చి డైటీషియన్ తో మాట్లాడు" అని ఆర్డర్ వేసారు.

ఇహ తప్పేదేముంది? ఈసురోమంటూ ఆయనతో పాటు లైఫ్ సెంటర్ కు వెళ్ళాను. ఆయన ట్రైనరునూ, డైటీషీయన్ ను పిలిచి పరిచయము చేసారు. ఇద్దరూ సన్నగా, తెల్లగా, సన్నజాజి మొగ్గల్లా వున్నారు. “అమ్మాయిలూ మా ఆయన సంగతి పక్కన పెట్టండి. నన్ను మీలా తయారుచేయగలరా?" ఆశగా అడిగాను. “మీ పర్సనాలిటీ బాగుంది కదా మేడం?” అంటూ చిన్నగా చిలకల్లా నవ్వేసారు ఇద్దరూ! ట్రైనరూ, మావారు జిమ్ లోకి వెళ్ళారు. వెళుతూ వెళుతూ, “అన్నీ జాగ్రత్తగా కనుక్కో" అని నన్ను హెచ్చరించటం మర్చిపోలేదు మా ఏమండి.

డైట్ పిల్ల నా పక్కన కూర్చొని ఓ రెండు అచ్చులో వున్న పేపర్ లు తీసింది. దానిలో పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి వరకూ ఏ సమయములో ఏమి తినాలి వివరముగా వ్రాసి వుంది.

"మేడం బియ్యము పూర్తిగా మానేయాలి. దోశలు, ఇడ్లీలల్లో కూడా వాడవద్దు" అంది.

“సరే.”

"బియ్యము బదులు, జొన్నలు, రాగులు, సజ్జలు లాంటివి వాడవచ్చు. మైదా కలవని గోధుమపిండి వాడవచ్చు."

ఆ పిల్ల చెప్పేవన్నీ శ్రద్ధగా విన్నాను. ఖర్మ కాకపోతే, 'ఇన్నేళ్ళకు మా ఏమండీకి ఏ తిండి పెట్టాలో ఈ బొట్టెతో చెప్పించుకోవలసి వచ్చింది!' అని గొణుక్కున్నాను అది వేరే సంగతి. ఓ అరగంట నా బుర్ర తిన్నాక డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. ఆయన మాఏమండీ బరువు తగ్గటము ఎంత అవసరమో, దానికి నేనెంత సహకరించాలో చెప్పీ చెప్పీ వాయగొట్టేసాడు. బుద్ధిగా బుర్ర ఊపాను. ఇలా ఓ రెండు గంటలు నానా హింసలపాలు చేసి వదిలేసారు లైఫ్ సెంటర్ వాళ్ళు!

ఇంటికి రాగానే డైట్ ఛార్ట్ ముందు పెట్టుకొని క్షుణ్ణంగా పరిశీలించాను. ముందుగా ధాన్యాలు కొనాలి. సలాడ్ లకు, సూప్ లకు కూరగాయలు కొనాలి. మరీ రోజు ఒకే రకంగా చేస్తే తినలేరుకదా పాపం అనుకొని గూగుల్ తీసి రకరకాల సలాడ్స్, సూప్స్ రెసిపీలు సర్చ్ చేసాను. పనిలో పని ఫ్రెండ్స్ అందరికీ మీకు తెలిసిన సలాడ్ ల, సూపుల రెసిపీలు చెప్పండహో అని మెయిల్స్ ఇచ్చాను. పాపం అందరూ తిరుగు టపాలో బోలెడు రెసిపీలు పంపారు. ఎంతైనా నా స్నేహితులు గుడ్ గర్ల్స్. సాయంకాలము సూపర్ మార్కెట్ కు వెళ్ళి ధాన్యాలన్నీ తెచ్చేసాను. ఎవరో చెప్పారు, సికింద్రాబాద్ లో ఇలా డైట్ పాటించేవాళ్ళ కోసమే ప్రత్యేకమైన ఓ కూరగాయల షాప్ వుంది. అక్కడ సలాడ్స్ కు కావలసిన రకరకాల కొత్తరకం కూరగాయలు దొరుకుతాయి అని. అంతే! ఛలోమంటూ వెళ్ళి వెయ్యిరూపాయల కూరలు తెచ్చేసాను. అదేమిటో ఫ్రిడ్జ్ లో అన్ని కూరలూ పట్టలేదు. పక్కింటి వాళ్ళను అడిగి కాసిని వాళ్ళ ఫ్రిడ్జ్ లో పెట్టుకోమందామా అనుకొని వద్దులే ఏమండి తిడతారు అని ఊరుకున్నాను.

పొద్దున్నే యుద్ధ ప్రాతిపదికన డైట్ ప్లాన్ మొదలు!

"ఏమండీ వేడి వేడి రాగి ఇడ్లీలు తయార్, వచ్చేయండీ!" అని కేకేసాను.

"రాగి ఇడ్లీలు, పుదీనా పచ్చడి బాగున్నాయోయ్?" మెచ్చుకున్నారు ఏమండీ. "ఇంకో రెండు వేసుకోండి!" అని ప్రేమగా వడ్డించాను.

"మృదువుగా బాగా వచ్చాయి.  ఇంకా ఉన్నాయా? బాక్స్ లో పెట్టి ఇవ్వు, మా ట్రైనర్ కి, డైటీషియన్ కీ ఇస్తాను" అన్నారు.  మురిసిపోతూ, మిగిలినవన్నీ బాక్స్ లో పెట్టి ఇచ్చాను.  మరి వాళ్ళకూ తెలియాలిగా నేనెంత కష్టపడుతున్నానో!

పొద్దున రాగి ఇడ్లీ,  మధ్యాహ్నము సలాడ్,  రెండు ఫుల్కాలు,  సాయంకాలము పెసల మొలకల చాట్,  రాత్రికి సూప్,  సలాడ్,  రెండు పుల్కాలు,  చిన్న గిన్నెడు సొరకాయ కూరా చేసేసాను!

రాగి ఇడ్లీలు,  సజ్జ ఇడ్లీలు,  జొన్న రొట్టెలు,  రకరకాల సలాడ్ లు,  సూపులూ నా శక్తి కొద్దీ,  మా ఏమండి మీద భయం కొద్దీ పైనపైనాలుగా చేస్తున్నాను.  "ఇడ్లీలల్లోకి పుట్నాల పప్పూ,  వేరుశెనగ పప్పూ,  కొబ్బరీ వాడొద్దు!" అంది డైట్ పిల్ల.  ఐనా 'మేము మాత్రం కొబ్బరి,  వేరుశెనగ తిని కొవ్వు పెంచుకుంటామా ఏమిటి? విడ్డూరం కాకపోతే. మాకూ తెలుసులేమ్మా!' మూతి తిప్పుకున్నాను.  "పుదీనా,  టమాటో,  అల్లం పచ్చళ్ళు చేసుకుంటాములేమ్మా!  బియ్యం రవ్వతో వద్దన్నావు సరే కానీయ్ ఏం చేస్తాను రాగి, సజ్జలతో ఇడ్లీలు చేస్తాలేవమ్మా! అన్నట్లు ఆవిరి కుడుములు కూడా ఉన్నాయిగా! అవి చేస్తే పోలే!

ఇహ తరువాత ఐటెం సలాడ్.  పాపం రోజు ఖీరా దోసకాయ,  టమాటా,  ఉల్లిపాయ ఏం తింటారు? రంగురంగుల కాప్సికంలైతే తినటానికీ,  చూసేందుకూ బావుంటాయి. అన్నట్లు ఈ మధ్య క్యాబేజీ కూడా ఎరుపురంగులో వస్తోంది.  అదీ బానే వుంటుందిగా! ఊ... ఇంకా బ్రాకలీ,  బఠానీలు కలిపి చేసే సలాడ్ కూడా బావుంటుంది.  పాలకూర, నిమ్మకాయ, ఆపిల్ కలిపి చేయొచ్చు.  వాకే డన్! మరి అన్నము తినకూడదాయే! కనీసం కంటికి, పంటికి ఇంపుగానైనా వుండాలా అందుకే ఈ తిప్పలన్నీ... పాపం ఈ ఆకులూ, అలములూ ఎంత తింటే కడుపు నిండాలీ! కళ్ళనీళ్ళు,  ముక్కూ తుడుచుకుంటూ,  డైట్ పిల్లమీద గొణుక్కుంటూ అనుకున్నాను.  చెప్పొద్దూ ఆయన కూడా చాలా రుచిగా చేస్తున్నావు అని తెగ మెచ్చేసుకుంటున్నారు.  పాపం ఇంకేమి చేస్తారు? జాలితో మరీ మరీ వడ్డించేదాన్ని. కాకపోతే ఆ ఆకులూ అలములూ తినలేక నా కోసం కూర, పప్పూ వేరే వండుకుంటున్నాను.  మరి నేను ముప్పొద్దులా అన్నం తినేదాన్ని కదా ఇవేం తినగలను? మా ఏమండీ తినగా మిగిలినవి పనమ్మాయికి ఇచ్చేస్తున్నాను.  అవునూ వాళ్ళు

ఇలాంటివన్నీ చేసుకోరాయే కాస్త తింటుంది పోనీలే. పాపం ఆ పిల్లా 'బాగున్నాయమ్మా' అంటూ లొట్టలేసుకుంటూ తింటోంది.

సూపర్ మార్కెట్ నుంచి తెచ్చిన ఉప్పు బిస్కెట్ పాకెట్లు, ఓట్ బిస్కెట్లు అలమారాలో సద్దుతూ, అరే నాకోసం తెచ్చుకున్న క్రీం బిస్కెట్ పాకెట్ ఇక్కడ వుండాలే ఏమైంది అనుకుంటూ "ఏమండీ, మీరేమైనా క్రీం బిస్కెట్ పాకెట్ చూసారా?" అని కేకేసాను.

"ఆ... రాత్రి కాస్త లో సుగర్ అనిపిస్తే తిన్నాను" బదులిచ్చారు.

"మొత్తం పాకెట్ తిన్నట్లున్నారు."

"అబ్బ ఏదో తిన్నానులే వదిలేయ్?"

"వాకే వాకే."

చూస్తుండగా నెల రోజులు గిర్రున తిరిగి పోయాయి. ఆ... ఎంతలో తిరుగుతాయి రోజులు!

పొద్దున్నే విచారంగా వచ్చిన మా పనమ్మాయిని, "ఏమైంది అట్లా ఉన్నావు?" అని అడిగాను.

"లావెక్కుతున్నావు. ఒళ్ళు కొవ్వెక్కింది. ఈ మధ్య నీకు తిండి ఎక్కువైంది. తిండి తగ్గించు, అని తిట్టాడమ్మా మా ఆయన. నేనెక్కువ ఏమి తింటున్నానమ్మా?" బేలగా అడిగింది.

పరిశీలనగా చూసాను. నిజమే లావయ్యింది. పొద్దుటి నుంచీ నాలుగైదు ఇళ్ళల్లో పని చేస్తుంది. ఐనా నా దగ్గర తప్ప ఇంకెక్కడా ఏమీ తినదు ఏమైందో పాపం ఏమైనా హార్మోనల్ ప్రాబ్లం ఏమో... నా నెట్ పరిజ్ఞానంతో అనుకున్నాను.

"దిగులు పడకు ఏమి చేయాలో చూద్దాం" అని ఊరడించాను.

సార్ గారు వచ్చే టైం అయ్యింది. రాగిజావ చేయాలి. పొద్దున బ్రేక్ ఫాస్ట్ కూడా సరిగ్గా తినలేదు. నిన్న క్లబ్ కు బ్రిడ్జ్ ఆడేందుకు వెళ్ళి రాత్రి చాలా ఆలశ్యంగా వచ్చారు. బోజనానికి రండీ అంటే ఓ పెగ్ విస్కీ, ఓ ప్లేట్ బటాకా వడా తిన్నాను ఆకలిలేదన్నారు.

ఓ పెగ్గేనా రెండు మూడూ కానిచ్చేసుంటారు. బటాకావడతో పాటు కట్ మిర్చీ, పల్లీలూ లాగించేసివుంటారు. లేకపోతే ఆకలెందుకువేయదు? పోనీలే పాపం ఎంతకని నోరు కట్టేసుకుంటారు అనుకుంటూ రాగి పిండి తీసాను.

ఇంతలో "ఎక్కడున్నావు?" లైఫ్ సెంటర్ నుంచి వస్తూనే అరిచిన ఏమండి అరుపు వినిపించింది. ఆయనకోసం చేస్తున్న రాగిజావను అలాగే వదిలి ఏమైంది ఇలా అరుస్తున్నారు అని హడలిపోతూ పరిగెత్తాను.

"ఇప్పుడు నా వెయిట్ ఎంతో తెలుసా?" భీకరంగా అడిగారు.

ఆయన భీకరాన్ని పట్టించుకోకుండా "ఎన్ని కిలోలు తగ్గారండీ? మీ డాక్టర్ ఏమన్నాడు?" సంబరపడిపోతూ అడిగాను.

"నీ మొహం! తగ్గటం కాదు, నాలుగు కిలోలు పెరిగాను" అరిచారు.

"హేమిటీ?" ఆశ్చర్యపోతూ ఆయన్ని పైనుంచి కింది దాకా పరిశీలించాను. "నిజమేనండోయ్! ఈ బుజ్జి బొజ్జ ఎంచక్కగా ముందుకొచ్చిందో! సంబరపడిపోతూ బొజ్జను చిన్నగా తట్టాను. బుగ్గలు నునుపు తేలాయి. మంచి రంగుతో నిగనిగలాడిపోతున్నాయి. బొద్దుగా, గుండ్రంగా ఎంత ముద్దొస్తున్నారండీ! ఈ ట్రాక్ సూట్ లో భలే స్మార్ట్ గా వున్నారు. నా దృష్టే తగిలేట్టుగా వుంది. వుండండి దృష్టి తీస్తాను" అంటూ మొట్టికాయలు తగలకుండా దూరం జరిగాను.

అప్పటి ఆయనగారి చూపు వర్ణించ నాతరమా!

ఐనా ఎక్కడ పొరపాటు జరిగింది? అన్నీ ఆ డైట్ పిల్ల చెప్పినట్లే చేస్తున్నాను కదా. ఏమి తేడా వచ్చిందబ్బా!

ఎంత ఆలోచించినా ఎక్కడ పొరపాటయ్యిందో అర్థం కాలేదు. నా ఫ్రెండ్ కు కాల్ చేసి, "మొగుడి క్షేమం కోసం లక్షవత్తులనోము, సావిత్రీ గౌరీ నోము నోచినంత శ్రద్ధగా డైట్ వంటలు చేసాను. మా ఆయనకిష్టమైన వివాహభోజనం పాట, ఘటోత్కచుడి బొమ్మే కాదు మాయాబజార్ సినిమా సీ. డీ నే ఇంట్లో ఎక్కడా లేకుండా చేసాను. గాంధారిలా ఆయన తినకూడనివన్నీ అన్నం తప్ప అన్నీ నేనూ తినటం మానేసాను. ఐనా మా

ఏమండీ ఒక్క గ్రాము తగ్గకుండా నెలనెలా పెరిగే బంగారం ధరలా పెరిగారు. ధూం ధాం అంటున్నారు. నాతో మాట్లాడటం మానేసారు" బేరుమన్నాను.

"మొగుడి మీద ప్రేమ తగలెయ్య. జాలితో ఎంత ఆకులూ అలములైతే మాత్రం వారానికి ఐదు కిలోలు కొసరి కొసరి తినిపిస్తే ఎట్లా? ఆయనా క్రీం బిస్కెట్లూ, పెగ్ విస్కీ, బటాకావడా అంటూ లాగించేస్తూవుంటే పెరగక తగ్గుతారా? నీ బొంద. లక్షవత్తులనోము కాదు నందికేశుని నోము చేసావు. ఇక నిరాహారవ్రతం దీక్షగా చేయి. డైట్ పిల్ల ను తిట్టుకోక ఆ పిల్ల చెప్పింది సరిగ్గా చేసి ఏడు. అంతా సద్దుకుంటుంది" అని హితబోధ చేసింది.

నిజమేకదా నాలిక్కరుచుకున్నాను! ఇక జాలి దయ బంద్. స్ట్రిక్ట్ డైటింగ్. ఎలా తగ్గరో నేనూ చూస్తాను శపథము చేసాను!

- **(18-2-2016 ఆంధ్రభూమివారపత్రిక)**

## 19. మా ఏమండీగారూ - ఆవకాయ - అను మాలా విలాపం

ఎందుకోగానీ ఈసారి ఆవకాయ పెట్టే ఓపిక గాని, మూడ్ గాని అస్సలు లేదు. కొత్త ఇంట్లో పనిమనిషి సరిగ్గా లేదు, వంటమనిషి సావిత్రి డుమ్మాలో వుంది, ఖమ్మం నుండి ఆవాలు తెప్పించలేదు ఇలా, ఆవకాయ పెట్టకుండా తప్పించుకునే కారణాలు వెతుక్కుంటూ ఉన్నాను. ఐనా తప్పదుకదా! అందరూ బాగుంటున్నాయి అంటున్నారని బాంబే స్టోర్ నుండి నూనె వగైరా సామానులు తెచ్చాను. కాని, ఉప్పును ఎండబెట్టకుండా, ఖారం జల్లెడ పట్టకుండా కాలం వెళ్ళదీస్తున్నా.

నాలుగైదు సంవత్సరాల నుండి మావారి కజిన్, వాళ్ళ ఇంటికి దగ్గరలో మామిడి తోట వుందనీ, అక్కడ మనము ఎంచుకున్న చెట్టునుండి కాయలు తెంపిస్తున్నారని, చాలా బాగుంటున్నాయని చెపుతూ వచ్చారు. కాని నేనెప్పుడూ వెళ్ళి తెచ్చుకోలేదు. సరే ఈసారి ఆవాలు సరైనవి లేవుకదా, కనీసం మామిడి కాయలైనా మంచివి తెద్దాం అనుకొని వస్తానని చెప్పాను. నేను వెళ్ళి కాయలు తెచ్చుకుందామనుకున్న శుభముహూర్తాన, గాలి వచ్చి కాయలన్ని రాలిపోయాయని, కావాలంటే ఓ పాతిక కాయలు మాత్రం దొరుకుతాయని, పాపం మా బావగారు ఎంతో ఫీలైపోతూ ఫోన్ చేసి చెప్పారు. పోనీలెండి అని ఆయనను ఓదార్చి, అమ్మయ్య ఈ వారం ఆవకాయ పెట్టే పని తప్పింది అనుకున్నాను! ఇంతలో మా ఆడపడుచు ఫోన్ చేసి, "నేను పనమ్మాయిని మాట్లాడాను, ఈ సారి మా ఇంటికొచ్చేయ్ వదినా!" అంది. ఇహ తప్పదుకదా. ముక్కుతూ మూలుగుతూ వాళ్ళ ఇంటికెళ్ళి ఎలాగో అయిందనిపించుకొని, 'అమ్మయ్య!' అని నిట్టూర్చాను. ఆడపడుచుల సాయంతో ఆవకాయ పెట్టేసావు కదా, ఈ మాలా విలాపం ఎందుకంటారా? అసలు కథ ఇప్పుడే మొదలైంది మరి. నన్ను తీసుకెళ్ళటానికి ఏమండిగారు వచ్చి, "ఐందా అమ్మాయ్ ఆవకాయ పని?" అని మా అమ్మాయిని అడిగారు. "మాతో ముక్కలు తుడిపించి మమ్మీ, విజ్జత్తనే కలిపారు డాడీ" అని మా మీదో

కంప్లైంట్ చేసి, ఈ సారి అస్సలు ఆవ ఘాటు లేదు అని కూడా అంది మా అమ్మాయి. అంతే, పితృహృదయం ద్రవించిపోయింది!!!

ఏమండిగారు పని మీద కొత్తగూడెం వెళ్ళాల్సి వచ్చింది. అక్కడనుండి కాల్ చేసి, "వస్తూ ఖమ్మం నుండి ఆవాలు తేనా?" అని అడిగారు. ప్రస్తుతం పితృహృదయం పొంగి పొరలి పోతోందనే మాట మరచి, "ఎందుకు ఆవకాయ పెట్టేసాను కదండీ?" అన్నాను.

"కాదులే ఇక్కడనుండి ఆవాలు తెస్తాను కొద్దిగా పిల్లల మటుకు పెట్టేయకూడదూ?" అన్నారు. ఇహ తప్పదుకదా, "ఒక్క కిలో మటుకు తెండి. ఎక్కువ తెస్తే చేసే ఓపిక లేదు" అని గొణుకున్నాను.

"కారం తేనా?"

"వద్దండి. మొన్నటి కారం ఉంది."

"అదా? ఎర్రగా, గొడ్డు కారంలా వుంది వద్దు. ఇక్కడి నుండి మంచిది తెస్తాను" అన్నారు.

మంచి వరంగల్ కారమని, చక్కగా ఎర్రగా పండులా మెరిసి పోతోందని తెచ్చాను. అది గొడ్డుకారంలా ఉంది హుం. ఇంకా నా నిట్టూర్పు పూర్తికానేలేదు, "మెంతులున్నాయా?" ఇంకో ప్రశ్న వచ్చేసింది.

"ఉన్నాయండి" జవాబు.

"శెనగలు? ఈ మధ్య నువ్వు శెనగలేయడం లేదు. మా అమ్మ వేసేది."

ఆహా ఎన్నేళ్ళకు గుర్తొచ్చాయి శెనగలు.

"మహా ప్రభూ నేను ఆవకాయ పెట్టటము అత్తయ్యగారి దగ్గరే నేర్చుకున్నాను. శెనగలేస్తే నూనె ఎక్కువ పీలుస్తున్నాయని శెనగలు వేయటము మానేసాము. అదీ అత్తయ్యగారు చెపితేనే. అన్ని ఉన్నాయి మీరేమీ తేనక్కరలేదు, ఒక్క కిలో ఆవాలు మాత్రం తెండి బాబూ చాలు" విన్నవించుకున్నాను.

"ఇక్కడ మామిడికాయలు బాగుంటాయి తెచ్చేదా?"

"వద్దండి బాబూ వద్దు. ఇప్పుడే మామిడికాయలు తెస్తే ఎట్లా? ఆవాలు కడగాలి, ఎండబోయాలి, పొడి కొట్టలి అప్పుడు కదా మామిడి కాయల అవసరం" ఇంకా నమ్రతగా చెప్పుకున్నాను.

ఇంత చెప్పినా ఆవాలు రెండు కిలోలు, ఖారం రెండు కిలోలూ తెచ్చారు. మా ఆపద్బాంధవి సావిత్రి కూడా వచ్చింది. అమ్మయ్య ఆవాల పని ఆమె చేసింది. మామిడికాయలకు ఒక్కదానిని వెళ్ళే ఓపిక లేక, కారులో తీసుకెళుతారు కదా అని, ఏమండిగారి ని వెంట బెట్టుకుని వెళ్ళాను. చూసారూ అదే నేను చేసిన పెద్ద పొరపాటు. కాయల వాళ్ళు పిలిచి పిలిచి మరీ రుచి చూపిస్తుంటే ఈయన గారు మహదానందంగా పెద్ద ముక్కలు రుచి చూసేస్తున్నారు. నేను ఊరుకోలేక “అంత పెద్ద ముక్కలు అన్ని తినకండి” అని చిలక్కు చెప్పినట్లు చెప్పాను. వింటేనా? పైగా నాపైపొక సీరియస్ లుక్! కాయలు బేరమాడబోతే “ఇవి బాగున్నాయి ఇచ్చేయ్” అన్నారు.

మేము ప్రతిసారి వాళ్ళతో గీసి గీసి బేరమాడతాము. అదేం లేదు. “ఇవి బాగున్నాయా, బాగున్నాయి, ఎన్ని కావాలి ముప్పైనా ఇచ్చేయ్” అంతే !

ముక్కలు కొట్టే అతని దగ్గరా అంతే “ఎంతకు బాబూ రెండు రుపాయలకొకటి కొడతావా సరే కానీయ్.”

“అది కాదండి, పోయిన సారి రూపాయకే కొట్టాడు” అని నా నసుగుడు.

"కాదమ్మగారు ఇప్పుడు రేట్ పెరిగింది" అని అతని జవాబు. ఇంకేమి చేయగలను? ఏమండిగారేమో ఒక్కో కాయా కడిగి తుడిచి మహా శ్రద్ధగా ఇస్తుంటే ఎలా కొడుతున్నాడా అని నేను చూస్తుండగానే ఈయన గారు, "చిన్న ముక్కలు కొట్టు బాబు" అన్నారు.

"చిన్నవా, టెంక సరిగ్గా రాదు" అని చెప్పబోయాను.

"నీకు తెలీదు ఊరుకో, ఎపుడూ నువ్వూ, విజయ పెద్ద ముక్కలు కొట్టించి వేస్ట్ చేస్తారు. చిన్న ముక్కలైతే, ఎక్కువ వస్తాయి, పిల్లలు పారేయకుండా తింటారు" అనేసారు.

ఐనా వూరుకోలేక "ఈ కాయల మీద కొంచెం నల్లగా రసి వుందండి వాసన వస్తాయేమో!" అన్నాను. నా గోలే కాని వినే నాథుడేడి? కాదట బ్రహ్మాండంగా వున్నాయని కొట్టే అతను, ఏమండిగారు కితాబులిచ్చేసారు. ఇహ చేసేదేమీ లేక దిక్కులు చూస్తూ కాయలు కొనడానికి వచ్చేవాళ్ళు, నన్ను "ఏ కాయ బాగుంటుంది?" అని సలహాలడుగుతుంటే, అహా నన్నే కదా అడుగుతున్నారు అని చెప్పేస్తున్నాను. ఇలా కాయల ప్రహసనం ముగిసింది.

పాపం ఆరోజు మధ్యాహ్నం అన్నం తినలేక, ఏమైందా అనుకున్నారు. నాకు ఛాన్స్ దొరికింది కదా అని, "చెప్పానా, అంత ముక్కలు తినొద్దు నోరు పొక్కిపోతుంది అని. విన్నారా? సార్ సార్ అని పిలిచి పిలిచి మరీ ఇచ్చారని తినేసారు. బాగయిందిలే లల్లలా" అని పాడేసుకున్నాను. కాని పాపం మూడు రోజులు ఏమి తినలేక ఇబ్బంది పడుతుంటే చెప్పొద్దూ మహా జాలేసింది. సరే మొత్తానికి కొత్త ఆవకాయ తిరగ కలిపి వేసే సమయానికి తినగలిగే స్టేజ్ కొచ్చారు. కంచంలో వేసిన ఆవకాయ చూసి, "ఇందులో ముక్కలేవి మాలా? అంతా పేస్ట్ లా వుందే" అని తెగ హాశ్చర్య పోయారు !

"మరి చిన్నారి పిల్లల కోసం బుజ్జి బుజ్జి ముక్కలు కొట్టిచ్చారుగా, టెంక ఊడిపోయి, ముక్క ఖారంలో కలిసి పోయి, నమిలే పనిలేకుండా హాయిగా మింగేసేలా తయారయ్యిందన్న మాట. ఊం కానీయండి, మింగేయండి" అనగానే, కంచం లోకి, నా మొహంలోకి, శూన్యం లోకి, నిశ్శబ్దంగా, దీర్ఘంగా చూసి, "పోనీ మళ్ళీ ఆవకాయ పెట్టరాదూ, పాపం పిల్లలు ఇదెలా తింటారు?" అని స్టేట్మెంట్ ఇచ్చారు.

"మళ్ళీనా అదెలా కుదురుతుంది? ఆవాలు లేవు కదా" కాస్త నసిగాను.

"ఎందుకు లేవూ? ఒక కిలో దాచమని సావిత్రికి చెప్పావుగా!" అన్నారు. ఏమిటీ నేను రహస్యంగా చెప్పాననుకున్నానే నేను చెప్పే రహస్యం ఇలా ఉందా? లేక ఈయనవి పాము చెవులా? అని నేను సందిగ్ధావస్థలో కాసేపు ఉండి, "కుదరదు గాక కుదరదు. నాకు ఇంకా ఆవకాయ పెట్టే ఓపిక లేదు గాక లేదు. ఐనా ఈ ఆవకాయంతా ఏం చేయను? బోయినపల్లి మార్కెట్ దగ్గర, ఈ జాడీలన్నీ పెట్టుకొని అమ్ముకోనా?" అని ఏడుపు గొంతుతో అరిచాననుకున్నాను!

"మాలా, నీకంత కష్టం కలిగిస్తానా? ఇవన్నీ మా సైట్ కు తీసుకెళ్ళి గాంగ్ వాళ్ళ కిచ్చేస్తాలే" అని నన్ను ఓదార్చారు.

శ్రీరామచంద్రా నారాయణా ఎన్ని కష్టాలు తెచ్చావురా నాయనా.

ముచ్చటగా మూడోసారి ఆవకాయ పెట్టక తప్పదా?????

హారి భగవంతుడా ఏదీ దారి? * * * * *

-(సాహితి)

## 20. అలారం మోగింది

సూదిపడ్డా వినిపించేంత నిశ్శబ్దం. ఎక్కడా ఎటువంటి చడీచప్పుడు లేదు. కరెంట్ పోయినట్లుంది. చుట్టూ గాఢాంధకారం. కన్నుపొడుచుకున్నా కనిపించని చిమ్మచీకటి! ఇంతలో ధబ్ మని ఏదో పడ్డ చప్పుడు పెద్దగా వినిపించింది. కెవ్వ్... కెవ్వ్ మని కేకపెట్టింది సుమ.

ఉలిక్కిపడ్డాను.

ఇంతలో కుకుకూ... కుకుకూ... సన్నని కోయిల రాగం...

ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు. అయోమయంగా చుట్టూ చూసాను. ఈసారి కొంచెం స్పష్టంగా కోయిల రాగం చెవి దగ్గరగా వినిపించింది. అప్పటికి చిన్నగా తేరుకున్నాను. అప్పటివరకూ చదువుతున్న డిటెక్టివ్ నవలను పక్కన పెట్టి, కోయిల రాగం ఏమిటా అని పక్కకు తిరిగి చూసాను. సోఫా పక్కన కుర్చీలో ఉన్న సెల్ నుంచి వస్తోంది ఆ రాగం! కప్పుకున్న కంఫర్టర్ ను పక్కకు జరిపి, లేవబోతే, పొట్ట మీద పెట్టుకొని, అప్పటి వరకూ తిన్న చేగోడీల పళ్ళెం ధన్ అని కింద పడింది. హూఫ్ అనుకుంటూ సోఫాలో పడుకున్న దానిని లేచాను. ఒళ్ళు విరుచుకుంటూ, ఇంకా కోయిల రాగం వినిపిస్తున్న సెల్ ను ఆపాను. ఈ అలారం దేనికి మోగిందా? అని ఆలోచనలో పడ్డాను.

అదేమిటో ఈ మధ్య తెగ మతిమరుపు వచ్చేసింది. ఏదో తీద్దామని ఫ్రిజ్ దగ్గరకు వెళతానా, ఫ్రిజ్ తలుపు తీసి ఏమి తీద్దామనుకున్నానబ్బా అని ఆలోచనలో పడుతాను. ఏదో పని మీద గదిలోకి వెళ్ళి, ఇక్కడకు ఎందుకు వచ్చానా అని ఎంత తల బద్దలు కొట్టుకున్నా గుర్తురాదు. వంట చేస్తూ, పుల్కా చేద్దామని పిండి తీయబోతే, ఏదీ పిండి? స్టవ్ పక్కన లేదు. ఫ్రిజ్ లో పెట్టానా ఏమిటి? ఎంత గట్టిపడిందో! అబ్బా అనుకుంటూ ఫ్రిజ్ తీసి అంతా వెతికినా కనిపించదు. ఎక్కడ పెట్టాను చెప్మా ఆలోచనలో పడతాను. ఓహ్... పొద్దున టిఫిన్ చేసినప్పుడు పిండి తడపలేదని అప్పుడు గుర్తొస్తుంది. అప్పటికప్పుడు పిండి తడిపి పుల్కాలు చేస్తే గట్టిగా అట్టముక్కలలా అయ్యాయి. దేవుడా! ఏమండీతో చివాట్లు తప్పవు అనుకుంటూ భయం భయంగా పెట్టానా, ఏ కళలో ఉన్నారో ఏమిటీ ఇట్లా

ఉన్నాయి అంటూ పక్కకు జరిపి అన్నం తినేసారు. అమ్మయ్య బతికిపోయాను అనుకుంటూ పెరుగు గిన్నె కోసం చూసాను. ఏదీ ? దీనికేమొచ్చింది ఎక్కడుంది? దేవుడా, మళ్ళీ వెతుకులాట. ఊ... రాత్రి తోడుపెడితేగా ఉండటానికి? ఏమండీకి రాత్రి పెరుగు ఫ్రిజ్ లోది వేసి ఎట్లాగో గట్టెక్కాను. చల్లటి పెరుగు తినలేక నేను చేయి కడిగేసుకున్నాను. పెరుగులేక ఏడుపొస్తుంది. ఈ మతిమరుపుకు తోడు లావు కూడా అవుతున్నాను. లాభం లేదు రాత్రి తొందరగా తినేసి, తొందరగా పడుకొని, తెల్లవారు ఝామున లేచి తొలిఎండలో వాకింగ్ చేయాల్సిందే. ప్రతిజ్ఞ చేసుకున్నాను. భోజనానికి బల్ల మీద అన్నీ సర్దేసి, ఏమండీని భోజనానికి పిలిచాను. "ఇప్పుడే వస్తున్నాను ఐదు నిమిషాలు" అన్నారు. ఏమండీ వచ్చేలోపు ఓసారి ఫేస్ బుక్ చూద్దామా? అని కాస్త టెంప్ట్ అయ్యాను. ఏమో బాబు ఓసారి తీసానంటే ఓపట్టాన వదలబుద్ధి కాదు అంది మనసు. లేదులే తొందరగానే ఏమండీ వచ్చేలోపు నా పోస్ట్ కు ఎన్ని కామెంట్స్ వచ్చాయో చూసుకొని తీసేస్తాను అని మనసును బుజ్జగించి, లాప్ టాప్ ఓపెన్ చేసి, ఫేస్ బుక్ లో మునిగిపోయాను. మన కామెంట్స్ చూసుకోవటంతో ఆగుతుందా అంతా తీరిగ్గా ఓసారి తిరిగేసి తలెత్తేసరికి తొమ్మిదైపోయింది. ఏమండీ ఎప్పుడు వచ్చారో, ఎప్పుడు తిని వెళ్ళిపోయారో గమనించనేలేదు. దేవుడా మళ్ళీ భోజనానికి ఆలశ్యం అయిపోయింది రాత్రంతా ఇబ్బంది తప్పదు. పొద్దున్నే మెలుకువ వస్తుంది కాని ఎందుకు లేచానో గుర్తుండక మళ్ళీ పడుకుండిపోతాను. దేవుడా... అని ఇన్నిసార్లు అనుకోవటమే సరిపోయింది!

ఆ మధ్య ఏమైందీ, ఏమండీగారు రాత్రి టి. వి చూసుకుంటూ సెల్ ఛార్జింగ్ చేసుకోవటం మర్చిపోతున్నారని, "నేను ఛార్జింగ్ లో పెడతానులెండి" అని హామీ ఇచ్చాను. ఏమండీ గారి సెల్ ఛార్జింగ్ లో పెట్టాలి... ఏమండీ గారి సెల్ ఛార్జింగ్ లో పెట్టాలని రోజంతా రామనామంలా జపం చేస్తూ, రాత్రి పదింటికి సెల్ ఛార్జింగ్ లో పెట్టి, హమ్మయ్య మర్చిపోలేదు, చేసిన వాగ్దానం నిలుపుకున్నాను అని ఊపిరి తీసుకున్నాను. నిశ్చింతగా నిద్రపోయాను. పొద్దున కాఫీ ఇద్దామని వెళితే సెల్ ను దీర్ఘంగా చూసుకుంటున్నారు ఏమండి. నా వైపు తిరిగి, "సెల్ ఛార్జింగ్ లో పెట్టావా?" అని అడిగారు.

"పెట్టాను కదా! మీరు చూస్తున్నారుగా" నన్ను మెచ్చుకుంటారని సంతోషంగా దీర్ఘం తీసాను.

"నువ్వూ చూడు" అన్నారు.

ఏమైంది, సెల్ ఛార్జింగ్ లోనే ఉందికదా అనుకుంటూచూసాను. ఖర్మ, ఛార్జింగ్ కు పెట్టాను కాని స్విచ్ ఆన్ చేయటం మర్చిపోయాను. ఏమంటారో అని దీనంగా ఏమండీవైపు చూసాను.

ఏమండీ సెల్ ను ఛార్జింగ్ లో సరిగ్గా పెట్టి, స్విచ్ ఆన్ చేసి, గంభీరంగా వెనకకు చేతులు పెట్టుకొని, దీర్ఘంగా ఆలోచిస్తూ, హాల్ లో అటూ, ఇటూ పచార్లు చేస్తున్నారు. నేను ఏమండీ ఎటుతిరుగుతే అటు తిరుగుతే అటు నా తల గిర్రున తిప్పుతూ, టెన్షన్ గా చూస్తున్నాను. కాసేపు చూసాక నా మెడ నొప్పి పుట్టి గోళ్ళు చూసుకుంటూ కూర్చున్నాను. కొద్ది యుగాలు అతి నిశ్శబ్దంగా గడిచాక, "ఓ పని చేద్దాం." అన్నారు.

ఏమిటన్నట్లు చూసాను.

"నీ సెల్ తీసుకురా."

బుద్ధిగా తెచ్చి ఇచ్చాను.

"ఊ ఇప్పుడు చెప్పు. పొద్దుటి నుంచి నువ్వు చేయాల్సిన నీ ముఖ్యమైన పనులేమిటో."

"పొద్దున్నే వాకింగ్ కు లేవాలి."

"ఎన్నింటికి?" చేతిలో సెల్ తిప్పుతూ అన్నారు.

"ఆరింటికి"

"ఓకే. తరువాత" సెల్ లో ఏదో సెట్ చేసి అడిగారు.

ఒకటొకటిగా, పిండి తడపటం, పాలు తోడుపెట్టటం వగైరా ఎప్పుడెప్పుడు ఏది చేయాలో అన్నీ చెప్పాను.

"ఊ ఇదిగో నీ సెల్. అన్నింటికీ అలారం సెట్ చేసాను. అలారం మోగగానే నీ పనులు చేసుకో. కొద్దిరోజులు ఇలా చేసుకుంటే అన్నీ గుర్తుంటాయి" అని బోధించారు.

నేను భక్తిగా నా సెల్ ఏమండీ దగ్గర నుంచి అందుకొని, నా సమస్యను తీర్చిన ఏమండీ వైపు ఆరాధనగా చూసాను. అలా ఏమండి నా సెల్ లో చక్కటి కోయిలరాగాన్ని కూడా రింగ్ టోన్ గా మార్చి ఇచ్చారు. హాయిగా సోఫాలో కంఫర్టర్ కప్పుకొని పడుకొని, పొట్టమీద చేగోడీల పళ్ళెం పెట్టుకొని తింటూ, మాంచి సస్పెన్స్ డిటెక్టివ్ నవల చదువుతుండగా అలారం మోగింది. ఇప్పుడు ఈ అలారం ఎందుకు మోగినట్లు? బుర్ర బద్దలు కొట్టుకున్నా, ఎంత ఆలోచించినా గుర్తురావటం లేదు. దేవుడా... కిం కర్తవ్యం... అన్నీ బాగానే ఉన్నాయి కానీ ఇప్పుడు అలారం దేనికి మోగిందబ్బా! పోనీ ఓ పని చేస్తే ఏమండీ నే ఈ అలారం ఎందుకు పెట్టారో తెలీడానికి యేదైనా ఉపాయం ఉందేమో అడగుతే ఎట్లా ఉంటుంది? నాలుగో ఐదో మొట్టికాయలు పడతాయా? పడితే పడ్డాయిలే! శ్రీరామచంద్రా నారాయణా ఎన్ని కష్టాలు వచ్చి పడ్డాయిరా నాయనా! ఏమైతే అదైంది, రేపు పొద్దున్నే అడిగేస్తాను అని డిసైడైపోయాను.

పొద్దున్నే బాల్కనీ లో కూర్చొని పేపర్ చదువుతున్న ఏమండీకి కాఫీ తీసుకెళుతూ సెల్ కూడా తీసుకెళ్ళాను. కాఫీ ఇచ్చి, ఏమండీ అని పిలిచాను. ఏమిటీ అన్నట్లు పేపర్ లో నుంచి తలెత్తిచూసారు.

"మరీ ఇన్ని అలారం లైతే దేనికి ఏది మ్రోగిందో తెలీక కన్ ఫ్యూజ్ అవుతున్నాను. ఏది దేనికో తెలిసేట్టుగా అలారం సెట్ చేసుకోవచ్చా?"అని అడిగాను.

ఏమండీ సెల్ తీసుకొని అటూ ఇటూ తిప్పిచూస్తున్నారు.

"ఆ అన్నట్లు ఏదో సినిమాలో సెల్ రింగవగానే "మీనూ రామ్మా... మీనూ రామ్మా..." అని ఆ అమ్మాయి నాన్న పిలుస్తున్నట్లుగా వస్తుంది. అలా, పిండి తడుపు... . పిండి తడుపు, పెరుగు తోడెయ్... పెరుగు తోడెయ్, వాకింగ్ చేయ్... వాకింగ్ చేయ్ అని వచ్చేట్లుగా సెట్ చేయచ్చా? కావాలంటే నేను వాయిస్ రికార్డ్ చేసి ఇస్తా?" అన్నాను గొప్ప విషయం చెపుతున్నట్లు.

"స్నానం చేయ్... స్నానం చేయ్, జడేసుకో... జడేసుకో, అన్నం తినూ.. . అన్నం తినూ వద్దా?"

"వద్దులెండి. అవి గుర్తుంటాయి" అంటూ ఏమండీ వైపు అనుమానంగా చూసాను.

ఏమండీ నా అరచేయి తీసి అందులో నా సెల్ ఉంచారు. "ఏమిటీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారా? అప్పుడే సెట్ చేసేసారా?" అన్నాను సంబరంగా.

"కాదు.  ఆ అలారం మోతలకే చిరాకేస్తుంటే ఇంకా వెధవ డైలాగులు కూడానా? అలారంలన్నీ తీసేసాను" అన్నారు తాపీగా!

అలారంలు మోగీ మోగీ గొంతు మూగబోయినట్లు దీనంగా నావైపు చూసింది నా బుజ్జి సెల్!

- **(ఫిబ్రవరి-2017 తెలుగుతల్లి కెనడా అంతర్జాలపత్రిక)**

## 21. మిస్టర్ & మిస్సెస్ నింబూపానీ!!!

రాత్రి టైం పదకొండైంది. హాల్లో టి.వి నుంచి మాటలు వినిపిస్తున్నాయి. చదువుతున్న నవలను మూసి, హాల్లోకి వచ్చాను. ఏమండీ వింగ్ కమాండర్ అభినందన్ పాకిస్తాన్ నుంచి విడుదల అవుతున్న క్లిప్స్ ను దీక్షగా చూస్తున్నారు. పక్కనే కూర్చుంటూ, "వచ్చేసాడుగా, ఇంకెంత సేపు చూస్తారు? పదకొండైంది పడుకోండి" అన్నాను.

నా మాట పట్టించుకోకుండా "లక్కీ గై" అన్నారు.

"ఎవరు? అభినందనా? ఎందుకలా అనుకుంటున్నారు?" అని అడిగాను.

"ఇప్పుడు టెక్నాలజీ చాలా ఇంప్రూవ్ అయ్యింది. సెల్ ఫోన్, జి. పి. యస్ మొదలైన మోడ్రన్ టెక్నాలజీతో క్షణాల మీద ఎక్కడున్నాడో తెలుసుకొని, వెంటనే మనవాళ్ళు స్పందించగలిగారు. పాకిస్తాన్ ముందు బుకాయించినా, ఋజువులు చూపించగలిగాము. దానితో మన దేశమే కాదు ప్రపంచమంతా బాసటగా నిలిచింది. ఆ ఒత్తిడితో విడుదల చేయక తప్పలేదు. మూడు రోజులు బందీగా ఉన్నా క్షేమంగా వచ్చేసాడు. అదే మా రోజులల్లో పొరపాటున సరిహద్దు దాటితే అంతే. అసలు మేమెక్కడున్నామో తెలిసేందుకు కూడా అవకాశం లేదు. వార్ కు వెళ్ళినా, ఎక్సర్సైజ్ ల కు వెళ్ళినా మేము తిరిగి వచ్చేవరకు మా గురించి కుటుంబాలకు తెలిపే అవకాశమే లేకుండింది" అన్నారు.

"అవును. ముఖ్యంగా బార్మీర్ (రాజస్తాన్ లో ఒక డిస్ట్రిక్ట్, పాకిస్తాన్ సరిహద్దుకు దగ్గర) ఎడారిలోకి ఎక్సర్సైజ్ కు వెళ్ళినప్పుడు, రెండు నెలలకు మీరు తిరిగి వచ్చేదాకా ఏ విషయమూ తెలీక ఎంత టెన్షన్ గా ఉండేదో. అప్పుడు కనీసం ఉత్తరం రాసి పోస్ట్ చేసే వీలు కూడా లేదు. మీరు తిరిగి వచ్చాక, నల్లగా కప్పుపడిపోయి అట్టలు కట్టిన మిమ్మల్ని చూస్తే, అమ్మయ్య క్షేమంగా తిరిగివచ్చారు అన్న సంతోషంతో పాటు ఎంత ఏడుపొచ్చేదో! ప్రతి సంవత్సరం డిసెంబర్ వస్తోంది అంటే గుండె గుబగుబలాడిపోయేది. మీరు వెళ్ళినప్పటి నుంచి తిరిగి వచ్చేదాకా భయంభయంగానే ఉండేది" అని అన్నాను.

"ఆ రోజులల్లో సెల్ ఫోన్ లెదు. సెక్యూరిటీ ఏరియా నుంచి లాండ్ కమ్యూనికేషన్ కూడా ఉండకపోయేది. వైరెలెస్ కమ్యూనికేషన్ మాత్రమే ఉండేది. కనుక ఆఫీసర్స్ కు ఇళ్ళకు ఫోన్ చేయటానికి వీలుండకపొయేది. అసలు ఆరోజుల్లో సరిహద్దులన్నిచోట్లా ఫెన్సింగ్ కూడా ఉండేది కాదు. మేము వెళ్ళిన చోట ఒకవైపు వెళ్ళబోయి ఇంకోవైపు వెళ్ళామంటే దారి తప్పిపోయేవాళ్ళం. అలా దారి తప్పి సరిహద్దు దాటిన వాళ్ళు ఎంతమందో! ఆ ఎడారిలో చీకట్లో దారి తెలియక, మెస్ లో డిన్నర్ చేసాక కొంచెం దూరంలో ఉన్న మా టెంట్ కు వెళ్ళాల్సిన దారి నుంచి కొంచెం పక్కకు తిరిగినా దారి తప్పే ప్రమాదం ఉండేది. బయట అంతా లైట్ అవుట్. అందుకే వెలుతురు ఉండగానే అందరం భోజనం కానిచ్చేసి, టెంట్స్ కు వెళ్ళిపోయేవాళ్ళం. రాత్రిళ్ళు దీపాలు కూడా వెలిగించేవాళ్ళం కాదు. తప్పనిసరై లాంతర్ వెలిగించాల్సి వస్తే, దానికి మూడు పక్కలా కాగితం అంటించి వెలిగించేవాళ్ళం. టిన్డ్ ఫుడ్, ఆలూ రోజు అవే ఎక్కువగా భోజనం లో ఉండేవి. ఫ్రెష్ ఐటంస్ చాలా తక్కువగా సప్లై అయ్యేవి" అని బార్మీల్ లోని అనుభవాలు గుర్తుచేసుకున్నారు ఏమండి.

"అందుకే ఇప్పటికీ ఆలూ అంటే ఇష్టం ఉండదు మీకు" అని నవ్వుతుంటే, జ్ఞాపకాల దొంతరలో దొర్లుకుంటూ నా మనసు అరవైల దశకం లోకి వెళ్ళింది. అప్పట్లో మేము భుజ్ లో ఉండేవాళ్ళం. భుజ్ గుజరాత్ లోని పాకిస్తాన్ వైపు ఉన్న టౌన్. భుజ్ సమీపంలో సముద్రం నీళ్ళు లోఏరియా కొచ్చి, నిలువ ఉంటాయి. మధ్య మధ్యలో కొన్ని చోట్ల ఎత్తుప్రదేశాలున్న లంకలాంటి ప్రదేశాలుంటాయి. ఎండాకాలంలో అక్కడ భూమి గట్టి పడుతుంది. సముద్రం నీరు ఉన్న ప్రదేశము ఫ్లాట్ గ్రౌండ్ లాగా ఉంటుంది. ఆ సమయంలో భుజ్ కు, లంకలకు వెహికిల్స్ వెళుతాయి. భుజ్ లో ఆర్మీ యూనిట్ లు ఉండేవి. ఆర్మీ ఫామిలీస్ కుడా ఉండేవి. సముద్రపు లాండ్ లో 'కావడా' అనే లంకలాంటి ప్రదేశంలో ఆర్మీ గస్తీ యూనిట్లు ఉండేవి.

ఒకసారి కావడాలో ఉన్న యూనిట్లో ఒక ఫంక్షన్ జరిగింది. భుజ్ లో ఉన్న ఆఫీసర్స్ ను పిలిచారు. కావడా ఫార్వర్డ్ (సెక్యూరిటీ) ఏరియా కాబట్టి మేము రాకుడదన్నారు. సరే మరి రూల్ అంటే రూలేకదా. అందులోనూ మిలిటరీ రూల్! మా పక్క క్వాటర్ లోనే కాప్టెన్ దీక్షిత్, అతని భార్య ఉండేవాళ్ళు. ఆయన భార్య వేదా, నేనూ దాదాపు ఒకే వయసు వాళ్ళం కావటంతో మాకు స్నేహం బాగానే కలిసింది.

"వాళ్ళు అక్కడే డిన్నర్ కూడా చేసి వస్తారు కదా, నువ్వు మా ఇంటికి వచ్చేసేయి. ఇక్కడే డిన్నర్ కలిసి చేద్దాము" అంది వేదా.

మా ఏమండీలు అట్లా వెళ్ళినప్పుడు ఇద్దరిలో ఎవరో ఒకరి ఇంట్లో డిన్నర్ చేసి, వీలైతే వాళ్ళు వచ్చేదాకా ఉండటం మాకు అలవాటే. ఒక్కళ్ళమే ఉంటే బెంగగా, భయంగా కూడా ఉంటుంది.

మా ఏమండీ వాళ్ళు వెళ్ళాక, తీరికగా ఇల్లు సద్దుకొని, అంతకు ముందే చేసి ఉంచిన డబల్కామీఠా తీసుకొని వేద దగ్గరకు వెళ్ళాను.

"ఇంకా రాలేదేమా అని చూస్తున్నాను రా రా" అంది వేదా.

నేను తెచ్చిన డబల్కామీఠా చూసి "వావ్ తుమారీ హైదరాబాదీ స్పెషల్. మై థోడా చక్ దూం" అని కొద్దిగా చెంచాతో నోట్లోవేసుకొని, "డిన్నర్ కు ఏమి చేయను?" అని అడిగింది.

"నీ ఇష్టం, ఏదైనా సరే" అన్నాను.

"ఐతే ముందు సూప్ తాగుదాము. వేడి వేడి సూప్ తాగుతే బాగుంటుంది. మిక్స్డ్ వెజిటబుల్ సూప్ చేస్తాను" అని కూరగాయలు, టమాటో పూరీ టిన్ తీసింది. వేదా టిన్ మూత తీస్తుంటే నేను కూరగాయలు కొన్ని తీసుకొని కడిగి, చిన్నచిన్న ముక్కలుగా కట్ చేస్తూ "మనం ఇక్కడ వేడి సూప్ తాగుతుంటే వాళ్ళక్కడ విస్కీ తీసుకుంటూ ఉంటారు" అన్నాను నవ్వుతూ.

"ఊహూ, లేదు. మా ఏమండీ డ్రింక్ తీసుకోరు. నాకు తాగేవాళ్ళు ఇష్టం లేదని ముందే చెప్పాను" అంది.

ఎందుకో తాగేవాళ్ళు అన్న మాట నాకు చివుక్కుమనిపించి, "లేదు వేదా ఊళ్ళల్లోలా ఇక్కడ అట్లా తాగి గోల చేయరు. లిమిటెడ్ గా తీసుకుంటారు. నువ్వు ఏ పార్టీలోనైనా ఎవరైనా తాగి గోల చేయటం చూసావా? లేదు కదా?" అన్నాను.

"ఐనా సరే నాకిష్టం లేదు" అని ఖచ్చితంగా అంది. పోనీలే ఎవరిష్టం వాళ్ళది దానికోసం వాదనలెందుకు అనుకున్నాను. సూప్ తయారుకాగానే "డిన్నర్ కు రాజ్మా, జీరా రైస్ చేయనా?" అంది.

"ఓకే" అన్నాను నవ్వుతూ.

వేడివేడి మిక్స్డ్ వెజిటబుల్ సూప్, రాజ్మా, జీరా రైస్, డబల్కామీఠాతో, కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ ముగించాక సమయం చూస్తే తొమ్మిదిన్నరైంది.

"మనవాళ్ళు ఇంకో గంటకు కాని రారు. నువ్వైనా ఇంటికి వెళ్ళి ఏమి చేస్తావు? పపులూ ఆడుకుందామా?" కార్డ్స్ డ్రా లో నుంచి తీస్తూ అంది వేదా.

ఇద్దరమూ కార్డ్స్ లో మునిగిపోయాము.

ఎక్కడ నుంచో కుక్క అరుపులు వినిపించి "గ్రామ సింహం ఎందుకో అరుస్తోంది" అనుకుంటూ రిస్ట్ వాచ్ లో టైం చూసాను. పన్నెండు. “బాబోయ్ ఏమిటి ఇంత సేపు కార్డ్స్ లో మునిగిపోయాము. అవునూ ఏమండీ వాళ్ళు ఇంకా రాలేదేమిటీ?” అని వేదా వైపు చూసాను. తను కూడా నావైపు చూస్తూ "అర్ధరాత్రైంది, ఇంకా రాలేదేమిటి? ఎప్పుడూ ఇంతసేపు వెళ్ళలేదు" అంది. ఇద్దరమూ బయట వరండాలోకి వచ్చి చూసాము. అంతటా నిశ్శబ్దం... ఎక్కడా అలికిడి లేదు. ఇద్దరమూ ముఖముఖాలు భయంభయంగా చూసుకున్నాము. ఇద్దరి మనసులో ఒకటే ఆలోచన "వెళ్ళింది ఫార్వర్డ్ ఏరియాకు. ఏమైనా కాలేదు కదా!" ఎట్లా తెలుస్తుంది? ఏమి చేయాలి? కాసేపు మౌనంగా ఉన్నాము. బయట నిలుచోలేక లోపలికి వెళ్ళాము. వేద నా చేయి పట్టుకొని "ఏం చేద్దాం?" అంది టెన్షన్ గా. ఏమో నాకు మటుకు ఏమి తెలుసు? జవాబు ఇవ్వలేదు. కాసేపు ఆగి, "వీళ్ళు క్షేమమే అంటావా?" అంది.

"అబ్బ! ఉండు తల్లీ అసలే నాకు పిచ్చి టెన్షన్ గా ఉంది. ముందే చిన్నచిన్న వాటికే టెన్షన్ పడిపోతుంటాను. ఇప్పుడు బుర్ర కూడా పని చేయటం లేదు. ఇంకా నువ్వు కూడా టెన్షన్ పెట్టకు. ఎంజాయ్ చేస్తూ ఉంటారు. చిన్నగా వస్తారులే" అన్నాను కాస్త తమాయించుకొని.

చిన్నగా కాలం కరిగిపోతోంది. లోపలికి బయటకు గాభరాగా తిరుగుతున్నాము. ఏమి చేయాలో, ఏమనుకోవాలో తోచటం లేదు. వేద ఏడుపు మొదలుపెట్టింది. చెప్పలేని, ఊహించలేని పరిస్థితి. ఒంటి గంట... రెండు... నాలుగు... సమయం భారంగా జరుగుతోంది. వేద ఏడ్చి ఏడ్చి సోఫాలో సొమ్మసిల్లిపోయింది. నేను ఆలోచించే ఓపిక లేక, ఉబికి వస్తున్న కన్నీళ్ళను అపుకుంటూ  హనుమాన్ చాలీసా,  అమ్మవారి స్తోత్రాలు భయంతో మర్చిపోయినా అట్లాగే, నట్టుకుంటూ చదువుకుంటూ, గుర్తొచ్చిన ముడుపులు కట్టుకుంటూ సోఫాలో నిస్త్రాణంగా తల వాల్చి కూర్చున్నాను. చూస్తుండగానే తెల్లవారిపోయింది!

ఇక టైం  చూసేందుకు కూడా భయపడిపోయాము. బిక్కుబిక్కుమంటూ ఎంతసేపు గడిచిందో తెలీదు. ఏదో వెహికిల్ వచ్చిన శబ్దం వచ్చినట్లై ఇద్దరమూ ఒక్క పరుగున బయటకు వచ్చాము. బయట వెహికిల్ ఆగి ఉంది కాని వీళ్ళు వెళ్ళిన జోంగా కాదు, ఇంకో వెహికిల్. 'ఏమైంది ఈ వెహికిల్ ఎక్కడిది?' అని ఒక్కసారే గుండె జారిపోయింది. అందులో నుంచి ముందుగా దిగిన ఏమండీని చూసి ఒక్క పరుగున ఆయన దగ్గరకు వెళ్ళాను. వెనుకనే కాప్టెన్. దీక్షిత్ మిగిలిన వాళ్ళు ఒక్కరొకరుగా దిగారు. వేదా కూడా పరిగెత్తుకుంటూ వచ్చి దీక్షిత్ కు హత్తుకుపోయింది. అప్పటి దాకా ఆపుకున్న నా దుఃఖం జలజలా కన్నీళ్ళుగా బయటకు వచ్చేసింది. మా ఇద్దరి దుఃఖం చూసి ఇంకో ఆఫీసర్ కాప్టెన్. బెనర్జీ "మీరు చాలా భయపడ్డట్టున్నారు. ఏమీ కాలేదు బాబీ. రాత్రి సడన్ గా పెద్ద వాన వచ్చింది. సముద్రం నీళ్ళున్న ప్రదేశం మెత్తబడింది. తెల్లవారి,  వాన ఆగాక, ఆ బురదలో రాగలిగిన ఈ వెహికిల్ తీసుకొని వచ్చాము" అన్నాడు.

అది వినగానే గబుక్కున వేద దీక్షిత్ షర్ట్ పట్టుకొని గుంజి, "కావడాలో  పార్టీ ఇచ్చారు బాగానే ఉంది. అందులో డ్రింక్ తీసుకొని నాన్ వెజ్ తిని,  డాన్స్ చెసి వచ్చే ఆఫీసర్స్ వెళ్ళారు బాగానే ఉంది. మీరు వెజిటేరియన్. డ్రింక్ తీసుకోరు. మీరు తీసుకునేది నింబూపాని. మీకు ఆ పార్టీకి వెళ్ళాల్సిన అవసరం ఏమి వచ్చింది? నాకసలే భయం. మీరు వెళ్ళకుండా ఉంటే నా బి.పి పెరిగేది కాదు. నా టెన్షన్ పెరిగేది కాదు. ఇక ముందు మీకు పార్టీకి వెళ్ళాలని ఉంటే చెప్పండి ఇంట్లో నే ఒక బాటిల్ నిండా నింబూపానీ తయారు చెస్తాను. మీ ఇష్టం వచ్చినంత తాగండి. కాని రిస్క్ ఉన్న ప్రదేశానికి వెళ్ళకండి" అంది ఏడుస్తూ.

ఊహించని ఈ పరిణామానికి అందరమూ బిత్తరపోయాము. ఒక్క క్షణం తరువాత "ఇక ముందు పార్టీలకు వెళ్ళను. నువ్విచ్చే నింబూపానీనే తాగుతాను. కానీ ఒక్క బాటిల్ వద్దు. ఒక్క గ్లాస్ చాలులే" అన్న దీక్షిత్ బిక్క మొహం చూడగానే అందరూ అప్రయత్నంగా బిగ్గరగా నవ్వేసారు. ఆ నవ్వులతో, ఒక్కసారిగా సృహలోకి వచ్చిన వేదా సిగ్గుపడి ఇంట్లోకి పరిగెత్తింది. అప్పటి నుంచి అందరూ వాళ్ళను మిస్టర్ & మిస్సెస్ నింబూపానీ అని పిలిచి ఏడిపించేవారు.

టి. వి లో నుంచి పెద్దగా శబ్దం వచ్చేసరికి జ్ఞాపకాల జావళీ లోనుంచి బయటపడ్డాను. కాని వేదా వాళ్ళను తలుచుకొని నవ్వుకున్నాను. "ఎందుకు నవ్వుతున్నావు? ఈ వార్తలో నవ్వేదేముంది?" అన్నారు ఏమండి.

"ఇందులో ఏమీ లేదు. మిస్టర్ & మిస్సెస్. నింబూపానీ గుర్తొచ్చారు" అన్నాను.

ఆ సంఘటన గుర్తు చేసుకొని ఏమండీ కూడా నవ్వారు.

“మీరు అన్నది నిజమే ఇప్పటి వాళ్ళు అదృష్టవంతులు. వెంటనే సహాయం అందుతుంది. కాని, అప్పట్లో మీరు బార్డర్ నుంచి తిరిగి వచ్చేదాకా ఎంత భయం వేసేదో! రాత్రిళ్ళు నిద్ర కూడా పట్టేది కాదు. మిమ్మల్ని చూసేదాకా మనసులో మనసు ఉండేది కాదు" అని చెపుతుంటే ఒక్కసారిగా ఆ కాళరాత్రులు గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది. ఒక చిన్న సంఘటన, ఎక్సర్సైజ్ లకు వెళ్ళిన రెండునెలలు మాకు ఏ సంగతి తెలియకపోవటమే అంత బాధ కలిగింది. సరిహద్దుకు సమీపంలో ఉన్న సామాన్య ప్రజలు, ప్రతి రోజు టెరరిస్ట్ అటాక్స్, మిలిటరీ బాంబులు, విమాన దాడులతో నిరంతరం భయపడుతూ ఎట్లా ఉంటున్నారో! వారి మనోధైర్యమే మనకు స్పూర్తి. వారికి జోహార్. శత్రువుల సైన్యానికి చిక్కిన వీర సిపాయిలు సంవత్సరాల తరబడి విడుదలకు నోచుకోక జైళ్ళల్లో రోజుకొక గండంగా ఉన్నా ధైర్యంగా ఎదుర్కుంటున్నారు. వారి సేవలు మరువరానివి. కాని వారికోసం ఎదురుచూస్తూ ఉన్న కుటుంబాల గురించి తలుచుకోగానే బాధ కలిగింది. నలభైఎనిమిది సంవత్సరాల క్రితం, పాకిస్తాన్ యుద్ధంలో భర్త యుద్ధఖైదీగా పట్టుబడ్డాడని మాత్రమే తెలుసు కాని ఎట్లా ఉన్నాడో తెలీదు. ఎప్పుడు విడుదల చేస్తారో అసలు చేస్తారో లేదో కూడా తెలియని ఓ వీరజవాన్ పత్ని, మనవడి చేయి పట్టుకొని, మీ తాతయ్య వస్తాడు, నిన్ను చూస్తాడు అంటూ, రెండో చేయి కళ్ళకు అడ్డంగా పెట్టుకొని, ఊరి శివారుల్లో భర్త కోసం

ఎదురుచూస్తున్న స్త్రీరూపం కళ్ళముందు మెదిలి మనసు భారమైంది. 'వీరపత్నీ నీకు మా వందనాలమ్మా!' అనుకుంటూ ఉద్వేగముతో కంపిస్తున్న నా చేతిని ఏమండీ చేతి మీద వేసాను. నా భావోద్రేకాన్ని అర్థం చేసుకున్న ఏమండీ రెండో చేతితో నా చేతిమీద చిన్నగా తట్టారు!

- (1-4-2019 - సంచిక అంతర్జాల పత్రిక)

## 22. డాలర్ మొగుడు

"ఇక్కడ సీనియర్ సిటిజన్ క్లబ్ ఉందిట. అక్కడ బ్రిడ్జ్ ఆడతారట. వెహికిల్ లో మన ఇంటి దగ్గరనే పిక్ అప్ అండ్ డ్రాప్ చేస్తారట. పటేల్ సాబ్ వాకింగ్ లో చెప్పాడు. మన ఇంటి దగ్గర ఉన్న బస్ స్టాప్ లో ఏ నంబర్ బస్ ఎక్కి వెళ్ళాలో చూపించాడు. రేపు పొద్దున అందులో వెళ్ళి, వచ్చేటప్పుడు వాళ్ళ వెహికిల్ లో వచ్చేస్తాను."

ఏమండి వాకింగ్ నుంచి వస్తూనే ఏక బిగిన ఎనౌన్స్ చేసారు. మేము శాన్ ఫ్రాన్సిస్కో వచ్చి రెండు రోజులు అయింది. అప్పుడే వాకింగ్ కు వెళ్ళటమూ, ఫ్రెండ్స్ ను చేసుకోవటమూ, ఇక్కడి సీనియర్ సిటిజన్ క్లబ్ గురించి తెలుసుకోవటమూ జరిగిపోయాయి. బ్రిడ్జ్ గురించి తెలిసిన సంతోషంలో నేను వాకింగ్ కు రాలేదన్న కోపం మర్చిపోయారు. హమ్మయ్య బతికి పోయాను!

మరునాడు పొద్దున్నే, కూతురు బాక్స్ లో నాలుగు చపాతీలు, నాలుగెందుకు? అంటే "నువ్వు ఒక్కడివే తినవుకదా, పక్కవాళ్ళకు కుడా ఇస్తావు కదా, అందుకే నాలుగు," పైగా ఆ చపాతీలూ, కూరా ఎలా తయారు చేసారో అందులో ఏమేమి వేసిందో వివరముగా వ్రాసి, దానిని ప్రింట్ ఔట్ చేసి, (ఆ పేపర్, ఎవరికైతే తినమని పెడతారో వాళ్ళకు చూపించాలిట. ముందు జాగ్రత్త అట హేవిటో గోల) ఆ పేపర్, ఓ మంచినీళ్ళ సీసా, కొన్ని బేబీ క్యారెట్లూ, రెండు సాఫ్ట్ డ్రింక్ పాకెట్ లూ అన్నీ ఓ చిన్న బాక్ పాక్ లో సర్ది ఇచ్చింది. బాక్ పాక్ వెనుక వేసుకొని, జీన్స్ పాంట్, టీ షర్ట్ లో కాలేజ్ కుర్రాడిలా ఈల వేసుకుంటూ వెళ్ళారు ఏమండీ గారు.

పొద్దున పదింటికి వెళ్ళారు, సాయంకాలమైనా రాలేదు. ఎక్కడైనా తప్పిపోలేదు కదా అని ఒకటే గాభరా పడుతూ ఇంటి ముందు తిరుగుతున్నాను. మనవరాలు, "అమ్మమ్మా తాతను సముద్రంలో వదిలేసినా, అడవిలో వదిలేసినా ఏ బాధా లేదు, అక్కడా ఎవరినో ఒకరిని ఫ్రెండ్స్ చేసుకొని హాపీగా ఉంటారు అంటావు కదా అంత టెన్షన్ ఎందుకు? వస్తారులే" అంది.

"నీ మొహం, ఏదో సరదాగా అంటాను. సెల్ కూడా లిఫ్ట్ చేయటం లేదు అని నేను భయపడుతుంటే నీ జోకులేమిటి? మధ్యలో" అని విసుక్కున్నాను.

ఇంతలో ఓ బస్ ఇంటి ముందు ఆగింది. అందులో నుంచి దిగిన ఏమండీగారు, బస్ లో ఉన్న ఎవరొ ఒకావిడతో మాట్లాడుతూ ఎంతకీ రారే! నేనేమో మెట్ల మీద నిలబడి చూస్తున్నాను. బస్ కదిలింది. లోపల ఆవిడకు చేయి ఊపి వచ్చారు.

"ఎవరో గర్ల్ ఫ్రెండ్ దొరికినట్లుంది. అందుకేనా ఇంతాలశ్యం?" అన్నాను మూతి తిప్పుతూ.

"మరే తొంభై ఏళ్ళ గర్ల్ ఫ్రెండ్. ఎంతకీ వదలదే!" తమాషాగా అని, "అన్నట్లు బ్రిడ్జ్ లో నేను ఎనిమిది డాలర్ లు గెలుచుకున్నాను" అన్నారు గొప్పగా.

"అబ్బా మీరూ డాలర్ లు సంపాదించారా! నా మొగుడూ డాలర్ మొగుడు అని అందరికీ చెప్పుకోవచ్చు" అన్నాను అప్పటి దాకా పడ్డ గాభరాను మర్చిపోయి సంబరంగా.

"ఏమిటీ ఇప్పటి దాకా నేను సంపాదించి నీ చేతిలో పోసిన లక్షలు లెక్కలేదా? ఎనిమిది డాలర్ లకే ఇంత సంతోషపడిపోతున్నావు?" అన్నారు కాస్త కినుకగా.

"ఎంతైనా డాలర్ డాలరే కాదా! అందుకేగా ప్రపంచమంతా డాలర్ వెనుక పడుతోంది" అన్నాను నవ్వుతూ.

"తాతా, నేనూ నీ కోసం ఇందాకటి నుంచి ఎదురుచూస్తున్నాను. ఈ రోజు వాకింగ్ కు నాతో వస్తానన్నావు కదా, వస్తావా అలిసిపోయావా?" సందట్లో సడేమియాలా అడిగింది మనవరాలు.

"అలసట ఏమీ లేదు. పద వెళుదాము" అని బయలుదేరారు.

"అమ్మమ్మా నేను నాలుగు డాలర్ లు గెలుచుకున్నాను" అన్నది మనవరాలు వాకింగ్ నుంచి లోపలికి వస్తూనే.

"వావ్ ఇవ్వాళ ఏమిటీ నువ్వూ మీ తాత డాలర్ లు తెగ గెలిచేస్తున్నారు. ఎక్కడ గెలిచావేమిటి?" అడిగాను.

"తాత దగ్గరే గెలిచాను. అలా అలా నడుచుకుంటూ చాలా దూరం వెళ్ళాము. తిరిగి నడిచేందుకు ఇద్దరికీ ఓపిక లేకపోయింది. అక్కడ బస్ స్టాప్ ఉంది. ఈ స్టాప్ లో బస్ వస్తుంది అని నేనంటే రాదని నాలుగు డాలర్ లు బెట్ కట్టారు. బస్ వచ్చింది. నాకు నాలుగు డాలర్ లు ఇచ్చారు. తాత..." అంటూ నాలుగు డాలర్ లు చూపిస్తూ ఒకటే నవ్వేస్తోంది.

ఇంకేంమనాలో తెలీక బిత్తరపోయి చూస్తున్న నన్ను చూసి నవ్వు ఆపి, "అమ్మమ్మా! నాకు వద్దులే నువ్వు తీసుకో" అని ఇచ్చేయబోయింది.

అప్పటికి కాస్త తేరుకొని, "వద్దులే బంగారూ నీకేగా ఇచ్చింది ఉంచుకో" అన్నాను. సూక్షం లో మోక్షం మనవరాలికే ఇచ్చారు ఇంకెవరికో ఇవ్వకుండా అని కాస్త తృప్తి పడ్డాను

ఆ రోజు అలా గడిచిపోయింది. మరునాడు పొద్దున్నే పిల్లలకు ఏమైనా చేసిపెడుదామని ఫ్రిజ్ లో ఏమున్నాయా అని చూస్తున్నాను. "అమ్మమ్మా, ఇప్పుడు నువ్వేమి చేసినా మేము తినలేము. లంచ్ బాక్స్ అంటూ హడావుడి పడకు. మేము స్కూల్ లోనే తినేస్తాము. సాయంకాలం ఆలూ పరోటా చేయి" అని చెప్పి వెళ్ళింది మనవరాలు.

ఏమిటో ఈ ఉరుకులూ పరుగులూ ఏదీ తినే సమయమే ఉండదు వీళ్ళకు. అందరూ వచ్చే టైం కల్లా అంతా సిద్దం చేసుకొని ఉంటే, వాళ్ళు రాగానే వేడి వేడిగా చేసి పెట్టవచ్చు అని అన్నీ ఉన్నాయో లేదో అని చూసుకుంటే కొత్తిమీర కనిపించలేదు. ఎట్లాగా ఏమి చేయటమూ? "మన దగ్గర లాగా కాదు, ఉప్పు కోసం, పప్పు కోసం పరుగులు పెడితే తేలేము, దూరం వెళ్ళాలి అందుకే ముందే అన్నీ చూసుకొని తెచ్చుకుంటాము" అంది మా అమ్మాయి. ఇప్పుడు కొత్తిమీర అంటే ఇంకేమైనా ఉందా అని మీమాంస పడుతుంటే, ఏమండి "అట్లా వాకింగ్ కు వెళ్ళొస్తాను. దగ్గర లోనే చిన్న సూపర్ మార్కెట్ ఉంది ఏమైనా తేవాలా?" అని అడిగారు.

"అమ్మయ్య బతికించారు. కాస్త కొత్తిమీర తెండి. కొత్తిమీర లేకపోతే ఆలూ పరోఠా ఏం బాగుంటుంది? కాస్త త్వరగా వచ్చేయండీ. ప్లీజ్ ప్లీజ్ ఏ పటేల్ సాబ్ తోనో ముచ్చట్లు పెట్టుకొని కూర్చోకండి ప్లీజ్ ప్లీజ్" అన్నాను.

"మరీ అంత బతిమిలాడక్కరలేదులే. తొందరగానే వస్తాను" అని అభయమిచ్చారు.

చెప్పానే కాని కాస్త అనుమానంగా "సరిగ్గా చూసి తెస్తారుగా" అన్నాను.

"ఏమిటి నాకు తెలీదా? ఎన్నిసార్లు కూరలు తేలేదు నేను?" అన్నారు చిరు కోపంగా.

"ఎందుకు తేలేదు మహరాజులా తెచ్చారు. కాకపోతే నాకు కూతురు పుట్టినప్పుడు, డాక్టర్ తోటకూర ఎక్కువగా పెట్టండి,  కాల్షియం బాగా పడుతుంది. సాయంకాలం సొరకాయ,  బీరకాయ లాంటి లైట్ కూరలు పెట్టండి, తేలికగా అరుగుతాయి అని చెపితే, నా కూతురుకు కూతురు పుట్టి అది హైస్కూల్ కు వెళుతున్నా సంచీనిండా నవనవలాడే తోటకూర,  నిగనిగా మెరిసిపోయే పెద్ద పెద్ద సొరకాయలు రెండు తెస్తున్నారుగా! ఇప్పటికీ అవి వండలేక,  తినలేక చస్తున్నా.  అందుకేగా ఈ మధ్య కూరలు  నేను తెచ్చుకుంటున్నాను" అని మనసులోనే గొణుక్కొని,  బయటకు మాత్రం “అవునండీ మీరు చాలా బాగా తెస్తారు!” అని ఉబ్బేసాను.

చేతిలో ఓ పెద్ద కవర్ తో తాత,  స్కూల్ నుంచి మనవరాలు ఒకేసారి వచ్చారు. ఏమిటీ ఇంత పెద్ద కవర్ అని చూస్తే దాని నిండా ఏదో ఆకు ఉంది.

"చూసావా ఎంత ఫ్రెష్ గా ఉందో కొతిమీర.  బాగుంది కొతిమీర ఖారం కూడా చేస్తావని నాలుగు డాలర్ ల ది తెచ్చేసాను. "

కవరులోనుంచి తీసిన ఆకుకూర పట్టుకొని అటూ ఇటూ తిప్పి చూసాను. ఈ దేశంలో కొతిమీర ఇలా ఉంటుందా? ఆకు కాస్త పెద్దగా వేరుగా ఉన్నా కొతిమీర సువాసనైనా ఉండాలిగా అని ముక్కు దగ్గర పెట్టుకొని చూసినా వాసన తెలీలేదు కాని పెద్ద పెద్ద తుమ్ములు మూడొచ్చాయి!

"ఏమిటండీ ఈ పిచ్చాకు?" అన్నాను అయోమయంగా!

"పిచ్చాకు కాదు అమ్మమ్మా. దీనిని సలాడ్ లల్లో వేస్తారు. దీని పేరు…”

"ఏదో ఏట్లో పేరు.  ఏపేరైతే ఏముంది.  కొతిమీర తెండీ అని ముద్దుగా చెపితే నాకా మాత్రం తెలీదాని గొప్పలకు పోయి నాలుగు డాలర్ లు పెట్టి ఏదో పిచ్చాకు తెస్తారా?" అన్నాను కోపంగా.

" పిచ్చాకో మంచాకో. నువు ఎప్పుడైనా కొతిమీర ఇది అని చూపించావా నాకు? పోనీ పాపం అని తెచ్చి పెడితే వంకలు పెడుతున్నావా?" అన్నారు ఏమండీగారు అంతకన్నా కోపంగా.

"ఇన్నేళ్ళ సంసారం లో మీకు తోటకూర తప్ప ఇంకే ఆకుకూర తెలీదని తెలుసుకోక పోవటం నాదే తప్పు. ఎంచక్కా ఎనిమిది డాలర్ లు సంపాదించారు అని సంబర పడ్డాను. నాలుగు డాలర్ లు మనవరాలితో బెట్ కట్టి ఓడిపోయారు. నాలుగు డాలర్ లు పెట్టి ఏదో పిచ్చాకు కొనుకొచ్చి నన్నే దబాయిస్తున్నారు నేను కొతిమీర ఎట్లా ఉంటుందో చూపించలేదని. డాలర్ మొగుడు డాలర్ మొగుడు అని కనీసం ఇరవైనాలుగు గంటలైనా మురిసిపోనీయలేదు!" ఉక్రోషంగా సణుక్కున్నాను!

- (సంచిక అంతర్జాల పత్రిక - నవంబర్ 18, 2018)

## 23. ఏమండీ ప్లీజ్ మీరు మీరుగానే ఉండండి!

"అమ్మా జీతం ఇస్తారా?" వంట ఏమి చేయాలో వంటామెకు చూపిస్తున్న నా దగ్గరకు వచ్చి అడిగింది మా పనమ్మాయి.

తల తిప్పి చూసి "అదేమిటీ సార్ ఇవ్వలేదా? ఎప్పుడూ రెండో తారీఖుకు ఇచ్చేస్తారుగా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవునమ్మా. ఎప్పుడూ ఇస్తారు. మరి ఈసారే ఇంకా ఇవ్వలేదు. అరో తారీఖు వచ్చింది. మా ఇంటి అద్దె ఐదో తారీఖుకల్లా ఇచ్చేయాలి. ఇంటావిడ అడిగింది పొద్దున్నే" అన్నది చిన్నగా నొచ్చుకుంటున్నట్లు.

"నేనూ అడుగుదామనుకుంటున్నానమ్మా. మా అమ్మాయి ఫీజ్ కట్టాలి. సార్ ఇంకా ఎందుకు ఇవ్వలేదో. ఎట్లా అడగాలా అనుకుంటున్నాను" అన్నది వంటామె.

ఆమెకు వంట ఏమి చేయాలో చెప్పి, బయటకు వచ్చి పేపర్ చూసుకుంటున్న ఏమండీతో "ఏమండీ ఈసారి పనివాళ్ళ జీతాలు ఇవ్వలేదా? వాళ్ళు అడుగుతున్నారు" అన్నాను.

నావైపు చూడకుండానే, "నువ్వియ్యి" అన్నారు.

"నేనా? మీరు బాంక్ నుంచి మనీ తెచ్చారా? ఎక్కడ పెట్టారు?" అని అడిగాను ఎప్పుడూ లేనిది ఇదేమిటీ అనుకుంటూ.

"తేలేదు. నువ్వెళ్ళి తీసుకురా" అన్నారు ముక్తసరిగా.

"నేను వెళ్ళాలా? ఎప్పుడూ తేలేదు ఎట్లా తేవాలో కూడా తెలీదు. ఎట్లా తేను?" అడిగాను అయోమయంగా.

"నాతో చాలా సార్లు వచ్చావుగా. రాకపోవటానికి ఏముంది అందులో. వెళ్ళి తీసుకొచ్చి అన్ని పేమెంట్స్ చేయి" అన్నారు పేపర్ లోనుంచి తలెత్తకుండానే.

"అది కాదండీ" అని నేను చెప్పబోతుంటే వినిపించుకోకుండా, "డ్రైవర్ వస్తాడు వెళ్ళు. అక్కడ అలమారలో చెక్ బుక్, పాస్ బుక్ ఉన్నాయి. తీసుకెళ్ళు. ఎకౌంట్ బుక్ లో ఎవరికెంత ఇవ్వాలో రాసి ఉంది ఇచ్చేయి" అన్నారు ఇక చెప్పేదేమీ లేదన్నట్లు.

ఐదు నిమిషాలు అట్లాగే నిలబడి, లోపలికి వెళ్ళి తయారై వచ్చి డ్రైవర్ ను పిలిచి, "వెళుతున్నాను" అన్నాను ఏమండీతో.

ఏమనుకున్నారో నా చేతిలో నుంచి చెక్ బుక్ తీసుకొని, ఎట్లా దానిని నింపాలో, అది ఏ కౌంటర్ లో ఇవ్వాలో చూపించారు.

కార్ లో కుర్చొని, ఈ మధ్య ఏమండీగారి ప్రవర్తన ఏమిటీ ఇట్లా ఉంది? బాంక్ కు చాలాసార్లే వెళ్ళాను ఆయనతో కాని ఎప్పుడూ విజిటర్స్ కుర్చీలో కూర్చొని, ఆయన పనయ్యేదాకా ఏదైనా బుక్ చదువుకోవటమో, లేక అటూ ఇటూ చూడటమో చేసేదానిని. ఆ మధ్య లోపలికి బాంక్ మేనేజర్ దగ్గరకు తీసుకెళ్ళి నన్ను పరిచయము చేసారు కూడా. ఇంకో సారి బాంక్ హెడ్డాఫీసుకు తీసుకెళ్ళి అక్కడి మేనేజర్ కు కూడా పరిచయము చేసారు. ఆయన ఆవిడతో మాట్లాడుతుంటే, ఆవిడ కట్టుకున్న ఆకుపచ్చ చీర బాగుందని చూస్తూ కూర్చున్నాను. ఆవిడ పేరు జానకి అని చెప్పినట్లు గుర్తు. ఎప్పుడూ ఆయన వెనక రమ్మనప్పుడు వెళ్ళటమే కాని ఏదీ పట్టించుకోలేదు. కాకపోతే ఈ మధ్య ఎక్కడికి వెళ్ళినా ఆ ఆఫీస్ వాళ్ళకు నన్ను పరిచయం చేస్తున్నారు. సటేరియాకు వెళ్ళినప్పుడు ఆయన పని ముగించుకొని వచ్చేదాకా కార్ లోనే కూర్చునేదానిని. ఇప్పుడేమో లోపలికి తీసుకెళ్ళి వాళ్ళకు పరిచయము చేసారు. మూడేళ్ళ నుంచి క్లబ్ కు రమ్మంటున్నారు. ఎప్పుడైనా బద్ధకిస్తే ఇంట్లో ఒక్క దానివి ఆ లాప్ టాప్ ముందు కూర్చుంటావు పదపదా అని బలవంతం చేస్తున్నారు. ఆర్.యస్పి లో కార్డ్స్ రూం విడిగా ఇనాగరేట్ చేస్తున్నారంటే పొద్దున్నే బయలదేరదీసారు. అక్కడి వాళ్ళకు “మా మిసెస్ వస్తుంది చూసుకోండి” అని చెప్పారు.

మొన్నంటికి మొన్న పైన బాత్ రూంలో నల్లాలు పని చేయటము లేదని ప్లంబర్ ని పిలుస్తే, అతనిని చూడనట్లు ఏమి పట్టనట్లు ఊరుకున్నారు. అతను, “సాబ్...” అని ఏదో చెప్ప బోతే నాతో చెప్పమన్నారు. ఇదివరకు వాళ్ళ వెంటవెంట ఉండి అన్నీ చూపించేవారు.

ఇవ్వన్నీ ఒక ఎత్తైతే పోయిన వారం ఆయన పాత క్లర్క్ ను పిలిచి వీలునామా రాసారు. ఏమిటో కాస్త గాభరాగా అనిపించి పిల్లలతో చెపితే "పోనియమ్మా డాడీ యఫ్. డీ లు, ఎకౌంట్లూ చూపిస్తే చూడరాదా? అంతలో ఏమైంది?" అన్నది అమ్మాయి.

"బాబా మీ డాడీ వీలునామా రాసారురా" అంటే వాడేమో, “అబ్బా రాస్తే ఏమైంది? నేనూ, అక్క కూడా రాసాము. నీతో చెపితే ఇదో ఇట్లా టెన్షన్ పడతావనే చెప్పలేదు. ఐనా ఏమిటమ్మా ఈ రోజు ఏ టెన్షనూ లేదే అని కూడా టెన్షన్ పడుతుంటావు?" అని నవ్వేసాడు.

నేను చెప్పేది పిల్లలకు అర్థం కావటము లేదు. ఏమండీలో వచ్చిన మార్పు నాకే అర్థం అవుతోంది. ఎప్పుడూ గలగలా మాట్లాడే మనిషి మౌనంగా ఉంటున్నారు. ఏదడిగినా జవాబు చెప్పటము లేదు. మాట్లాడండీ అన్నా వినటం లేదు. అప్పటికీ ఓసారి విసుగొచ్చి "దేవుడు మనకు నోరిచ్చింది మాట్లాడమని. అంతే కాని ఇలా మౌనానందస్వామిలా ఉండమని కాదు. ఎప్పుడూ లేనిది ఈ మౌనం ఏమిటి?" అని విసుక్కున్నా జవాబు చెప్పలేదు. అప్పుడప్పుడు నా వైపు సాలోచనగా చూస్తున్నారు. "ఏమిటండీ అట్లా చూస్తున్నారు?” అంటే ఏమీలేదులే అని చిన్నగా నిట్టూరుస్తున్నారు. ఏమిటీ, ఏమి జరిగింది తెలీటము లేదు.

నా ఆలోచనలో నేనుండగానే బాంక్ వచ్చింది. మనీ డ్రా చేసుకొని, ఇంటికి వచ్చి ఏమండీకి ఇవ్వబోయాను. నీ దగ్గరే ఉండనీయి అన్నారు. ఇక తప్పదన్నట్లు పని వాళ్ళకు లెక్క చూసి జీతం ఇచ్చి పంపేసాక, లంచ్ చేసి టి. వి చూస్తున్న ఏమండీ దగ్గరకు వెళ్ళి టి.వీ ఆపేసాను. ఏమిటి అన్నట్లు చూసారు.

ఏమండీ పక్కన కూర్చొని "ఈ మధ్య ఏమైంది?ఎందుకు ఇట్లా బిహేవ్ చేస్తున్నారు. పూర్తిగా మారిపోయారు మీరు. ఇదివరకు లా లేరు. ఏమైంది?నా వల్ల ఏమైనా పొరపాటు జరిగిందా?” అని అడిగాను.

"ఏమైంది? ఏమి మారిపోయాను? బాగానే ఉన్నానుగా?"అన్నారు.

"కాదు. ఇంటి విషయాలేమీ పట్టించుకోవటము లేదు. నేనెప్పుడైనా బయట పనులు, బాంక్ పనులు చేసానా? ఈ మధ్య యఫ్. డీ లు కూడా చూడమని చూపిస్తున్నారు. అందరి జీతాలూ, వాళ్ళు అడిగినా అడగకపోయినా బోనస్ లు

ఇవ్వటమూ అన్నీ మీరే చూసుకునేవారు. మొన్న పెళ్ళికి కూడా నన్నొక్కదానినే వెళ్ళమన్నారు. నేనెప్పుడైనా ఒక్కదానిని వెళ్ళానా మా ఫ్రెండ్స్ పుస్తకావిష్కరణలకు, పేరంటాలకు తప్ప. ఎందుకిలా చేస్తున్నారు? మీరెక్కడికెళ్ళినా కొన్ని సార్లు బద్ధకంగా ఉండి రాలేనంటే బలవంతం చేసి తీసుకుపోతున్నారు" అని ఏడుపు గొంతుతో అడిగాను.

"నేనెప్పుడైనా నిన్ను ఎక్కడికీ వెళ్ళవద్దని అన్నానా? నీ మీద ఏమైనా ఆంక్షలు పెట్టానా?" అడిగారు.

"అనలేదు. కానీ నేనే మీ చుట్టూ నా చిన్ని ప్రపంచం ఏర్పర్చుకున్నాను. కానీ ఈ రోజు మీరిలా మారిపోతే భరించలేకపోతున్నాను."

"మారిపోయాను, మారిపోయాను అంటున్నావు ఏమి మారిపోయాను? ఏం ఈ పనులు చేసుకోలేవా? ఎప్పటికీ నా మీదే ఆధారపడి ఉంటే ఎట్లా? పెద్దవాళ్ళమౌతున్నాము. ఏ రోజు ఎట్లా ఉంటుందో చెప్పలేము. నీకూ ఈ విషయాలన్ని తెలిసి ఉంటే మంచిది. నా మాట వింటున్నానంటున్నావు. రెండు నెలల నుంచి అడుగుతున్నాను, పెన్షన్ ఆఫీస్ కు వెళుదాము రా అని వచ్చావా?" అని కొంచెం సీరియస్ గా అన్నారు.

ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేకపోయాను. ఏమండీ అంటున్నది అర్థమయీ అవకుండా ఉన్నట్లుంది. గొంతు పెగుల్చుకొని, "ఏమిటీ మీరంటున్నది?" అన్నాను చిన్నగా.

"ఇందులో అర్థం కాకుండా ఉండేందుకు ఏముంది? మనము పెద్దవాళ్ళమౌతున్నాము. ఏరోజు ఎట్లా జరుగుతుందో చెప్పలేము. నేను పోతే నువ్వు ఎవరి మీదా ఆధారపడకుండా ఉండాలి కదా! అన్నీ తెలుసుకొని ఉంటే మంచిది. ఇదో ఈ డైరీలో నాకెప్పుడు ఏది గుర్తొస్తే అది రాసి పెడుతున్నాను. పాస్ వర్డ్స్ కూడా రాసాను. జాగ్రత్తగా పెట్టుకో" అని లేచి టేబుల్ మీద నుంచి ఒక డైరీ తీసి ఇచ్చారు.

ఆ డైరీ తీసుకోకుండా కళ్ళప్పగించి ఏమండీనే చూస్తూ ఉండిపోయాను. కొంచెం తేరుకొని "ఒక వేళ నేనే ముందు పోతే?" అన్నాను.

"ఫరవాలేదు, నేను ఎట్లాగో బతికేయగలను" అన్నారు.

"ఇద్దరమూ ఒకేసారి ఏ ఆక్సిడెంట్ లోనో పోతే?" అన్నాను ఏమనాలో తెలీక.

"అంతకన్నా అదృష్టం ఏముంది?" అన్నారు.

"ఎందుకు ఇప్పటికిప్పుడు ఇలాంటి ఆలోచన వచ్చింది మీకు? మీకెందుకలా అనిపిస్తోంది? పోతాననుకుంటున్నారా?" పిచ్చిదానిలా అన్నాను.

"నువ్వు అట్లా అంటే నేనేమి చెపుతాను?" అన్నారు.

"ప్లీజ్ అట్లా మాట్లాడకండి. నాకు భయంగా ఉంది" అన్నాను ఏమండీ చేయి పట్టుకొని.

"అనవద్దన్నంతమాత్రాన జరిగేవి జరగక ఆగుతాయా? నేను పోతే నువ్వెట్లా బతుకుతావా అన్నదే నా దిగులు. కనీసం మంచం మీద ఉన్నా నీకు అండగా ఉంటాను అనుకుంటాను. కాని ఎట్లా జరుగుతుందో మనం చెప్పలేముకదా? ఎట్లా బతుకుతావు మాలా" అన్నారు తపనగా.

"ఇందాకటి నుంచి చూస్తున్నాను ఎట్లా బతుకుతావు, ఎట్లా బతుకుతావు? అంటారు ఈమధ్య ఈ మాట మీరు చాలాసార్లు అన్నారు. ఎట్లాగో అట్లా బతుకుతాను. ప్రపంచంలో కోటానుకోట్ల మంది బతుకుతున్నారు. నా ఒక్క దానికి జాగా ఉండదా? ఏ చెట్టు కిందో పుట్ట కిందో బతుకుతాను" ఉక్రోషంగా, కోపంగా అని, ఏడుపు ఆపుకోలేక, ఏమండీ పక్కన కూలబడి ఆయన చేయి పట్టుకొని భోరుమన్నాను.

కొంచెం తమాయించుకొని, ఏమండి భుజం మీద తలానించి, "నేనే అన్ని పనులూ నేర్చుకొని చేసుకుంటాను. ఎప్పుడైనా మీ మాట కాదన్నానా? మీరు చెప్పినట్లే వింటున్నాను కదా? మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. ప్లీజ్ అండి ఇట్లా మౌనంగా ఉండకండి. మీరు మీరుగానే ఉండండి. మిమ్మల్ని ఇట్లా చూసి తట్టుకోలేను" అన్నాను వణుకుతున్న గొంతుతో.

"ఇప్పటికిప్పుడు ఏదో అయిపోతోందని దిగులు పడకు. రెండు నెలల క్రితం డాక్టర్ ఏమన్నాడు? ఆరోగ్యపరంగా ఐతే ఏమీ ప్రాబ్లంస్ లేవు. యు ఆర్ పర్ ఫెక్ట్ లీ ఆల్ రైట్, కాని ఆ దేవుడు తీసుకుపోతే నేనేమీ చేయలేను అని ఆయన నవ్వుతూ అన్నా నిజమే

కదా అనిపించింది. మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను నేనైతే ఎట్లాగైనా బతికేయగలను. కానీ నువ్వు ఒక్కదానివే ఉండవలసి వస్తే, నువ్వు ఎక్కడ ఉన్నా నీకు ఏ ఇబ్బంది కలగకుండా చూడవలసిన బాధ్యత నాది. నీది అంటూ నీ డబ్బు ఉంటే, నీ పనులన్నీ నువ్వు చూసుకోగలిగితే నువ్వు ఎవరి మీదా ఆధారపడకుండా ఉండాలని అన్నీ నీకు చూపిస్తున్నాను. ఎవరమైనా ఏది జరిగినా, హుందాగా స్వీకరించి హుందాగా బతకాలి. అంతే తప్ప నేనేమీ మారిపోలేదు. పద పెన్షన్ ఆఫీస్ కు వెళ్ళి అటు నుంచి క్లబ్ కు వెళదాము" అని లేచారు.

- (సంచిక అంతర్జాలపత్రిక 23-8-2020)

## 24. డిప్ప కట్టింగ్ !!!

ఇది మా మనవళ్ళ చిన్నప్పటి ముచ్చట. అప్పట్లో బ్లాగ్ లో రాసుకున్నది. మా మనవడు విక్కీ మూడో ఏట వాడి మామ వాడిని చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి గుడి లో గుండప్ప చేసాడు. అదో అప్పటి నుండి వాడి కష్టాలు మొదలయ్యాయి. ప్రతినెల వాడి డాడీ నో మమ్మీ నో వాడిని తీసుకొచ్చి, మా ఏమండి గారికి వాడి హేర్ కట్ చేయించమని అప్పగిస్తారు. ఎందుకంటే మా ఏమండి గారి బార్బర్ బాగా చేస్తాడట. చిన్నప్పుడు పెద్దగా పేచీ పెట్టలేదు కాని పెద్దవాడవుతున్న కొద్దీ గుండుకు ఎక్కువ, క్రాఫ్ కు తక్కువ అయిన ఆ డిప్ప మిలటరీ కట్ వాడికి ఏమాత్రము నచ్చటము లేదు. వాడికి రకరకాల లంచాలు లాలిపాప్ దగ్గర మొదలై ఐమాక్స్ సినిమా దాకా వచ్చాయి. ఆపై పెద్ద రాహుల్, చిన్న రాహుల్, రాజేష్ వాళ్ళంతా వాడి ఫ్రెండ్స్ లెండి వాళ్ళ డాడీలు ఫోన్ చేసి అడిగారు, "మీ విక్కి హేర్ కట్ బాగుంది ఏక్కడ చేయించారు?" అని తాత చెప్పిన కథలు పాపం పిచ్చి సన్నాసి నమ్మి తాతతో వెళ్ళేవాడు. అలా అలా కొన్ని సంవత్సరాలు వాడిని మభ్యపెట్టగలిగారు.

కాలం ఎప్పుడూ ఒకే రకముగా ఉండదుగా! తాత కథలు నమ్మటము మానేసి, మా ఇంటికి రావటానికి కూడా సందేహించే పరిస్థితి ఏర్పడింది. కట్ కాదు మేఘు, గౌరవ్ తో ఆడుకుందువుగాని అని ఎలానో తీసుకొచ్చి, కొంచెం సేపు ఆడుకున్నాక మరిపించి తీసుకెళ్ళి, డిప్ప కట్ చేయించేవారు. వాడి తీసుకెళుతుంటే మా అబ్బాయి, "డాడీ విక్కీని హేర్ కట్ కు తీసుకె ళుతుంటే గౌరూను తీసుకుపో!" అని అప్పగించేసాడు. అంతే. వాడూ డిప్ప కట్ తో తయారు.

ఇద్దరు మనవళ్ళూ, తాతా ముగ్గురు ముచ్చటగా డిప్ప కట్ తో తయార్! కాని ఈసారి విక్కీ ఎంత గోల చేసాడంటే, మరి మరునాడే వాడి క్లాస్ అమ్మాయి బర్త్ డే. మరి ఇలా ఎలా వెళతాడు? దానికి తగ్గట్టు గౌరు కూడా నేను ఇంక జెల్ రాసి స్టైల్ చేసుకోలేనుగా అని వాడూ గోల. మనవళ్ళ బాధ చూడలేక జీవితం లో మొదటి సారి ఏమండీ మీద, "వాళ్ళనేమైనా మిలిట్రీలో చేర్పిస్తున్నారా, లేకపోతే కసమ్ పేరేడ్ కి వెళ్ళాలా?" అని

ఘాట్టిగా అరిచాను (అనుకున్నాను). విక్కీ భీకరంగా ప్రతిజ్ఞ చేసాడు, ఇకపై హేర్ కట్ చేసుకోనని బర్త్ డే కల్లా, పోనీటైల్ వేసుకుంటానని. అంతే మా మనవరాళ్ళిద్దరూ వాళ్ళ రబ్బర్ బాండ్స్ అర్జెంట్ గా దాచేసుకున్నారు.

ఈ రోజు వాడి బర్త్ డే పార్టీకి వెళ్ళినప్పుడు చూడాలి పోనీ టేల్ వేసుకున్నాడా లేదా అని. ఏందుకంటే ఆ తరువాత మాకు వాడు కనపడలేదుగా! ఈ మధ్యే మా మనవరాలు చెప్పింది. విక్కి తలకు వాటర్ రాసి సెట్ చేసుకుని స్కూలుకు వస్తే ప్రిన్సిపల్ తిట్టిందంట. పాపం. ఎన్ని తిప్పలో వాడికి.

మా ఏమండీగారికి... ఆయనకే కాదు మా ఇంట్లో పనివాళ్ళకు కూడా డిప్ప కట్టింగ్ చేయించటం అలవాటు. ఓసారేమైందంటే ఊరి నుంచి శంకర్ అని ఓ అబ్బాయిని పని కోసం తీసుకొచ్చారు మా మామగారు. సరే ఏ పనివాడు కొత్తగా వచ్చినా అతని జుట్టును శల్యపరీక్ష చేసి, ఓ ఇంచెక్కుపైనా కట్ చేయించాకనే పనిలోకి తీసుకోవటం ఏమండీగారి అలవాటు. అలాగే శంకర్ కి కూడా హేర్ కట్ చేయించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కాకపోతే అప్పుడు ఏమండీ గారు కాంప్ కు వెళుతున్నారు. తిరిగి వచ్చేవరకూ శంకర్ కు హేర్ కట్ చేయించకుండా ఉండే ప్రశ్నే లేదు. అందుకని నాతో "శంకర్ ను నా రెగ్యులర్ సెలూన్ కు తీసికెళ్ళి నేను పంపానని చెప్పు, హేర్ కట్ చేస్తాడు. నువ్వే తీసుకొని వెళ్ళు. నాన్నకు చెప్పకు. ఆయన తక్కువ ధరకు చేస్తారని నారాయణగూడా బ్రిడ్జ్ మీద చేయించుకొస్తాడు." అని వంద సార్లు చెప్పి వెళ్ళారు.

ఇక చేసేదేముంది శంకర్ ను ఏమండీ గారి సెలూన్ కు తీసికెళ్ళాను. "ఓ మేజర్ గారి కాండిడేటా. నాకు తెలుసమ్మ ఎట్లా చేయాలో" అని అప్పటికే వెయిట్ చేస్తున్నవాళ్ళను ఆపి, "మేడం గారిని వెయిట్ చేయమనకూడదు" అని నచ్చచెప్పి టకటకా డిప్ప కట్టింగ్ చేసి పంపించేసాడు. నా మొహం జుట్టు ఏదైనా స్టైల్ గా కట్ చేయాలంటే టైం పడుతుంది కాని డిప్పకట్టింగ్ ఎంతసేపు!

ఇంటికి వచ్చాకా మామయ్యగారు "మగవాళ్ళ సెలూన్ కు నువ్వెళ్ళావా? ఇంత డబ్బు తగలేసావా? నేను నారాయణగూడా బ్రిడ్జ్ మీద పావలాకు చేయించుకొచ్చేవాడిని కదా!" అని వేస్తున్న చివాట్లన్నీ గోళ్ళు కొరుక్కుంటూ భరించాను. అంతేనా? మా డ్రైవర్ అతని పెళ్ళైన కొత్తల్లో కాస్త జుట్టు పెంచుకుంటే, "పాపం కొత్త భార్య దగ్గరికి వెళుతున్నాడు

ఈ సారికి వదిలేయండి!" అని నేను రికమెండ్ చేసినా, "వాడి మొహం! కొత్త పెళ్ళాం, పాత పెళ్ళాం ఏమిటి? ముందు ఆ జులపాలు కట్ చేయించుకురా!" అని కోపం చేసారు. సర్ లీవ్ ఇవ్వరేమోనని ఏడుపు మొహం వేసుకొని కట్ చేయించుకొని వచ్చాడు. అంతేనా ఈ మధ్య కలలో కనిపించి, "ఏమిటిరా జుట్టు పెంచుతున్నావు?" అని కోపం చేసారట.

ఇంకా చెప్పాలంటే,  మా అమ్మాయి పెళ్ళిలో కాటరింగ్ వాళ్ళందరికీ ముందు డిప్ప కట్టింగ్ చేయించుకొని రావాలని కండీషన్ పెట్టారు.  పాపం మేజర్ గారి మాట తీసేయలేక వంటవాళ్ళూ,  వడ్డించే వాళ్ళు  అందరూ డిప్పకట్టింగ్ తో వచ్చారు! హేర్ కట్టింగ్ కు ఎక్స్ట్రా డబ్బులిచ్చారు లెండి.

మళ్ళీ మా ఇంటి సంగతికొస్తే,  మా అబ్బాయి,  అల్లుడు,  మా మనవళ్ళిద్దరు,  మా డ్రైవర్ అతని కొడుకులిద్దరూ అందరికీ మిలిటరీ కటింగే. ఆ జుట్టును ఒక్క ఇంచైనా పెరగనీయండి అంటే వినేవారు కాదు!

---------------------

ఇంతటితో  నా "ఏమండీ కథలు" పూర్తయ్యాయి. నా ఏమండీ కథలను ప్రచురించిన వివిధ పత్రికల ఎడిటర్ లకు,  ఫేస్ బుక్ లోని వివిధ గ్రూప్ ల అడ్మిన్ లకూ, ఆదరించిన పాఠకులకు, నా ప్రభాతకమలంలో విన్న శ్రోతలకూ,  ధన్యవాదాలు.  నా "ఏమండీ కథల" ను ఈ బుక్ చేసేందుకూ, ప్రభాతకమలంలో వినిపించేందుకు సహకరించిన మా పిల్లలందరికీ నా హృదయపూర్వక ఆశీస్సులు.

Author Page



ప్రభాతకమలం



# ప్రభాతకమలం

Author: Mala Kumar

(Kamala Paracha)

prabhatakamalam@gmail.com

https://sahiti-mala.blogspot.com/

https://www.youtube.com/channel/UCvqUtxbDtOVgh1cu_RwYRRw

My other Books:

1.Neejatagaa Nenundaali

(Stories)

2. Sahiti

(Blog posts)

3. Anaganagaa Oka Katha

(Book Reviews & Writers interviews)

4. Nenu Nochina Nomulu

v